UNIVERSAL
LIBRARY

OU_204604

UNIVERSAL
LIBRARY

హిందూధర్మశాస్త్ర గ్రంథమాల 13

నవాబునందిని

౧౯౪౯

అనువాదకులు:

శ్రీ చాగంటి శేషయ్య

హిందూధర్మశాస్త్ర గ్రంథనిలయము,
కపిలేశ్వరపురం (తూ॥ గోదావరి)

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి.

రెండవ కూర్పు

వెల రు 2-4-0

ప్రకాశకులు
ఆంధ్రప్రచారిణి లిమిటెడ్
కపిలేశ్వరపురం (తూర్పుగోదావరి

శ్రీరామచంద్ర

కృతి

అమృతగర్భయగుచు ♦ నలరెనే తన్వంగి
గడుపార మమ్ములఁ ♦ గాంచుపట్ల
నమృతహస్తయగుచు ♦ నలరెనే గుణమణి
ప్రియమార మమ్ములఁ ♦ బెంచుపట్ల
నమృతేక్షణయగుచు ♦ నలరెనే యబ్జాక్షి
కన్నారమమ్ములఁ ♦ గాంచుపట్ల
నమృతస్వరూపమ్మై ♦ యలరెనే కల్యాణి
రేబవల్ మమ్మాద ♦ రించుపట్ల

నమృతరూపిణియౌటఁదా ♦ నమరలోక
మందెనే సాధ్వినిశ్చలా ♦ నందయగుచు
నట్టిమాతృదేవత సుబ్బ ♦ మాంబఁదలఁచి
ప్రేమనీకృతినామెక ♦ ర్పించుకొంటి.

చాగంటి శేషయ్య

పీఠిక.

దుర్గేశనందినీ పాఠకులలోఁ గొందఱు "అయేషా తరువాతి వృత్తాంతమేమైన" దని ప్రశ్నింపమొదలిడిరి. ఆప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగఁ జాలకాలముక్రిందటనే దామోదరముఖోపాధ్యాయులవారు దీనిని బంగాళాభాషయందు రచియించియుండిరి. దానిని బి. వేంకటాచార్యులవారు కన్నడభాషలోనికిఁ బరివర్తనము చేసిరి. నేనాకన్నడగ్రంథమును ౧౮౧౫వ సంవత్సరములో నిట్లాంధ్రీకరించితిని. ఈ గ్రంథాంధ్రీకరణభాగ్యముగూడ నాకేలభించినందుల కెంతయు నానందము నొందుచున్నాఁడను. దుర్గేశనందనిలోఁ బరిచయులైన జగత్సింహుఁడు, తిలోత్తమ, అస్మానుఖాను, అయేషా, మానసింహుఁడు, విమల మొదలగు వారే యిందును వచ్చుచుందురు. ఆంధ్రలోక మొసంగిన ప్రోత్సాహముచే మరల ముద్రించుభాగ్య మలవడినందుల కెంతయో సంతసించుచున్నాఁడను.

కపిలేశ్వరపురము,
౧ జూను ౧౯౪౯

చాగంటి శేషయ్య.

శ్రీరామచంద్ర

నవాబునందిని

ప్రథమభాగము

మొదటి ప్రకరణము

సర్వమును పూర్వమువలెనే యుండెను.

మందారణగడమందు వీరేంద్రసింహుని దుర్గము పూర్వము వలెనే యొకేతీరుగ సమభావముతోఁ దలయెత్తుకొని యాకాశమార్గమున నిలుచుండి యుండెను. దుర్గపార్శ్వమందలి మామిడితోఁటయందు వృక్షములు శాఖాప్రశాఖలతో వృద్ధినొంది పూర్వమువలెనే సమాన భావముతోఁ దూఁగాడుచుఁ గ్రీడించుచుండెను. నీరు పూర్ణముగా లేక కృశించియున్న యామోదరానదియును బూర్వమువలెనే మృదుమృదు శబ్దములను జేయుచు దుర్గశిరోభాగమందున్న కుడ్యపాద ప్రదేశములను దడుపుచుఁ బ్రవహించుచుండెను. వసంతమందానిలము వికసించుచున్న సహకారవృక్ష కుసుమములయందలి పరిమళముల నపహరించుకొనివచ్చి హెచ్చుతగ్గులులేకుండ సమానభావముతో నందఱిశరీరములమీఁదను వెదజల్లుచుండెను. కవిప్రసిద్ధమును వసంతర్తువున విడబాయనిసహచరము నగుకోయిల వృక్షపర్ణములనడుమఁ దన శరీరమును దాఁచుకొని క్రమోచ్చస్వరముతోఁ గంఠమునెత్తి తానకమును గూయుచు దిగంతములను గంపింపఁ జేయుచుండెను. సునీలమైన గగనాంగణమందు చంద్రుఁడును నక్షత్రములును పూర్వమువలెనే మేఘమధ్యమున దాఁగిలిమూఁతల నాడుకొనుచుండెను.

అన్నియును పూర్వమువలెనే యుండెను. కాని, ఎంతస్వల్ప కాలములో నెట్టియవాంతరప[illegible]యినవి! విమలయు దు

గ్రేశనందిని యగుతిలోత్తమయు మొట్టమొదట శైలేశ్వరుని దేవాలయ
మందు యువరాజగు జగత్సింహుని సందర్శించుట, పఠానుల దుర్గమం
దు విమల యస్త్రాఘాతముచే నవాబు కతలుఖాను మరణించుట, ఈ
మొదలగు నవాంతర కార్యము లెంతస్వల్పకాలములో నడచిపోయి
నవి! ఆకాలరాత్రి.—ఏరాత్రి విమల యజాగ్రతమూలమునఁ బఠా
నులు దుర్గమును జయించి దుర్గాధిపతియగు వీరేంద్రసింహుని యువ
రాజగు జగత్సింహుని బట్టుకొని బంధించి బందాలుగఁ జేసిరో, ఆ
కాలరాత్రి సంబంధములైన చిహ్నములేవియు నిప్పుడు కాన్పించు
చుండుటలేదు. ఆదినమున రక్తప్రవాహముచే నేలయంతయు నాని
పోయిన గుఱుతు లణుమాత్రమును నిప్పుడు కనఁబడుటలేదు. దుర్గ
మునంతను బ్రకంపించునట్లుచేసిన యానాఁటి హాహాకారధ్వనులేవి
యు నిప్పుడు శ్రవణగోచరమగుటలేదు. ఎక్కడచూచినను దుర్గము
నందంతటను సౌభాగ్యలక్షణములే కనఁబడుచుండెను. అన్నియు స
మంజసభావముతో విరాజిల్లుచుండెను. అన్నియును బూర్వమువలెనే
యుండెను. కాని వీరకేసరియైన వీరేంద్రసింహుఁడు మాత్ర మిప్పు
డు లేఁడు. అంతటిస్వల్పకాలములో విమలయు వితంతువై పోయెను.
తిలోత్తమ తండ్రిలేనిబాలిక యయ్యెను. దుర్గమునందు సర్వమును
పూర్వమువలెనే యుండెను పూర్వముండెడి వారందఱును మరలవచ్చి
దుర్గమునందుఁ జేరిరి వీరేంద్రసింహుఁడొక్కఁడు మాత్రము లేఁడు ఆతఁడు
తిరిగిరాలేదు. యముని యందాత్మసమర్పణముచేసి కొనినవాఁడు తిరిగి
వచ్చుటఁ జూచినవారెవ్వరును లేరు.

అనేకజనులు యమాలయమునకుఁ బోయియున్నారు. స్థిర
మైన యానివాసమున కనేకులు నిత్యమును బోవుచున్నారు. వారిలో
నెవరును దిరిగిరాలేదు. వచ్చుటయును లేదు. అందువలనఁ బ్రపంచ
మునకుఁ గలిగినలోపమేమియును లేదు. వసుంధరయందు సుఖదుఃఖ
ప్రవాహమున కించుకంతయును హెచ్చుతగ్గులున్నట్లు కాన్పించుట
యును లేదు. మందారణ దుర్గమున కధీశ్వరుఁడైన వీరేంద్రసింహుఁడు
తిరిగి రాలేదు. అందుచే దుర్గమునకు లోపముగాని దుర్గతిగాని కలిగి
నట్లు కాన్పింపదు. ఒకొక్కప్పుడు విహారముపోయి దానిస్థానమున సం

తోష మధికారము చేయుచుండును. మఱియొకప్పుడు సంతోషముపోయి దానిస్థానమును విచారమాక్రమించు కొనుచుండును. విచారసంతోషములు రెండు నొకేసూత్రమునందు గ్రథితములైనట్లున్నవి. అవి రెండును విశ్వమండలమునకు సమానగతితో నవిరతముగఁ బ్రదక్షిణముచేయు చుండునని తోఁచుచున్నది.

విమల—విలాసమయియు, లావణ్యమయియు, హాస్యకౌతుక నిరతయు నగువిమల విధవయైపోయినదా! ఎవతె తనకుఁ బ్రియాస్పదుఁడైనపురుషుని బొందుటకై యనేకకష్టముల ననుభవించినదో, సహధర్మిణీ గౌరవము లేకపోయినను దనస్వామికి తానొకదాసిమాత్రమని చెప్పుకొనుచుఁ జిరకాల మాతనిగృహమునం దొకపరిచారికవలె నెవతె కాలము వెళ్ళపుచ్చుకొనుచుండెనో, అట్టివిమల నామె హృదయేశ్వరుఁడు శాశ్వతముగ విడనాడిపోయెనుగదా! అబ్బ! అది సహించుటకు సాధ్యమైనయాతనయేనా? కాని యట్టియసదృశయాతనలయందును మనస్సును హర్షసంయుతముగాఁ జేయుకార్యములు లేవా? ఉండునని చెప్పవచ్చును. వీరుఁడైన యామెపతి వీరునివలెనే తేజస్వియై కాతరమేమియు లేకుండ ప్రాణములను దుచ్ఛముగ నెంచి త్యాగమొనర్చెను. ఆకార్యము వీరపతికి మిగుల గౌరవమును గలుగచేసెను. ఆమెకుఁ గలిగిన వేదనకు గొంతవిషయ మేమనఁగా—విమల తనపతి ఘాతకుఁడును, హృదయహీనుఁడును, పరమశత్రువు నగు నవాబు రహిమల్ ఖానుని వక్షస్థలమునఁ దనస్వహస్తముతో నిశితఖడ్గముచే నొక్క పోటు పొడిచి యాతనిని శమనపురమునకు పంపించినది. అది యామెకు మిగుల గౌరవకారణ మయినదియే. ఇంకను నాహ్లాదకరమైన విషయ మొకటికలదు. అది యేమనిన—మిగుల గారాబముతోఁ బెంచిన తనముద్దులపట్టి తిలోత్తమ మనోభీష్టము సఫలీకృతమయ్యెను. సుశీలయు, సురసుందరియు నగుతిలోత్తమ మహాగౌరవయుక్తుఁడును మహారాజునగు మానసింహునకుఁ గోడలయ్యెను. ఆమె గర్భమున జన్మించెడి తనయుఁడు ముందు అంబరేశ్వరుఁడు కాఁగలఁడు. అదియొక సామాన్యమైన యానందమా?

తిలోత్తమ—పితృహీన—తండ్రిపోవుటచే దుఃఖితయైన తిలోత్తమ ప్రేమమయుఁడైన తండ్రిప్రేమ ధనమునుండి వంచితయై హృదయవిదారకవ్యథ ననుభవించుచుండెను.—ఔను—దానికి సందేహములేదు. కాని, మర్మాంతికములగు వ్యథలమధ్యమునఁ గూడ ఆనంద మొసఁగూర్చు కార్యములులేవా? అనేకములున్నవి. క్రూరాత్ముఁడగునవాబు కటుల్‌ఖానుని పాపపంకిలమైన యంతఃపురమునం దామె బందీయయ్యెను. కటుల్‌ఖానుని యంతఃపురమునకుఁ బోవుటతటస్థించినచో స్త్రీలలోఁ దమపవిత్రతను గాపాడుకొని ధర్మధనమును గోలుపోవకుండ వచ్చిన వారొక్కరును లేరు కాని తిలోత్తమకు మాత్రమచ్చట నెట్టికళంకమును సంప్రాప్తముకాలేదు. ఆమె తండ్రియగు వీరేంద్రసింహుఁడు శత్రువులచే నిహతుఁడయ్యెను ఆమె జీవనసారరూపుఁడగు జగత్సింహుఁడు శత్రువుల యస్త్రాఘాతముచే మృతప్రాయుఁడై పోయియుఁ బునర్జీవితుఁడయ్యెను. ప్రేమమగ్నుఁడును సౌందర్యవంతుఁడును సౌభాగ్యశాలియు వీరపురుషుఁడునగు కుమారజగత్సింహుఁడు పవిత్రమైన వివాహబంధముచేఁ గట్టునది యెల్లవేళల, నెల్లభావములఁ దిలోత్తమనే తలపోయుచుండెను అది యొక నిరూపమానమైన యత్యంతానందము కాదా?

మహారాజగు మానసింహుని యాజ్ఞానుసారముగా మందారణదుర్గము స్వాధీనమైన వీరేంద్రసింహుని పత్నికిని, యాతని తనయయగు తిలోత్తమకును నొసఁగఁబడి వారిరువురకును స్వాధీనముఁ జేయఁబడియెను. మందారణదుర్గము కొలదికాలము పరాయుల వశమునందున్నను బ్రకృతమున నట్టి పరాధీన చిహ్నము లేవియు నట గాన్పించుటలేదు.

అపరాహ్ణకాలమునం దొకనాఁడు దుర్గమధ్యమున నంతఃపురమునకుఁ జేరియున్న యొక సౌధముపైఁ గుమార జగత్సింహుఁడొంటరిగ నటునిటు పచారము సేయుచుండెను. ఆతని మొగమువంకఁ బరికించిచూచినచో నాతఁ డేదియో విచారముచే దిగులొందియున్నట్లు తోఁచును. అప్పటి యా మృదుమందానిలముగాని, యత్యంత రమణీయమైన యాప్రదేశముగాని యాతని హృదయమున కించుకంతయును

వినోదమును గలుగఁజేయుచున్నట్లు తోఁచుటలేదు. ఆతని హృదయ ప్రాణవినోదకారిణియైన సుందరితో వివాహసూత్రమున బద్ధుఁడై యింకను నొకనెలయైనను గాలేదు. అట్టి నవోఢ యయ్యు నాసుందరి యాతని నొకనిమిషమైనను విడువకుండ సహచరియై యుండెనని చెప్పినను జెప్పవచ్చును అట్టిచో నాతఁడు చింతనొందుచుండుటకు గారణమేమి చెప్పుమా ?

వారు కేశ్వరనదీతీరమున శిబిరములను స్థాపించుకొని సైన్యములతోఁగూడ నివసించియున్న వార్తను సింహుఁడు కింహాము లంకె గిపోయినవని తెలిసికొని శిబిరములనెత్తివేసి యనుచరులతోఁగూడ స్వా నగరమునకుఁ బయనమైపోయెను. జగత్సింహుఁడా సమయమునకుఁ బోయి యాతనిని గలిసికొనఁజాలఁడయ్యెను. ప్రస్తుతమునఁ జేయవలసిన విశేష కార్యభారమేమియు నాతనిపై లేకుండుటచే నాతఁడు తనయిష్టమువచ్చినట్లు కాలమును వినోదముగ గడపుచుండెను. ఆతఁడిప్పుడు మందారనగరమునఁ బ్రియురాలి యగు ప్రణయిని సంగసుఖమునఁ గాలమును గడుపుచుండెనని వేఱుగఁ జెప్పనక్కఱలేదు.

యువరాజగు జగత్సింహుఁడు పవిచారము సేయుచుండిన యా సౌధముపై నొకవైపున శయ్యయొకటి సిద్ధముగ వేయఁబడియుండెను. జగత్సింహుఁడు శయ్యపైఁ గూర్చుండకయే యా సౌధముపై మఱియొకవైపున నిటునటు నారక తిరుగాడుచుండెను.

ఇంతలో భువనమోహిని యగు నొకజవ్వని యచ్చటికరుదెంచెను లావణ్యమయి యగుబాలలనాసమాగమముచే, నస్తమయోన్ముఖుఁడగు సూర్యదేవుని స్వర్ణమయకిరణజాలముతోఁగూడిన సుషమామయి యగు ప్రకృతిదేవికి నైతె మధికకాంతి కలుగుచుండెను. సౌందర్యసంపద్యుక్త యగు నాయువతియుఁ బ్రజాయుక్తమగు వదనముతో జగత్సింహుని సమీపించి మృదుమధుర కంఠస్వరమున "యువరాజా! నారాక యాలస్యమయ్యెనా యేమి ?" అనియెను

జగత్సింహుఁడు—అంతవిశేషకాల మాలస్యమైనట్లు కాన్పింపదు. కాని, యోప్రాణాధికా! ఎవతె దగ్గరలేనిచో యర్ధనిమిష

మైన నొకమహాయుగముగఁ గాన్పించుచుండునో, యట్టి నీవు చేసిన యీయత్యల్పాలస్యముగూడ నెంతయో నాలస్యముగా నాకుఁ గనబడుచున్నది.

లజ్జాశీల యగునా సురసుందరి చిఱునగవుతోఁగూడిన తన వదన మండలము నించుక వంచుకొనియెను యువరాజు తన వామబాహువు నామెవీపునఁజేర్చి దగ్గరఁదీసి యేమియుఁ జెప్పకుండ నామె యాజ్ఞలేనిదే సుధామధుర బింబాధరమును పరిపూర్ణప్రేమముతోఁ బరిచుంబనము గావించెను. లజ్జవలననో, అనురాగమువలననో, సంకోచమువలననో, మఱియెందువలననో నాయువతీ ముఖమండలము కెంపు వర్ణమును దాల్చెను.

ఆసుందరి దుర్గేశనందినియగు తిలోత్తమయే. ఆయువతీయువకులకుఁ బరిణయమయి యెన్నిదినములో కాలేదు వారిపూర్వపరిచయము చిరవ్యాప్తిమైనదియుఁ గాదు. అందుచే సుశీలలగు సుందరులకు స్వాభావమైన సంకోచమును, లజ్జయు నించుకంతయు కొఱఁతనడకుండ సంపూర్ణముగవచ్చి యామె నావరించుకొనినవి.

తిలోత్తమ మఱింత ముఖమును వంచుకొనియెను. ఆనందానురాగము లతోఁ గూడిన లజ్జయు నామె ముఖమండలమున కొక యపూర్వకాంతి నొసఁగెను. ముగ్ధుఁడగు జగత్సింహుఁడును నతృప్తనయనములతోఁ నాకాంతిని సందర్శించుచు "సుందరీ! ఎవరి పుణ్యబలముచే మనకిరువురకును నిట్లు సంఘటితమైనది? చెప్పగలవా?" అని యడిగెను.

తిలోత్త—ఎవరి పుణ్యఫలమా? నాదియే. కాకున్న మీపుణ్యఫలమా?

జగ—నా పుణ్యఫలమనియే చెప్పవలయు. నీవీ ప్రపంచమున సారరత్నమవు. నీతోసమానమైనరత్న మీలోకమున లేదు. ఈరత్నము దేవతాకంఠము నలంకరింపఁదగినది. అల్పమనుష్యుఁడనైన నన్నుఁ గూర్చి చెప్పనేల? మన యీసంఘటనము పుణ్యముయొక్క ఫలమేయైనచో జన్మాంతరము నందట్టిపుణ్యమును నేను చేసియుండవలయును.

తిలో——అసత్యమును దాపవలసివచ్చినచో నిట్లే యన్యథా మాటలాడవలయును. నాథా! నీవెవరవో నేనెవతెనో నీవెఱుఁగని వాఁడవా? నీవు భువనవిఖ్యాతుఁడైన అంబరేశ్వరుని తనయుఁడవు. రూపమందేమి, సాహసమందేమి, వీరత్వమునందేమి, గుణమునందేమి, యీప్రపంచమున నీతో సమానులెవ్వరును లేరు. ఇఁక నేనంటినా! అత్యల్పమైన మందారణదుర్గమందలి సామాన్య భూస్వామి తనయను. నీదాసానుదాసిగ నుండుటకుఁ గూడ యోగ్యను గాను. నీవు నాయందలి దయచే నీపాదపద్మములకడ నొక్కింతస్థాన మొసంగితివి. ఇది నేననేకకోట్ల జన్మములయందుఁ జేసిన పుణ్యఫలము కాదా నిజము చెప్పుము చూతము.

జగ——పుణ్యము నీదియో నాదియో—అవివాదమునఁ బ్రస్తుతము మనకించుకంతయుఁ బ్రయోజనము లేదు. కాని హృదయేశ్వరీ! స్వర్గలోకమునకంటె నధిక మధురమైన స్థానమును నిహలోకముననే నిర్మించుకొనుట——నందనవనసమీపమున దేవత లనుభవించు దానికంటె నత్యధిక సుఖభోగముల నీలోకముననే యల్పుఁడైన మానవుఁడుకూడ ననుభవించుట——యనునీరెండను నేను నీసంఘటనముచేఁ బొందితినని యనుకొనుచున్నాఁడను నీవు నన్ను భాగ్యవంతులలో నగ్రగణ్యునిగాఁ జేసితివి. నేను నీకుఁ జాలకాలము ఋణపడి యుండెదను.

తిలో——(ఇంచుక నగవుతో) కఠోరహృదయముగల యసిసాధకుఁడగు మహావీరుని రసనయం దట్టి యమృత మున్నదని నేననుకొనలేదు——ఎవరెవరికి ఋణపడియుండిరో, ఆ విషయమునుగూర్చి బాగుగ యోచించితిరా? యోచించిచూడుఁడు. నానిమిత్తమున మీరేకార్యములను చేయకుండ నుండిరి? అత్యంతపరాక్రమవంతుఁడగు మానసింహుని తనయుఁడవైయుండియు స్వతః వీరాగ్రగణ్యుఁడవైయుండియు నితరుల దుర్గమున కర్ధరాత్రియందు తస్కరునివలె ప్రవేశించుట యొందుకొఱకు? ఈ యబల నొకసారి చూడవలయుననికాదా? పుణ్యశ్లోకుఁడవు నత్యంతధార్మికుఁడవునై యుండియు, స్వల్పపరిచితయు నవివాహితయు నగు నొక కులకామినియొక్క యంతఃపురమున కొంటరిగఁ

బ్రవేశించుట యెందుకొఱకు ? ఈ భాగ్యవతితో నొకటి రెండు మాటలాడుటకై కాదా ! శత్రుగణముల యస్త్రఘాతములచే శరీరమందలి యమూల్యమైన రక్తమునంతయుఁ బోఁగొట్టుకొని మృత్యుముఖమున కేగుట యెందుకొఱకు ? ఈ యధమ స్త్రీయొక్క తుచ్ఛమైన ప్రాణమును రక్షించుటకొఱకుఁగాదా ? దుర్మార్గులగు శత్రువులచేఁ జిక్కి చాలకాలమువఱకు బందీవై కాలమును గడపుటయెందుకొఱకు ? ఈహీన నారిపై ప్రేమాకర్షణముచేఁగాదా ? నీచరణదాసిగ నుండుటకైన యోగ్యతలేని యబలను బరిణయమాడి ప్రత్యక్ష దేవతాస్వరూపుఁడైన జనకుని యాగ్రహమునకుఁ బాత్రుఁడవగుటెందుకొఱకు ? ఈ యధమవనితపైఁగల మమతచేఁగాదా? యువరాజా! ఇప్పుడు యోచించి చూడుము. ఎవరికెవరు ఋణపడియున్నారు ?

తిలోత్తమ పలికిన తుదివాక్యమును విని జగత్సింహుఁడు మిగుల విచలితుఁడయ్యెను. అతఁడాసుందరితోడి యితరసంభాషణము మాని "ప్రాణేశ్వరీ ! ఇఁకముందు నాయదృష్ట మెట్లున్నదో చెప్పఁజాలను. నీవీ సంభాషణములో మాజనకుని యాగ్రహమునుగూర్చి వర్ణించితివి. అందుమూలమున నాహృదయమునఁ గళవళము హెచ్చుచునది. ఆవిషయమున నే నుదాసీనుఁడనై యున్నాఁడను. ప్రాణేశ్వరీ ! రమ్ము. ఇటఁగూర్చుండి యీ విషయమున మన కర్తవ్యమేదియో యాలోచింతము" అనియెను.

తిలోత్తమ మాటలాడలేక పోయెను. ప్రఫుల్లకమలనిభమగు నామెవదనము వాడిపోయెను. తనవివాహవిషయము మహారాజగు మానసింహునకుఁ దెలియదనియు, దానిపరిణామము భయానకమైనదనియు దామె యెఱుంగును. ప్రస్తుతప్రస్తావమున యువరాజు నోటినుండి వచ్చిన శంకావాక్యములను వినుటచే దిలోత్తమకుఁ బ్రాణమే పోయినట్లయ్యెను. ఆమె వడఁకుచు భర్తతోఁగూడ మెల్లమెల్లగఁబోయి యట సిద్ధముచేయఁబడియున్న శయ్యపై నొకవైపున నిశ్శబ్దముగఁ గూర్చుండియుండెను.

జగత్సింహుఁడును తిలోత్తమ సమీపమునకు వచ్చి కూర్చుండి వామబాహువుచే నామె కంఠమునుజుట్టి కౌఁగిలించుకొని యుత్కంఠి

తమై నిశావసానకాల శరచ్చంద్రబింబమువలె మలినమైయున్న యామె ముఖమండలమును తనవిశాలవక్షమునం జేర్చికొనియెను. తిలోత్తమయు భయకంపితయై దేవతాస్వరూపుఁడగుతనస్వామి వదనమును స్థిరనయనములతోఁ జూచుచుండెను.

జగత్సింహుఁ డిట్లు చెప్పనారంభించెను. "నాతండ్రి నాపై మిగుల నాగ్రహముఁ జెందియున్నాఁడు. అతఁడు తన యాగ్రహమును మాటలలో వ్యక్తపరుప లేదు. అతనికిఁ నమ్మకముఁ గలిగియున్న మనుష్యుల మూలమునను నాకుఁ దెలియఁజేయు లేదు. కాని, యనేక శతసహస్రలక్షణములచే నాతఁ డాగ్రహము నొందియున్నట్లు వ్యక్తమగుచున్నది.

తిలో—(మెల్లగా) అయినచో, జాగరూకుఁడవై యుండ లేదేమి?

జగత్సింహుఁడు సరళస్వభావయగు నాయువతి ముఖమును చుంబనమాడి యించుకనగుచు "ఎంతసరళస్వభావవు! జాగరూకతయా? నీముఖమునుజూచి, నీప్రేమసాగరమున మునింగి, నీయందాత్మసమర్పణముచేసినవాఁడు మృత్యుదేవత నెదుటఁ జూచినను నాపద్భయముచే జాగరూకతకై ప్రయత్నింపఁగలఁడా? జాగరూకతమాట చెప్పకుము. జాగరూకతనుగూర్చి నేను యోచించుట లేదు" అనియెను.

తిలో—అట్లయినచో నిప్పుడు యోచించుటెందులకు?

జగ—ఇపుడు యోచించుటకు రెండుకారణము లున్నవి. నా జనకుఁడు రాజపుత్రవీరుఁడు. అతనిమనసున నుదయించినభావము క్రియారూపకముగఁ బరిణమించుట కాలస్య మెంతమాత్రము నుండదు అతనియిష్టమునకు వ్యతిరేకముగ మాటలాడువారీభూమండలమునం దెవ్వరును లేరు. పాదుషహా అక్బరుసైత మాతనియిష్టము ననుసరించి నడచుచుండు నని చెప్పనప్పు డితరులమాట చెప్పనేల? అట్టి నాజనకుఁడు నన్నువిధేయుఁడైనతనయునిగా నెంచి నాకుప్రాణదండనను విధించినను నాశ్చర్యముగానుండదు.

తిలోత్తమ చకితయయ్యెను. జగత్సింహుఁ డిట్లని మరలఁ జెప్పఁదొడఁగెను. భయపడకుము. రాజపుత్రవీరుఁ డెప్పుడును మరణమునిన

భయపడను. కావనిన నాకెప్పుడును భయములేదు. కాని, నాకిప్పుడు భయమగుచున్నది. మరణించినచో నీవియోగచింతను సహించుట యసాధ్యమని నాకుఁ దోఁచుచున్నది.

తిలో—(సజలనయనయై) ప్రేమమయా! వియోగముకలుగు ననుభయము నాకు లేదు. నీవు వీరశ్రేష్ఠుఁడవు. కాతరమేమియు లేకుండ మరణింపఁగలవు. వీరపత్నులును నవ్వుచునవ్వుచుఁ బ్రాణము లను విడువఁగలరు.

జగ—అయినచో నిప్పుడీఁక నాభయమునకుఁ గారణముండదు. స్వాభావికమైన యపత్యస్నేహము జనకుని, సంతతికఠోరకార్యము నందుఁ బ్రవర్తింపకుండఁజేసినను జేయవచ్చును. కాని, యంతకంటె ద్విగుణీకృతమైన కఠినతరదండనను విధింపఁగలఁడు. సులభముగాఁ బ్రాణములను దీసివైచి యాతనాసమూహమును దుదముట్టించుటకు బద్ధులుగ స్వల్పస్వల్పముగఁ బ్రాణములుపోవునట్లు భయంకరయాతన లనుభవించుచుండునట్టి కఠోరదండనను విధింపఁగలఁడు

తిలోత్తమ యావాక్యములను విని కంపితయై "అదియెట్లు?" అని యడిగెను.

జగ—ప్రాణేశ్వరీ! నీపాణిగ్రహణవిషయ మాతని కిష్టము గాకుండనుండవచ్చును. అందువలన నన్నీఁక మరలనెన్నఁడును నిన్నుఁ జూడకుండఁజేయును.

తిలోత్తమనేత్రములనుండి బాష్పములు ప్రవహింపనారంభించెను. ఆమె రోదనముచే జడితమైన క్షుబ్ధస్వరముతో "నాసవతితల్లి యగు విమల ధర్మపత్నియయ్యును భర్తయింట దాసివలె కాలమును గడపిపుచ్చినది. నేనునట్లే కాలముగడపుటకు మామగారింట స్థలము దొరకదా?" అనియెను.

జగత్సింహుఁడు తనవస్త్రముచేఁ దిలోత్తమనేత్రములను తుడుచుచు "భయపడవలదు. వ్యాకులత నభివృద్ధినొందింపకుము. మనుష్యవాసస్థలములను వీడి బహుదూరము పోయి సముద్రతీరమున నొకచెట్టునీడను నీతోఁగూడి వాసముచేయుచుండినను నేను ధన్యుఁడనే

యగుదును. కాని, నా జనకుఁ డెందును నెదురులేనిశక్తిశాలి. ఆతని యిష్టమునకు వ్యతిరేకముగ నిలిచియుండుట కీప్రపంచమున నెవరికిని సామర్థ్యము లేదు. అయినను సాధ్యమైనంతవఱ కనుకూలమగుట కనేకప్రయత్నములను జేసిచూచెదను. ఆపైని భగవంతుఁ డున్నాఁడు. ఈశ్వరుని యాజ్ఞ యెట్లున్న నట్లగును" అనియెను

తిలోత్తమ మాటాడకుండ నెమ్మదిగఁ గూర్చుండెను. ఆమెనేత్రములయందు బాష్పములు లేవు ఆమెముఖమున విషాదచిహ్నము లేవియును లేవు. జగత్సింహుఁ డాదరముతో నామెనుజూచి "తిలోత్తమా యేమియాలోచించుచున్నావు" అని యడిగెను.

తిలోత్తమయు నిట్టూర్పువిడిచి "మరణమునకు మార్గమెప్పుడడ్డములేకుండ తెరవఁబడియుండును — అంతకంటె వేఱుచింత యేమున్నది ?" అనియెను.

నూతన పరిణీతులగు ప్రేమోన్మత్తదంపతుల కెట్టి విషమతర యాతన !

రెండవ ప్రకరణము.

మఱునాఁడు ప్రాతఃకాలమున జగత్సింహుఁడు చక్కఁగ శృంగారించుకొనివచ్చి మనోహరముగ నలంకరింపఁబడిన తన గుఱ్ఱము పైఁ గూర్చుండి యొంటరిగ వెలుపలకు బయలుదేరెను. మధురమై సమ్మోహనకారియైన యాయుషఃకాలమునందుఁ బ్రకృతిదేవి పరమరమణీయ వేషమును ధరించియుండెను. పూర్వదిగంగనయు రక్తాంబరధారిణియైన ప్రగల్భనారివలె నవకుంఠనమును భేదించుకొని వదనమండలము నించుక తోఁపింపఁజేయుచుఁ జిఱునగవు నవ్వుచుండెను. వివిధములగు ననేకపక్షులు విశేషోన్నతములు కాని వృక్షశాఖాంతరములయందుఁ గూర్చుండి తమ మధురగీతధ్వనులచే శ్రోతలహృదయముల నాకర్షింపఁజేయుచుండెను. శుకపికాదిపక్షిసంతతుల మనో

హర కాకలీశబ్దము లితరపక్షిగణధ్వనులతోఁ జేరి చాఁ దూరము వఱకు నానందప్రవాహమును వెల్లివిరియఁ జేయుచుండెను. అప్పుడు శాంతియుఁ బవిత్రతయు, మాధుర్యమును, శోభయు, ప్రీతియు, నానందమును మూర్తీభవించి యచ్చటచ్చట సంచరించుచున్నట్లు తోఁచుచుండెను. ఆసమయమున జగత్సింహుఁడు తెలుపువన్నెగల తన గుఱ్ఱము నధిరోహించి యొంటరిగ దుర్గతోరణమును దాటిపోవుచుండెను. శాంతిపూర్ణమైన యీ దృశ్యప్రపంచము నడుమ చిరాభ్యస్తమైన యాయశ్వము చిరపరిచితుఁడైన యాజగత్సింహుని వీపున వహించుకొని మెల్లమెల్లగ ముందునకుఁ బోవఁదొడంగెను.

జగత్సింహుఁడును, దిలోత్తమయు రాత్రియంతయును సంతాపనాశకమైన నిద్రాదేవత నాశ్రయించియు నామె సాన్నిధ్యము నందలేకపోయిరి. ఇరువురకును నించుకంతయును సుఖములేకపోయెను. వాయుప్రవాహమున నించుకసేపు తిరుగాడినచోఁ దలయును, మెదడును జల్లబడి చింతాభార మొక్కింతయైనను దగ్గునేమో యని యోచించి జగత్సింహుఁడు తెల్లవారకమునుపే, యెవరును లేవక పూర్వమే శయ్యనువిడిచి లేచెను. అతఁడు లేచుటకుఁ బూర్వము తిలోత్తమకుఁ గొంచెము నిద్రపట్ట నారంభించెను. జగత్సింహుఁడు మిగుల జాగరూకతతోఁ దనజీవనస్వరూపయు, నిద్రితయు నగు తిలోత్తమబాహుపాశమును మెల్లగ విడిపించుకొనియెను నిద్రాభిభూతయగు నామాధురీరాశి నొక్కింతసే పతృప్తనయనములతోఁ జూచి పిదప నామె కపోలము నాదరముతో ముద్దువెట్టుకొనియెను. పిమ్మట స్వభావసుందరియగు నామె శోభామయశరీరమును జూచుచు నిట్టూర్పు విడుచుచు నటనుండి బయలువెడలెను.

దుర్గమునుండి కొంచెము దూరమేగి ముందునకుఁ బోవకుండ నిలిచి హృదయమున నేదియోతోఁచుటచే జగత్సింహుఁడు దుర్గమునందలి తిలోత్తమశయనమందిరమువంక తిరిగిచూడ నారంభించెను. చూచుచు గుఱ్ఱపుకళ్ళెమును సడలవదలెను. అక్కడ కనఁబడుచుండు వస్తువులను ఱెప్పవేయక చూచుచు నిలుచుండియుండెను. శయనమందిరగవాక్షమునందుఁ జెదరిపోయిన మలినవస్త్రములు గలదియు,

వీడిపోయిన కుంతలములుగలదియుఁ జెదరినహారములుగలదియు నగు తిలోత్తమ నిలుచుండియుండుటను జూచెను. జగత్సింహుఁ డనేక పర్యాయము లనేకభావములతో నాశోభామయిని జూచి విమోహితుఁ డయ్యెను. కాని, యిప్పు డామాధురీసముద్రమున——ఆమాధురీక్షేత్రమున——ఆమాధురీశోభామధ్యమున——ఆమాధురీమూర్తి నిలుచుండి యున్న ప్రాతనిహృదయమునఁ దట్టెను.

జగత్సింహుఁడు శయ్యనువిడిచిన కొంతసేపటికే తిలోత్తమయు మేల్కని యశ్వశాలనుండి యాయితముచేసి దీసికొనిరాఁబడుచున్న గుఱ్ఱముడెక్కలిచప్పుడు విని యాత్రిముతోఁ బ్రేమమయుఁడగు తన హృదయరత్నమును జూచుటకై గవాక్షముకడ నిలుచుండి చూచు చుండెను.

జగత్సింహుఁ డామెనుచూచుచు హృదయముపై తనరెండు చేతులను జేర్చికొని యామెకుఁ దనప్రణయసూచనను గనఁబరచెను. తనచొకమునువిసిరి యామెను లోపలికి బొమ్మని సూచించుచు తో డనేవచ్చెదనని తనచేతితో సంజ్ఞచేసెను. గుఱ్ఱము మెల్లమెల్లగ ముందునకుఁ బోవుచుండెను. ముందునకుఁబోవుచున్న జగత్సింహుఁడు మరల వెనుకకుఁ దిరిగిచూచెను. సుందరియు నెప్పటియట్ల యట నిలుచుండియుండెను. ఆతనిదృష్టి యావైపునకుఁ బ్రసరింపగనే చీర సవరించుకొనుచు నేలపైశిరసునుంచి యామెప్రణామముచేసెను. జగత్సింహుఁడును తనచేయెత్తి "శుభమగుఁగాక!" యనువాక్యార్థము సూచించునట్లు సంకేతము చేసెను. గుఱ్ఱము ముందునకుఁ బోవుచుండెను జగత్సింహుఁడును మరల వెనుకకుఁ దిరిగిచూచెను. తిలోత్తమ రోదనముచేయుచుఁ జెఱగుచేఁ గన్నులను తుడుచుకొనుచుండెను. జగత్సింహుని హృదయము కళవళమంద దొచ్చెను. ముందునకుఁ బోవుటకు మనసొప్పలేదు. స్వల్పదూరముపోయి యటనుండి మరలఁ దిరిగి రావలయునని స్థిరపఱచికొని యశ్వమును దాటించెను అది వేగముగ నడచిపోయెను. జగత్సింహుఁడు మరల వెనుకకుఁ దిరిగిచూచెను. గవాక్షము నేత్రగోచరముకాలేదు. ఆతఁడు నిట్టూర్పును విడిచెను. అశ్వము సమవేగముతోఁ బోవుచుండెను.

జగత్సింహుఁడు మొట్టమొదట నేమార్గమున మందారణదుర్గమునకు విమలతోఁగూడ వచ్చియుండెనో, యామార్గముననే యిప్పుడును పోవుచుండెను అదియే మామిడితోఁట. ఏయుద్యానవనమునందలి చెట్టుకడ విమల తెచ్చియిచ్చిన భల్లముచే జగత్సింహుని హస్తమునందు పఠానుఁ డొకఁడు మరణమునందెనో, యాయుద్యానవనమును దాటి ముందునకుఁ బోయెను. అస్థలమున నిప్పుడు జగత్సింహుఁ డద్భుతవేషధారి యగు నొకపురుషుని జూచెను. ఆవ్యక్తి యనుపమాన దీర్ఘకాయుఁడును ఘోరకృష్ణవర్ణ శరీరుఁడునై యుండెను. క్షురికాస్త్ర సాహాయ్యముచే నాతని మస్తకము కేశశూన్యమయ్యె, వెనుకభాగమున నొక్కింత కేశగుచ్ఛము మాత్రము శిఖాకారమునఁ గాన్పించుచుండెను. వదనము శ్మశ్రుశూన్యతమై యుండెను. ఆతని దేహమున యధోభాగము పాయిజామాచే నావృతమై యుండెను. ఊర్ధ్వభాగము విచిత్రకంచుకాచ్ఛాదిమై యుండెను. ఆతని కంఠమునందలి రుద్రాక్షమాల చరణద్వయము వఱకును వ్రేలాడుచుండెను. దీర్ఘమగు నాతని నాసికపైఁ దిలకమునకు బదులుగ మృత్తికయుండెను. జగత్సింహుని జూచుటతోడనే యావ్యక్తియు తనచేతిని ముందునకుఁ జాపి "ఖుదానారాయణుఁడు మీ కెప్పుడును మేలొనఁగూర్చుఁగాక" అని యాశీర్వదించెను.

జగత్సింహుఁడు నగవు నాపుకొనుచు "మీరేనా గజపతి విద్యాదిగ్గజులు?" అని ప్రశ్నించెను.

రుద్రాక్షధారి యగునాపురుషుఁడు "ఔను మహాస్వామి! వ్యాకరణాదిశాస్త్రములు తుదముట్టినవి స్మృతులన్నియు నభ్యసించితిని. అన్నిఁటియందును నా పేరు జగద్విఖ్యాతమైనది. ఇప్పుడు ఉర్దుభాషయందును శిక్షితుఁడనై యుండుటచే నా పేరు బ్రహ్మాండము వఱకును వ్యాపించినట్లు తోఁచుచున్నది" అనియెను.

జగ—మీకీ వేషమెందులకు?

గజ—యవనుల సంపర్కముచే యవనవేషమే సంభవమైనది. పఠానులు నా జాతిని ధ్వంసముచేసి నా వేషమును మార్పించి విడలి

పోయిరి. నావలెనే యితరులనేకులు వారిసంశ్రయము నందున్నారు వారికెవరికిని జాతిపోలేదు. వారందఱును గ్రామమునకువచ్చి చేరి దరు నేనును నధ్యాపకులగు మాస్వాములకడకుఁబోయి వారికి సలాములుచేసితిని. వారు నన్నుఁజూచి నీవీవేషముతో నాశ్రమమునకు రాఁగూడదు నీకు సనాతనధర్మశాస్త్రములను పాఠములుగఁ జెప్పఁజాలను'' అని సెలవొసంగిరి. అదివిని నేను "బాలానాం రోదనంబలం" అనియెఱింగి యేడువఁదొడంగితిని. "అమృతం బాలభాషితం" అని యుండుటచే నధ్యాపకమహాశయులు సంతుష్టచిత్తులై "నీవు గంగాతీరమునకుఁబోయి యచ్చట మూఁడుదినములు నివాసముచేసి గంగాస్నానమునుజేసి మస్తకాదులను ముండనముచేసికొని యొకదినము హవిష్యమును భుజించి తిరిగి వచ్చితివేని మరలఁ బాఠములను చెప్పెదను" అని యాజ్ఞయిచ్చిరి. నేనును గురునియానతిని నవియన్నియును జేసి తిరిగి యాశ్రమమునకుఁ బోవుచున్నాఁడను.

జగ—అయినచో మరల నీవేషమేల?

గజ—వస్త్రాభావము—యవనులు నావస్త్రముల నన్నిఁటిని లాగికొని వీనినిచ్చిరి. వీని నుపయోగించుటకంటె గత్యంతరమేమియును లేదు.

జగత్సింహుఁడు తనకవచమునందుండి యొకరూపాయనుదీసి గజపతికొసఁగి మీరు దుర్గమునకు వచ్చిచూచినచో మీసంగతులన్నియు వినియెదను'' అనియెను.

గజపతియు రూపాయను దీసికొని "స్వస్తిశ్రీభోజరాజ ! మీరిప్పుడు వీరేంద్రసింహుని స్థానమును వహించియున్నారా?" అని ప్రశ్నించెను.

జగ—మీరు నన్నెఱుఁగరా? పఠానులశిబిరమునందొకప్పుడు మిమ్ముఁను నేను జూచియున్నాఁడను. స్వర్గస్థుఁడైన వీరేంద్రసింహుని తనయను నేను పరిణయమాడితిననుసంగతి మీరెఱుఁగరా?"

దిగ్గ—ఔనౌను. భార్యయుఁ బుత్రికయు—వీరిరువురను గాపాడవలయునని వీరేంద్రసింహుఁడు సతిని బుత్రికను సంరక్షించుభారము సరియైనవారి యందుంచి స్వర్గారోహణమును జేసియున్నాఁడు.

గజపతి విద్యాదిగ్గజుని యసంగతవాక్యములను వినియు విననియట్లు జగత్సింహుఁడు ముందునకుఁ బోయెను. స్వల్పదూరము పోవునప్పటికి శైలేశ్వరునిమందిరము దృష్టిగోచరమయ్యెను. మందిరమువరకునుబోయి తిరిగి రావలయునని జగత్సింహుని యభిప్రాయము. హృదయమును బదిలపరచుకొని దేవాదిదేవుని చరణకమలములకు భక్తిభావముతో వందనముచేసి తిరిగిరావలయునని యాతఁడు నిశ్చయించుకొనియెను. జగత్సింహుఁడు దేవతాదర్శనముచేసి దేవునిపాదములకడఁ దన దుఃఖములను నివేదనము చేసికొనునూహతోఁ జిత్తసంయమనము గావించుకొని యక్కడకుఁ బోవుచుండెను.

ఇంతలో దూరమునుండి యనేకాశ్వపదధ్వనులు వినవచ్చుటచే నాతనిచిత్తభ్రాంతి దూరమైపోయెను. దూరమునందుఁ గుండలాకారమైన మేఘఖండమువలె ధూళిరాశి యాకాశమండలమున వ్యాపించెను. జగత్సింహుని గుఱ్ఱము తనసమీపమునందుఁ స్వజాతీయులు వచ్చుచుండుటనుగుర్తించి వాలము నల్లాడించుచుఁ జెవులు రిక్కించి తనయభిప్రాయమును వ్యక్తపరిచెను. కొంచెము దూరములో ననేకవీరులు శీఘ్రముగఁ బరువెత్తుచుండుటను జగత్సింహుఁడు చూచెను.

జగత్సింహుఁడు ధైర్యవంతుఁడు. శత్రువులువచ్చు సంభవమేమియు నిప్పుడులేదు. పఠానులు యుద్ధవిగ్రహములనువీడి యుత్కల దేశమునకుఁ బోయియుండిరి. దేశమునందు పాదుషహాసైన్యము తక్క వేఱుసైనికుఁ డొక్కఁడును లేఁడు. పాదుషహాసైనికులు మందారణదుర్గమునకు శత్రువులుకారు. మహారాజగు మానసింహుఁడు స్వయముగా మందారణ దుర్గాధికారభారము వీరేంద్రసింహుని యుత్తరాధికారులఁ జెందుట కంగీకరించియున్నాఁడు. అయినచో నీయెదుటవచ్చుచున్న వారెవ్వరు? వారెవరో యీప్రక్కకే వచ్చుచున్నారు. వారు మహారాజగు మానసింహుని సైనికులైనట్లు కన్పట్టుచున్నారు. జగత్సింహున కాకస్మికముగ హృత్కంపము జనియించెను.

సైనికులు సమీపమునకు వచ్చిరి వారందరు నేబదిమంది యాశ్వికులుగానుండిరి. అందఱును. వస్త్రధారులై యుండుటేగాక బలిష్ఠులును బరిపుష్టశరీరులునునై యుండిరి. వారిలో నొకఁడు స్వతంత్రభావ

ముతో నందఱికంటెను ముందుగ వచ్చుచుండెను. అతఁడు తక్కినసైనికుల
కందఱకును నాయకునివలెఁ గన్పట్టుచుండెను. నాయకుని యాజ్ఞాప్రకా
రము తక్కిన సైనికులందఱును గుఱ్ఱముల కళ్ళెములను బిగ్గఁబట్టి నిలిచి
సమభావముతోఁ దమతమకత్తుల నొరలనుండితీసి భుజములపైనమర్చి
సమస్వరముతో "జయ! జయ! పాదుషహాఅక్బరునకు జయమగుఁ
గాక! మానసింహ మహారాజునకు జయమగుఁగాక!" అని యుచ్చై
స్స్వరముతో జయజయధ్వనులను జేసిరి.

జగత్సింహుఁడును తత్క్షణమే తనకత్తినిదీసి ధరించి "జయ!
పాదుషహాఅక్బరునకు జయమగుఁగాక! జయ! మహారాజగు మాన
సింహునకు జయమగుఁగాక!" అని జయజయధ్వనులను జేసెను. పిదప
ముందుప్రక్కనున్న నాయకునితో జగత్సింహుఁడు "ఇదేమి? మధు
రాసింహా! సమాచారములేమి? పాదుషహాకుశలవృత్తాంతములు తెలి
యుచున్నవా? మహారాజునకుఁ గుశలమా?" యని ప్రశ్నించెను.

మధురాసింహుఁడు గుఱ్ఱమునుండి దిగినిలిచి "భగవంతుని యను
గ్రహముచే నెచ్చటను నమంగళసూచన లేవియు లేవు" అని
యెను.

వెనుకనుండిన సైనికుఁడొకఁడు వచ్చి మధురాసింహుని గుఱ్ఱపు
కళ్ళెమును బట్టుకొనియెను. మధురాసింహుఁడు యువరాజుసమీపము
నకువచ్చి యభివాదనముచేసి పిదప రుమాలనువిప్పి యందు కట్టియున్న
యొకపత్రికనుదీసి యతివినీతభావముతో యువరాజు హస్తమునం
దుంచెను.

ఆయుధపాణులై సైనికులు వచ్చుచుండుటను జూచి తనయానంద
సుఖభోగముల కానాఁడే యాస్థలమునందే యప్పుడే తుదికాలమని
తెలిసికొని జగత్సింహుఁడు "నావిషయమున మహారాజువారి యాజ్ఞ
యేమి?" అనియడిగెను.

మధు—యువరాజా! నేను మీయనుగతభృత్యుఁడను. ఈ
దాసుని యపరాధమును క్షమింపవలయును. మీరేయవస్థయందున్న

నాయవసరముండే నాతోఁగూడ దీసికొనిరావలయునని మహారాజుగారి యాజ్ఞయైనది.

జగ—ఎక్కడకుఁబోవలయును?

మధు—పాట్నానగరమునకు—మహారాజుగారి సన్నిధానమునకు.

యువరాజు—కొంచెముసేపుండి, అనఁగా–ఇప్పు డిక్కడనుండి బయలుదేరుట కన్నియు సిద్ధపరిచికొని వచ్చుటకంగీకరించుట కేమయిన నాక్షేపణమున్నదా?

మధు—(చేతులు జోడించుకొని) యువరాజా! మీరు మాతోఁగూడవచ్చుటకు వెనుకముందుఁజూచి యాలస్యముచేసితిరేని వెంటనే మిమ్ములను బందీగాఁ జేసి తీసికొనిరావలయునని మాకాజ్ఞయైనది.

జగ—ఇచ్చట నాకాత్మీయులు కొందఱున్నారు. వారిని జూచి వారికడ సెలవుగైకొని వచ్చుటకుఁగూడ నవకాశము లేదా?

మధు—(పూర్వమువలెనే చేతులుజోడించుకొని) నేను దాసుఁడను. దాసుని యపరాధములను క్షమింపవలయును. ఇంచుకైన నవకాశమిచ్చుట కాజ్ఞలేదు.

జగత్సింహుఁడు పునరుక్తికిఁగాని ప్రతివాదమునకుఁగాని యది సమయముకాదని తెలిసికొనియెను తనయపరాధము రాజద్రోహము క్రిందఁ బరిగణింపఁబడెననియుఁ దన్ను రాజద్రోహియనియెంచి విచారణముసేయునున్నారనియుఁ దెలిసికొని మధురాసింహునితో "మహారాజుగారి యాజ్ఞోల్లంఘనముసేయునంతటి ధైర్యవంతులగు మానవు లీభరతఖండమున నెవ్వరునులేరు. ఇఁక నేనంటినో?—సేవకులయందు క్షుద్రులలో క్షుద్రుఁడనుఁ అయినను నినొక్కప్రశ్న మడిగెదను. నాయంతట నేను మీతోఁగూడ రాకున్నచో నన్ను బందీగఁజేసికొని రావలయునని యాజ్ఞయైనదని చెప్పితివి. ఒకవేళ నేను నీతో యుద్ధమును జేసినచో నప్పుడు నీవు నన్నేమిచేయుదువు? ఆవిషయమున నేమని యాజ్ఞయైనది?" అనియడిగెను.

మధు—యువరాజా! ఈదాసానుదాసునినోటనుండి యంత మాట రానేరదు. యువరాజును మృతావస్థయందైనను, జీవితావస్థ యందైనను సముఖమునకుఁ దప్పక తీసికొనిరావలయునని మహారాజు గారి యాజ్ఞయైనది.

జగత్సింహుఁడు చేసిన యీవిచారణయందు మహారా జత్యంత కఠోరమైనయాదేశ మొసంగెనని స్పష్టపడియెను. అందుచే క్షణ కాలమైన నాలస్యముచేయుట కాతనికి ధైర్యముగాని, సాహసముగాని లేకపోయెను. మహారాజు సమ్ముఖమునకుఁ గొనిపోఁబడినపు డతి కఠోరమైనదండనము విధించుటయే సంభవమగును. తప్పదు. కాని, యావిచారముతోఁ బ్రస్తుతము ప్రయోజనమేమి? భగవద్వాక్య మును పరిపాలనముచేయుట కనేకమిషలను బన్ని కాలవిలంబమును జేసినఁ జేయవచ్చునుగాని, మహారాజగు మానసింహుని యాజ్ఞకు మాత్రి మట్టియాలస్య మించుకంతయును గారాదు. ఉత్తరక్షణము ననే యాయాజ్ఞను ప్రతిపాలింపవలయును. జగత్సింహుఁడు మధు రాసింహునితో "లెమ్ము! మధురాసింహా! కాలవిళంబనమువలన ననర్థకమేకాని ప్రయోజనములేదు నాసైన్యము దారుకేశ్వరనదీ తీరమందు జహానాబాదుకడ నున్నది. దానివ్యవస్థ యేమి కావలయును? అనియెను.

మధు—దానికివలయు నేర్పాటును నేను గావించెదను.

మధురాసింహుఁడు సైనికులలో నొకనినిబిలిచి యాతని నా సైన్యమున్నకడకుఁ బొమ్మని యాజ్ఞయొసంగెను. సైనికుఁడు మం దారణ దుర్గమార్గమునఁ బోవునని యెరింగి జగత్సింహుఁడాతనితో నిట్ల నియెను. "మందారణదుర్గమార్గమునఁ బోవుచున్నప్పుడు నీకెవరైనను గాన్పించినచో జగత్సింహుఁడు తండ్రిగారి యాజ్ఞాప్రకారము వారిసం దర్శనమునకై పాట్నానగరమునకుఁ బోవుచున్నాఁడని యాతనితోఁ జె ప్పుము." అని చెప్పి పిదప జగత్సింహుఁడు మధురాసింహునితో "నీ సైన్యమును రెండుభాగములుగాఁ జేయుము. ఆరెండు భాగములనడ మను నేనుండవలయునని నాయభిప్రాయము. నీవు నా పార్శ్వమునుండి వచ్చుచుండవలయును." అనియెను.

మధు— యువరాజా! ఈదాసుఁడు మహారాజువారికింకరుఁడు. ఆజ్ఞాప్రకారము నడచుటకంటె నీతనికి వేఱేమియు లేదు.

తత్క్షణమే మధుకాసింహుని యాజ్ఞానుసారము సైనికులు రెండు భాగములుగాఁ జీలిపోయిరి. ఒకభాగము జగత్సింహునకు ముందువైపునను, నొకభాగ మాతనికి వెనుకతట్టునను వ్యూహమువలె నిలిచి వచ్చుచుండిరి. మధురాసింహుఁడు గుఱ్ఱమునధిష్టించి వచ్చి జగత్సింహుని పార్శ్వమున నిలుచుండియుండెను. అందఱును మెల్లగఁ బయనమును సాగించుచుండిరి.

తిలోత్తమా! నీ వెక్కడ? నిన్నసాయంకాలము నీహృదయమే శ్వరుఁ డాశంకానూచకముగఁ బల్కినవాక్యము లింతశీఘ్రకాలములోనే క్రియారూపమునఁ బరిణమించునని యెవరు తెలిసికొనఁగలరు? జగత్సింహా! స్వల్పకాలమునకుఁ బూర్వము గవాక్షమునందు శిశిరసిక్తకమలమువలెఁ దొడిమనుండి రాలిపడిన కుసుమమువలె, సూర్యకిరణములచేఁ గ్లిష్టమైన కిసలయమువలె, మలినమైయున్న ముఖమును జూచియున్నాఁడవుకాదా? ఆసందర్శనమే నీకు తుదిసందర్శనమయ్యెనా? విగళితవసనభూషితమై నవీనబాలారుణ ప్రదీప్తమైన యాశోభాసందర్శనము—ఆరోదనము—ఆ వీడుకోలు—ఆ ప్రణామము— హా! హా! అవియే నీప్రేమకుఁ దుదియభినయములా?

మూ డ వ ప్ర క ర ణ ము.

శశకము విపత్సముదాయమునుండి తప్పించుకొనుట కుపాయము గాననప్పుడు తననేత్రములను మూసికొని యొకవైపున స్థిరముగా నిలుచుండియుండును. కన్నులుమూసికొనుటచే దాని కేమియుఁ గానిపింపదు ఇతరులెవ్వరును దనను చూచుచుండుటలేదని యది యనుకొనుచుండును. కుమారజగత్సింహుఁడును నట్లే చేసెను. తండ్రి తనపరిణయమున కంగీకరింపఁడని యాతఁ డెఱుంగును. ఆతనికిఁ దెలిసి

నచో వివాహసంఘటనము కాదనియు, వివాహసంఘటనము కానిచోఁ దనజీవనసుఖమంతయుఁ జిరకాలము నష్టమైపోవుననియుఁగూడ నాతఁడెఱుంగును. కావున నావివాహవ్యాపారము నతిగోప్యముగ జరిగించెను. మఱియు నావృత్తాంతము తండ్రికెప్పుడును దెలియఁజాలదనియు భావించుకొనియెను. అల్పప్రాణియగు శశకమువలె జగత్సింహుఁడు కన్నులుమూసికొని నిశ్చింతుఁడై యూరకుండక యుచితసమయమును గనిపెట్టి తండ్రి పాదపద్మములపైఁబడి జరిగిన వృత్తాంతమునెల్ల ననుతాపముతో నాతని కెఱింగించినచో నపత్యస్నేహ ప్రాబల్యముచే ననుకంపవొడమ సదయుఁడై యాతఁడు కుమారుని విన్నపము నాలకించి మన్నించుననియుఁ బిదప నాశంకలన్నియు నిశ్శేషముగ నశించి హృదయమునకు శాంతి వొడముననియు నాతఁడు తలపోయుచుండెను.

జగత్సింహుఁడు, తిలోత్తమ, విమల, అభిరామస్వామి, మొదలగువార లేమేమిభావించుకొనిరో యవియన్నియును మహారాజునకుఁ దెలియవు. జగత్సింహుఁడు మందారణదుర్గమందు వీరేంద్రసింహుని మందిరమునఁ బఠానులచేఁ జిక్కెనను వార్త తత్క్షణమే మానసింహునకుఁ దెలిసెను. కుమారుఁడు ప్రణయముగ్ధుఁడై దుర్గాధిపతి యంగీకారములేనిదే యవేళయందుదుర్గమునఁ బ్రవేశించుట మొదలగు వృత్తాంతములన్నియు నెప్పటికప్పుడు మానసింహుఁడు తెలిసికొనుచుండెను. తనయునిపై నాతని కెంతయో యాగ్రహము వచ్చెను. మానసింహమహారాజు వీరేంద్రుని వృత్తాంతమును బూర్వమునుండియు పూర్ణముగా నెఱిఁగియుండినవాఁడగుటయేగాక వారందఱును గులహీనులనియు, నీచసంపర్కముగలవారనియు నాతఁ డెఱింగియుండెను. అట్టివారు తనకు బంధువులని మాటవరుసకైనను జెప్పుట కాతని కిష్టములేదు. అట్టివారితనయను కోడలనుగాఁ జేకొనుట కాతఁడించుకంతయు నంగీకరింపఁడు.

అనేక వీరాధివీరులసమక్షమునఁ దండ్రియెదురనిల్చుండి జగత్సింహుఁడు మహాగర్వముతో నైదువేలమంది సైనికుల సాహాయ్య

మునఁ బఠానులను సువర్ణరేఖానది యావలకుఁ బాఱఁదోలివత్తునని వీరములువలికి పోయియుండెను. మానసింహుఁడు కుమారుని స్పర్ధయును సాహసమునుజూచి మిక్కిలి గౌరవించి యాతఁడు కోరినసైన్యములనిచ్చి పఠానుల జయించుభారమంతయు నాతనిపైఁ బెట్టెను. అట్టి గురుతరమైన మహాభారమును వహించిన జగత్సింహుఁడు యదృచ్ఛగఁ గన్యాన్వేషణకార్యమునఁ దగులొని తస్కరునివలె నితరుల దుర్గమున నర్ధరాత్రియందుఁ బ్రవేశించి దుర్గేశునితనయపైఁ బ్రణయలీలాప్రమత్తుఁడై కర్తవ్యమును విడనాడెను. ఈసమాచారములన్నియు మానసింహుని యాగ్రహమును మఱింత యభివృద్ధిచేయుచుండెను. వీరేంద్రసింహుని తనయతోఁగూడి యామోదనిమగ్నుఁడైయున్న జగత్సింహుఁడు పఠానులచేఁ జిక్కి బందీయయ్యెనను సమాచారము తెలియుటతోడనే మానసింహునికోపము మితిమీఱి పోయెను. ఆకారణముచే నాతఁడాక్షణము పఠానుకులను నామూలముగ ధ్వంసముచేయు ప్రయత్నములఁ జేయఁడయ్యెను. అవిధేయుఁడును నయోగ్యుఁడు నగు నట్టి కుమారునకు శుభమొదగూర్చుట యయుక్తమనియు నిష్ప్రయోజనమనియు మానసింహుని యభిప్రాయము.

విమలయస్త్రాఘాతముచేఁ గటుల్ఖానుఁడు మరణము నొందెను. మరణకాలమునఁ గటుల్ఖానుఁడు జగత్సింహునితో సంధిప్రస్తావమును జేసెను. జగత్సింహుఁడు బంధమునుండి విడివడియెను. విడుదలయైనపిదప నాతఁడు పోయి తండ్రినిజూచి పఠానులప్రార్థనానుసారముగఁ దండ్రితో సంధిప్రస్తావమును జేసెను. మానసింహుఁడు తాను శీఘ్రముగ ఢిల్లీకిఁ బోవలసియుండుట వలనను, దనసహకారియైన సయ్యదుఖాను వర్షకాలము పోవువఱకును సైన్యములను బ్రోగుచేసికొని తనకు సాహాయ్యముగ వచ్చుటకవకాశము లేకపోవుట వలనను, పైకారణముల వలనఁ బ్రస్తుతము విగ్రహకార్యముల నడపింప వీలులేకపోవుట వలనను సంధిబంధమున కప్పుడు సమ్మతించెను. పిదప మంత్రి ఖాజాయిసాఖాను, క్రొత్తనవాబగు సులేమాన్ఖాను తోడను, అస్మాన్ఖాన్ తోడను, వచ్చి విస్తారముగ నుపహారాదిక

ములకుఁ దెచ్చి మానసింహమహారాజునకు సమర్పించెను. మానసింహుఁడు వానినందుకొని వారిని యథాయుక్తముగ సన్మానించి వీడుకొలిపెను. పిదప మానసింహుని యాజ్ఞాప్రకారము మొగలాయి సైన్యములు పాట్నానగరమునకుఁ బ్రయాణమైపోవుటకు సిద్ధమయ్యెను. మానసింహుఁడు జగత్సింహునిపై విశేషకార్యభారము లేమియు పెట్టలేదు. అతనియవజ్ఞతనుగూర్చి విచారణ సేయవలయునని మానసింహుని యభిప్రాయమై యుండెను.

జగత్సింహుఁడు, తండ్రితనపై విరాగభావముతో నున్నాఁడను విషయమును దెలిసికొనలేదు. అతఁడు శిబిరమునువీడి తనగుఱ్ఱపు వాగెమునకుఁ గట్టియున్నట్టియు బ్రాహ్మణునిచే లిఖింపఁబడియున్నట్టియు లిపినిచూచి యక్కడనుండి యట్లేవెడలిపోయెను. తండ్రి యాజ్ఞను బడయకయే తండ్రికేసమాచారమును దెలుపకయే మందారణ దుర్గమునకుఁ బోయి యచ్చటఁ దిలోత్తమను బాణిగ్రహణము చేసికొనియెను. వివాహమునకుఁ దనబంధువు లనేకులువచ్చి కలిసికొనిరి, అశేషము నామెయనుచరులును వచ్చియుండిరి. ఉత్సవసంబంధమగు నానందములన్నియు యథేచ్ఛగ జరిగినవి. వివాహమునకు జనకుఁడగు మానసింహుని రావలయునని వేఁడుకొనలేదు. మానసింహుని యంగీకారమునుగాని తుదకాశీర్వాదమును గాని బడయవలెననుప్రయత్నము లేవియును జరిపియుండలేదు. తనకుఁ దెలియనిదే యీశుభకార్య మిట్లుజరుగునని మానసింహుఁడెన్నఁడు ననుకొనియుండలేదు. మానసింహుని యాగ్రహము మఱింత యధికమయ్యెను. అతనినోటనుండి యాయాగ్రహచిహ్నములేవియు వ్యక్తమగుటలేదు. కాని యదిమొదలు మానసింహుఁడు రాజకీయవిషయములనుగూర్చి తనయునితో నాలోచించుటయే మానుకొనియెను. సామాన్యకార్య నిర్వాహకభార మాతఁడు వహించియుండెను. జగత్సింహునకుఁ గార్యాకార్యములు మొదలగు వానినిగూర్చి పర్యాలోచనముచేయుట వదలిపోయెను. మహారాజగు మానసింహుని హృదయకుండమునఁ గుమారసంబంధమైన యసంతోషాగ్ని ప్రజ్వలనమగుచుండెను అత్యంతమును బ్రజ్వలించుచున్న యామహాగ్ని

లకుఁ బిమ్మట మరల నాస్థలమునకే వచ్చెను. ఆకుసంగతిని తెలిసికొనినపిదప నాతని హృదయము మథితమైపోయెను. పరిచయమైనతోడనే యాసుందరీ సమాగమలాభము తన నుదుట వ్రాయఁబడియుండలేదని యాతఁడనుకొనియెను. వీరేంద్రసింహుని తనయతో మానసింహుని కుమారునకు వివాహసంబంధము కేవల మసంభవము. ఎప్పటికిని సంభవింపఁదగినదికాదు. ఇప్పుడు జగత్సింహునకొక భ్రమకలిగెను. తనజీవనసారస్వరూపయగు నాయబలామణి నొక్కమారు కడసారిచూచి యామెచే సెలవుఁగైకొని రావలయునని యాతనికాశ వొడమెను. అదియాతని కజ్ఞానముచేఁ గలిగిన భయానకభ్రమ—ఆరీతిగచూచి సెలవుగైకొనుటచేఁ బ్రణయము నూఱురెట్లభివృద్ధి నొందునని హతాశులగుప్రియులు తెలిసికొనఁజాలరు. ఆదర్శనముచేఁ బ్రణయులోలత కాలక్రమమున మందీభూతమైనను కావచ్చును కాని దర్శనరూపమనెడి యింధనసంయోగముచేఁ బ్రణయానలము ప్రజ్వలితమై ప్రబలముగమండుచు విస్తారముగఁ బైకిలేచెను. అదియెటులగక ప్రేమగలవారు తుదిసందర్శనముకొఱకై యున్మత్తులగుచుందురు. అనేకసందర్భములయం దట్టితుదిసందర్శనమే సర్వనాశనమునకుఁ గారణమగుచుండును. జగత్సింహుని యదృష్టమునకు నావిధముగనే సంభవమయ్యెను.

విమల యాహ్వానముచేయుటచే జగత్సింహుఁడామెతో మందారణమునకుఁబోయెను. దుర్గాధిపతి యనుమతిలేనిదే దుర్గములోనికిఁ బ్రవేశించుట కాతనికిష్టము లేకపోయెను. విమల యతనికర్ణరంధ్రమున తన స్వవిషయమును గూర్చి చెప్పినపిదప జగత్సింహుఁడు దుర్గమునందుఁ బ్రవేశించెను. అప్పటి ప్రస్తావనసందర్భమున విమలయుపయోగించిన యొకటి రెండుమాటలు వినినపిదప జగత్సింహునకు క్రోధమో లేక, చిత్తవికారమో కలుగుట మంచిదేయయ్యెను జగత్సింహుఁడామెను సుచరిత్రయని సంబోధించుటకై, విమల తానుకుచరిత్రనని చెప్పుకొనియెను. స్త్రీలు తాము కుచరిత్రలమని చెప్పుకొన్నచో నదిమిగులఁ జెడ్డయర్థమును వ్యక్తపరుచుచుండును. దుర్గమునందుఁ బ్రవేశించునప్పుడు గుప్తమార్గప్రస్తావమురాగా విమల "చోరుఁడున్నచోట కన్నముండును" అని చెప్పియుండెను. అదివిన్న రాజపుత్త్రున కనుమానము కలుగవలసి

యుండెను. ఏమనిన "చోరుఁడు—కన్నము" అనుపదములను గుప్తప్రణయమునకు గుప్తోపాయమని చెప్పినట్లు సూచితమగుచుండెను. కులాంగన నోటనుండి యట్టి మాటలు వచ్చుట యుక్తముకాదని యాతని కప్పుడు తోఁచియుండినచో నిట్లు సంభవించియుండదు. జగత్సింహుఁ డామాటలన్నియును సరసప్రవీణయగు విమల సరసవాక్యములని యోచించి యర్థాంతరమును తెలిసికొనఁడయ్యెను. వస్తుతః అదియే నిజమని తోఁచుచున్నది.

అంత్యసందర్శనమయ్యెను. కడసారిసందర్శనమున నేమిజరుగునో, ఈసందర్భమునందును నదియేజరిగెను. ఇరువురును పరస్పరము నాత్మసమర్పణము చేసికొని చిరకాలావిచ్ఛిన్నమగు ప్రణయపాశమునందు బద్ధులైపోయిరి. ఈవిధముగా వారి ప్రణయలీలాచరిత్రము చెప్పఁబడియెను. జగత్సింహుఁడు వీరుఁడును, సైన్యాధిపతియు నక్బరుపాదుషహా సేనకుఁడునై యుండెను. అందువలన నాసమయమునఁ బ్రణయరంగమున నారీతిగాఁ బ్రమత్తుఁడై యుండుటాతని కుచితముకాదు. కాని ఘటనలన్నియు నాతనికిఁ బ్రతికూలములై యున్నవి. ప్రణయరంగక్షేత్రము నందభినేతృఁడైయుండఁ బ్రార్థించిన వాఁడుకాదు. ఘటనాపరంపర యసంభావితోపాయములచే నాతని నారంగస్థలముపైఁ గూర్చుండఁజేసెను. ఆమదిరామోహనావేశ మొకసారి తలకెక్కినచో నెట్టివీరుఁడును దానిశాసనమునుండి బయటపడఁజాలఁడు

మానసింహుఁ డీసంభవములనన్నిఁటి నెఱుఁగునా? అతని కేవ్యాపారమును దెలియలేదని తోఁచుచున్నది అయినను నాతఁడు కుమారునిపై నాగ్రహము కలిగియుండెను. అతఁడు మొదట స్వామికార్యమును సాధించి పిదపనే స్వసుఖసంతోష విషయికయోచనము చేయవలయునని తలంచెడివాఁడు. అట్లుండుటయే కర్తవ్యనిష్ఠుఁ డగువీరునకు లక్షణమై యుండును. న్యాయపరాయణుఁడును గర్తవ్యనిష్ఠుఁడగు సేవకుఁడు నగునంబరేశ్వరుఁ డట్టియుద్దేశముతోడనే జగత్సింహునిపై నతికుపితుఁడయ్యెను. క్రమముగ ననేకవిధములచే నాతనికోప ముత్తరోత్తరాభివృద్ధినందెను. దానినిగూర్చి పాఠకు లిదివఱకు చదివేయున్నారు.

ఇంతేగాక జగత్సింహుఁడు మాసాధికకాలము తనసైన్యమును విడిచిపెట్టి దూరమున నివసించియుండెను. అది చాలగొప్పయపరాధము. అది క్షమింపఁదగిన నేరము కాదని మానసింహునకు గట్టినమ్మకము. ఆతనికోపమునకు హద్దులేకుండెను. అందుచే మహారాజు మానసింహుఁడపరాధిని సజీవావస్థయందైనను నది యసంభవమైనచో మృతావస్థయందైనను దీసికొనిరావలయునని యాజ్ఞయొసంగెను. ఆయాజ్ఞను వినినసభాసదులందఱును నాతనిక్రోధాధిక్యమును దెలిసికొని యెవరు నేమియు ననలేకపోయిరి.

జగత్సింహుఁడు శైలేశ్వరమహాదేవుని మందిరముకడ బందియయ్యెను. ఏస్థలమునందాతని ప్రణయాభినయమునకు బ్రారంభము కలిగెనో, ఆస్థలముననే యాతని యవనికపడిపోయెను.

నాల్గవప్రకరణము.

పాట్నానగరమున మానసింహమహారాజుగారి దర్బారుమందిరమునం దిప్పుడొక యసాధ్యకార్యము జరుగనైయుండెను. అటయథాసమయమున వర్ణనాతీతమైన యొకవిషయము నడవనున్నది. ఇంకకొంచెము సేపటిలో నచ్చట మిగుల గౌరవాస్పదుఁడైన రాజసేవకుని యపరాధమునుగూర్చి విచారణ జరుపఁబడును. రక్షకభటులస్త్రధారులై నాల్గువైపులను నిలువఁబడియుండిరి. కాల్బలమంతయును గుఱ్ఱపురౌతులును నందఱు నిష్టానుసారము విచారణసభకువచ్చి సిద్ధముగనుండవలయునని యుత్తరువులను పొందియుండిరి. వేలకొలది సైనికులు సభాస్థలమును జేరియుండిరి నగరవాసులందఱును వచ్చిచూచుటకభ్యంతరము లేమియు లేవు. ఆకారణమున విచారకార్య మారంభమగుటకు ముందు చాలసేపటినుండియును జన సమాగమముచే విశాలమైన యాదర్బారు మందిరమునం దెచ్చటఁజూచినను సంపూర్ణముగఁ బ్రజలు కిక్కిరిసి యుండిరి.

యథాసమయమున నగారాశబ్దము మ్యెను వాద్యధ్వని యాగిపో యినతోడనే స్తుతిగాయకులు మంగళగానములనుపాడి ముగించిరి. పిదప తూర్యధ్వని యమ్యెను. సభాగృహమునందున్న వారందఱును దలలెత్తి మహారాజువచ్చెడి మార్గమువంకఁ జూడనారంభించిరి తోడనే యంబరేశ్వరుఁడగు మానసింహమహారాజు ధీరగంభీర పాదనిక్షేపముతోఁ బ్రత్యేకముగనున్న యొకమార్గమునవచ్చి సభాస్థానమునఁ బ్రవేశించెను. అతనితోఁగూడ నాతనియనుచరులును సేనాపతులును సభాసదులును బారిషదులు నాతనిననుసరించి వచ్చినవారును గ్రమముగా నాసభలోఁ బ్రవేశించిరి. అందఱిముఖములును భయముచే నావరింప బడియుండెను నాఁ డేదియో యొకభయంకరవ్యాపారము సంఘటింపఁగలదని యందఱును భయవ్యాకులితహృదయులై యుండిరి. మానసింహమహారాజు సభయందు దానికి నిర్దిష్టమైయున్న యొక్క స్వర్ణభద్రాసనముపైఁ గూర్చుండెను సేనాధిపతులు సభాసదులు మొదలగువారుభయపార్శ్వములయందును గొంచెముతగ్గియున్న యాసనములపైఁ గూర్చుండిరి. అటనున్న వారందఱికిని మానసింహమహారాజు ముఖమునందు స్థిర గాంభీర్యభావసూచకలక్షణములు గన్పట్టుచుండెను

జనసమూగమముచే సభయంతయు నిండియుండినను, నత్యంత శాంతమును నిస్తబ్ధతయు నంతటను విరాజిల్లుచుండెను. ఎవరినోట నుండియును మాటలేదు. పార్శ్వమునందున్న జనులలోఁగూడ మాట లాడవలయునను ప్రవృత్తి లేదు. గట్టిగ నుచ్ఛ్వాసనిశ్వాసములను విడుచుటకైన నెవరికిని ధైర్యములేదు. అందఱును జిత్రాకులులైయుండిరి అందఱును భయావహులై యుండిరి.

మహారాజు సింహాసనము నధిష్ఠించి యకంపితగురుగంభీరకంఠముతో "బందీని తీసికొనిరావలయును" అని యాజ్ఞాపించెను.

తోడనే సభయంతయు విచలితమయ్యెను. అక్కడనున్న వారందఱిముఖములును మఱింత యుమ్మలికముతోఁ గందినట్లయ్యెను. అందఱు నుత్సుకులై మార్గమువంకఁ దిరిగి చూడసాగిరి. అప్పటికిఁ జుట్టుకొనఁబడియున్న నడివయస్కుఁడగు భటులమధ్యనుండి బందీ తల వాల్చుకొని యాసభాప్రదేశమునందుఁ బ్రవేశించెను. జనులందఱును

గరుణాసూచకములగు నేత్రములతో నపరాధిని జూచుచుండిరి. ఆబందీ "కుమారజగత్సింహుఁడు."

బందీ వచ్చి యెదురుగనిలిచినతోడనే మహారాజగు మానసింహుఁడు పూర్వమువలెనే దృఢకంఠముతో "బందీజగత్సింహా! నీవనేక విధములగునపరాధములను జేసి యపరాధివైతివి. నీయపరాధములను రెండుభాగములుగా విభాగించితిని. కొన్నియపరాధములు పారివారికమైనవి. మరికొన్నియపరాధములు రాజకీయమైనవి. ఇప్పుడు నీయపరాధముల విననిన్నిటిని చారణచేసి నీకుఁ దగినదండన విధింపఁబడును. రాజకీయసంబంధములైన నీయపరాధములు చాల గొప్పవి. విచారణ కార్యము సులభముగానుండు నని యెంచి ముందు నీపారివారికాపరాధములు విచారించుచున్నాను." అనియెను.

అవనతశిరస్కుఁడైన జగత్సింహుఁడు మిగుల లజ్జచే మఱింత తలవంచుకొనియెను. సమీపమునందున్న మొగలాయీ పారిషదులలో వృద్ధుడొకఁడు తనస్థానమునుండి లేచి నిలుచుండి మహారాజునకు విహితవినయపురస్సరముగ నభివాదనముచేసి "అధీనుఁడగునీయపరాధిని క్షమింపవలయును. సవినయముతో విన్నవించుకొనుచున్నాఁడను. పారివారికమైన యపరాధములనుగూర్చి యాలోచించునప్పుడితరులెవ్వరును వినవలసినయావశ్యకము లేదు. ఆసమయమున మేమందఱమును మరియొకస్థలమునకుఁ బోయియుండవచ్చునా?" అని విన్నవించుకొనియెను.

మాన—వలదు. ఎవరును నీస్థలమును విడిచిపోవలసిన యావశ్యకము లేదు. ఏమనిన—అపరాధి పారివారికాపరాధములతోఁ గూడ రాజకీయాపరాధములను గలిసిచేసియుండుటచే నొకయపరాధముయొక్క విచారణపై రెండవయపరాధ విచారణ మాధారపడియుండును.

మొగలాయీపారిషదుఁడు మరల కూర్చుండెను. అందఱును విగ్రహములవలె తమతమస్థానములయందుఁ గూర్చుండి మహారాజాజ్ఞ నెదురుచూచుచుండిరి.

మహారాజు — బందీ! వినుము. ముందువేయుప్రశ్నలకు నిజమైన ప్రత్యుత్తరములను జెప్పకపోయినచో నీయపరాధములు మఱింతగొప్పవిగా గ్రహింపబడును.

జగ — (గర్వముతో) మహారాజా! శాసనము కేవలమనావశ్యకమైనది జగత్సింహుఁ డసత్యములను చెప్పుటెన్నఁడు నెఱుఁగఁడు. ప్రాణభయముచేనైన నసత్యములనుడువ నశక్తుఁడు.

మాన — నీవు వీరేంద్రసింహుని యంతఃపురమునందలి యొకగదియందొక స్త్రీతోఁ గూడ పఠానులచేఁ బట్టుబడి బందీగాఁ గొనిపోఁబడలేదా ?

జగ — ఔను. కొనిపోఁబడితిని.

మాన - నీవు పఠానులవశమున బందీవైయుండి కటుల్‌ఖానుని పాలితతనయయగు నయేషాహృదయమునందు ప్రేమలాలసత నుత్తేజితమగునట్లు చేసియుంటివా ?

జగ — మహారాజా! ఆప్రశ్నకుత్తరము చెప్పవలయుననినచో జాలఁగలదు. క్షమింపవలయును. నవాబునందినియగు నయేషా నాకుఁ బరమహితైషిణి. నేననేకాపరాధములచే నాపాదితుఁడనైన యపరాధినైనను నిప్పుడు న్యాయవిచారణకొఱకు మీసన్నిధానమునకువచ్చి నిలుచుండుటకు సమర్థుఁడనగుట నవాబు తనయయగు నయేషాగుణాతిశయముచేతనే. నేనస్త్రఘాతముచే క్షతవిక్షతశరీరుఁడనై జ్వరవికారముచే స్మృతితప్పియున్నప్పుడు నవాబునందినియగు నయేషా తల్లివలెను సోదరివలెను సహధర్మచారిణివలెను సఖివలెను సర్వప్రయత్నములతోడను శుశ్రూషచేసి నా కారోగ్యమును గలుగఁజేసినది. ఆదేవికి భక్తితో నమస్కరించెదను సర్వాంతఃకరణములచేతను నామెను సన్మానించెదను. ఆమె నిష్కపటచిత్తయగు యాత్మీయబంధువని నాయభిప్రాయము అట్టిదేవకన్యను ప్రేమదృష్టితోఁ జూచుట కథముఁడనైన నాకు ధైర్యమెన్నటికి నుండదు ఆమెను దేవతగాభావించి పూజార్హములగు భావములతోఁ దక్కమఱి యేయితరభావములతోడను జూడవలయు ననుప్రవృత్తి యెప్పుడును లేదు. కాని, చెప్పుటకు హృదయము విదీర్ణమైపోవు

చున్నది. ఒకానొక యసంభావితఘటనచే గుణవతి యగునవాబునందిని యయోగ్యుఁడనగు నాయందుఁ బ్రేమసక్తయైనదని తెలియవచ్చినది సదయహృదయయగు నయేషాహృదయము మితిలేని నూతన కాకరమ య్యెనని తెలిసినది మొదలుకొని యత్యంతకష్టముల ననుభవించుచుం టిని. ఆమెను బ్రణయోన్మత్తనుగాఁ జేసితిననుమాట యసత్యము అపా రమైన యామెప్రణయమున కించుకైనను ప్రతిదానమునుజేసి సమా ధానపడినవాఁడనైనచో నాసుఖసౌభాగ్యానందములకుఁ బారమే లేకుండ నుండియుండును. ఆమెహృదయమునఁ బ్రేమోత్తేజనము చేయుటయనఁ జాలదూరతోపాస్త విషయము. ఆమె యాహృదయమునుండి ప్రేమా కర్షణచిహ్నమును మాత్రము తొలఁగఁజేయుటకొఱ కెట్టియసాధ్యకార్య మైనఁ జేయవలసివచ్చినచో నందులకించుకంతయును వెనుకంజవేయను.

మాన—ఇదువిషయమున నీకును బరానుఁ నవాబగు నస్మాన్ ఖానునకును ద్వంద్వయుద్ధమయ్యెనా ?

జగ—అయినది మహారాజా ! అయేషాప్రణయమే యందు లకుఁ గారణము. అస్మాన్‌ఖా నీప్రపంచమున నయేషాయొక్క ప్రేమకు రెండుస్థానము లుండరాదు. అందుచే మనయిరువురియం దెవ్వరైననొక రిప్పు డంతమొంది తీరవలయు నని నాతోఁ జెప్పెను. నేనందులకుఁ బ్రత్యుత్తరముగ "నాక యేషాపై వలపులేదు. అందునిమి త్తము యుద్ధముచేయవలసిన ప్రయోజనములేదు" అని స్పష్టముగాఁ దెలియఁజెప్పితిని. అస్మాక్ "నీవు ప్రేమించుటలేదు. కాని అయేషా నీయెడ ననురాగయై యున్నది. యుద్ధమెనర్పుము క్షమాపణలేదు. నీవు వధ్యుఁడవు" అని చెప్పెను. అదియంతయు నస్మాక్‌ఖానుకూడ నొప్పుకొనును. అతఁడు నాతో యుద్ధమునకుఁ గడంగినాఁడు కాని నేనాతనితో యుద్ధమును చేయలేను

మాన — నీవు నవాబుకుమార్తె కప్పుడప్పుడుత్తరములను బంపి యుండలేదా ?

జగ—అప్పుడప్పుడు మరలమరల వ్రాయలేదు. ఒక్కసారి వ్రాసితిని.

మా—నీవు కారణములేనిదే అయేషాను చూచుటకు పోయి యుండలేదా ?

జగ—పోయియుంటిని. ఈదేశమును విడిచిపోవుకాలమునందుం దదిపర్యాయ మొకసారి చూచివచ్చుటకై పోయితిని.

మాన—ఆమెను రావలయునని నీవేవరిచేనైనను వర్తమాన మంపితివా ?

జగ—రావలయునని వర్తమానమంపితిని.

మాన—నీ వయేషాను జూడఁబోయినప్పుడామె నిన్ను చూడ నంగీకరింపక నిన్ను వెనుకకుఁబొమ్మని యనలేదా ?

జగ—ఒకానొక కారణ విశేషముచే నామె నన్నుచూచుట కంగీ కరింపనిమాట నిజము.

మా—(విరసపునవ్వును నవ్వి) నీవు నవాబునందిని యం దాసక్తుఁడవై యుండలేదని యిప్పుడును జెప్పెదవా ? నీ వామెకుఁ బ్రేమోత్సాహముఁను జూపితివా ? లేక ఆమెయే నీయెడ ననురాగిణి యయ్యెనా ?

జగ—అగును. మహారాజా! నేను దానినిగూర్చి మొదటనే చెప్పియుంటిని. ఇప్పుడును జెప్పెదను. నమ్ముటయు నమ్మకపోవుటయు మహారాజువారి యిచ్ఛాధీనము.

మాన—(దృఢస్వరముతో) వీరేంద్రసింహుని తనయ నీకుప పత్నియా ?

జగత్సింహుఁడు విచలితుఁడయ్యెను. అతనిశరీరమున విద్యుత్ప్రవాహము ప్రవహించినట్లయ్యెను. అతఁడు స్థిరస్వరముతోఁ జెప్పఁ దొడంగెను. "మహారాజా! మీరు భూపాలురు. శాసనపాలనకర్తలు. ప్రభువులు. విశేషించి నాకు జనకులు. అందుచే ప్రత్యక్షదేవతా స్వరూపులైయున్నారు మీరడిగినప్రశ్నకు సరియైన ప్రత్యుత్తరము నిచ్చుట కశక్తుఁడుగ నున్నాఁడను. ఇతరులెవరైన భ్రమచేఁగాని పరిహాస మునకై గాని యట్టిప్రశ్నను వేసినచో వారి నా నిమిషముననే సర్వ నాశనము చేసితీరుదును. వీరేంద్రసింహుని తనయ నా సహధర్మిణి. పవిత్ర మంత్రానుష్ఠాన పురస్సరముగాఁ బరిగ్రహీతమైన ధర్మపత్ని.

మానసింహుఁడు జటలువిఱికిన సింహామువలె భయంకరరోషితస్వరముతో నిట్లనియెను. "నరాధమా! రాజపుత్రికుల కళంకా! పాపోద్రేకము"లైన యిట్టి మాటలను నా సమక్షమున వచియించి నప్పుడు నీజిహ్వ ముక్కముక్కలైపోలేదేమి? క్షోభచేఁ దనులజ్జచేతను నీప్రాణ మాలోడితముకాలేదేమి? వీరేంద్రసింహుని కుమార్తె నీకు ధర్మపత్నియా? ఏ వీరేంద్రసింహుఁడు వారివాహాకనివలెఁ బవిత్రమైన నాయంతఃపురమునందు ప్రవేశించి పరిచారిక గౌరవమును ధర్మమును సర్వనాశనముచేయవలయునని యత్నించెనో, ఏవీరేంద్ర సింహుఁడు నాయంతఃపురమునందు పట్టుబడి వ్యభిచారిణియైన యొక శూద్రస్త్రీ తనూజాత యగువిమలను వివాహముచేసికొనియెనో, ఆ పాపాత్ముఁ డగువీరేంద్రసింహుఁడు నీకు మామయా? మఱియు నా శూద్రస్త్రీతనయ యగువిమల నీధర్మపత్నికి సవతితల్లియా? ఇంకను వారివారిచారిత్రములను జెప్పవలయునా? నీధర్మపత్ని యనిచెప్పెడి యాస్త్రీ యొకజారజగర్భమున జన్మించినది ఇంతేకాదు. శశిశేఖరుఁ డనుపేరుతోఁ బ్రపంచమునంతను దలక్రిందులుగఁ జేయయత్నించి యనర్థోత్పాతములను గల్గించినసన్న్యాసి యిప్పు డభిరాముఁడై పరిణమించిన యాతఁడు నీధర్మపత్నికి మాతామహుఁడు. ఆతఁడు ప్రవాసియగుటకుఁబూర్వము ప్రవాసియైన మఱియొకనిభార్యకు గర్భోత్పాదనము చేసి పలాయనమైపోయెను. కాశికేగి బహుశాస్త్రముల నభ్యసించియుఁ దనకు సేవచేయుచు నివసించియుండుటకు గృహమునొసంగిన యొక శూద్రకన్య కన్యాధర్మమును నాశనముచేసెను. ఆమహాపురుషుఁ డిప్పుడు పరమజ్ఞాని. ఛీ! ఏమి! నీవివేచనము— నీచజఘన్యులైన వారందఱు నీకాత్మీయపరివారముగా నెంచుకొనుచు సామాన్యపు జమీందారుని తనయను వివాహముచేసికొంటివి. నీ వామెను నీయుపపత్నిగా నంగీకరించినచోఁ గొంతవఱకు నీయపరాధముస్వల్పమై క్షమించుట కర్హమై యుండును. తండ్రియిష్టమునకు విరోధముగాఁ దండ్రియాశీర్వాదముగాని తండ్రియంగీకారముగాని యపేక్షింపనిదే యిట్టి నికృష్ట వంశమువారితో సంబంధమునుచేసికొనిన కుమారుఁడు తండ్రికిఁ బరిత్యాజనీయుఁడు. ఇదిమొదలు జగత్సింహుఁడు నాకుమారుఁడుకాఁడు,

నీ వెవరితో నైనను మానసింహుని తనయుఁ డనని చెప్పుకొనినచో నీకు ప్రాణదండనము సంభవించును.

సభయందలివారందఱు భయభ్రాంతులై మహారాజు నాజ్ఞను వినుచుండిరి. మహారాజు మరల చెప్పఁదొడఁగెను—ఇఁక నీ రాజకీయాపరాధమునుగూర్చి యాలోచింపవలసియున్నది. నీవు పాదుషాహా వారి సేవకుఁడవై యొకానొక కార్యభార్యమును గ్రహించిన సేనాధిపతి వయ్యును నతాయాసముగా నొకతస్కరునివలె నర్ధరాత్రియం దెవరు నెఱుఁగకుండ దుర్గాధిపతికిఁ దెలియనిదే యితరులదుర్గములోనికిఁ బ్రవేశించియుండ లేదా?

జగత్సింహుఁడు ప్రత్యుత్తర మేమియునీయకుండఁ దలవాల్చుకొనియుండెను. మానసింహుఁడు చెప్పఁదొడఁగెను. ఐదు వేల సైన్యమును గూడఁదీసికొని పఠానులను దరిమివేయుభారమును వహించి యా కార్యమును జేయక యే స్వసుఖప్రయత్నమున నారీలాభము నాశించి యక్కడ నుండ లేదా?

జగత్సింహుఁడు నిరుత్తరుఁడయ్యెను. మానసింహుఁడు చెప్పఁదొడఁగెను. పఠానులచెఱనుండి విడుదలయైనపిదప నీవు సైన్యములున్న కడకుఁ బోయి వారిని కలిసికొని నాయాజ్ఞల నెదురుచూచుచు నేల యుండ లేదు?

జగత్సింహుఁడు మాటాడ లేదు. మానసింహుఁడు మరలఁ జెప్పదొడఁగెను సేనాధిపతులందఱును శిబిరములను వీసి సైన్యసమేతులై పోవుచున్నప్పుడు నాయాజ్ఞానుసారముగఁ బోయి నీవు వారితో నేలచేర లేదు?

జగత్సింహుఁడు మాటాడ లేదు. మానసింహుఁడు తిరిగి చెప్ప నారంభించెను ఏవిధమైనయుత్తరువును బడయనిదే పాదుషావారి యేకార్యమునందును జేరనిదే స్వతంత్రుఁడవై కాలహరణము నేల చేసితివి?

జగత్సింహుఁ డేమియు జెప్ప లేదు. మానసింహుఁడు నుడువ సాగెను. చెప్పుము! దురాత్మ! కర్తవ్యజ్ఞానవిహీనుఁడవైన నీయట్టివాని

కెట్టిశిక్షవిధింపవలయును ? ప్రాణదండనమే నీకుఁ దగినదండనమై యున్నది

మొదటఁజెప్పిన మొగలాయీపారిషదుఁడు లేచినిలుచుండి యత్యంతవినీతిభావముతో మహారాజునకు సలాముచేసి "హుజూర్! అభయము ప్రసాదింపఁబడుఁగాక! ఒకవిన్నపము విన్నవించుకొనుచున్నాఁడను. యువరాజు మీకు పుత్రు—

మాటముగియకపూర్వమే మానసింహుఁడు వజ్రగంభీరస్వరముతో నిట్లనియెను హతభాగ్యుఁడగు నీనీచుఁడు నాకుఁదనయుఁడని చెప్పువా రెవరు ? నాకుఁ గుమారుఁడేయైనచో రాజద్రోహియై కర్తవ్యాకార్యమునం దనాసక్తుఁడై ప్రభువున కవమానమును గలుగఁజేయఁడు. పుత్రత్వసంబంధమును బరిత్యాగము చేయవలయునని యే పారివారిక సంబంధము లగునపరాధములని మొట్టమొదట విచారణచేయ నారంభించితిని. ఆవిచారణముతోడనే యీహతభాగ్యునితోఁ బుత్రత్వసంబంధము తుదముట్టినది.

మొగ—మంచిది! మీరు ధర్మావతారులు. యోచించి చూడవలయును. యువరాజింకను దరుణవయస్కుఁడు.

మానసింహుఁడొక్కింత సేపధోముఖుఁడై యాలోచించి పిదప "దురాత్మా! వినుము. నీయపరాధములకుఁ బ్రాణదండనముతక్క వేఱుసముచితమైన శిక్ష యేదియు లేనట్లుతోఁచుచున్నది. అయినను నీ చిన్నతనమునకుఁ దగినట్లు నీకు యావజ్జీవమును గారాగారవాసదండనమును మాత్రము విధించితి" నని చెప్పి కావలివారలను జూచి "ఈహతభాగ్యునిదుస్తులను భూషణముల నన్నిఁటిని దీసివేసి నాసమక్షముననే యీసభయందు సంకెలలను దగిల్చి యందఱును జూచుచుండఁగా వీని నాకారాగారమునకుఁ గొనిపొండు" అని యానతిచ్చెను.

మహారాజుగారి యాజ్ఞ తత్క్షణమే నెరవేర్పఁబడియెను. జగత్సింహుఁడు బందీదుస్తులను దొడిగికొనియెను. లోహశృంఖలము లాతనిహస్తములయందును బాదములయందును నిబద్ధములయ్యెను. నాల్గుమూలల నుండియును నస్ఫుటములగు హాహాకారములును నిట్టూర్పుధ్వనులును

బయలువెడలెను సైన్యాధిపతులందఱును దలలు వాల్చుకొనిరి వృద్ధులందఱి నేత్రములనుండియుఁ గన్నీరు ప్రవహించుచుండెను. కావలివారలు బందీని గొంపోయిరి. సభయు విడిపోయెను.

ఐ ద వ ప్ర క ర ణ ము.

వార్తాహరుఁడు.

దారుకేశ్వరనదీతీరమునకుఁ బోయిరమ్మని యాజ్ఞాపింపఁబడిన సైనికుఁడు మధురాసింహుని సైన్యమును వీడి యొంటరిగా మందారణ దుర్గాభిముఖుఁడై కొంచముదూరము వచ్చినపిదప నాతనికి దారియందు వికటవేషధారియైన గజపతివిద్యాదిగ్గజుఁడు కనఁబడియెను. గజపతి కొంచముసేపటికి పూర్వమశ్వారోహియైన జగత్సింహుని గలిసికొని యాతనియొద్దనుండి యొకరూపాయను బుచ్చుకొనియుండెను. మరల నిఁకనొక యశ్వారోహియగు వీరపురుషుఁడు వచ్చుచుండుటను జూచి మనమునందుఁ దనకది సుప్రభాతమనియు, నామనుష్యునితో మాటాడినచోఁ దనకేదైన లాభముండుననియు భావించుకొని యశ్వారోహి కెదురేగినిల్చుండి రెండుచేతులను బైకెత్తి "అల్లామహాదేవుఁడు హుజూర్ తబియతును (మీ దేహారోగ్యమును) కాపాడుఁగాక!" యని యాశీర్వదించెను

అశ్వారోహియగు సైనికుఁ డాశ్చర్యవేషియైన యా మనుష్యుని నోటనుండి యాశ్చర్యభాషయందు వచ్చిన యా యాశ్చర్యాశీర్వాదమును విని యాశ్చర్యమునొంది యాతనితో మాటలాడవలయు నను నభిప్రాయముతో గుఱ్ఱమును మెల్లమెల్లగ నడపనారంభించెను. దిగ్గజుఁ డాతని పార్శ్వమునుండి నడచివచ్చుచుండెను.

అశ్వారోహి—మీరేజాతివారు?

దిగ్గజుఁ డాలోచింపఁదొడంగెను. కొంచెము సేపయినపిదప గురువుగారినడిగి తెలిసికొననిదే "మీప్రశ్నకు సరియైన ప్రత్యుత్తరము నీయఁజాలను" అనియెను.

అ—అదేమిమాట? మీజాతినిగూర్చి యింకొకరి నడిగనిదే చెప్పఁజాలరా?

దిగ్గజ—నేనేమో సరిగా నేయుంటిని కాని, నా జాతివిషయ మింకను సరిగా లేదు.

సైనికుఁడు తన మనసునందు "ఈమనుష్యుఁడు పిచ్చివాఁడని తోఁచుచున్నది. ఇతనితో మాటాడినచో కాలమువ్యర్థముగా నష్టమగు" నని యోచించి "ఏమి చాల నాశ్చర్యముగ నున్నది." అనియెను.

దిగ్గజ—నేను హిందూబ్రాహ్మణుఁడను పిదప నేను ముసల్మానుఁడనైతినని విన్నాఁడను. పునః హిందువగుటకుఁ జేయవలసిన దానినంతను జేసితిని. ఇప్పుడు నాజాతినిగూర్చి యేమని చెప్పవలయునో మాస్వాములవారు సెలవిచ్చువఱకును నేనేమియుఁ జెప్పజాలను.

సైనికుఁడు సంగతి నంతయును దెలిసికొనవలయునని యెంచి "స్వాములవారెవరు" అని యడిగెను.

ది—నా కధ్యాపకులు—పాఠములను జెప్పెడివారు.

సైనికుఁడు మరల విస్మితుఁడై "నీకధ్యాపకులా? నీ వయస్సునందుఁగాఁ అంత యేమియు లేనట్లు తోఁచుచున్నది ఇప్పుడును నీవు విద్యార్థివేనా?" అని యడిగెను.

దిగ్గజ—నాకు వయసత్యల్పము. అమ్మాసీ చెప్పినట్లు నేనింకను బసివాఁడనే ఆమాటయెప్పుడు నసత్యముకాదు?

సైనిక—అమ్మాసీ యెవరు?

దిగ్గజుఁడు కొంచెముసేపు కన్నులుమూసికొని యోచించి పిదప "ఎవరో నేనెఱుఁగను." అనియెను.

సై—అమ్మాసీ స్త్రీయా? లేక పురుషుఁడా?

దిగ్గజుఁడు మరల కొంచెము సేపాలోచించి పిదప "నిశ్చయముగాఁ జెప్పజాలను. స్త్రీ యనియే తోఁచుచున్నది" అనియెను.

సైనికుఁడాతనికి బుద్ధిచాలదని తెలిసికొనినాఁడు. అట్టివానితోఁ బరిహాసమాడుచుండు టందలికి నిష్టము. సైనికుఁడు మరల "అమ్మాసీ స్త్రీ యని యెవరివలనఁ దెలిసికొంటిరి?" అనియెను.

దిగ్గజ—స్త్రీవలెనే చీరను ధరియించును. శిరోజములను గొప్పు పెట్టుకొనును. భూషణములను ధరియించును. యీలక్షణములనుజూచి స్త్రీ యని నిశ్చయించితిని

సైని—ఆమెకు గడ్డమును మీసములున్నవా?

దిగ్గ—అవేవియు గాన్పింపలేదు.

సైని—అందువలననే యామె స్త్రీయని తెలియుటలేదా?

దిగ్గజుఁడు కొంచెముసేపాలోచించి పిదప "అంతమాత్రముచే నిశ్చయముగాఁ జెప్పవలనుపడదు. నాకు పాఠములుచెప్పిన యధ్యాపకుల కనేకులకు గడ్డములును మీసములును లేవు అనేకులువైదిక లౌకికులకును మీసములు గడ్డములు లేవు. ఈయుత్కల దేశమునందుఁ పురుషులకు గడ్డములును మీసములును లేవు. మస్తకమునందో—కొప్పుపెట్టుకొన వీలులేనిశిరోజములు మాత్రము—"అనియెను.

సై—ఆస్వామినీ యధ్యాపకురాలు కాదని చెప్పవచ్చునా?

ది—మహాశయులు చెప్పినది సరికాదని చెప్పను. కాని యాస్వామినిముఖభావము మొట్టమొదట నాయధ్యాపకుని ముఖభావమునకు సరిగాఁబోలియున్నది. అదియుఁగాక యాస్వామినీ వ్యవహారాదు లా యధ్యాపకుల వ్యవహారాదులవలె నున్నవి.

· సైనికుఁడు కౌతూహలముతో "ఏవిషయమునందు" అని యడిగెను

దిగ్గ—ఆమె యెప్పుడును నన్నుఁ గొట్టుచునేయుండును. కాని నాయందు మిగులఁ ప్రీతికలిగియుండును. నేను చేయఁదగిన కొన్ని కార్యములను నాచేఁ జేయించుకొనుచుండును. సుఖదుఃఖములను గూర్చి నాకుఁ జెప్పుచుండును

సై—నీకు పాఠములను జెప్పుచుండుటలేదా?

ది—లేదు. అది నాదోషమనియే చెప్పవలయును. నేనామెను జూచినతోడనే సర్వమును మరచిపోవుదును. చదువవలసిన విషయములు మనస్సునఁ బట్టవు. పాఠమును జదువుటకు సమయముండదు.

సై—ఆస్మానీ స్త్రీయని యిప్పుడు తెలిసినది. మీరిదివఱకును నాతోఁ బరిహాసమాడుచున్నట్లున్నది, ఆస్మానీ మీకుఁ బ్రియయని.

దిగ్గజుఁ డుద్దండుడై యెగిరి గంతువైచెను. అతఁడు పైకెగిరి గంతువేయుతొందరలో నాతనికంఠముననున్న రుద్రాక్షమాల కంఠమునుండి తెగి దూరముగాఁబడిపోయెను. అతఁడు దానిని తీసికొనకుండ నట్లేపోయి సైనికునియొద్ద నిలిచి "మీరేమిచెప్పితిరి? నేనామాటనే యూహించుకొనుచున్నాఁడను. కాని, ఇతరులామెను స్త్రీయని తెలిసికొందురా?" అనియెను.

సైనికుఁడు చిఱునగవుతో "నిజముగా జను లట్లే తెలిసికొందురు. ఆమె మీయందుఁ బ్రీతికలిగియున్నదనియు మీరొకటి రెండు మాటలాడినతోడనే యామె మీప్రియయని యనియుఁ దెలిసికొంటిని" అనియెను.

దిగ్గజుఁడు వ్యస్థుఁడై రుద్రాక్షమాలను దీసికొని కంఠమున వేసికొని సైనికునిసమీపమునకు వచ్చి నిలిచి "మీరు దైవజ్ఞులా? మీరు నిజమైనమాటలనే చెప్పుచుండిరికదా? నేనీపర్యాయము దుర్గములోనికిఁ బోయి యామెను నాప్రియయని యని పిలువవచ్చునా?" అనియెను.

సైనిక—ఆమె మీప్రియయని యని నిజముగాఁ జెప్పుచున్నాను మీరు పోయి స్వచ్ఛందముగా నామెను మీప్రియతమ యని చెప్పి యాదరింపవచ్చును. నేను చాలకాలము మాగురువులకడ సాముద్రికశాస్త్రము నభ్యసించితిని. మీముఖమును జూచినతోడనే మీకొకమనోమోహిని యుండెనని తెలిసికొన్నాఁడను. ఆమెనామము యొక్క మొదటియక్షరము "ఆ" యని గోచరమైనది. ఆమెనామమునందలి యంత్యాక్షరము గోచరమయినదికాదు నీవిప్పుడు తొందరగావచ్చి నిలుచుండినపిదప మీప్రియయినీ నామాంత్యాక్షరము "ని" యని స్పష్టమయ్యెను.

ది—(పరమానందముతో) దేవర చెప్పినమీఁదట కన్నులు తెరచిచూచినట్లయ్యెను. మీవంటి దైవజ్ఞులనోటినుండి వినినపిదప నాస్మానీ

నాపత్నియని యని ధృఢవిశ్వాసము కలిగినది. అందులకు సంశయములేదు. మీరు దయచేసి, నాలలాటమునకు గొంచెము పరీక్షించిచూడవలయును. నా పత్నియనీ నాపూతాక్షరములుగానుండ నక్కడక్కడ వేజేయక్షర సముదాయమే మైననున్నదేమో సరిగాఁ బరీక్షించి చూచి చెప్పవలయును.

గజపతి లలాటమును గొంచెము విప్పి దగ్గరగా వచ్చెను. సైనికుఁడు "అక్షరములున్నవి. కాని, "ఆ" "ని" అను నీ రెండక్షరములుఁ గనఁబడినంత స్పష్టముగాఁ దక్కినవి కాన్పించుట లేదు అవిమసకమై పోయినవి." అనియెను.

గజ—మీరు నాకుమహోపకారమును జేసినవారైనారు. మీరెక్కడకుఁబోయెదరు ?

సై—ప్రస్తుతము మందారణ దుర్గమునకుఁ బోయెదను. పిదప వేఱే మఱియొకతావునకుఁ బోయెదను.

గజ—మందారణ దుర్గముకడకు వచ్చినారము. ముందు కనఁబడుతోఁట వెనుక నేకదా కోటయున్నది. ఇక్కడ కెవరికొఱకువచ్చితిరి ?

సై—విశేషకార్యము లేవియులేవు. కోటలోనొకవార్తఁ జెప్పవలసియున్నది.

గ—అయినచో పోవుదము రండు. నేను మొట్టమొదట కోటలోపలికే పోయెదను. అచ్చట నాపత్నీ యున్నది. మొదట నామెను చూడనిదే మఱియెక్కడకును బోను.

సై—మీరు దుర్గమునందున్న యందఱితోడను మాటాడుట కలదా ?

గ—(గర్వముతో) అనేకపర్యాయములు—విశేషముగ—దుర్గమునకుఁ గర్తలగు నభిరామస్వాములు నాకధ్యాపకులు. దుర్గమందు సర్వమయి యగునామె నాఘృతభాండము. ఎవతెనామాతాక్షరములలో మొదట "ఆ" యును నంత్యమున "ని" యును కలదో, ఆమెయే నాకు ముఖ్యాధారము.

సై.—అయినచో దయచేసి మీరొక సామాన్యవార్తను దుర్గమునందుఁ దెలిపినచో గొప్ప యుపకారమును జేసినవారగుదురు. ఎవతె నామాక్షరములలో మొదట "ఆ" యును చివర "ని" యును కలదో, యట్టి మీముఖ్యాధారిణి మూలమున నీవార్తను బంపిన జాలును!

గ.—అవశ్య మట్లేచేయుదును. మీకొఱకు నాప్రాణమును బోగొట్టుకొనుటకైనను సిద్ధముగా నున్నాఁడను. ఆస్మానీ నాప్రణయిని యని మీరుచెప్పినది మొదలుకొని నాధైర్యసాహసము లెట్టులభివృద్ధి యయ్యెనో నేను చెప్పఁజాలను. నేనిప్పుడేపోయి వార్తను జెప్పివైచెదను సమాచారమేమి? చెప్పుడు.

సై.——మీరు దయచేసి కుమారజగత్సింహుఁడు బందీయయ్యెనని తెలియఁజేయ వలయును.

గజపతి "ఎందులకు బందీయయ్యెను? ఎవరు బంధించినారు?" అని యడిగెను.

సై.——ఎందులకు బందీయయ్యెనో చెప్పఁజాలను. మహారాజగు మానసింహుని యాజ్ఞాప్రకారము మేమే యతనిని బందీగా పట్టుకొంటిమి

దిగ్గజుఁడు కొంచె మాలోచించి యువరాజు బందీయైనప్పుడు దుర్గమునందలి మిగిలినవారందఱకు నదేగతిపట్టుననియు, వీరేంద్రసింహుఁడు బందీయైనప్పు డాతనియనుచరులందఱు నాతనితో ననుగతులై బందీలైరనియు భావించుకొనియెను. తానుచేసిన గంగాస్నానము, తీర్థదర్శనము, గంగాతీరవాసము మొదలగునవన్నియు వ్యర్థములయ్యె ననియు, యువరాజునుపట్టుకొని బందీచేసినవారిలో నొకఁడు ముందుగా వచ్చినాఁడనియు, మిగిలినవారు వెంటనే రాఁగలరనియు, ప్రస్తుతమున బందీగాఁజేయునాతనిసహవాసమును వీడిపారిపోవుట మిగులమేలనియు యోచించుకొని ప్రకాశముగా సైనికునితో "ఈవార్తను దుర్గమునందుఁ దెలియఁజేసెదను. వేఱుకార్యమునుగూర్చి మీరు దయచేయ వచ్చును" అనిచెప్పెను.

ఈవిధముగఁ జెప్పి దిగ్గజుఁడు క్రమముగా నచ్చటచ్చట నడ యాడనారంభించెను. సైనికుఁ డాతని కడ్డమువచ్చి వెన్నంట లేదు. దిగ్గజుఁడు మెల్ల మెల్లగ కొంచెముదూరము పోయి పిదప పరువిడనారం భించెను. పరుగెత్తుచు నప్పుడప్పుడు వెనుదిరిగిచూచుచు మరల పరు గెత్తుచుండెను. పరుగెత్తుటయం దాతనికి విశేష నైపుణ్యముండెను. పూర్వమొకప్పుడు విమలతోఁగూడ రాత్రికాలమునఁ బోవుచున్నప్పుడు పిశాచభయముచే గజపతి యీరీతిగనే పారిపోయియుండెను.

దిగ్గజుఁడు పలాయనమ్మె యదేపోకగాఁబోవుచుండుట యంతవిశే షముగా సైనికుఁడు గమనింపలేదు. పదస్థుఁడగునాతఁడు పదచ్యుతుఁ డగువానికిఁ బూర్వమువలె గౌరవమునొసంగక యవజ్ఞచేయుచుండు టెల్లరకును స్వభావసిద్ధము. జగత్సింహుఁడు ప్రస్తుతమున బందీగ్రమై యుండుటచే నాతనియాజ్ఞను నెరవేర్చుట యంతయావశ్యకముకాదని సైనికుఁడు తెలిసికొనియెను. యువరాజు చెప్పినవార్తను దెలుపుటకుఁ దానే దుర్గమునకుఁబోయి కాలమును వ్యర్థముగా నష్టముచేసికొనుట ప్రయోజనకారికాదని యాతఁడు తెలిసికొనియెను. ఇంతేగాక యా స్థితియందు యువరాజుచెప్పినవార్తను దుర్గమునకుఁబోయి తెలియఁ జెప్పుట క్రమముకాదనికూడ నాతఁడు భావించుకొనియెను ఏమం టిరా? ఈవార్తను దుర్గమునకుఁబోయిచెప్పినను సమాచారము మహా రాజెఱింగినచో సైనికుఁడు దండార్హుఁడగును ఆశంకచేతనే దుర్గము నకుఁ బోవలసినయావశ్యకము లేదని యాతఁడనుకొనియెను గజపతిని వార్తావహునిగాఁ జేసి వార్తను దుర్గమునఁ దెలియునట్లుచేసి తనపైఁ బెట్టినభారమును తగ్గించుకొనియెను.

మందారణదుర్గమునకు సరిహద్దున నాల్గుమార్గములు చేరియుం డెను ఒకటి దుర్గములోనికిఁ బోవును. ఒకటి శైలేశ్వరుని మందిరము నకుఁ బోవును. ఒకటి వర్ధమానముకడకుఁ బోవును. నాల్గవది పురము నకుఁ బోవును. సైనికుఁడు దుర్గమునకుఁ బోవకుండ పట్టణమునకుఁబోవు మార్గమునుబట్టి పోయెను. కశాఘాతముచే నుత్తేజితమైన యాతనిగుఱ్ఱ మును వేగముగాఁ బోవుచుండెను.

ఆఱవ ప్రకరణము

గజపతివిద్యాదిగ్గజుఁ డూపిరివిడువకుండ పరువెత్తి దుర్గము లోనికిఁ బోయెను. మఱియెక్కడకును బోవకుండ నామ్మాసినిజూడ వలయునని యంతఃపురమునకుఁ బోవుట కధికారము లేకపోయినను సాహసముచేసి పోవుచుండెను. అద్భుతముగనున్న యాతనిదుస్తులనుఁ నత్యంతవ్యస్తభావముతో నాకస్మికముగా నాస్థలమునకువచ్చి నిలుచుండుటయుఁ జూచి ద్వారరక్షకుఁడు కసరుకొనుచు నాతని నచ్చటనుండి వెడలిపొమ్మని చెప్పెను.

దిగ్గ—అన్నా! కోపపడెద వెందులకు? నేనొకగూఢసమాచారమును దెచ్చితిని. దానినిప్పుడే తెలుపుటయత్యావశ్యకము.

ద్వారపాల—అట్టి వార్తయేదియో నాకుఁ దెలుపఁగూడదా?

దిగ్గ—నీకుఁ దెలుపఁదగినది కాదు ఒక్కరికిమాత్రమే యది యేకాంతముగాఁ దెలుపఁదగియున్నది నీకుగడ్డమును మీసములున్నవి కచ్చ బిగించుకొని బట్టకట్టుకొంటివి. నీతలపై కొప్పులేదు. నీకు వార్త జెప్పుటకు నీవు నాకధ్యాపకుఁడవా?

ద్వార—నిన్నువిడిచి పెట్టినచో ఠాకూరాణియొద్దఁ గూర్చుండి నీవార్తలను విన్నవించెదవా? ఇక్కడ నిలువవలదు. దూరముగఁ బొమ్ము.

దిగ్గ—నీవు నన్నెఱుఁగవా? నేనిక్కడివాఁడనే. నీవు నన్ను మఱచిపోయితివి కాఁబోలు.

ద్వార—నీవిప్పుడు నిక్కడివాఁడవుకావు. నేను చూడనివారెవరు నిందులేరు. నీవిక్కడివాఁడవే యైనచో నిట్లువచ్చి మార్గమునొద్ద గద్దెమాడుచుండవు. నీవు నిజముగాఁ గిష్కింధలో నుండువాఁడవు.

దిగ్గ—నిజముగా నీవు నన్నుఁ జూచియుండలేదా? దుర్గమునందు నన్నెఱుఁగనివారున్నారనుమాట నాకాశ్చర్యమును గల్గించుచున్నది. నీ వభిరామస్వామి నెఱుఁగుదువా?

ద్వార—ఆయన నేనెఱుఁగనా? నీవుపిచ్చివాఁడవు—నీకును నాయనకు నేమిసంబంధము?

దిగ్గ——ఆయన నాకు గురువు. నేనాయనకుఁ బ్రధానశిష్యుఁడను.

ద్వార——కొంచెము యోచించి పిదప నాయనకు శిష్యుడవేయైనచో నీకీవేషమేల ?

దిగ్గ——దానినిగూర్చి చెప్పవలయునని నచోఁ జాలఁగలదు. మఱియొకనాఁడదియంతయు నీకెఱింగించెదను ఇపుడంతఃపురమునందు నాయూప్మ్రానీయున్నది నేను చెప్పవలసిన యత్యవసరవార్త నామెకు మాత్రమే చెప్పెదను

ద్వార——యప్మ్రానీ యన్నమాట నిజమే. నీవామె కేమగుదువు?

దిగ్గ——దానినిగూర్చి చెప్పవలయునని నచోఁ జాలకలదు అది యట్లుంచుము. నీవామె నిక్కడకుఁ బిలువుము. అట్లు కాకపోయినచో నేనామె యుండుస్థలమునకుఁ బోయెదను విడువుము. అదియునుగాక పోయినచో నిక్కడనుండియే యామెను గట్టిగా కేకవేసి పిలుచుట కొప్పుకొనుము.

ద్వార——కొంచెము సేపాగుము. జనులెవరినైనను జూచి యామె యొద్దకు సమాచారమును జెప్పిపంపెదను.

దిగ్గజ——నేను వేచియుండఁజాలను. వేగముగా సమాచారమును జెప్పిపంపుము. నేను తెలియజేయవలసినవార్త చాలనవసరమైనవార్త. కాలవిళంబమైనచో నది యొకమహావిపత్తునకుఁ గారణమగును.

ద్వారపాలకుఁడు కొంచెము యోచించి పిదప మనస్సునందు "ఇతఁడు మందారణనివాసుఁడేయనియు, నితని నిచ్చట నిలిపియుంచుటుచితముకాదనియు నిశ్చయించుకొని ఆగుము. లోనికి వార్తనంపెదను." అనియెను.

దిగ్గజునకును ద్వారపాలకునకును నీవితండవాదము జరుగుచున్నప్పుడదియంతయును నంతఃపురమునందుఁ బ్రచ్ఛన్నయై గవాక్షముకడ యవనికాంతరాళమున నొకప్రౌఢవిధవాంగన నిలుచుండి చూచుచుండెను. ఇతరులకామె కానిపింపకుండ మార్గముకడకువచ్చి నిలుచుండి,

ముఖహస్తపాదాద్యవయవములతో నభినయము సేయుచు గంధరగోళముఁజేయుచున్న దిగ్గజుని జూచుచుండెను.

ఆమెవిమల. ఆమె దేహమున నెచ్చటనునాయుజ్జ్వలతయు నా కోమలతయు నిప్పుడులేదు. అత్యంతమనోహరమగు నాచంపకసదృశ వర్ణ మిప్పుడులేదు. అధరోష్ఠములయం దాతాంబూలరాగవర్ణ మిప్పుడు లేదు. లోచనములయందు పూర్వమువలె నాకజ్జలరేఖలు నిప్పుడు లేవు. ఆలోచనములయందు మన్మథశరరూపములగు నాకటాక్షములును లేవు కుంతలములయందా నిబిడకృష్ణతయును లేగు. వేణిగాని కబరిగాని యేదియును లేదు శరీరమందెచ్చటను నొక్కయాభరణమైనను లేదు. స్వర్ణసూత్రసమన్వితమైనవస్త్రముచే నామెశరీరము సమావృతమై యుండలేదు. వక్షమునందు ముక్తాఖచితమైన కంచుకము లేదు. పూర్వశోభాసమృద్ధులేవియు విమలయందిప్పుడు లేవు. విమల వయస్సునందేగాకుండ పైకిఁజూచుటకుఁగూడ వృద్ధయై యుండెను. ఆమె యాయలౌకికలావణ్యమును, శోభామయమైన యాయౌవన సంపదయును గాలముచే జయింపఁబడినవని యనేకులెఱుంగుదురు. ఇప్పుడవి శ్రీభ్రష్టములును, మలినములును, విశుష్కములునైయుండెను. ఆమె యవయవములు క్షీణించియుండెను. దేహము కాతరమై యవసన్నమై యుండెను. గమనము కంపితమై విచలితమైయుండెను భావభంగులు సంయతములై సావధానములై యుండెను విలాసమయి యగు నా విమల యిప్పుడు శుభ్రవసనధారిణియైయుండెను. హాస్యకౌతుకమయి యగు నావిమలయధరోష్ఠము లిప్పుడు రవికరపతితప్రసూనకలికలవలె మ్లానములైయుండెను. ఆ హాస్యానందము లామెయొద్దనుండి చిరకాలపుసెలవును గైకొనిపోయినవి. రహస్యము, రసికత, పరిహాసము మొదలగునవి యామెస్నేహమును వదలిపెట్టిపోయినవి. హా! శోకమా! నీవీసంసారమునందు ఘటించినయచించిత పూర్వపరివర్తనము లేవియు రాకుండనుండవా?

ఆసమయమునఁ గొంచెము స్థూలకళేబరమును శ్యామలవర్ణముగలప్రౌఢవయస్కయగు మఱియొకస్త్రీవచ్చి విమలవెనుకప్రక్క నిలుచుండియుండెను. ఆస్త్రీ ఆస్మాని.

ఆష్మాని—సఖీ! మధురకుఁబోవు మార్గమునుజూచుచు వ్యర్థముగాఁ గాలహరణముసేయు టెందులకు? శకుఁడగునానటు డు దిగ్గజుఁడు వెనుకకుఁదిరిగి రాఁడు.

విమల——ఈ పరిణయబంధమును ద్రెంపివేయుట కెవరికిసాధ్యము? మనశ్యామసుందరమదనమోహనుఁడు మరలవచ్చియున్నాఁడు

ఆ——నిజమే! ఆహా! అట్టిదినము మరలవచ్చునా?

వి——వచ్చిచూడుము!

ఇట్లుచెప్పి విమల ఆష్మానీని తానున్నయెడనిల్పి తాను కొంచెము వెనుకకుదిరిగి "చూడుము. మనచోరునిజూడుము. ఔనా? కాదా?" అనియెను.

ఆష్మానియుఁ జూచి నవ్వుచు "ఔను. అమ్మా! ఆపోకరి బ్రాహ్మణుఁడు వచ్చినాఁడే! కాని యూదుస్తులేమి?" అనియెను

విమలయు నవ్వుచు నాష్మానీగడ్డమును బట్టుకొని విరహ విహ్వలా. రాధా! అన్నియును మఱచితివా? గోపకన్యలప్రాణధన మిప్పుడు మధురాపురమునకు రాజుగానున్నాఁడు. అది యూరాజవేషము అనియెను

ఆష్మాని—పరిహాసమున కేమి—ఈనిర్భాగ్యుఁ డిన్నిదినములకుఁ దరువాత నిప్పుడెక్కడనుండి వచ్చెను?

విమ—అది తెలిసికొనుట మిగుల నావశ్యకము. నీవుపోయి గజపతిసి దీసికొనిరమ్ము. ద్వారపాలకునితో గద్దలముసేయు టెందులకు?

ఆష్మానియు నక్కడనుండి క్రిందికిదిగిపోయి లక్ష్మణియను నొక దాసినిబిలిచెను. ఆమెవచ్చెను. ఆమెనుగూడతీసికొని యాష్మాని పార్శ్వమందున్న యొకచీకటింటికిఁ బోయెను అక్కడఁ గూర్చుండుటకు స్థలము లేదు. అటునిలుచుండి ఆష్మాని లక్ష్మణితో "ద్వారమునొద్ద పొడవైనకాళ్లును, బట్టతలయును గలమనుష్యుఁ డొకఁడువచ్చి మాటాడుచున్నాఁడు. ఆతఁడెవఁడో, ఎక్కడివాఁడో, యనియాతేము విచారించి తెలిసికొనివచ్చి చెప్పుము" అనియెను.

ల—నీవేపోయి యడుగరాదా ?

ఆ—అతఁడు నామనోహరుఁడు. ఆకస్మికముగ నేనెట్లుపోదును? నేనిప్పుడు చూడఁగూడదు.

లక్ష్మణి చాలకాలమునుండి దుర్గమునం దుండియుండెను. తఱచుగా విమలతో మాటలాడుచుండును. రసికశాస్త్రమునందును, గుప్తకృత్యములు చేయుటయందును వెనుకఁదీయునది కాదు. ఆమె మనస్సునందు "రసోల్లాసము బాగుగ నేయున్నది" అని యనుకొని "ఏమే శిఖండి! నీహృదయహారమును విప్పుకొని నేను తగిలించుకొనవలయునా యేమి ?" అనియెను.

ఆస్మాని—నీకది సాధ్యమే ?. నీవునీవే; యజమానురాలగు ఠాకురాణి నాకేమియుచేయలేక వెడలిపోయినది. నేనొకప్పుడు దయాపూర్వకముగ నామె నాతనికిఁ జంద్రావళిగా నొప్పిదము చేసితిని. ఘానమయియగు రాధికమైయున్న యామె నేనుదక్క మఱెవ్వరును గారు. నేనొక్కతెను మాత్రమే మొదటినుండియు నాతనిపాలిటి రాధికనై యున్నాను.

లక్ష్మణి యధికవయసుకలదికాదు ఆస్మానికంటె నొకటిరెండు సంవత్సరములు తక్కువవయస్సు కలదని తోఁచుచున్నది శరీరచ్ఛాయ యు నామెకంటె స్వచ్ఛమైయుండెను. అందుచే లక్ష్మణి తనమైసొబగును జూచుకొని దానాస్మానిని వినాశనము చేయఁగలనని యనుకొని "నీకంతటిమోహము తగినదికాదు" అనియెను.

ఇట్లుపలికి లక్ష్మణి ద్వారముకడకు వచ్చెను. ఆమె యక్కడకు వచ్చునప్పటికి గజపతివిద్యాదిగ్గజుఁడును గాతరభావముతో ద్వారపాలకునిఁగూర్చి "అన్నా! నీవు నాకవకాశము నీయనిచో నేనిచ్చటనే ప్రాణములను బోఁగొట్టుకొనియెదను. అందువలన నీవు గోహత్య బ్రహ్మహత్య, స్త్రీహత్య, భ్రూణహత్య మొదలగు మహాపాతకములకు గుఱియగుదువు." అని యనుచుండెను.

ద్వార—నీవు ప్రాణములను విడిచినచో నేనట్టి మహాపాతకములకు గుఱియగుటకుఁ గారణమేమి ?

దిగ్గ—చెప్పెదను వినుము. బాల్యమునందు మాగురువులు నన్ను "శుద్ధపశువు" అని పిలుచుచుండెడివారు. అందుచే నీకు గోహత్యసిద్ధమగును. నేను బ్రాహ్మణకుల ప్రదీపకుఁడను. అందుచే బ్రహ్మహత్య సంఘటించునని తోఁచుటలేదా? నేనెల్లప్పుడును మిగుల భయస్థుఁడను. అదిచూచి నాసహాధ్యాయియొకఁడు నన్ను స్త్రీయనియు నబలవలె ధైర్యములేనివాఁడననియు ననుచుండెడివాఁడు నేను సులభముగా మాటిమాటికి నేడ్చుచుందును అదిచూచి జనులు నన్ను కేవలము స్త్రీయని చెప్పుచుందురు. అందుచేత స్త్రీహత్యయు సంభవింపఁగలదు. నేనొకప్పుడు చేఁపలనుగొనవలయునని యంగడికిఁ బోయియుంటిని. అచ్చట నామత్స్యములను విక్రయించు నొక స్త్రీ చేఁపలను గుట్టలుగుట్టలుగాఁ బోసియుంచెను. వెలయెంతని విచారింపగా 'నొకడబ్బు' అనిచెప్పి యక్కడనున్నగుట్టలను చూపించెను నేనొకడబ్బు నిచ్చి యాగుట్టల నన్నిటిని ప్రోగుచేసి యెత్తుకొనుచుంటిని. ఆ స్త్రీ "అదేమిస్వామీ? ఒకడబ్బునిచ్చి యన్నిగుట్టలను దీసికొని పోయెదరా?" అనియెను. నేను "అన్నిగుట్టలు నొక్కడబ్బుకాదా" అనియంటిని. ఆ స్త్రీ మీనములను దీసికొనుచు "పాపముస్వామి యేమియునెఱుఁగరు. ఇంకను దల్లికడుపులోనేయుంటిరి" అనియెను. ఆమెయట్లు చెప్పియుండుటచే భ్రూణహత్యయు నీతలకుఁ జుట్టుకొనును.

దిగ్గజుఁ డీవిధముగాఁ జెప్పినప్పుడు లక్ష్మణియు నాతనిదర్శనము చేసి "ఏమి! రసికపురుషా! జ్ఞప్తియున్నదా?" అనియెను.

దిగ్గజుఁడు తలవంచుకొననారంభించెను. అటునిటుచూడఁ దొడంగెను. ఆసుందరినెఱింగియున్న ట్లాతనికి జ్ఞప్తిలేదు. కాని యత్యంత సుందరియగు కామినియొకర్తువచ్చి "రసికపురుషా!"యని తన్నుసంబోధించినప్పు డామె యెవరో తానెఱుంగనని చెప్పుట యరసికతయగునని భావించుకొని "సుందరీ! నిన్ను నేనెఱుగుదును. చూచియున్నాఁడను. బాగుగ నెఱుఁగుదునుగాని గుర్తింపఁజాలను. నీవెవరవు? చెప్పఁగూడదా?" అనియెను.

లక్ష్మణియు ముఖమును విశేషభారసూచకముగ ముడుచుకొని "సరి! నేననుకొన్నట్లే-పురుషజాతిని దెలిసికొనకుండ వారికి హృదయ

ప్రాణముల నర్పించినచోఁ దుదకిట్లేయగునని నేనెఱుంగుదును. తుదకు స్త్రీకి విలపించుటయే గతి. నాహృదయము నపహరించుకొనిన నీవు తుదకుఁ జెప్పినమాట యిదియా?" అనియెను.

దిగ్గజుఁడు చాలసేపుయోచించెను. కాని యెవరిహృదయము నపహరించినట్లాతనికి జ్ఞప్తికిరాక "నాజీవితకాలములో నేనెప్పుడు నితరుల దియొకచిల్లిగవ్వయైన నపహరించియుండలేదు. నేనుదొంగనుగాను. అదియంతయు నీమందారణదుర్గమునందున్న వారందఱు నెఱుఁగుదురు. అన్యాయముగా నన్ను చోరుఁడవని చెప్పెదవేల? నీవు బాగుగా వెదకి చూడుము? నీహృదయప్రాణములు మఱియెచ్చటనో యుండియుండవలయును. నేను వానినెప్పుడును దీసికొనియుండలేదు" అనియెను.

లక్ష్మణియు చురచుఁ చూచి "తుదకీమాటలనందఱును జెప్పెదరు. మంచిది. నేనిప్పుడే వెడలిపోయెదను" అనియెను.

దిగ్గజ—వెళ్ళిపోకుము. సుందరీ! వెళ్ళిపోకుము. నేను నిన్ను బాగుగా నెఱుఁగుదును. గుర్తించుటకుఁ దగినట్లు చెప్పినచో గుర్తించెదను. నన్ను చోరుఁడనని చెప్పుటకు నీకిష్టము గానుండెనేని నేను చోరుఁడనే యగుదును. నీవిప్పుడు దయచేసి నాకొక్క యుపకారమును జేయవలసియున్నది.

ల—అదియేమి చెప్పుము.?

ది—(చేతులుజోడించుకొని) ఆప్తునితో నత్యవసరమైన యొకవార్తను జెప్పవలసియున్నది. దానికనుకూలమగు నేర్పాటులను నాయందుదయయుంచి నీవు చేయవలయును. ఇదే నాప్రార్థనము.

ల—గొప్పకష్టము సంఘటిల్లినది. నీవాప్తునిపై వలపుఁగొనియున్నట్లున్నావు. నన్నుమఱచిపోయితివి. నేను నీకు జ్ఞప్తికి రాలేదు. నన్ను గుర్తింపలేకపోయితివి నేనిప్పుడే పోయి యాయాప్తునిని బిలిచికొనివచ్చి నీసన్నిధిని విడిచి పోవలయునా! అయ్యో! నాలలాటలిఖితమా!

లక్ష్మణి యీ విధముగాఁజెప్పి పోవుచుండ దిగ్గజుఁడుచూచి భయభ్రాంతుఁడై యామెవస్త్రమును బట్టుకొని "నాతోడు. నీవు నాపైఁగో

పగింపవలదు—కృపయుంచి ఆప్మానిని బిలువుము. చిరకాలము నీ వాసా నుదాసుఁడనై యుండెదను” అనియెను.

లక్ష్మణి నవ్వుచు నాతనినిగూడఁ దీసికొనిపోయెను. ద్వారపాలకు డభ్యంతరపెట్టలేదు. లక్ష్మణి దిగ్గజుని కచ్చేరిగదిలోనికిఁ దీసికొనిపోయెను.

దిగ్గజుఁడు గదిలోఁ దలపెట్టిచూచి “లోపలనంధకారము” అనియెను.

లక్ష్మణి—నీవు లోపలకుఁబోయినచో వెలుఁగువచ్చును. ఆప్మానినిజూచెదవు.

దిగ్గజుఁడులోపలకుఁబోయి చూచెను. లోపల నాప్మాని యుండెను దిగ్గజుఁ డానందముచే నుబ్బి నోరార నవ్వసాగెను.

ఆప్మాని “ఇదేమిభూతమా? ఇన్నిదినము లెచ్చటనున్నది?” అనియెను.

ఆప్మానినిజూచుటతోడనే గజపతి విద్యాదిగ్గజుని కవిత్వముపొంగి పొరలెను. ప్రణయినినిజూచి యొకశ్లోకమును చెప్పనిదే సంబోధించుట యుచితముకాదని యెంచి “యాదేవీసర్వభూతేషు నమస్తస్యైనమోనమః” అనిచెప్పి బ్రాహ్మణుఁడాప్మానికి నమస్కారమొనర్చెను.

అ—నాకు నమస్కారమును జేయుచుంటివా?

ది—బ్రాహ్మణవర్యులు నాగవాసుల పాదసేవనే సేయునప్పుడు నమస్కారముచేయుట యొకగొప్పకాదు.

అ—నీవు రసికుఁడవేయగుదువు. నీవింతవఱకు నెక్కడనున్నాఁడవు?

ది—ఆమాట పిదప చెప్పెదను. నీవిప్పుడు నాతో బయలుదేరవలయును ఇక్కడనున్నచో ననేకవిపత్తులకు గుఱిగావలసివచ్చును. నీవు నాప్రణయినివికావా?

ఆ—దానినిగూర్చి మరలమరల చెప్పనేల? నీవు నాకేమగుదువో యావిషయము నందఱు నెఱుఁగుదురు.

ది—సరిగా జెప్పితివి. ఔను. ఆవిషయము నందఱు నెఱుఁగుదురు. దేశవిఖ్యాతుఁడైన జ్యోతిషపండితుఁడొకఁడు నన్నుచూచెను. అతఁడును దానిని దెలిసికొనినాఁడు. అట్లయినప్పుడు నీవు నాతోడరాఁగూడదా?

ఆ—రానని యెవరుచెప్పినారు? నేను నీపై నెంతప్రేమగలిగియున్నానో నీవు నాపై నంతప్రేమను గలిగియుండుటలేదు.

ది—లేదని యెవరుచెప్పినారు? అట్టిమాటను జెప్పినవాఁడు కేవలము మిథ్యావాది. నామనస్సును బాధించుట కసత్యవాక్యములను బ్రకటించినాఁడు. నేను నిన్ను ప్రేమించుచున్నాననుటకు నాశరీరమే సాక్షి. నేను చూచిన యాదేవజ్ఞమహాశయుఁడు నాలలాటమునుజూచి దానిపై, నీనామాద్యక్షరమగు "ఆ" యనునంత్యాక్షరమగు "నీ" యును వ్రాసియున్నవని నుడివియున్నాఁడు. అట్టి ప్రీతివిశ్వాసములు మఱియెవరియొద్ద కనఁబడఁగలవు?

ఆ—అదియంతయు నసత్యము నీవంతవిశేషముగా నన్ను ప్రేమించుచుండినయెడల నీవు నన్నువిడిచి విదేశమునకుఁబోయి యింతకాలము ప్రవాసివై యుండనేయుండవు.

ది—ఆహ్మానీ! ప్రాణేశ్వరి! నాకపాలమున నీనామము వ్రాసియున్నది. నా మాటయందు నీకు నమ్మకము లేకపోయినచో నీవే చూడుము.

అనిచెప్పి దిగ్గజుఁడాహ్మానీ నేత్రములకు సరిగాఁ దనలలాటమును బెట్టి "చూచితివా?" అనియెను.

ఆ—ఔను. చూచితిని. కాని, నీవు చెప్పినయక్షరము లేవియునటలేవు. నీకపాలమున "పశువు" అని స్పష్టముగా వ్రాసియున్నది.

ది—అట్లును నుండవచ్చును. ఏమనిన నేనునీపశువునేయగుదును నీవునన్ను మేపుచుంటివి. త్రిప్పుచుంటివి. బయటకుఁ దోలుచుంటివి. నీకిష్టమువచ్చినట్లు చెప్పుము. ఇఁక నధికకాలవిళంబముతోఁ బ్రయోజనములేదు. వేగముగా నాతోడరమ్ము. ఇక్కడనుండుటవలన భయంకరవిపత్తు సంభవముగును.

ఆ—ఏమి యాపద ?

ది—వీరేంద్రసింహుని వ్యాపారము పునః సన్నిహితమైనది.

ఆ—అదియేమి ?

ది—యువరాజు బందీయైనాఁడు.

అప్మానీ ప్రకంపితయై భయముతో "ఎవరు చెప్పినారు ?" అనియెను.

ది—బందీగాఁ జేసినవారే చెప్పినారు.

ఆ—బందీగాఁ జేసినవా రెవరు?

ది—మహారాజగు మానసింహుని మనుష్యులు.

ఆ—ఎక్కడ బందీగాఁ బట్టుకొనినారు ?

ది—పోవుచున్న దారియందు.

ఆప్మాని యాత్రముతో నీవార్త యసత్యముగనది కాదని తెలిసికొని మరల "నీవు చెప్పినది నిజమేనా ?" అని యడిగెను.

ది—(హృదయముపైఁ జేయివెట్టుకొని) నీతో నసత్యమును జెప్పినచో నాకు నరకమందును స్థలము దొరకదు నాకామాట బాగుగాఁ దెలియును. నీకు తెలియదా ? యువరాజు బందీయైనప్పుడు పూర్వము వలెనే యిప్పుడును దుర్గమునందున్న వారందఱును బందీలగుదురు. నీని మిత్తమై నేనెంతయో యోచించుచున్నాఁడను ఇప్పుడే రమ్ము! ఎక్కడికైనను బారిపోవుదము.

ఆప్మాని మిగులకళవళపడి విమలతో నీవార్తను జెప్పుటకై యాత్రముకొనుచుండెను. గజపతి నక్కడనుండి పంపివేయుటకై "సరిగాఁ జెప్పితివి. పారిపోవుటయే వివేకమని తోఁచుచున్నది. నీవిప్పుడు పొమ్ము. సామానులను దీసికొని చీఁకటిపడగనే వెడలిపోవుదము." అనియెను

ది—ప్రాణేశ్వరీ ! ఆలస్యముచేయుటకు ధైర్యముచాలదు. మనము పోవులోపలనే యాయాపదవచ్చినను రావచ్చును.

ఆ—అందుల కొకయుపాయమును జేసెదను నీవిప్పుడేపోయి యాశ్రమమునందున్న వారితో మానసింహుని మనుష్యులిక రెండుగంటలలోవచ్చి దుర్గమును ముట్టడింపనున్నారని చెప్పుము.

వడకుచు ద్వారముకడకు వచ్చి "ఏమంటివి? నేనిప్పుడే పోయెదను" అనియెను.

ఆ—నీవు పొమ్ము. నేనుసమయమునకు సరిగావచ్చి నిన్నుఁగలిసికొనియెదను.

గజపతి యొకమార్గము వెంట ద్వారముకడకుఁ బోయెను అచ్చట లక్ష్మణి నిల్చుండియుండి "మిత్రుఁడా! నన్ను విడిచిపెట్టి పోయెదవా?" అనిపలికి యతనిపైనున్న వస్త్రమును బట్టుకొనియెను.

"లేదు—ఇప్పుడే వచ్చెదను—బట్టను విడువుము" అని దిగ్గజుఁడనియెను.

ఆవస్త్రములోసగము లక్ష్మణిచేతిలోని కూడివచ్చెను. గజపతి పలాయనుఁడైపోయెను.

ఏడవ ప్రకరణము.

గజపతివిద్యాదిగ్గజుఁడు చెప్పిన దుర్వార్త స్వల్పకాలములో దుర్గమంతటను వ్యాపించెను. జగత్సింహునకు సంభవించిన యాపద్వార్తను వినినప్పటినుండియు నాతని యాత్మీయుల దుఃఖమునకుఁ బారము లేదు. అభిరామస్వామి శీఘ్రముగా దిగ్గజునిబిలిచి యనేకవిధములగు ప్రశ్నలనడిగి తెలిసికొనియెను. దిగ్గజుఁడు విశేషసంగతు లేమియు చెప్పఁజాలకపోయెను తుదకు సత్యస్థితిని డెలిసికొనివచ్చుటకు నమ్మకమైన యొకగుఱ్ఱపురౌతును బంపవలయునని నిశ్చయించుకొనిరి. అభిరామస్వామి యాజ్ఞానుసారముగ రౌతొకఁడు పాటానగరమునకు బయలువెడలెను. ఆసమయమునం దాత్మీయులందఱును గర్తవ్యమును గూర్చి యోచింపనారంభించిరి.

సూర్యాస్తమయమైనపిదప నిరువురుస్త్రీ లభిరామస్వామి కుటీరమునకు వచ్చిరి. అభిరామస్వామి మృగచర్మముపైఁ గూర్చుండియుండెను. వచ్చిన యిరువురిస్త్రీలలో నొకతె విమల. మఱియొకతె ఆస్మాని. వారిరువురును నేలపైఁ గూర్చుండియుండిరి. అందఱిముఖములను జింతా

విషాదము లావరించుకొనియుండెను. అందఱును [illegible] యుండిరి.

విమల మాటాడుట కారంభించి "ఇప్పు డుపాయ మేమి?" అని యెను.

అభిరామస్వామి యధోముఖుడై కొంచెముసేపుచింతించి పిదప నిట్లు చెప్పనారంభించెను. "విమలా! శ్రీశైలేశ్వరునిమందిరమున నీకును, జగత్సింహునకును బ్రథమసందర్శనమైనపిదప నీవు నన్నాలోచనయడుగుటకు వచ్చియుంటివి కాదా? ఆదినమున జరిగినమాట లేమైన నీకు జ్ఞప్తియందున్నవా? చాలకాలముమాటకాదు. అదేస్థలమున నిలుచుండి నీవు నన్ను మరలనాలోచన మడుగుచున్నావు."

విమల—జ్ఞప్తియందున్నది. ఆదినమున జరిగిన మాటలన్నియు బాగుగా జ్ఞప్తియందున్నవి.

అభి—మానసింహుడీపరిణయమున కంగీకరింపడని నేనప్పుడు చెప్పియుంటిని. నీవందులకు యువరాజే స్వతంత్రుడని బదులుచెప్పితివి. ఆమాటలు జ్ఞప్తియందున్నవా?

విమల - (అధోముఖియై) ఔను.

అభి - ఆస్వాతంత్ర్యమున కిదియే ఫలము యువరాజునకిప్పుడు నేమాత్రమును స్వాతంత్ర్యములేదు. ధనమునందును, మానమునందును, బదవియందును, బ్రతిష్ఠయందును, శౌర్యపరాక్రమములయందును, గౌరవమునందును మానసింహుడద్వితీయుడని చెప్పిన నది యుత్ప్రేక్ష కాజాలదు. తండ్రియిష్టమునకు వ్యతిరేకముగా నేకార్యము జేయుటకును జగత్సింహునకీషన్మాత్రమును స్వాతంత్ర్యము లేదు. ఇంతేగాక, మానసింహునకును, యువరాజునకును బ్రభుభృత్యసంబంధముండుటచే యువరాజు సార్వభౌముని కార్యములయందు నియోగింపబడినవాడు. ఆకార్యములయందును నాతని కేవిధమైన స్వాతంత్ర్యమును లేదు.

విమల—ఆవిషయమిప్పుడు తెలిసినది ఒకవేళ నీసంగతి యప్పుడు తెలిసియున్నను నేమిచేయగలము? ఆప్రేమప్రవాహమును నిరుద్ధము చేయుటకు సాధ్యముకాదు.

అభిరామస్వామి యుపహాస్యసూచకమందహాసమును జేసి మరలఁ జెప్పనారంభించెను. "విమలా! నీవు బాలవుకావు. ఇట్టివ్యాపారములను దెలియనిదానవుకావు సమయము వచ్చినప్పుడు చలింపకుండ నుండుట నీకుచితమైయుండెను. అనురాగము నంకురమునందే త్రుంపి వేయవలయునని నీకుఁ దెలియఁజేసియున్నాఁడను. కాని నీవు నా మాటను విననైతివి. దానిపరిణామమిప్పుడు భయంకరమైనది. ముం దెట్లు జరుగునో యెట్లుపరిణమించునో తెలియదు

విమల— మీరు తిలోత్తమను సర్వదా చూచుచుండెడివారు కారు. నేనామెయొద్ద నెల్లప్పుడు నుండెడిదానను. అట్టిసంబంధమును జేరికయు సంఘటనమగునెడలఁ జాలదుఃఖములు కలుగఁగలవని నేను బాగుగ నెఱింగించియుంటిని.

అభి— నేనాసంగతినప్పుడు తెలిసికొనియుండలేదు. ఇప్పుడును దెలిసికొనఁజాలను. ముందైనను దెలిసికొనవలసినంత యవసరము సంభవించునని నాకుఁదోఁచుటలేదు ప్రథమసందర్శనమున నెక్కడనైనను దైవవశముచే మార్గమధ్యమున నొక్కపర్యాయ మాకస్మికముగ నైన సందర్శనముతోఁ బుట్టిన ప్రేమము ప్రగాఢముగాఁ బరిణమింపనేరదు. అది కేవలలోలతచేఁ గలిగినక్షణికమాత్రమోహమే కాని వేఱుకాదు. దానియుత్తేజనము మిగులఁ ప్రబలమైనది. అది మనుష్యుని దిక్కుతెలియనివానివలెను జ్ఞానశూన్యునిగను జేయఁగలదు. కాని సరియైన కర్ణధారుఁడు నౌకనునడపించుభారమును వహించినచో నన్నియాపదలును నాశంకలును దూరమైపోవును. అసంగతమును నసంభవము నగుప్రవృత్తిప్రవాహమున కుచితకాలమునందుఁ దక్షణమే యడ్డును గల్పింపనిచో నది మిగులవర్ధితమై క్రమముగఁ గూలములనతిక్రమించి సమస్తమును దేలవేసికొని పోవును. నీవట్టివిషయములయందు మిగుల నభిజ్ఞవని మెంచి చక్కగా నడపించుభారమును నీపైఁ బెట్టి నిశ్చితుఁడనైతిని.

విమల—(అధోముఖియై) సాధ్యమగునంతవఱకు నేను కార్యమును చక్కనిమార్గముననే చేయుచు వచ్చితిని. ఎట్లుచేసినచో సమస్తమును సుఖమయమును, నానందమయమునగునో యట్లుచేసితిని.

అభి—మనకిప్పుడు ఘోరతరమైన యాపత్సముద్రము తటస్థించి నది. మనమందఱమును విషాదమునందు మునిగియున్నారము. వెనుక జరిగిపోయిన యప్రియప్రసంగమునుగూర్చి యిప్పుడాలోచింపకుండ నుండుటయే యుచితము. అయినను బ్రస్తావవశమున నావిషయమును గూర్చి యొకటిరెండుమాటలను మాటాడుటవలన హానియుండదని తలంచెదను. ఈ విషయమున మొదటినుండియును నింతవఱకును జక్కనిమార్గమునే యేర్పరిచితినని నీవుచెప్పెడిదానిలో నాకుఁ దెలియకుండ నున్న దించుకంతయును లేదు. నీవుచేసిన యాకార్యములలోఁ బ్రతిభాగమునందును భయంకరమైన నీయవివేచనమును, నసావధానతయు, బుద్ధివిహీనతయు మొదలగు తొందరపనులు స్పష్టముగాఁ గన్పట్టుచున్నవి.

విమల యధోముఖియై నిరుత్తరయయ్యెను. అభిరామస్వామి చెప్పఁదొడఁగెను. "నిజమాడిన నిష్ఠురముగానుండును. ఈదుఃఖసమయమున నప్రియమైన నిజమునుచెప్పి వేదన నభివృద్ధిచేయుట నాకిష్టము లేదు. జరిగిపోయినదానిని తిరిగి కూడఁదీసికొనుట కుపాయమున్నచో నిప్పుడు దానినిగూర్చి చర్చించినందువలన ఫలముండును. కాని, యిప్పుడు జరిగిపోయినదానినిగూర్చి యోచించుట కష్టమునకుఁ గారణమగుటయేగాని వేఱుకాదు.

విమల—నాప్రాణములపై నైనను దృష్టిలేకుండ సర్వదా తిలోత్తమ హితసాధనములగు కార్యములనే చేయుచు వచ్చితిని. తిలోత్తమ నా రెండవప్రాణము నా జీవనమందలి సమస్త సుఖములను వదలుకొంటిని. నాసుఖములన్నియు నష్టమైపోయినవి ఈప్రాణములు నా దేహమున నొకదినమైనను నిలుపఁజాలను. కాని, యిపుడు ప్రాణములను నిలుపుకొనియుండుట కేవలము తిలోత్తమ ముఖమును జూచుకొనియుండుటయే యైనది. తిలోత్తమ సర్వసుఖముల ననుభవించుచుండఁగాఁ జూచి ప్రాణములను విడువవలయునను నొకటే సంకల్పముతో నుంటిని. ప్రార్థనీయసుఖములన్నియును దిలోత్తమకు లభించినవి. కాని నాయదృష్టదోషముచే మరల నామె యిప్పుడు కూలములేని సముద్రములోఁ దేలుచున్నది. మరల నామె శోకమువలనను, జింతవలనను, మృతప్రా

యయ్యెపడియున్నది ఈనాదుఃఖము నెవరు తెలిసికొనఁగలరు ? నాయీ దురవస్థ నెవరితోఁ జెప్పుకొందును ? నేనెవరిసుఖముకొఱకు సర్వదా వ్యాకులత నొందుచుండెడిదాననో, అట్టియామెకు నాయవివేచనమువలనను బుద్ధిదోషమువలనను నెట్టియాపద సంభవించెనో నాకుఁదెలియదు. అది యప్రియమైన మాటయైనను దానిని విని పశ్చాత్తాపము నొందుదును. నే నేసమయమున నన్యాయముగా వ్యవహరించితినో దయయుంచి మీరు నాకుఁ జెప్పవలయును.

అభి — పూర్వాపరకార్యములయందు నీవెఱుఁగని దిసుమంతయును లేదు. మానసింహుని తనయునితో వీరేంద్రసింహుని తనయకు బరిణయసంబంధ మెట్టి సందర్భమునందును సంఘటితము కాఁజాలదని నీవు బాగుగ నెఱుంగుదువు. అట్లెఱింగి యున్నప్పుడామె యాశ నిర్మూలమైపోవునట్లు స్పష్టముగా సరళవాక్యములతోఁ దిలోత్తమ కా విషయమును దెలియఁజేయుట నీకున్యాయము. దానివలన నెట్టిఫలమును గలుగకపోయినను నీవు తిలోత్తమకు నీమాత్రమైనను ఆమె కేకమాత్రసంరక్షిణివగుటచే నట్టికర్తవ్యమును జేయుట నీకు విధియైయున్నది. నీ వాకర్తవ్యము నొకప్పుడుగూడ నెరవేర్చియుండలేదు. పదునైదు దినములకుఁ బిదప రెండవమారు యువరాజును శైలేశ్వరమందిరముకడఁ జూడవలెనను నుద్దేశముతో బయలుదేరుటకు ముందునీవొకసారి యావిషయమును దిలోత్తమకుఁ జెప్పియున్నావనుమాట వాస్తవమే. కాని, యామాటను నీవు నొక్కిచెప్పియుండలేదు. మొదటనుండియు నామాటను పదింబదిగా స్పష్టముగాఁ దెలియఁజేయుట నీకు విధియైయున్నది నీవట్లు చేయలేదు. అదినిజమేనా ?

విమల మాటాడలేదు. అభిరామస్వామి చెప్పఁదొడఁగెను. "శైలేశ్వరుని యాలయమునందు మొట్టమొదట సమావేశమైనప్పుడు జగత్సింహుఁడు మీరెవరో తెలిసికొనకుండఁగనే వెడలిపోవుచుండెను. అప్పుడు పదునైదుదినములకుఁ బిమ్మట నదేస్థలమున యావృత్తాంతమును తెలిపెదనని యవకాశముకలుగఁజేయుట నీకుచితమైనపనికాదు. ప్రథమసందర్శనమే యంత్యదర్శనమైనచో నెంతయో శ్రేయస్కరముగ నుండును. ఇచ్ఛాపూర్వకముగ రెండవపర్యాయము మరల దర్శనముచేయుదునని

ప్రతిజ్ఞచేయుట నీకు కేవల మనుచితము. నీవును నాస్మాత్రినియు నాశిష్యుడగు గజపతితోఁ బరిహాసమాడుచు మూర్ఖతతో రహస్యాలాపములాడు చుండుటను నేను బాగుగా నెఱుఁగుదును. కాని యామూర్ఖుడారహస్య పరిహాసాలాపము లవివేకజన్యములని తెలిసికొనలేదు. ఆగజపతినిఁకూడఁ దీసికొని యర్ధరాత్రిమున శైలేశ్వరుని యాలయమునకుఁ దీసికొనిపోవుట నీకుయుక్తముకాదు. ప్రపంచజ్ఞానవిహీనుఁడైన యామనుష్యుఁడు మీయందనురక్తుఁడైనాఁడు. ఆదినమున మీయిరువురినడవడి వలనను మాటలవలనను నతనియనురాగము వృద్ధిపొందినది. పోవుచున్నప్పుడు మార్గ మాధ్యమున సంగీతాదిలోలత్వవ్యాపారములన్నియుఁ గొదవలేకుండ జరగినవి. పశుతుల్యుఁడగు నాపురుషుఁడు మీపై నత్యాచారములు నడపినను నడపవచ్చును. అట్టిప్రవర్తనమంతయుఁ గులకామినుల కత్యంతము నిందాపాత్రము. ఇదియంతయు నిజముగునా కాదా?

విమల నిరతిశయలజ్జాయుక్తయై ప్రత్యుత్తరమీయలేదు. స్వామి మరల నిట్లు చెప్పనారంభించెను. "యువరాజునుజూచినప్పు డతఁడు తిలోత్తమయందత్యంతానురాగమును గలిగియున్నాఁడని నీవు దెలిసికొనియుంటివి. అతనిప్రార్థనను విని యాతనికిఁక నొకసారి తిలోత్తమ దర్శనము చేయించెదనని యొప్పుకొనుట నీకెంతయు ననుచితము. రెండవసారి సమావేశమైనప్పుడా శైలేశ్వరుని యాలయమునందే యా విషయమును విడిచిపెట్టియుండినచో నెంత చక్కగానుండును? అంతటితో వదలివేయక యారాజకుమారుని గూడఁ దీసికొనివచ్చి నీశక్తిని నధికారమును మరచి యనేకగర్హితకార్యములను జేసితివి. అట్టియుద్ధ విగ్రహకాలమునందు దుర్గేశునకుఁ దెలియకుండ యువకుఁడగు నొక మొగలాయీసైన్యాధిపతి ననాయాసముగా దుర్గమునకుఁ గొంపోయితివి. నీవు దుర్గేశునకు శాస్త్రవిహితముగాఁ బరిణీయమైనధర్మపత్నివే యగుదువు. కాని, యట్టివిశేషకార్యములను జేయుటకు నీకధికారము లేదు. స్త్రీలకట్టిస్వాతంత్ర్య మిచ్చుటను శోభించదు. అది యనేకానర్థములకుఁ గారణమగును. ప్రస్తుతమున నదియే సంభవించినది ఈవిషయమున నీవుత్తరవాదినివి కావా?"

విమల పూర్వమువలెనే మౌనమైయుండెను. అభిరామస్వామి యిట్లు చెప్పనారంభించెను. "పిదప నీ వే కార్యమును జేసితివో యా కార్యమును జేయుటకుఁ దల్లిగాని, సవతితల్లిగాని, పరిచారికగాని, పరిచితయైన మరియే స్త్రీగాని తుదకు వేశ్యయైనను సాహసింప జాలదు. సురక్షితమై సునాసితమై బద్ధద్వారమైన యొక రాజకన్యకాంతఃపురమునకామె యందత్యాసక్తుఁడై యున్న తరుణవయస్కుఁడగు నొక రాజపుత్త్రుని ననాయాసముగాఁ బ్రవేశింపఁ జేసితివి. ఆ యపరాధము — ఆ స్వాతంత్ర్యము — ఆ యవివేకము - ఆ మాటలను దలఁచుకొనినచో నిప్పటికిని హృదయమునఁ గంపము జనించుచుండును. ఆ నీ యజాగ్రత్తమూలముననే దుర్గము పఠానులకు వశమైనది. దానికి ఫలముగానే నీకు వైధవ్యము సంభవించినది. అందువలననే యనేకానర్థములు సంఘటిల్లినవి. విమలా! నేను నిన్ను తిరస్కారము సేయుటలేదు. తిరస్కారమునకును ననురాగమునకును నిదిసమయము కాదు. కాని యోచించిచూడుము. ఈ వ్యాపారమునందు మొదటినుండి తుదివఱకును నీవుచేసిన యే కార్యమును బాగుగా లేదు.

విమల పితృచరణములపైఁబడి "నాకుఁ దెలిసినది మొదటనుండియును నేను గర్హితకార్యములనే చేసితిని. ఇప్పుడు దాని కే ప్రతీకారమును లేదు. ఇప్పుడందుల కేమియుపాయము కలదో యోచించి యా రీతిగఁ జేసి మమ్ము రక్షింపవలయును" అని వేఁడుకొనియెను.

అభిరామస్వామి విమలను లేవఁదీసి "నేను పగలంతయు నుపాయమునుగూర్చి యోచనము చేయుచునేయుంటిని. నేను పంపించిన దూత తిరిగివచ్చువఱకు నేయుపాయము నవలంబించుటకును నవకాశము లేదు. నిర్బోధకుఁడగు దిగ్గజునివాక్యములవలన నేసంగతియును నిశ్చయముగాఁ దెలియుటలేదు. మహారాజుకోప మేవిధముగా నెందులకు వృద్ధియయ్యెనో తెలిసికొనినపిదప నేమేమియుపాయములను మన మవలంబింపవలయునో స్థిరముచేసికొనవచ్చును" అనియెను.

విమల — దూత తిరిగివచ్చుట కెన్నిదినములుపట్టును?

అభి — రేపే రావచ్చును. కాని, యతఁడు పాట్నాపర్యంతమును బోవలసియున్నచో నెనిమిది పదిదినము లాలస్యముకావచ్చును.

విమల—ఎనిమిది పదిదినములాలస్యమైనచో మఱియేవిపత్తులు సంఘటించునో తెలియదు తిలోత్తమ యిప్పుడే మృతప్రాయమై యున్నది ఆమె యెనిమిది పదిదినములా యాతనను సహించి యెట్లు జీవింపఁగలదు?

అభి—నీవు తిలోత్తమకు విశేషధైర్యమును జెప్పవలయును నేనామెను జేపట్టియుదయముననే చూచి యోదార్పఁ బ్రయత్నిం చెదను.

విమల—మహారాజునకును యువరాజునకును జనకపుత్రసంబంధము తండ్రి కుపితుఁడై కుమారుని బందీగాఁ జేసినమాట వాస్తవము. కాని వారిరువురకును బ్రత్యక్షసమాగమమైనచోఁ గుమారుని నోటి నుండి వెడలువినీతవాక్యములనువిని మనసు కరఁగి మానసింహుఁడు తనయుని క్షమింపఁడా?

అభి—అదియెట్లు? వీరపురుషునిక్రోధము పుత్రులు లేక యాత్రీయు లన్నంతమాత్రమున నిరస్తము కాదు

విమల—ఆక్రోధ మెట్లుగాఁ బరిణమించునని మీ యభిప్రాయము?

అభి—(కొంచెము యోచించి) నీవాఁడు దానవు. సంగతులన్నియు నీకుఁ దెలియకుండుటయే మేలు.

విమ—విశేషానిష్టమేదయిన సంభవించునెడలఁదోడనే దానికి దగినప్రతీకారమును జేయుటకై ప్రయత్న మొనర్చుటుచితముకాదా? మానసింహమహారాజు మీయెడల విశేషశ్రద్ధాభక్తులను గలిగియున్నాఁడు. తండ్రికొడుకులకున్న భేద భావమును దూరము సేయుటకు మీరుమధ్యస్థులై నిలిచినచో మంచిదికాదా?

అభి—ఈవిషయమున నేను మధ్యస్థుఁడనుగానుండుట మరింత యనిష్టమునకే కారణమగునుగాని మనోరథసిద్ధి కాఁజాలదు. మానసింహుఁడు నాయందు శ్రద్ధాభక్తులను గలిగియున్నాఁడని నీయభిప్రాయము. కాని యాతనిభక్తిశ్రద్ధలవిషయమున నాకు నమ్మకము లేదు. అతఁడు సర్వాంతఃకరణములచేతను నన్ను ద్వేషించుచునేయుం

డును. మనలో నెవరిమీఁదను నాతనికి మమతగాని, శ్రద్ధగాని, విశ్వాసముగాని లేదు. ప్రస్తుతమున మనము మఱియెవరిమీఁద మన నైనను మనకార్యసాఫల్యమునకై ప్రయత్నములను చేయవలసియున్నది మానసింహునకు గౌరవపాత్రుఁడైన మనుష్యుని మూలమున ప్రయత్నించిచూడవలయు. ఇప్పుడు రాత్రి చాలయైనది. మీరు దుర్గమునకుఁ బొండు రేపటియుదయమున మరల రండు

విమలయు నాప్మానియు భక్తిభావముతో నభిరామస్వామికి వందనములుచేసి యక్కడనుండి వెడలిపోయిరి.

ఎనిమిదవ ప్రకరణము.

మాత తిరిగివచ్చెను పాట్నానగరమువఱకును బోయి యచ్చట యువరాజుయొక్క దుర్దశావృత్తాంతముల నన్నిఁటిని సంపూర్ణముగఁ దెలిసికొని యాతఁడు తిరిగివచ్చెను. అతఁడు చెప్పిన యుదంతమును విని దుర్గము నందలి జనులందఱును శోకముచే మృతప్రాయులై పోయిరి.

మాత యాదుఃఖవార్తను దెచ్చినదినమున నభిరామస్వామి యాతనినోటినుండి సమస్తవృత్తాంతమును విని దుర్గముతోఁ సంబంధించినకార్యములను జేయుటయందు నివిష్టచిత్తుఁడయ్యెను. తాను దుర్గమున లేనికాలమున రాజకార్యములు సరిగా నిర్వహింపుటకుఁ దగినయేర్పాటు లన్నిఁటిని జేసి యాతఁడాదినముననే తీర్థయాత్రలను జేసికొనుటకై బయలువెడలెను. అందఱితోఁడను దాను తీర్థయాత్రలకై పోవుచుంటినని చెప్పెను. జనులట్ల యభిప్రాయపడిరి. కాని విమలమాత్ర మట్లనుకొనలేదు. ఇప్పుడు సంభవించిన యాశోచనీయ విషయమునకుఁ బ్రతీకారమును జేయువలయుననుప్రయత్నముతో నాతఁడు దుర్గమునువీడి పోవుచుండెనని యామె యనుకొనియెను.

తిలోత్తమ దుఃఖిని—మర్మపీడిత—తిలోత్తమా! దారుణమైన యాదుఃఖమును హృదయమున నిలుపుకొనుటకు నీకుశక్తి లేదా? మిగుల ఘోరమైన యాయాతనను సహించికొనుటకు నీకు సామర్థ్యమున్న

దా? విపద్వాయువుచే సంక్షుబ్ధమైయున్న సముద్రమును శాంతభావముతో దాటిపోవుటకు నీకు శక్తి కలదా? లేదు నీకేశక్తియు లేదు. తిలోత్తమ యీయాఘాతముచే నవసన్నమైపోయెను. తీవ్రమైన యీయాతనచే సర్వభావములు దిగుడును నామె విచారగ్రస్తయై యుండెను. దుస్తరమైన యీసముద్రమును దాటుటకు గావలసినశక్తి సాహసము లేనియు నామెకవ లేవు. వియోగవిహ్వలయైన యీదుఃఖిని యధోవదనయై భూశయ్యయందుఁ బడియుండెను.

ఆగది—ఏగదియందు సర్వదాశీన శ్రేయము నభిలషించు విమల యనుగ్రహము మూలమున నచింతితపూర్వోపాయముచే దిలోత్తమ తనహృదయేశ్వరుఁడగు జగత్సింహునితో మొట్టమొదట కలిసికొనియెనో ఏగదియందు సరళహృదయయగు తిలోత్తమ జగత్సింహుని హస్తమునందు శాశ్వతముగ నాత్మసమర్పణము చేసియుండెనో ఏగదియందు. రనప్రియేశ్వరుఁ డెడతెగకుండఁ గత్తినిద్రిప్పి పిదప శత్రువుల యస్త్రఘాతముచే స్మృతిహీనుఁడై రుధిరార్ద్రకళేబరుఁడై ధరాశాయి యయ్యెనో ఏగదియందు దిలోత్తమయు విమలయు కారాస్వరూపులగు పఠానులచే జిక్కి బందీలైపోయిరో, బహువిధసుఖదుఃఖ స్మృత్యుద్దీపకమైన యీగదియందిప్పుడు తిలోత్తమ పడియుండెను. ఆమెసమీపమున నామంచము—ఏమంచముపై తిలోత్తమ పరధ్యానభావముతో నసంగతములగు గొన్నియోవ్రీతలను వ్రాసివ్రాసి కట్టకడకు కుమారజగత్సింహునినామమును వ్రాసెనో, పిదప తనయసావధానచిత్తమును దెలిసికొనుటచే బొడమినసిగ్గుచే నధోవదనయై యేశయ్యయందలి యీభాగము ననేకపర్యాయములు కడిగితుడిచినైచినను దనహృదయేశ్వరునినామము చెఱిపోవకుండ స్పష్టముగా వ్రాసియున్నట్లు కాన్పించుచుండెనని యీయామె యనుకొనియుండెనో, ఆశయ్య—ఏశయ్యపై దిలోత్తమ తనహృదయేశ్వరుని కంఠాలింగనము చేసికొని యనేకసుఖకల్పనలచేఁ బ్రమత్తయై యానందసాగరమున మునిఁగియుండెనో—ఆశయ్య యీయామె పార్శ్వమున నుండెను. ఏతల్పముపైఁ బదిదినములకుఁ బూర్వము తిలోత్తమ తననాథునిపార్శ్వమున శయనించి యుత్కంఠతతో నారాత్రియంతయుఁగడపి యుషఃకాలమందమలయ మారుతసంస్పర్శముచే నించుక

నిద్రజెందియుండ నాతఁడు తనబాహుపాశమును విడిపించుకొని ప్రాతఃకాలవాహ్యాళికై బయలుదేరిపోయెనో, ప్రియమ్మై, సుఖమయమ్మై, మనోహరమ్మైన యాపర్యంకపార్శ్వమున నాతిలోత్తమ భూశయ్యపై బడి పొరలాడుచుండెను.

ఆమె యశ్వారూఢుఁడై పోవుచున్నతననాథుని గవాక్షమునుండి చూచుట, ఆతనిసంజ్ఞలు, ఆతనివీడుకోలు, ఆమెరోదనము, ఆమెప్రణామము. ఇవియన్నియు జరిగి పదిదినములైపోయినది అయిననాతఁడింకను దిరిగిరాలేదు. అంతేకాదు. వెనుదిరిగిరాకుండుటయేగాదు. ఆతఁడుతిరిగి వచ్చునను నాశయేలేదు అతఁడు శృంఖలాబద్ధుఁడై బందీయై పోయెను. యావజ్జీవమును నాతఁడాదశయందే కాలమును గడపవలసియున్నది. ఈ విధముగా మానసింహమహారాజుగారియాజ్ఞయైనది తండ్రియాజ్ఞచేఁ గుమారున కాకఠినతరమైనశిక్ష — అత్యంతకఠోరమైన యా యాజ్ఞ కన్యథాచేయఁగలిగినవారెవరు ? మానసింహునిమాటకు వ్యతిరేకముగా నెదిరించి మాటచెప్పఁగలవారీభరతఖండమున నెవరుకలరు ?

అకటకటా ! సుఖమెన్నిదినములుండును? తిలోత్తమ శైలేశ్వరుని మందిరమున జగత్సింహునిమోహనమూర్తిని సందర్శించినది — పిదప కేవలముచింత — ఒకపక్షముదినము లతిదారుణమైన గొప్పయాపద — పఠానులగృహమున నివాసము. సతీత్వము — ధర్మము — జీవనము — పవిత్రత — ఇవినాశనమ్మై పోవునేమోయని నిరంతరము భయము అసంభావితోపాయముచే నస్మాన్ఖానుని యంగుళీయకసాహాయ్యమున నటనుండి విడుగడ — "వీరేంద్రసింహుని తనయయా ? ఇక్కడ కెందులకు ?" అని యువరాజుపలికిన మర్మభేదకములగు కఠోరవాక్యములు — అయేషాయనుగ్రహముచే ముక్తిలాభము — దానితోడనే హృదయమునందలివిజాతీయతాపముచేఁ బొడమిన భయంకరవ్యాధి — తన్మూలమున మరణాపన్నదశ — అభిరామస్వామి యాహ్వానముచే జగత్సింహుని రాక — అనుగ్రహము — అతనిపాదపద్మములయందుఁ దావొసంగుట — పిదపనట్టి మహాకష్టము అసహనీయమగునట్టి యాతనాపరంపర ననుభవించినపిదప మనోరథమీడేరుట — హృదయేశ్వరునితో సమ్మేళనము — హా ! అకటకటా ! సుఖమెన్నిదినములు? సుఖసౌదముయొక్క ప్రథమ

సోపానమునందే యీబాధ! చిరకాలయత్నార్జితమును మహాయాసలబ్ధమైన రత్నమును వక్షమునధరించుకొనుటతోడనే భయంకరమైనదుర్గతి సుఖసాధమము మొదలంట భస్మీభూతమైపోయినది బాణముచేఁ గొట్టఁబడినలేడివలె నిరీహమైన తిలోత్తమ యాతనల నందుచుండెను అక్కటా! సుఖమెన్నిదినములు!

తిలోత్తమ యాహారమును గైకొనుటలేదు. నిద్రపోవుటలేదు. మడిపీడియున్న యామెనిబిడకృష్ణకేశరాశి ధూళియందు మలినముగఁ బడియుండెను ఆస్వర్ణకాంతి భూతలమునఁబడి మబ్బువలె నైపోయెను. దేహము ధూళిధూసరితమయ్యెను. శరీరము భూషణవిహీనము—నోట మాటలేదు. నేత్రములనుండి బాష్పములులేవు తిలోత్తమ యధోముఖియై, నేలపైఁబడియుండెను.

తిలోత్తమ తనహృదయమునందుఁ 'బ్రపంచమున నాపదలనేకముగ నుండును వానికిఁ బ్రతీకారముండుటయుఁ గలదు. అత్యంతఘోర విపత్తునకుమాత్రము ప్రతీకారముండదా? ప్రతీకారము లేదని రోదనముచేయుటవలనను, యోచించియోచించి యూరకుండుట వలనను, శోకయాతనల ననుభవించుటవలనను నేమియుపకారము కలుగును? నాజీవనమునకు జీవనమైన జగత్సింహుఁ డినుపసంకెలలచే నిబద్ధుఁడై కారాగారమునందున్నాఁడు; ఇఁక నేనో—ఇంటియందు పడియుండి యనేక కష్టముల ననుభవించుచున్నాను; అతనికంటె నూఱురెట్లధికకష్టములనే యనుభవించుచుంటిని. కాని దానివలన బ్రయోజనమేమి? ఇట్టి యీ యుద్వేగముచే ఫలమేమి? చేతనైనంతవఱకుఁ బ్రతీకారమునకై యుపాయములను వెదకుట యుచితము. నేనిక నా ప్రయత్నములనే చేసెదను." అని యోచించుకొనియెను.

తిలోత్తమ లేచి కూర్చుండి "ఎవరక్కడ?" అని పిలిచెను.

అక్కడనున్న దాసి యొకర్తుక శీఘ్రముగవచ్చెను. తిలోత్తమ దాసినిజూచి "కాగితము, కలము మొదలగువానిని దీసికొనిరమ్ము" అని యాజ్ఞాపించెను.

దాసి లేఖ్యసాధనములనన్నిఁటిని దీసికొనివచ్చి తిలోత్తమ యొద్దనుంచి "శరీరమునందలి చమటను దుడిచివేయుదునా? చెదరియు

న్న ముంగురులను సవరింతునా ? పాత్రియందు నీరునుపోసి తీసికొనిరా నా ? కట్టుకొనినచీరను విడిచి మఱియొకవస్త్రమును ధరించెదరా?" అని యీవిధములగు ప్రశ్నముల నెన్నిఁటినో వైచెను.

తిలోత్తమ "ఇప్పుడేమియువలదు. అమ్మ యెక్కడనున్నది ?" అని యడిగెను.

తిలోత్తమ విమలను "అమ్మ" యని పిలుచుచుండును. వీరేంద్ర సింహుఁడు స్వర్గస్థుఁడైనపిదప విమల నిజవృత్తాంత మందఱికిని వెల్లడి యయ్యెను. ఆమె యొకసామాన్యపరిచారికవలె వాసముసేయుచుండి నను వీరేంద్రసింహుఁడు పరిణయమాడిన ధర్మపత్నియని యందఱును దెలిసికొనిరి. కటులుఖానునిచేతినుండి విడిపించుకొని మందారణదుర్గము నకు వచ్చినపిదప దుర్గములోనివారందఱు నామెను యజమానురాలు, ఠాకూరాణి, రాణి, మాత, యని పిలుచుచుండిరి. ఆమెను విమలయని పేరుపెట్టి పిలుచుట కెవ్వరికి ధైర్యముచాలదు తిలోత్తమయు నామెను తల్లియనియే పిలుచుచుండును కాని, వేఱుపేరుపెట్టి పిలుచుటలేదు. తిలోత్తమ "అమ్మ యెక్కడనున్నది?" అని దాసినడిగెను.

దాసి—ఉత్తరపుచావడియందుఁ గూర్చుండి యాస్వామినితో నేదియో యాలోచించుచున్నారు. పిలువుమనియెదరా?

తిలో—వలదు నీవుపోయి యిప్పుడు రావలసిన యావశ్యక మేమియులేదనియుఁ గొంచెముసేపైనపిదప నేనేవచ్చి చూచెదనని యు నమ్మతోఁ జెప్పుము.

దాసి యానందముతో వెడలిపోయెను. నాల్గుదినములకుఁబిమ్మట తిలోత్తమ లేచికూర్చున్నదనియు, మాటాడినదనియు, వ్రాసికొనుటకు గావలసినయుపకరణములను దెప్పించుకొనెననియు నేదియోవ్రాసికొను చున్నదనియు, నామె యపరిమితానందమునుబొందెను. ఈ శుభసమా చారమును విమలకుఁదెలుపవలయునని యామె పరువెత్తుకొనిపోయెను.

తిలోత్తమ కాగితమును గలమును పుచ్చుకొని యందొకకాగి తముపై వ్రాయనారంభించెను. చాలసేపువ్రాసెను. వ్రాసినపిదప నిట్లు చదువనారంభించెను.

"నవాబునందినీ!

అత్యంతదుఃఖకరమగు సమాచారమును నీకుఁ దెలుపుటకై నే నీయుత్తరమును వ్రాయుచున్నాను. నీకు జ్ఞప్తియున్నదా? అలనాఁడు—వివాహమునాఁటిరాత్రి—ప్రపంచమునందంతటను శ్రేష్ఠమైన యీపురుషరత్నమును నీయలంకారరాజము నలంకరింపుము" అని యుపదేశించి యుంటివి. జ్ఞప్తియున్నదా? నాయదృష్టదోషముచే నాపురుషుఁ డిప్పుడు బందీగనున్నాఁడు లోహశృంఖలముచే బద్ధుఁడై కారాగారము నందున్నాఁడు మానసింహమహారాజనేకకారణములచే విరక్తుఁడై గుణమయుఁడగు కుమారజగత్సింహుని యావజ్జీవమును గారాకార బద్ధునిఁగాఁ జేసివైచినాఁడు.

ఆపదలువచ్చినప్పు డాత్మీయులు జ్ఞప్తికివత్తురు. కాని నీకును నాకును బరిచయము రెండుదినములుమాత్రమే. అయినను నాకాత్మ బంధురాలవని నేనెఱుంగుదును. అందుచే నేనిప్పుడీ దుఃఖసమాచారమును నీకు వ్రాయుచున్నాను.

పఠానులకును మొగలాయీలకును సంధిసంస్థాపింప బడినపిదప నత్యల్పకాలములో యువరాజునకు నీవొకయుత్తరమును వ్రాసియుంటివి. ఆయన యాయుత్తరము ననర్ఘమగుసంపదయని మిగుల జాగరూకతతోఁ గాపాడకొనుచున్నారు. ఆయన యాయుత్తరమును బదింబదిగ నాకుఁ జదివి వినుపించుచుండెడివారు. ఆయుత్తరమిప్పుడును నాయొద్ద రత్నపేటికయందున్నది

ఆయుత్తరమునం దొకచో "ఎప్పుడైన నీహృదయమునకు కష్టముకలిగినేని, అప్పుడ యేమాను స్మరించుకొందువా?" అని వ్రాయబడి యున్నది. రాజపుత్రుఁడిప్పు డత్యంతక్లేశములో నుండియున్నాఁడు. సందేహములేదు. అందుచే నాతఁడు మాటమాటకు నయేమాను స్మరించుకొనుచుండునని చెప్పుటకు సందేహములేదు.

యువరాజు నీకుఁబ్రేమాస్పదుఁడు—నీవు దానిని మరచిపోవుటకు నిష్టపడుదానవుకావని దోఁచుచున్నది— అనేకలతిక లొకసహకారవృక్షము నాశ్రయించును. ఏది దానినివిడనాడియుండఁగలదు? ఒకయాశ్రయమునందె యనేకములువ్యాపించి వృద్ధిపొందఁగలవు.

నీవు స్త్రీరత్నమవని నేనెఱుంగుదును. ఈప్రపంచమున నీతోఁ బోల్పఁదగినవారెవ్వరును లేరు. నీవంటి స్త్రీరత్నముతో మాటలాడుట నిజముగా నాభాగ్యమేయగును. నీవు నిష్కామస్వరూపిణివి.

ఇష్టమువచ్చినప్పుడు నీకుత్తరమువ్రాయుటకు యువరాజునకు నీవనుజ్ఞనొసంగియున్నదానవు ఈయవస్థయందాయన కవకాశమును స్వాతంత్ర్యమును జిక్కియుండినచోఁ దప్పకుండ నీకుత్తరమును వ్రాసియుండును. అందుకు సందేహములేదు.

ప్రస్తుతమున సంభవించిన యీయాపదయందు నీవేమిచేయఁగలవో యేమిచేయవలయునో యది నాకేమియుఁ దెలియదు. నేనా విషయమునేమియుఁజెప్పను. ఈప్రపంచమున రాజపుత్రుని క్షేమమునుగోరువారున్నచో నీవట్టివారిలో నగ్రగణ్యవు. అందుచే నీకీ సమాచారమును దెలుపుట నాకుఁగర్తవ్యము. నాకర్తవ్యమును నెరవేర్చుకొనుటకే నేనీయుత్తరమును వ్రాయుచున్నాను.

ఇతరకష్టసుఖములనుగూర్చి తెలుపుట కిదిసమయముకాదు.

ఆవశ్యకమనితోఁచినచో నిష్టమువచ్చినప్పుడు నీవు నాకుత్తరమును వ్రాయవలయును. సమక్షమున మాటలాడవలసిన యావశ్యకముండుట యాశ్చర్యముకాదు—నీవీవిషయమున నెట్లాజ్ఞాపించిననట్లు చేయుటకు సిద్ధముగానున్నదాను

ఇట్లు

దుఃఖిత

తిలోత్తమ"

ఉత్తరమునఁజదివి తిలోత్తమ దానిపైవిలాసమును "నవాబునందిని, అమేషా" అని వ్రాసెను మఱియు నుత్తరముపై వేఱొకప్రక్క "మందారణదుర్గమునుండి" అని లిఖించెను. నియమానుసారముగ నుత్తరమును దారముతోఁగట్టి ముద్రనువేసెను. పిదప నుత్తరమును జేతియందిడికొని యాగదియందొకటి రెండుమారు లిటునటుతిరుగాడి తటాలున నామె తనహృదయమున—"కర్తవ్యముస్థిరమైనది. వేవే కార్యానుష్ఠానమున కారంభము సేయవలయును." అని యనుకొనియెను.

ఎవరియందుఁ జిరకాలము శాంతత, సుశీలత, నిరీహత, పరాజ్ఞానుసారప్రవర్తనము ననుగుణములు వాసముచేయుచుండునో, యట్టివారియందవస్థావిశేషముచే నాకస్మికముగ నద్భుతదృఢత, స్వాధీనత, స్వాతంత్రత, తేజస్విత, కర్మక్షమత, ఏకాగ్రత, దృఢప్రతిజ్ఞ, మొదలగు మహాగుణములు ప్రాదుర్భవించుచుండును చరిత్రములయందును జనసమాజమునందును నట్టిదృష్టాంతముల ననేకము మనము చూడవచ్చును. మానవచరిత్రయందాకస్మికముగ నట్టిపరివర్తనము లెట్లు సంభవించుచుండునో తెలిసికొనుటకు మనోవిజ్ఞానశాస్త్రము నెఱిఁగినపండితశ్రేష్ఠులే తగినవారు. సౌమ్యయు, శాంతయు, వినమ్రస్వభావయు, సంతతపరముఖాపేక్షిణియునగు తిలోత్తమ యీ విధముగా దృఢసంకల్ప యయ్యెను

ఉత్తరమును జేతియందుంచుకొని తిలోత్తమ యాగదినుండి బయలు వెడలిపోయెను

తొమ్మిదవ ప్రకరణము.

పఠానులు తమరాజధాని నిప్పుడు స్వర్ణదుర్గమునందు స్థాపించుకొనిరి. పరలోకగతుఁడైన కటులుఖానుని తనయుఁడగు ఖాజాసులేమాన్ ఖానును ఖాజా అస్మాన్ ఖానును బాలితతనయయగు నయేషాయు, నితరపురమహిళలును నిశ్చింతతో స్వర్ణదుర్గమునందుండిరి. యుద్ధవ్యాపారములన్నియు నిలిచిపోయెను.

స్వర్గస్థుఁడైన కటులుఖానునితనయు లిరువురును జరిత్రలయందుఁ బ్రసిద్ధనిగాంచియుండిరి వారిరువురకు నెప్పుడైనను రాజ్యసంబంధమగు వివాదము పుట్టునేమోయనెడి సంశయముచే మానసింహ మహారాజు చేసిన సంధినిబంధనానుసారముగా రాజ్యభారమంతయుఁ దనచేతియందిడుకొని వృద్ధమంత్రియగు ఇసాఖాన్ పరిపాలించుచుండెను. ఆతనిశక్తిసామర్థ్యములచే నెచ్చటను విచారము తలసూపుట కవకాశము లేకుండెను అన్నియును జక్కగ నెరవేర్పఁబడుచుండెను.

అన్నియును సరిగా నడచుచున్నను మానవునిహృదయము దుర్దమనీయమైన దురాకాంక్షచే ననేకసమయములయందు యాతనల నను

భవించుచుండుటయేగాక బుద్ధిపూర్వకముగా విచారములను దెచ్చిపెట్టుకొని యనేకములగు ననాగతయాతనలకు లోనగుచుండును. నవాబు కటుల్‌ఖానుని యిరువురి తనయులస్వభావములు నొకరీతిగానుండక యత్యంతము భిన్నములైయుండెను. సులేమాన్‌ఖాను సురాపానమునందును సుందరీసంసర్గమునందును గాలమును వినియోగించినచో, బ్రపంచమునందలి యీజీవితముయొక్క సర్వప్రయోజనములును సఫలీకృతములగు ననునమ్మకము గలవాఁడు. అతఁడు తననమ్మకము ననుసరించి యందులకుఁ గావలసిన పదార్థ సమూహముచే సర్వదా పరివృతుఁడై యుండి నిశ్చింతభావముతోఁ గాలహరణమును జేయుచుండెను. అతనితమ్ముఁడైన అస్మాన్‌ఖాను ఇంద్రియసుఖాన్వేషణ మత్యంతనీచకార్యమని తలంచెడువాఁడు. మనుష్యజన్మమునుపొంది వీరహృదయమునుదాల్చి పఠాన్ రాజవంశమునజన్మించి అసిచాలననైపుణ్యమున వన్నెకెక్కి నారీమధ్యమున సురాపానమత్తుఁడై యచేతనావస్థయందు జీవనమును గడపుట మిగుల హీనకార్యమని యాతఁడనుకొనుచుండెను.

అస్మాన్‌ఖా నత్యంతమానసికక్లేశముచేఁ గాలమును గడపుచుండెను. మొగలాయీలిప్పుడు భారతీశ్వరులుగ నున్నారు. మొగలాయీలను భారతీశ్వరులుగా నంగీకరించుట యనిన నస్మాన్‌ఖానుని హృదయమునకు మిగుల వ్యథగా నుండెను. ఢిల్లీసింహాసనమునకుఁ బఠానులు ప్రభువులు కావలయునని తలంచి కుతుబుద్దీను తన బాహుబలముచే హిందువులను వశముచేసికొని రాజ్యమును జయించి యమితపరాక్రమముతో భారతవర్షమునఁ బఠానులరాజ్యమును బ్రతిష్ఠించియుండెననియు మొగలుఁడగు బేబ రధికబలశాలియై పఠానురాజును బదచ్యునిఁజేసి ఢిల్లీసింహాసనము నాక్రమించెననియు, నంతమాత్రమున మొగలాయీలీభారతవర్షమునకు న్యాయసంగతులగు భూపతులని చెప్పుటతగదనియు పఠానుల స్వత్వములను మొగలాయీలు లాగుకొనిరనియు, భాగ్యదోషముచేఁ బఠానులిప్పుడిట్టి హీనావస్థయందున్నను నదృష్టచక్రము పరివర్తనము నొందినప్పుడు మరల నున్నతస్థితికి రాఁజాలరని చెప్పుట తగదనియు, హీనావస్థయందే సంతుష్టచిత్తులైయుండి దానికిప్రతీకారమును జేయ యత్నింపకుండుట కాపురుషలక్షణమనియు నస్మాన్‌ఖాను తలపోయుచుండెను.

ప్రస్తుతమున మొగలులకును బఠానులకును జరిగినసంధివిషయమును గూర్చి అస్మాన్ ఖానుఁడు తలపోయని దినమొకటియును లేదు. ఈ మైత్రి కాతనిహృదయము పూర్ణాంగీకార మొసంగుటలేదు. మానసింహ మహారాజుమూలమున జరిగిన యీసంధి యఖండనీయమనియుఁ జిరస్థాయిగా నుండఁదగినదనియు నస్మాన్ ఖాను తలపోయుటలేదు. ప్రపంచము నందలి యన్ని దేశములలోను జరిగినమైత్రులన్నియు భంగముగొందకుండ స్థిరముగానున్నవా? అని యాతఁడనుకొనుచుండెను. ఇప్పుడు జరిగినసంధికి మొగలులదోషముచేనైననేమి, పఠానుల దోషముచేనైననేమి స్వల్పకాలములోనే భంగము తప్పకుండఁ గలుగఁగలదని యస్మాన్ ఖాను నమ్మియుండెను. నవాబు కటుల్ ఖానుని మరణము, రాజ్యమున నలుప్రక్కలనున్నవాండ్ర విశృంఖలభావము, యథార్థముగా మానసింహుఁడు చేసిన గొప్పసన్నాహములు మొదలగునవన్నియు నొక్కమారుగ వచ్చి పడుటచే సంధికంగీకరింపవలసివచ్చినదనియు, నాయవాంతరములన్నియు నంతర్హితములై పోయినపిదపఁగూడ నాసంధి యక్షుణ్ణమై యుండవలయు ననుట సంభావితము కాఁజాలదనియు నాతఁడు యోచించుకొనుచుండెను.

అస్మానుని హృదయమునందసంతోషము నాటుకొనియుండెననుట కించుకంతయును సందేహములేదు. ఆతనిహృదయము నందలి యశాంతికి మఱియొక కారణముకూడఁ గలదు. లావణ్యమయప్రతిమయగు నయేషా యాతనిజీవనసర్వస్వము నపహరించియుండెను. ఆతనిజీవనము నందలి శాంతిసుఖములామెకృపాధీనములై యున్నవి. కాని, భూలోకదుర్లభమైన యాస్త్రీరత్న మాతని స్త్రీరత్నము కాలేదు. అస్మాన్ ఖానునకు బ్రతిదానము చేయుట కామె తనహృదయమున నించుకంతయును స్థానమునొసంగలేదు. ఏమురా కాంక్షయొక్క ప్రబలతరశాసనములచే నస్మానునిహృదయ మెల్లప్పుడు నున్మత్తమగుచుండెనో, ఉత్తేజితమైన యేదురాశచే భారతవర్ష సింహాసనలాభమందు ప్రమత్తమైన యాతని హృదయము కుంఠితమగుచుండెనో, అట్టియాకాంక్షలను— ఆశలను— సర్వము నయేషాయణుమాత్రానుగ్రహమునకైన వినిమయముచేయుట కాతఁడు సిద్ధపడియుండెను. అయిన నాసుందరి తనహృదయము నందాత

సికిం దావోసంగ లేక పోయెను. హతాశుఁడగు నా ప్రేమికుని యంతర్జ్వాల దుస్సహనీయముగ నుండెను !

ఆ యమేషయెవ్వరు ? కటుల్‌ఖానుని పాలితకన్య—అమేషా కటుల్‌ఖానుని కాశ్మీరబీగమునకు సోదరుని తనయ — అమేషా ఆఱునెలలవయసులోనుండగా నామెతల్లి లోకాంతరగతురాలయ్యెను. పత్నీవియోగముచే విధురుఁడగు నామెతండ్రి యాశిశువును దనసోదరికడనుంచెను. పిదపఁ గొలఁదిదినములలోపలనే అమేషాతండ్రియు నీలోకమును వదలిపోయెను. అమేషా తలిదండ్రులు లేనిబాలికయయ్యెను. అయినను నామెకట్టిలోపమేమియుఁ గాన్పింపలేదు. నవాబుకటుల్‌ఖాను, అసామాన్యరూప లావణ్యవతియగు నాకన్యనతిగారాబముతోఁ జూచుచుండెను. కాశ్మీరబీగమునకు వేఱుసంతానము లేకుండుటచే నీబాలికను దనతనయగనే భావించుకొని సంరక్షించుచుండెను. నవాబునకు వేఱుగఁ గొడుకులును గూఁతుండ్రున్నను నమేషాపై నత్యంతమమత్వమునుగలిగి యూరసనంతానముకంటె నధికముగ నామెను బ్రేమించుచుండెను. సాధారణజనులందఱు నామె కటుల్‌ఖానుని తనయయనియే భావించుచుండిరి. అమేషాసయితము తాను కాశ్మీరబేగము గర్భవాసమున జన్మించిన నవాబునందిని ననియే తలంచుకొనుచుండెను.

అస్మాన్‌ఖానును నమేషయు సమవయస్కులు నవాబు నంతఃపురమునందు వారిరువురును బాల్యమున గాతుకక్రీడలఁ బొద్దుపుచ్చుచుఁ బెరుగుచుండిరి అమేషాసౌందర్యము నిరుపమానమైనది. ఆమె కుశలతయు సాహసమునుగూడఁ గొనియాడదగినవి. ఆమెబుద్ధియు ధర్మప్రవృత్తియు నసాధారణములైయుండెను వయసు హెచ్చినకొలఁదిని నస్మానామెయం దనురక్తచిత్తుఁడగుచువచ్చెను. బాల్యమందలి యాయనురాగము యౌవనమునందు వేఱురూపమును దాల్చెను. అస్మాన్‌ఖాఁ మెల్లమెల్లగ నమేషాకు దాసుఁడయ్యెను.

కటుల్‌ఖాను తనమరణమునకుఁ జాలకాలమునకుఁ బూర్వమే అమేషాజీవననిర్వాహముకొఱకు విశేషధనము నొసంగియుండెను. అమేషాకిచ్చినంత ధనమును నవాబు తనయౌరసతనయులకుఁగూడ నీయలేదు కటుల్‌ఖానును గాశ్మీరబీగమును నమేషాయు నస్మానుఖా ననురక్తుఁ

డయియుండెనని తెలిసికొనియుండుటయేగాక మాటలనుబట్టియు ప్రవర్త ననుబట్టియు నయేషాకూడ నస్మానుని యందాసక్తయై యుండెననికూడ నమ్మియుండిరి. అయేషా సర్వాంతఃకరణములచేతను నస్మానునకు హితము సేయుచుండును. ఆతనికి బ్రియములైన కార్యములను జేయుటకు సమయము లభించినచో నామె యెంతయో సంతసించుచుండును. ఇంతే కాదు. అస్మానుఖానుని సుఖదుఃఖముల యందామె సహానుభూతయగుచుండును. అట్టివేళల నస్మానుని హృదయహారిణియైన యామోహిని అయేషా సర్వదా అస్మాన్ఖానునియందు దనహృదయప్రాణముల నర్పించియున్నదని తోచుచుండును. కాని అయేషాయనురాగము, మమత మొదలగునవి యన్నియుసోదరస్నేహము నతిక్రమించియుండ లేదు. అస్మాన్ తనకు స్నేహమయుడైన సోదరుడనితలంచి యామె యాతనిని సర్వదా ప్రేమించుచుండెను. ఆవిషయము నెవ్వరును దెలిసికొనలేకుండిరి. అపరిమిత ధనసంపద లయేషాకుండియుండుటచే ముందస్మానుఖానామె పాణిగ్రహణము చేసికొన్నచో నామెసుఖసౌభాగ్యములు సంపూర్ణతనొందునని బీగమును, కటుల్ఖానును ననుకొనుచుండిరి ఇంతలో నవాబు లోకాంతరగతుడగుట తటస్థించెను.

అయేషాప్రణయ మెంతవఱకు ప్రగాఢమైనదో యస్మాన్ఖానెఱుంగును. ఆతడు తనహృదయమునందలి ప్రేమసూచకవాక్యము నామెకడ నేమాత్రము వ్యక్తముచేయ జూచినను నుత్తరక్షణముననే అయేషానిస్సందిగ్ధభావముతో విస్పష్టముగా నాతనియెడ దనకుగల హృదయభావములను నాతనికి దెలియ జేయుచుండెను. అయేషానుడివినవాక్యము లాతనిహృదయమును వాడిశూలములవలె వేధించుచుండెను ఆతడాదుస్సహయాతనను మౌనముతో సహించుకొనెను.

ఈవిధముగా బహువిధకష్టములచే బీడింపబడుచున్న యస్మాన్ఖానొకనా డపరాహ్ణకాలమున దుర్గమునందలి విశాలమైన యొకగదియందు గూర్చుండియుండెను. ఒకప్రక్క నిష్ఫలప్రణయముచే గలిగిన తీవ్రతరయాతన—ఏమిసేయుటకును దోచదు. అస్మానుఖానిహలోకమున తనజీవనము కేవలభారమాత్రమేయని తలంచి దారుణక్లేశము ననుభవించుచుండెను. ఆసమయమునం దాకస్మికముగ నెవ

రోవచ్చుచున్నట్లు ధ్వనిగానయ్యెను. అస్మాన్ తేచి మార్గమునొద్దకు వచ్చి నిలువఁబడియెను. దీర్ఘములైన తెల్లనిమీసములతోఁగూడిన వదనముఁగలిగి గొప్పతలపాగనుదాల్చియున్న మంత్రిశ్రేష్ఠుఁడగు విసాఖా నక్కడకువచ్చెను. అస్మానుఖా నాతనిని యథాప్రకారముగ గౌరవించెను. వృద్ధుఁడైన యిసాఖానును ప్రభువగు నస్మాన్ ఖానున కుచితరీతిని మర్యాదలను జరపినపిదప నిరువురు నుచితాసనములపైఁ గూర్చుండిరి.

అ— మీరిప్పుడెందులకువచ్చితిరి? క్రొత్తసమాచారము లేమైన నున్నవా?

మం— జగత్సింహునకుఁ గారాగారదండన విధింపఁబడినదను సంగతి యేలికకుఁ దెలియకుండనున్నదా?

అ— ఆసమాచారము నాకుఁ దెలిసినది. అందువలన మన కేమైన లాభనష్టములున్నవా?

మం— కొలఁదిగ నుండుననియే చెప్పవలసియున్నది. మానసింహమహారాజు మనతోఁజేసిన యేసంధిననుసరించి యుభయపక్షములయందును గార్యము లింతవఱకును నడపఁబడుచుండెనో, ఆసంధి కక్బరుఫాదుషా యంగీకరింపలేదని తెలియుచున్నది. మానసింహుఁడు చేసినసంధి కక్బరుఫాదుషా యంగీకరింపకుండ నుండఁజాలఁడనుటయు నిజము. అయినను నాతనికది సంతోషజనకమైనదికానప్పుడు దాని నన్యథాచేయుటకు సమయమును జూచుకొనుచుండును

అ— జగత్సింహుని కారాగారవాసశిక్షకును నావ్యాపారమునకు నేమిసంబంధమున్నదని మీరూహించితిరి?

మం— సంబంధమున్నదనియే నాయభిప్రాయము. జగత్సింహుఁడు మననగరమునందు బందీగానున్నప్పు డాతనియెడమనము నడపినప్రవర్తనమువలన నాతనికి విచారము కలిగినదని యెంచుట కవకాశమేమియు లేదు. మనయందాతఁడు విరక్తిఁజెందియుండ లేదని చెప్పుట కించుకంతయు సంశయములేదు. విషయములనన్నిఁటిని వివరముగా విప్పిచెప్పుటకు నాకిష్టములేదు. కాని, మనపైఁబగఁదీర్చుకొనుట కాతని కిష్టముగానుండఁజాలదని చెప్పుటకు వేఱుకారణము లున్నవని మాత్రము నాహృదయమునకుఁ దోఁచుచున్నది.

వృద్ధమంత్రి యేయభిప్రాయముతో నీతుదివాక్యములను నుడివెనో యాయభిప్రాయము నస్మాన్ ఖాను తెలిసికొనియెను. జగత్సింహునియం దమేషాకుఁగలయూసక్తిని సూచింపవలయునను నభిప్రాయముతో నట్టిమాటలను వృద్ధమంత్రి నుడివెనని యస్మాన్ గ్రహించెను. ఆమాటలనువినుటచే నస్మానునిహృదయమునం దేకకాలమున సహస్ర వృశ్చికములు కుట్టినట్లయ్యెను. అతఁ డతికష్టముతోఁ దనహృదయభావములను వ్యక్తపడకుండఁ గప్పిపుచ్చుకొని మంత్రిమాటలకుఁ బ్రత్యుత్తరముగ "జగత్సింహుఁడు మనకనుకూలుఁడై యుండుటచే మనకు హితకరములగుమాటల నక్బరునితోఁ జెప్పుట కాతని కవకాశము చిక్కినచో నిప్పుడు నడచుచున్నట్లే యిఁకముందును పఠానులకును మొగలులకును మైత్రినడచునట్లాతఁడు చేయఁగలఁడనియు నిప్పుడాతఁడు బందీగానుండుటచే మనకుహితముచేయునట్టి యవకాశములేదనియు మీయభిప్రాయముకాదా?" అనియెను.

వృద్ధుఁడు సంకుచితభావముతో "సేవకుఁడట్లే యోచించుచున్నాఁడు" అనియెను.

అ—మీరభిజ్ఞులు, ప్రవీణులు విశేషించి నాకు జనకసమానులు. అందుచే మీమాట కెదురాడ నాకధికారములేదు. కాని మిమ్ములనొక్కమాట యడుగుచున్నాను — ఈసంధివలన మనకుఁ గలిగిన విశేషలాభమేమున్నది? మనము మనబాహుబలముచే శరీరములయందలిరక్తమును వెదజల్లి మనకోశాగారమునందలి ధనమునంతను వ్యయముచేసి ప్రాయికముగా వంగదేశమునంతను స్వాధీనముచేసికొంటిమి అప్పడాధరపురయుద్ధమునందు జయమునుబొంది మేదినీపురమునను,వర్ధమానపురముప్రక్కవఱకును మనయధికారమును స్థాపించియుంటిమి ఈసంధితో మనము క్రొత్తగాజయించిన రాజ్యమునంతనువిడిచిపెట్టవలసివచ్చినది. అంతియేకాకుండ జగన్నాథునిమందిరమును పూరిమండలమునుగూడ మొగలులస్వాధీనము చేయవలసివచ్చెను. అట్టిసంధి లజ్జాస్పదమును నసహ్యాకరమును నైయున్నది అక్బరీసంధిని భంగముచేసినను మనమందులకు విచారింపవలసిన యావశ్యకతయేమియును లేదు.

మంత్రి కొంచెము సేపు మౌనమును దాల్చియుండి పిదప "నే నావిషయమున నేలికసన్నిధానమున నేపక్షముగను జర్చింపఁజాలను. కాని మనమిప్పుడు దుర్బలులమైయున్నామనిమాత్రము మనవిచేయు చున్నాను" అనియెను.

అ—నిజము! మానసింహుని కెదురుగనిలువఁ గలిగిన బలశాలులెవరును మనకడ నిప్పుడు లేరనుట నిశ్చయము మీరాలోపమును బూర్తిచేయుటకు యత్నింపఁగలరా?

వృద్ధ—ఏలిక యెఱుంగని దిసుమంతయును లేదు నేనిప్పు డాభ్యంతరికములైన రాజకార్యముల ననేకవిధముల నిర్వహించుటలో మునిఁగియున్నాఁడను. అందుచే మరి యే కార్యవిచారమునందును నా మనసును బ్రవేశపెట్టుట కవకాశములేకున్నది

అ—మీహృదయము నా రాజకార్యనిర్వహణమునందే యుంచెదరుగాక! ఈవయసునందు మీహృదయము యుద్ధవ్యాపారముల విషయమున పనిసేయఁజాలదు. ఈస్థితియందెప్పుడును మీరు సంధిని, శాంతినే గోరుచుందురనుటకు సందేహములేదు. మీరు నన్నుక్షమింప వలయును వర్తమానమున నడచుచున్న యీసంధి కేవల మవమాన జనకమని నాయభిప్రాయము. అనుకూలమే కానిండు అసహ్యమైన యీసంధి బంధమును ధ్వంసముచేసి మొగలాయీల కెదురుగ రణక్షేత్రమున నిలువఁబడి యుద్ధముచేయుటయే నాకుఁదృప్తికరము అందులకుఁగావఁ సినవానినెల్ల సిద్ధముచేసి పిదప నా వృత్తాంతము ను మీకెఱింగించెదను

మం—ఆవిషయమున నేనిప్పుడేమియుఁ జెప్పను. నేనిప్పుడు విన్నవింపవలసిన స్వల్పవిషయ మొకటి కలదు. మానసింహమహారాజు శీఘ్రకాలములో పూరికి రానైయున్నాఁడు.

అ—మంచిదే. కాఫరులు కుత్సితకాష్ఠఖండము నీశ్వరుఁడని నమ్ముచుందురు. మొగలాయీశ్యాలకుఁడగు మానసింహుఁడును నా యీశ్వరపూజకై పూరికి వచ్చుచుండెనా?

మం—రావచ్చును. అతఁడు విస్తారసన్నాహముతోడనే వచ్చు చున్నాఁడు.

అ—ఆతనియిష్టము. సంధిసూత్రానుసారముగఁ బూరిని మనము వారికి విడిచిపెట్టినపిదప బంగాళా దేశపు సుబేదారుఁడగు మానసింహుఁడు సమారోహుఁడై రావచ్చును భిక్షుకులును బోవచ్చును దానివలన మనకైన దేమి? మనకేమిసంబంధము?

మం—మనకుఁ గొంచెముసంబంధమున్నది. మానసింహమహారాజు పూరికిఁ బోవుచున్నాఁడు. కావునఁ జాలదూర మాతఁడు మన రాజ్యము లోపలినుండియే వెళ్ళవలసి యున్నది

అ—ఆతఁడిచ్ఛవచ్చినట్లు వెళ్ళవచ్చును రాజమార్గమున కభ్యంతరము లేదు. ఆతఁడన్నమాటయేమి? అందఱును బోవచ్చును.

మం—అప్పుడు మనము చేయవలసిన కార్యమున్నది.

అ—ఏమికార్యము?

మం—అతఁడు మన రాజ్యపుటెల్ల లోనికివచ్చినప్పుడు మనమాతనికి సన్మానము చేయవలసినవిధి యున్నది

అస్మానుని ముఖముపై మేఘము క్రమ్మినట్లయ్యెను.

అ— అది యెందులకు?

మం—మనము సంధిసూత్రముచే బద్ధులమైయున్నాము. అతనిని సన్మానింపకపోయినచో పాదుషా కవమానము చేసినవారమగుదుము. మానసింహుఁ డక్బరు పాదుషాయొక్క ప్రతినిధి.

అ—ఏవిధమైన సన్మానము చేయవలయును?

మం—మనరాజ్యపుటెల్లలలో నున్నంతవఱ కతనితోఁగూడ నుండవలయును

అస్మాన్ ఖాను సింహాసనమునుండి లేచి యాగదియందిటునటు కొంచెముసేపు పదప్రచారముసేయుచుఁ దటాలున మంత్రికెదురుగ నిలిచి "అట్టి యవమానమును సహింప జాలను. మానసింహుఁడు జగద్విఖ్యాతుఁడైన పరాక్రమశాలియే యగును. మానసింహునికి బాహుబలముచే నక్బరునకట్టి గౌరవముండుటయు నిజము మానసింహుఁ డక్బరుని కుటుంబములోఁ జేరినవాఁడనుటయు వాస్తవమే. మానసింహుఁ డొకదేశమునకు భూపతియు నగును. అట్లయినను

నాతఁడక్బరునకు దాసుఁడై యున్నాఁడు. మనమిప్పుడు బలహీనులమైయున్నను స్వతంత్రరాజులము అక్బరునకు సమకక్షులము. ఘటనాచక్రముచే నిప్పుడు దుర్బలులమై యుండుటనిజమే. అయినను నింతవఱకును మనమక్బరుషాదుషాతో హోరాహోరిగాఁ బోరాడుచునేయున్నాము—జయాపజయములమాట యట్లుంచుము—కాని, మనమెప్పుడును నేకారణమువలనను నెవరికిని—ఒక్కరికైనను—పదానతులమైయుండలేదు. మనమిప్పుడును నోరిస్సాయందు స్వతంత్రప్రభువులము. ఇట్లుండఁగా నక్బరునిప్రతినిధియొక్క పాదుకలను మోసికొనుచు నాతని నాశ్రయించి కూడఁగూడఁదిరుగుట కే నెంతమాత్రము నంగీకరింపను" అనియెను.

మం—మహారాజుకొద్దనుండి యుత్తరమొకటివచ్చినది. అని చెప్పి యావృద్ధుఁడు తనలువుటంగీజేబునుండి యొకయుత్తరమునుదీసి యస్మాన్ఖానునిచేతియందిడియెను. అందిట్లు వ్రాయఁబడియుండెను. "మానసింహమహారాజు స్వధర్మపాలనార్థమై పురుషోత్తమ క్షేత్రయాత్రను జేయనున్నాఁడు. ఒరిస్సాదేశమున నోరిస్సానవాబుల ప్రదేశములోఁ బ్రవేశించినతోడనే క్రొత్తనవాబు లిరువురును నాతనిసందర్శనము చేయుదురని నమ్ముచున్నాఁడు" ఉత్తరము ఇసాఖానునిపేర వ్రాయఁబడియుండెను.

అస్మాన్ఖానాయుత్తరమును జదివి తిరిగి మంత్రి కిచ్చివేయుచు "దీనికి బ్రత్యుత్తర మెట్లువ్రాయవలయునో రేపటిదినమున మీకుఁ దెలియఁజేసెదను. మానసింహుని యౌద్ధత్యము నాకుఁ జాల విరక్తిని గలుగఁజేయుచున్నది" అనియెను.

మం—నేను సెలవుఁగైకొనియెదను. నేనిటనుండి వెడలిపోవుటకుఁబూర్వ మేలికసమక్షమున నొక్కమాటను మనవిచేయవలయునని యున్నది.

అ—చెప్పవచ్చును.

మం—మానసింహమహారాజు మొగలులకును బఠానులకును నడుమచేసిన సంధియంతయు జగత్సింహుని ప్రయత్నములచే నెరవేరి

నదిగనున్నది. మనమావిషయమును జ్ఞప్తియందుంచుకొనుట న్యాయము — మఱియొక్క మాట — మన మాసంధిబలమువలన నుత్కలదేశమునకు స్వతంత్రాధికారమును బొందినవారమైయున్నను మన మక్బరునకు లోబడియుండుట నంగీకరించియున్నాము. మానసింహమహారాజు శిబిరమునకు బోయి యాతనిని మనము సన్మానింపవలయును. ఆతనికిం గానుకల నొసంగి యాతండొసంగు బహుమానముల నంగీకరించి సన్మానముల నందంజేయవలయును. మనము విధిప్రకారము మానసింహ మహారాజున కనుగతులమై యుండవలయును. పాదుషాకు సంపూర్ణముగా లోబడియుండి యుత్కలదేశ స్వాతంత్ర్యమును బొందియున్నాము. ఇవియన్నియు నింతశీఘ్రకాలములో మఱవకుండ నుండుట మంచిది.

అ— నేనావిషయములను గొంచెమేనియు మఱవలేదు. ఆకళంకము నా హృదయమును బీడించుచున్నది. ఆయపకీర్తి శీఘ్రకాలములోనే లుప్తమైపోగలదు.

మం— (లేచి నిలుచుండి) వేఱువిధముగా నవస్థాంతరము సంఘటించువఱకును మానసింహమహారా జక్బరుపాదుషా ప్రతినిధియని తలంచి యాతని కుచితసన్మానముల జేయుట మనకువిధి అట్లుచేయక మనమన్యథా నడచుకొంటిమేని పాదుషాతో మనకు విరోధము తప్పదు. మనమేవిధముచేతను బ్రస్తుతమున నక్బరున కెదురుగ నిలువంజాలము. ఈవిషయములన్నిటిని యోచించి పిదప కర్తవ్యము నవలంబింపవలయునని నా ప్రార్థనము. నాకు శరీరమునందు బలములేదు వార్ధక్యముచేతను దత్సంబంధములైన యితర వ్యాధులవలనను బీడింపబడుచున్నాడను. చాలకాలము జీవించియుండగలనని తోచదు. జీవించియున్నంతవఱకు మాప్రభువుల కవస్థాంతరము సంభవింపకుండ నుండవలయునని నామనోరథము. సెలవుగైకొని పోయెదను.

సముచితశిష్టాచారములను నిర్వర్తించినపిదప మంత్రి యటనుండి వెడలిపోయెను.

పదియవ ప్రకరణము.

విచారపీడితుఁడైన యస్మాలీఖాను మెల్ల మెల్లగ గదిలోనుండి యీవలకువచ్చెను. మానసింహునియుత్తరమును నాదేశసూచకమైన యాజ్ఞాపత్రిక (పర్మానా)గా భావించుకొనియెను ఆతడు తనహృదయమునందు "పఠానులు ఢిల్లీపాదుషాకు వశులైనట్లంగీకరించినను వారి మనోరథములేమైన నీడేరెనా? సంధివలన మొగలాయీ లుపకృతులు కాలేదా? మాతోఁజేసినయుద్ధమునందు మానసింహునకు నష్టము సంభవింపలేదా? సర్వస్థుఁడైన నవాబు ధారాపురయుద్ధమునందు మానసింహునోడించి యాతనితనయుఁడైన జగత్సింహుని బందీగాఁదీసికొని వచ్చెను. అంతేకాకుండ వంగదేశమునందు విష్ణుపురమువఱకును నధికారమునుగూడఁ జేసియుండెను. జగత్సింహుడు మాచేజిక్కినప్పుడాతనినేమిచేసినను జేసియుండవచ్చును అట్లుచేసినచో మానసింహునకు మరల సైన్యమును సమకూర్చుకొనుట కవకాశముకలిగియుండక పోవును. ఈలోపలనవాబు మరికొంతప్రదేశము నాక్రమించుకొనినచో మేము వంగదేశమునంతను స్వవశముచేసికొని యుందుమనుటకు సందేహామించుకంతయును లేదు. కాని యింతలో నవాబుబహద్దూరుమరణము సంఘటితమైనది. ఆకస్మికముగా సంభవించిన యీవిపత్తునందుఁ జిక్కుకొనియుండుటచేఁ గాతరమువలన నెటుచేయుటకు నవకాశములేక పోయినది. ఆసమయమున యుద్ధమునకుసిద్ధమగు టుచితముకాదని యెంచి సంధి కంగీకరింపవలసివచ్చినది. పఠానులెప్పుడును భీరువులై యుద్ధమునుజేయలేక సంధిబంధమున కంగీకరించియుండలేదు. రణరంగమున వారెప్పుడు నసమర్థులని యనిపించుకొనియుండలేదు మొగలాయీసైన్యములను నాశనముచేయుటయందు వారెన్నఁడును భీతులయి యుండలేదు జగత్సింహుని నాతనితండ్రి శిబిరమునకుఁ బంపి పఠానులు తమయౌదార్యమును గనఁబరుచుకొనిరి అట్టిపఠానుల విషయమున నంతనిర్లక్ష్యమునుచూపి యట్టికఠినాదేశమును బంపి వారు తమకు వశ్యులైయుండిరికదాయని వారియెడ నక్రమముగా వ్యవహరించుట మానసింహున కుచితముకాదు. మానసింహుఁడాయుత్తరమునం

దావిధముగా వ్రాయుటకు మారుగ "క్రొత్తన వాబులు నా యాత్మీయుల లోనివారుగాఁ బరిగణింపఁబడినవారుగను న్నారు. నేనుత్కల దేశము నం దున్నప్పుడు వారిసందర్శనము లభించినచోఁ జాలసుఖనయ్యెదను." అని వ్రాసియుండినచో మేమునిజముగా నుపాయనాదులతోఁ బోయి యాత నినిచూచి యన్యోన్యవిశ్వాసము నభివృద్ధిచేసికొనఁ బ్రయత్నించియుం దుము." అనియనుకొనియెను.

ఈవిధముగా ననేకవిధములైన చింతలచేఁ బ్రపీడితుఁడైన యస్మా నునిపాదము లాతనిబుద్ధికి గోచరముకాకుండఁగనే యాతని నంతఃపుర మువంకకుఁ దీసికొనిపోయెను ఆతనిచింతాసూత్ర మంతటితో నిలువక ముందునకు సాగుచుండెను. లేమ అట్లెప్పుడును కాదు; నాసోదరుఁడు వ్యాపారములయం దుదాసీనుఁడైయున్నాఁడు. ఆతఁడెక్కడకును వెళ్లఁడు నేనునుబోను మానసింహుఁడు మాయధికారప్రదేశములలోఁ బ్రవే శించినప్పు డాతని నెదుర్కొనుటకును నాతని కావశ్యకములైన పదార్థ ముల నాతని కందించుటకును మాసేవకులలో నుచ్చపదస్థు నొకని నియ మించెదను. ఉపాయనాదికము లేమియువలదు"

ఈవిధముగా నాలోచించుకొనుచు నస్మాన్ ఖాను తానేయుద్దే శముతో నటుపోవుచున్నదియుఁ దెలిసికొనకుండగనే ముందునకుఁబోవు చుండెను గర్వితుఁడైన మానసింహునితనయుఁడు చేఁజిక్కినప్పు డాతనిని నాశనముచేయకుండుట యన్యాయమై పోయినదనియు, నయేషా యా తనియెడ ననురాగిణియై యుండెననియు, నాతఁడామె యం దాసక్తుఁడు గాకపోయినను నంతమాత్రమునఁ దనకేమియు లాభములేదనియు, నా తఁడు ప్రాణములతో నున్నంతవఱకు నయేషా యాతనిని మఱవఁజాలద నియు నాతఁడీప్రపంచమున నున్నంతకాలము నయేషాహృదయమునం దుఁ దనకీషణ్మాత్రమును స్థలము దొరకదనియు, జగత్సింహుఁడు తనకు కేవలము శత్రువనియు, నతఁడు బందీయైయున్నను నాతనిజీవములతో నుంచుట సరికాదనియు ద్వంద్వయుద్ధమునఁ దానోడిపోయినంత మాత్ర మున నాశత్రుత్వమును విడుచుట సరికాదనియుఁ, దనకాతఁడు పరమ శత్రువనియు, నతఁడు కన్నులకుఁ గనఁబడకపోయినచో నామె యాతని యెడ ననురాగమును గలిగియుండఁజాలదనియు, నాతఁడు మరణించి

నచో నయేషాయనురాగము తుదముట్టువనియు, మిషచేనైననేమి, బలముచేనైననేమి జగత్సింహుని నాశనముచేయుటయే తనకు వ్రతమనియుఁ బదింబదిగ ననుకొనుచు నస్మానుఖాను ముందునకుఁ బోవుచుండెను.

ఇట్లు పోవుచుండఁగా నాకస్మికముగఁ బ్రక్కగదిలోనుండి రమణీకంఠస్వరముతో "అస్మాన్! అస్మాన్!" అను కోకిలధ్వని విననయ్యెను.

వినుటతోడనే యస్మానుని సర్వవిచారగ్రంధులును విచ్ఛిన్నములైపోయెను. ఆత డాశబ్దమువచ్చిన వైపునకుఁ బరికించెను. కొంచెము దూరములోఁ బ్రౌఢవయస్కయగు నొకసజీవదేవీ ప్రతిమయుండెను. ఆమెయే నవాబు కటుల్ఖానుని కాశ్మీరబేగమ్—అస్మానుఖానునకు సవతితల్లి. అయేషాకామె పెంపుడు తల్లి. దర్శనమాత్రము చేతనే యస్మానుఖా నతిభక్తితో నామెపాదములకు నమస్కరించెను.

బే—ఇప్పుడే నీప్రశంస వచ్చినది. నిన్నిక్కడకు రమ్మని వర్తమానమంపితిని. నీవంతఃపురమునకువచ్చినచో లోపలకుఁ బిలువవలసినదని మాజననితోఁ జెప్పియుంటిని.

అ—(సవినయముగ) ఆజ్ఞయేమి?

బే—(ఉద్రేగభావముతో) ఇట్లునిలుచుండి మాటలాడుట యెట్లు? మాటలాడవలసినవిషయము చాలఁగలదు. నీవు సావధానచిత్తముతో వినవలసియున్నది. గర్భవాసమున జన్మించినకుమారుఁడు దక్క మఱియెవరును బేగములగదులలోనికి రాఁగూడదని నవాబుగారి యాజ్ఞ—నీవు నాగర్భవాసమున జన్మించిన బిడ్డవేయని నాయభిప్రాయము అందుచే నీవు నాగదిలోనికివచ్చి కొంచెముసేపు కూర్చుండి యత్యావశ్యకములైన కొన్నిసంగతులను మాటలాడవలయును అందులకు నీకాక్షేపణ మేమున్నది?

అ—(ఇంచుక యోచించి) మీరు నాకు విమాతలైనను నేను కన్నతల్లిగ భావించి చిరకాలమునుండి భక్తితో మిమ్ముసేవించుచుంటిని మీరయేషాకు జననీసమానలు. అందుచే మీరు నాకుఁ బూజార్హలు—మహాలులోనికిఁ బ్రవేశించుట నియమవిరుద్ధమేయగును. అయినను మీ

యాజ్ఞోల్లంఘనము చేయఁజాలను. మీయాజ్ఞానుసారముగ లోపలి కరుదెంచెదను.

బే—బిడ్డా! రమ్ము! నేనాజ్ఞనొసంగితిని అందుచే నీయాజ్ఞోల్లంఘనదోషము నీకు లేదు. అంతియేకాకుండ నియమముల నేర్పరచుట కిప్పుడు నీవేకర్తవు వచ్చి కూర్చుండుము.

అస్మానుఖా నవనతమస్తకముతో మహలులోఁ బ్రవేశించి గద్దెపైఁగూర్చుండెను అనతిదూరముననే యొకరత్నకంబళముపైఁ గూర్చుండి "అయేషావిషయమున నొక్కమాట చెప్పెదను" అనియెను.

అస్మానునిహృదయము ద్రుతభావముచే స్పందితమయ్యెను.

అ—ఆజ్ఞయ్యుండు.

బే—నీకు జ్ఞాపకముగనున్నదో లేదో నేను చెప్పఁజాలను. అయేషాపినతండ్రి యపరిమితసంపదలను సంపాదించి వాని నయేషాకొసంగి స్వర్గస్థుఁడైనాఁడు. అయేషా యాసంపదలకన్నిటికి నిప్పుడుత్తరాధికారిణి యైనది.

అ—చాలకాలమునకుఁ బూర్వ మీసంగతి నొకప్పుడు వినియున్నాఁడనుకాని యదియిప్పుడు బాగుగ జ్ఞప్తియందులేదు.

బే—ఔను. చాలకాలమునకుఁ బూర్వమే ఇప్పటికిఁ బది సంవత్సరములక్రిందట నయేషాపినతండ్రి లోకాంతరగతుఁడైనాఁడు. అతనిసంపదలకన్నిఁటికిని నయేషానొక్కతెనే యుత్తరాధికారిణిగాఁజేసి, పంజాబుదేశపుసుబేదారు మీతండ్రికి సమాచారమంపి, దానినంతను నయేషాకొఱకు స్వాధీనముచేసికొనవలయునని వ్రాసియుండెను. స్వర్గస్థుఁడైన నవాబు అయేషా నొక్కదినమైనను నిడిచి యుండఁజాలకపోవుటచే నిక్కడివారిని గొందరి నక్కడకుఁబంపి యావిభవముతో సంబంధించిన వ్యవహారములనన్నిఁటిని సరిగానిర్వహించుచుండెను. ఆసమస్తసంపదలను గాపాడుటకై పోయియుండిన యామనుష్యులిప్పుడు వచ్చి, "అయేషా ప్రాప్తవయస్కయైయుండుటచే నామె స్వయముగావచ్చి యాయాస్తినంతను స్వాధీనముచేసికొని వ్యవహరింపకపోయినచో నాయాస్తియంతయు దొరతనమువారు స్వాధీనముచేసికొనఁగల"రని చెప్పు

చున్నారు. నీవిప్పుడావ్యవహారమును నిర్వహించుటకు స్వతంత్రుడవై యున్నాడవు. ప్రస్తుతము నం గర్తవ్యమేమియో నీవు నిశ్చయింపవలయును.

అ—ఈసంగతులన్నియు నిప్పుడు మీకెట్లు తెలిసినవి?

బే—అక్కడిమనుష్యులు మనమంత్రికడకువచ్చి యిట్లుచెప్పినారు.

అ—అయేషా గొప్పవంశమునందు జన్మించినదని యెఱుగుదును. మీసోదరుల కేమిపని?

బే—మాసోదరులు పంజాబుదేశపు సేనాధిపతులు అయేషాకు ఆస్తిని విడిచిపెట్టిపోయిన సోదరులు జాగీరుదారులైయున్నారు అయేషా తల్లి సుబేదారుని తనయ.

అ—అట్లయినచో నయేషాతల్లి మొగలాయీస్త్రీయును దండ్రి పఠానుడునా? ఈపరస్పరవిరుద్ధఘటన మెట్లుసంఘటించినది?

బే—దానికొక్కటేయుత్తరము బాల్యమునందుఁ దనుతమ ప్రణయవిచారమును దెలుపుకొనుటకు లజ్జయుండదు. మీతండ్రిగారు పఠానులు; నేనోఁ మొగలులకన్యను. ఈఘటన మెట్లుసంఘటించినది?

అ—అదియంతయుఁ దెలిసినది, కాని అయేషా యిప్పుడు స్వర్గస్థుడైన కటుల్‌ఖానుని తనయగా నున్నది. పఠానులతనయకు నందును విశేషించి కటుల్‌ఖానునితనయకు మొగల్‌సుబేదారుఁడాస్తి నిచ్చుటెట్లు?

బే—ఆవిషయమున వ్యాఘాతమేమియు నుండదు. అయేషాతండ్రి అక్బరునకత్యంతము ప్రీతిపాత్రుఁడై యుండెడివాడు. ఈసంబంధమున నక్బరుపాదుషా స్వయముగా నాజ్ఞాపత్రమును వ్రాసియుండుటచే దానినిమార్చుట కెవరికిని సాధ్యముకాదు. అంతేకాక యొకవిధముగా నయేషా యక్బరునకుఁ బరిచితమై యున్నది. పాదుషా దర్బారునందును నంతఃపురమునందును బరోక్షభావముతో ననేకు లయేషానెఱింగియున్నారు.

అ—ఇప్పుడు నేనేమిచేయవలయునని మీయభిప్రాయము?

బే—ఏమిచేయవలయునో నేను యోచనసేయలేను. చేయవలసినదానిని నీవేయోచించి చేయవలయును కాని నీకొక్కమాటను జెప్పక తప్పని సరియగుచున్నది. అయేషా పంజాబునకుఁ బోవలయునని యిష్టపడుచున్నది.

అ—అదేమి ?

బే—ఆమెకిప్పుడు శరీరమునందు స్వస్థతలేదు. బంగాళాదేశమున బందీగ్రామెనతండ్రి మరణించుటచేఁ గలిగినశోకమువలననో మరియేకారణముచేతనో అయేషా సంతతమును చింతాకులగ్రామై యుండుచున్నది. ఆమెకాహారమునందుఁ బ్రివృత్తియే లేదు వసనభూషణధారణమునందభిరుచిలేదు సర్వదా యప్రిఫుల్లభావముతో నుండును ఆమెశరీరము శుష్కించి మలినమైయున్నది. సెలవైనచోఁ గొన్నిదినములు పంజాబునకుఁబోయి యుండిన సుఖముగానుండునని యనుచున్నది. స్థానపరివర్తనముచే శరీరమునకు స్వస్థతకలుగవచ్చునని తోఁచుచున్నది.

అ—విశేషవిచారకారణమైన విషయము. అయేషాయాస్తిని పరిపాలించుకార్యము నెట్లయినను నిర్వహింపవచ్చును. కాని, అయేషయే యీస్థలమును విడిచి వెళ్ళవలయునని యిష్టపడుచున్నది. అమ్మా! అయేషా యీపట్టణమును విడిచివెళ్ళినచో సర్వము నంధకారమై పోవును.

బే—నీవయేషాను మిగులఁ బ్రేమించుచున్నావు. నేనును స్వర్గస్థుఁడైననవాబును మీయిరువురి శుభసమ్మేళనమును జూచి నేత్రములను సార్థకము చేసికొనవలయునని యాశపడుచుండెడివారము. నవాబు స్వర్గస్థుఁడైనాఁడు అభాగ్యనైన నేను జీవించియున్నాను. ఆయాశ యింకను దీరలేదు. ఏదియెట్లుజరుగునో చెప్పఁజాలను. అయేషాస్థితిఁ జూచినచో నిట్లున్నది నీవుసర్వదా చింతాయుక్తుఁడవై యన్యమనస్కుఁడవై యగపడుచున్నావు. నీవు మహలులోనికి వచ్చుట మానితివి నిత్యము నయేషానుజూచుటతోడనే కాలముగడపు నీవిపుడామె విషయమునుగూర్చి యుచ్చరింపనైన మానితివి మీయిట్టిభావములను జూచుచున్న నాకు మనసులోఁ జాలగష్టముగా నున్నది.

అ—తల్లీ! నాయపరాధ మిసుమంతయును లేదు. అయేషాకొఱకుఁ బ్రాణములనైన విడుచుటకు సిద్ధముగానున్నాఁడను. కాని, తల్లీ! అయేషామనసునందే జ్వాలనుదయింపఁజేసికొని తానుభస్మమగుచున్నది నన్ను భస్మముచేయుచున్నది. ఆజ్వాలలు మీకుఁగూడఁ దగిలి మీరుఁగూడఁ గష్టములకు గుఱియగుచున్నట్లున్నది. ఇప్పుడామాట యట్లుండుఁడు. అయేషాయవస్థకు నాహృదయము విషాద మధికమగుచున్నది. అయేషా యిప్పుడెచ్చటనున్నది? నేనామెను జూడవలయును.

బే—ఇంతకు రెండుగడియలకు బూర్వమామెయిచ్చటనేయున్నది. ఉద్యానవనవిహారమునకుఁ బోయియుండునని తోఁచుచున్నది. పంజాబుప్రయాణమునుగూర్చి నీయభిప్రాయము నెప్పుడువచ్చి చెప్పెదవు?

అ—అయేషానుజూచి యామెహృదయభావములను దెలిసికొనినపిదప నాయభిప్రాయమును మీకు విన్నవించెదను. నేనిప్పుడు సెలవుఁగైకొనియెదను.

అస్మాన్‌ఖాను విమాతచరణములకు నమస్కరించి మెల్లమెల్లగ వృక్షవాటికాభిముఖుఁడై వెడలిపోయెను.

పదునొకొండవ ప్రకరణము

ఉద్వేగవిషముచే జర్జరితుఁడై మృతప్రాయుఁడైన యస్మాన్‌ఖాను మెల్లమెల్లగఁబోయి వృక్షవాటికలోపలఁ బ్రవేశించెను. అయేషా యెచ్చటనున్నది? వాపీకటసోపానావళిపై నామె తఱచుగ విశ్రమించుచుండును. కాని యిప్పు డామెయట లేదు. లతాకుంజమందలి శిలాసనమున ననేకసమయముల నామెయొంటరిగఁ గూర్చుండుచుండును. కాని యిప్పుడారూపలతిక యటఁగాన్పింపలేదు. చంపకవృక్షచ్ఛాయయందలి శిలాసనమునఁ గూర్చుండి యనేకసమయములయం దామె విశ్రమించుచుండును. కాని యానవీనచంపకవర్ణ యచ్చటనుగాన్పింపలేదు. అనేకసమయములలో నయేషా విశాలవకుళపాదపపదసమీపమున నొంటరిగఁ

గూర్చుండెను. కాని యానిరుపమానసజీవపుష్ప మిప్పుడచ్చటను వికసించియుండలేదు గులాబీపూలచెట్లయడవిలోని కప్పుడప్పుడు పోయి యామెపుష్పముల నేరుచుండుటకలదు. కాని సకలకుసుమశోభాహారిణి యైన యాసుందరి యిప్పుడచ్చటను లేదు. అట్లయినచో నయేషా యెచ్చటనున్నది?

రెప్పవేయకుండఁ బరికించినను నెవరును గంటికిఁ గనఁబడుట లేదు. విచారహృదయముతో నస్మానుఖాను ప్రమదావనమధ్యమున నున్నప్రాసాదాభిముఖుఁడై ముందునకుఁ బోయెను. అచ్చట నొకదాసి యాతని కెదురుగవచ్చి యత్యంతగౌరవముతో నభివందనముచేసి "ప్రభూ! నవాబునందిని యీగృహమునందున్నది" అని విన్నవించెను.

అస్మానఖాను మిగులమెల్లగ నడుగులనిడుచు లోపలఁ బ్రవేశించెను. లోపల నడుగిడినతోడనే ముఖమునుద్రిప్పి రెండడుగులు వెనుకకువైచెను. అయేషా యేకాకిని; శిథిలవసన; నిద్రిత, ఆస్థితియందు లోపలకుఁబోవుట యనుచితమని తలంచి యాతఁడు వెనుకకుఁ దిరిగి వచ్చెను. కాని, యదియెంతటిశోభాకాంతి! మర్మరప్రస్తరసమాచ్ఛన్నమైన యావిశాలగృహమునందు ముఖమలుతలదిండుపై శిరమునిడికొని భూశయ్యాయం దయేషా నిద్రితయైపడియుండెను. ప్రపంచమునందలి సమస్తశోభారాశియును సృష్టియందలి యాపద్రమణీయతయును విధాతృనియపూర్వరూపనిర్మాణకౌశలమంతయును నిద్రితయైయున్న యా రమణీదేహమునందొక్కసారిగఁ జేరినట్లు కన్పట్టుచుండెను. ఆసుందరి యించుక మ్లానయై, విశుష్కమైయుండెను. అందుచే నయేషా సౌందర్యమున కేమైనఁ గొఱతసంభవించెనా? ఇంచుకంతయును గొఱత లేదు. దివాకరునితీక్ష్ణాలోకనముకంటె సుధాంశునిమ్లానమగు సుస్నిగ్ధ కాంతి యెట్లధికతరరమణీయమైనదియో, మిగుల స్వచ్ఛముకాకుండ నాచ్ఛాదనాంతరాళమున నుజ్జ్వలముగ వెలుంగుచున్నదీపమెట్లు నయనవినోదకరమో, అట్లే ఆయేషారూపరాశియును మ్లానమై శుష్కమై యున్నను విశేషశోభాయమానమై ప్రకాశించుచుండెను. సుషుప్తియందున్న యాసుందరి మోహినీదేవతవలె నెట్లు విరాజిల్లుచుండెను!

అస్మాన్‌ఖాను గృహములోనికిఁ బ్రవేశించినతోడనే విగళిత వసనయైన యాశోభామయికనఁబడెను. ఆయుత్తరక్షణముననే యాతఁడు వెనుకకుఁ దిరిగివచ్చెను. హృదయరాజ్ఞియగు నామె ధుర్యారాశి నింకొకమారు చూడకుండ నాస్థలమును విడిచిపోవుట కాతనికి సాధ్యము కాకుండెను. ఆతఁడు ద్వారముకడ నిలుచుండి యయేషా నిద్రాచ్ఛన్నభువనమోహన శరీరమును జూడవలయునని నయనసంచాలనము చేసెను.

అదేమి ?—అయేషావక్షస్థలముపై నదియేమి? నవీనఘనకృష్ణకేశరచిత వేణివలె సూక్ష్మాగ్రములుగల యొకపదార్థమయేషా దేహముపై నొకవైపునుండి వేఱొకవైపునకు విస్తృతమైయున్నది. అదియేమి? అస్మానుఖానున కాపదార్థముయొక్క యొకభాగముమాత్రము కాన్పించినది ఆపదార్థము నేలపైనుండిలేచి క్రమముగా నాసుందరి వక్షఃప్రదేశమునుండి దేహముయొక్క మఱియొక ప్రక్కకుఁ బోయియుండెను అక్కడనున్నభాగ మాతనినేత్రములకు గోచరముకాలేదు. ఆతని నేత్రములకుఁ గనబడినభాగము సూక్ష్మాగ్రమైయున్నను గ్రమముగ స్థూలాకారమును దాల్చెను. అదియేమివస్తువై యుండవచ్చును? రజ్జువో కాక కేశరజ్జువోయైయుండవచ్చునా? అయేషాశరీరముపైకి రజ్జువెట్లువచ్చినది. అస్మానుఖానునకు విశేషముగ యోచనలారంభమయ్యెను. ఆతనికిఁగలిగి నయాశోభాసౌందర్య సందర్శనాపేక్షపోయి హృదయమున సంశయము జనియించెను. ఆతఁడు వ్యాకులితుఁడై తోడనే వెనుకకుఁ దిరిగివచ్చెను. కొంచెముదూరములోనున్న దాసిని శీఘ్రముగఁ దనకడకురమ్మని సంజ్ఞ చేసెను.

వచ్చినయామెతో నస్మాన్‌ఖాను "నవాబునందిని నిద్రపోవుచున్నది. అందుచే నేను లోపలకుఁ బోఁగూడదు. నీవు జాగ్రతగ ధ్వని చేయకుండ లోపలికిఁబోయి యామెశరీరముపైనున్న దేదియో చూచి వేగముగరమ్ము. నాకుఁజాల భయమగుచున్నది." అని చెప్పెను.

ఆమెనిశ్శబ్దముగా లోపలికిఁబోయి యానిమిషముననే యత్యంత భయముతో వెనుదిరిగివచ్చి "మహాప్రభూ! ఏమిజరుగనున్నదో చెప్పఁజాలను. నవాబుతనయ యేమాత్రమటునిటుకదలినను సర్వనాశనము

సంఘటింపఁగలదు. ఆమెశరీరముపైనున్న దొకపత్రికాండ కాలసర్పము." అనిచెప్పెను.

అస్మానామాటను విని తణకాలము విచలితుఁడై పిదపఁబశ్చిమాభిముఖముగా నిలుచుండి కరుణామయుండైన భగవంతుని దనపై దయచూపుమని ప్రార్థించెను. పిదపఁ దనకాలిజోడు నక్కడవిడిచి "నీవుకదలకుండక నుండుము. మాటాడకుము. అల్లరిచేయవలదు" అని దాసికాజ్ఞ యొసఁగి నిశ్శబ్దముగా నాగృహమునఁ బ్రవేశించి చూచెను. సాతాద్యమునివలె భయంకరమైన కాలసర్పమయేషా వీపునను వక్షస్థలవామపార్శ్వమునను జేరి సుఖముగా విశ్రమించియుండెను. ఆయేషాకాలుసేతులు కదపినను, లేక, యేదేనొకవైపున కొత్తిగిలఁబ్రయత్నించినను, మృత్యుస్వరూపమైన యాసర్పము తనపడగనువిప్పి యామెసుకుమార శరీరమును గఱచివేయును ఎంతటిభయానకమైన యాపద!

అప్పుడస్మాన్ ఖాను స్థిరబుద్ధిగలవాఁడయ్యెను "సర్పదంశనముచే నయేషా జీవనము తుదముట్టిపోవును. విషజ్వాలచే భువన రత్నము మహా ప్రస్థానమును జేరిపోఁగలదు. అస్మాన్ ఖాను నిశ్చేష్టుఁడై నిలుచుండి మిడుతు మిడుతుమని చూచుచుండెను. అల్లెన్నఁడును సంభవింపదు — అదియసంభవము — అంతటియస్వాభావికమైన యపమృత్యువుచే నయేషాజీవనము పరిసమాప్తమగుటయే విధాతయభిమతమైనచో నంతకుఁబూర్వమే యస్మానునిప్రాణములు బరలోకమునుమును జేరియుండవలయును. తరువాత జరుగవలసినదేదియో జరుగును గాక !" అని స్థిరముచేసికొని మిగులజాగరూకతతో దెప్పవేయునంతలోఁ గాలోపమమైన యాసర్పముయొక్క వాలమునుబట్టుకొని యీవలకువచ్చెను. ఆక్షణముననే యాకాలసర్పము విద్యుచ్ఛక్తి వేగముతో విచలితమై పడగనువిప్పి వెనుకకుఁ దిరిగెను. అస్మాను తనహస్తమును కొంచెముదూరముగాఁ బెట్టెను సర్ప మస్మానును గఱచుటకై తలయెత్తి బుస్సురుని భయంకరధ్వనులను జేయుచు సూదులవలెనున్న తన రెండు నాలుకలను మాటిమాటికీవలకుఁ జూపుచుండెను. అదియయేషానువీడి కొంచెముదూర మీవలకు వచ్చుటనుజూచి యస్మానుఖాను సుశిక్షితుఁడైన పాములవానివలెఁ గౌశలముతోఁ గఱచుటకు వీలులేనంతట దూర

ములో నిలుచుండి చేయినెత్తుచుఁ బామునుమరికొంతదూరము తీసికొని వచ్చి మిగులనైపుణ్యమునఁ గుడిచేతితో దానితలను బలముగానదిమి పట్టుకొనియెను. ఈమాటను జెప్పుటకుఁ బట్టినకాలములో నూఱవవంతు కాలములోపలనే యీపనియంతయు జరిగిపోయెను తోడనే యాసర్ప మాతని దక్షిణహస్తమును బలముగాఁ జుట్టుకొనియెను. చేతిమణికట్టు మొదలు కంఠమువఱకును జుట్టుకొనియెను.

అస్మాన్ ఖానా యవస్థయందే యచ్చటనే మోకాళ్లునేలపై నాని కూర్చుండి పామచుట్టుకొనిన కుడిచేతితో నెడమచేయినిజేర్చి రెండుచేతులును బైకెత్తి "దేవాదిదేవా! నీమహిమను సంపూర్ణముగాఁ దెలిసికొనినవారెవరు? నీవు నావంటి యల్పప్రాణిమూలమునఁ బ్రపంచము నందంతటను సర్వశ్రేష్ఠమైన జీవనసారరత్నము యొక్క ప్రాణరక్షణమును జేసితివి. అది నీయపారకృపాకటాక్షము కాదా!" అని స్తోత్రము చేసెను.

సర్పముచుట్టుకొని యున్నచేయి మిగులనొప్పి యెత్తుచుండెను. అస్మన్ ఖాను మెల్లమెల్లగ నిశ్శబ్దముగ గృహమునుండి యీవలకు వచ్చెను.

మార్గముకడ నిలుచుండియున్నదాసి భయానకమైన యాకార్యములనన్నిఁటిని బ్రత్యక్షముగాఁజూచి భయముచే నడలుచు నటనిలువఁబడి "మహాప్రభూ! మీరుధన్యులు. ఇప్పుడేమియుపాయము? పామును జేతినుండి తీసివేయుటయెట్లు?" అనియెను.

"దీనిని జేతినుండి విడిపింపశక్యముకాదు. దీనిని ఖండఖండములుగ ఖండించినఁగాని పట్టువిడువదు."

"కుడిచేతికిఁ గట్టినట్లున్నది. దానిని ఖండించి తీసి వేయుట యెట్లు?"

"ఎడమచేతితోఁ గత్తినిపట్టుకొని ఖండింపఁగలను—ఇతరులసాహాయ్య మక్కఱలేదు. మఱియెవరును రాఁగూడదు. బీగము చూచినచోఁ జాలనలజడి పొందును. ఎవరును జూడకుండ నాకొకకత్తిని దీసికొనివచ్చి యిచ్చెదవా? మిక్కిలి శీఘ్రముగా రావలయును. త్వరగాఁ బొమ్ము."

దాసియు "చిత్తము" అని వెడలిపోయెను. సర్పము గట్టిగాజుట్టు చుండుటచే నాతనికి యాతన మిక్కిలి హెచ్చుయ్యెను.

దాసి కత్తిని తీసికొనివచ్చెను. అస్మానుఖానామెతో "నీవీపా మును జూచుచుండవలసిన పనిలేదు. నవాబునందినియొద్దకుఁ బొమ్ము. ఆమె మేలుకొన్నను నీసంగతి నామెకుఁ దెలియనీయకుము" అనియెను

"చిత్తము. నేను సన్నిధానమునం దుండనక్కఱలేదా? నా వలనఁ గావలసినపని యేమియును లేదా"

'నీవలనఁ గావలసినకార్య మేమియును లేదనియే తోఁచుచున్నది. కావలసినచోఁ బిలిచెదను. నీవు నవాబునందినియొద్దకుఁ బొమ్ము ఆమె కింతలో మెలకువ రాదు. వచ్చిన నామె కీసమాచారము తెలియఁ గూడదు"

దాసి లోపలకుఁ బోయెను. కాని, యస్మానుఖానునిహస్తము నుండి యానాగపాశ మెట్లువీడిపోవునో చూడవలయునను కౌతూహల ము నామె యడంచుకొనలేక ద్వారము లోపలిప్రక్క నిలుచుండి యస్మానుఖాను చేయుకార్యముల నన్నిఁటిని జూచుచుండెను.

అస్మానుఖాను మిగులనేర్పుతో నెడమచేతఁ గత్తినిధరించి సర్ప దేహమును ఖండింపఁదొడంగెను. అది యతిభయంకరమైన లోమహ ర్షణకార్యమైయుండెను ఆవిషయమునుగూర్చి విస్తారముగా వర్ణనము సేయుట ప్రస్తుతమున కావశ్యకము కాదు. సర్పశరీర మనేకస్థలముల యందు నఱకఁబడియెను. కాని ఖండింపఁబడిన యేభాగమును సంపూ ర్ణముగా విచ్ఛిన్నమై విడిపోలేదు. ఆచరియ సూక్ష్మాగ్రభాగ మంగీని ఛేదించికొని తనశరీరముపై గాయముచేయు ననుభయముచే సర్పశరీ రము ముక్కలుముక్కలుగా విడిపోవునట్లు తుదవఱకును ఖండింపలేదు. సర్పరక్తముచే నాతనిదుస్తులయం దచ్చటచ్చట రక్తమయ్యెను. ఖండ ఖండములుగా ఖండింపఁబడిన యాసర్పశరీరము పరస్పరసంలగ్నమైన యోగమాలికవలె వ్రేలాడుచుండెను. అయినను నరకఁబడిన ప్రతిఖండ మును భయంకరముగఁ గదలుచుండెను. దానినిచూచి యస్మాన్ ఖాను లేచినిలుచుండెను. సర్పశరీరము వ్రేలాడుచు నేలను దాకుచుం డెను. దాని దేహమంతయు ముక్కముక్కలుగ నరకఁబడియెను. నోటి

యొక్క స్వల్పదూరము నరకఁబడలేదు. పిదప రెండుచేతులతోను సర్పమునెత్తి యధికబలముతో దూరమందున్న యొకస్థలమునకు విసరిపారవైచెను. ఆస్థలమునందుఁ బడిన యాపాము మొండెము పటపటకొట్టుకొనుచు మాటిమాటికి నోటిని దెరచుచుండెను. ఆసర్పరాజముయొక్క దుర్దశ నస్మాన్ ఖాను ప్రత్యక్షముగాఁ జూచి దానినిగూర్చి యిప్పుడు చేయవలసినదేమియులేదని యోచించి యాతఁడు చేతులను గాళ్లను గడుగుకొనుటకై సరోవరాభిముఖుఁడై వెడలిపోయెను.

పండ్రెండవ ప్రకరణము.

నవాబునందినియగు నయేషాకు నిద్రాభంగమయ్యెను. దాసి యెదురుగఁబోయి నిలుచుండి వందనముచేసెను. అయేషాయభిప్రాయానుసారముగ దాసి యామెదుస్తులను సవరించి పిదప గులాబియత్తరుచే సిక్తమైన యొకవస్త్రమును దీసికొనివచ్చెను. అయేషా యాకరవస్త్రముచే మొగమునుదుడిచికొని దాసితో "మోతీ! నీవిక్కడ నెంతసేపటినుండియున్నావు?" అనియెను.

మోతి—అమ్మా! మీరిక్కడకు వచ్చినప్పటినుండియు నే నిచ్చటనే యున్నదానను.

అ—ఇప్పుడు నేనొకకలఁగంటిని; ఎవఁడో యొకఁడు నన్నుముట్టుకొనినట్లును ఆతని దేహ మత్యంతశీతలమై యున్నట్లును గనఁబడినది' నీవు నాదేహముపైఁ జేయి వైచితివా?

మో—అమ్మా! లేదు.

అ—ఇక్కడకు మఱెవ్వరైనవచ్చిరా!

మో—ఔను! హుజూర్ వచ్చినారు.

అ—వచ్చినవారెవరు?

మో—నవాబుసాహెబు.

అయేషా కుపితఫణివలె ఫూత్కారముసేయుచు "ఏనవాబుసాహెబువచ్చినాఁడు? నేను నిద్రఁబోవుచున్నదానను. నాదుస్తులు సడలి శరీరమును సరిగాఁగప్పియుండలేదు. నేనాస్థితియం దున్నప్పుడు

వా రెందులకువచ్చినారు ? ఇప్పుడాయన యెక్కడనున్నాఁడు ?'' అని యడిగెను. మోతీ భయముతో "సంగతులనన్నింటిని విన్నవింపకూడ దని నాకాజ్ఞయైనది. అమ్మా! ఆయన యిప్పుడు వసారాలో నుండ వచ్చును.'' అనియెను.

అయేషా లేచినిలుచుండెను క్రోధహేతువుచేఁ బాష్పములచే పఁపఁబడిన యామె కంఠము మిగులసుందరముగఁ గన్పట్టుచుండెను. అతి విస్తృతములైన యామెనేత్రములు నిద్రాభంగము వలనను, క్రోధము వలనను కొంచెమెఱ్ఱబడియుండెను. అనతిదీర్ఘమైన యామెశరీరము కొంచెము చంచలమైనట్లు కన్పట్టుచుండెను రాజరాజమోహిని కెంతయు పూర్వరూపకాంతియున్నది! ఆమె "విషయములనన్నింటిని విశదముగా జెప్పకుండ నిషేధమున్నదా ? అయిన నాతఁడితర సామాన్యులవలెఁ జెడుగుచేయవలయునను నభిప్రాయముతోఁ నిద్రబోవుచున్న సమయమున నాగదిలోనికిఁ బ్రవేశించెనా ? ప్రవేశించి యజ్ఞానావస్థలోనున్న నన్ను కౌఁగిలించుకొనియెనా ? రమ్ము నడువుము. ఆతఁడెక్కడనున్నాఁడో, నాకుఁ జూపుము'' అనియెను.

కుపితయు, నభిమానినియు నైనయయేషా యాగదినుండి బయలువెడలెను; మోతియు నామెవెనుకనే వచ్చుచుండెను. వసారాయందస్మానుఖాను లేఁడు అయేషా "మోతీ! నవాబిచ్చటలేఁడు. ఎచ్చటనున్నాఁడో చూపుము" అనియెను.

మోతియుఁ గొంచెముదూరము ముఁదునకుఁబోయి చూచెను. అస్మానుఖాను కాలుచేతులను గడుగుకొనివచ్చి సరోవరతీరప్రదేశమునందుఁ గూర్చుండియుండెను. మోతి చూచివచ్చి "అమ్మా! ఆయన సరోవరతీరమునందున్నారు.'' అనియెను.

అయేషా యచ్చటకుఁబోయెను. మోతి యప్పుడొకవిషమ వ్యాపారము సంఘటింపనున్నదనియుఁ దానాసమయమున సమక్షమునందుండు టనుచితమనియుఁ దలంచి ముందునకేగక యచ్చటనే నిల్చుండియుండెను.

అస్మానుఖా నయేషాయలంకారశింజితధ్వనులను దూరమునుండి విని లేచినిలుచుండెను. నవాబునందిని మరింతసమీపమునకు వచ్చు

టనుజూచి యస్మాన్ఖాను తనహృదయమున "నేనిప్పు డేమిమాటాడ వలయును?" అని యోచించుకొనుచుండెను. కాని, యాతఁ డేమాట యు మాటలాడవలసిన యావశ్యకముయే లేకపోయెను. అయేషా మిగుల సమీపమునకువచ్చి క్రోధకంపితమగు నుత్తేజితస్వరముతో "నవాబ్ సాహేబ్ ! మీకిది యుచితమేనా? నేను నిద్రితను; శిథిల వసనను; ఒంటరిగనున్నదానను నేనాయవస్థయందున్నప్పుడు మీరు నాగదిలోపల కెందులకుఁ బ్రవేశింపవలసివచ్చినది? మీరు పూజ్యుల నియు మహాపురుషులనియు హీనకార్యములయందుఁ బ్రవేసింపరనియుఁ జాలకాలమునుండి నమ్మియున్నదానను ఇప్పుడు మీ రేకారణముచే నాయనుమతి లేనిదే నేనునిద్రించుచున్నప్పుడు నాగదియందుఁ బ్రవే శించినీచవృత్తి కొడంబడితిరి"' అనియెను.

అస్మా—(అధోవదనుఁడై ధీరస్వరముతో) నేను నాబుద్ధిపూర్వక ముగ లోపలకు రాలేదు. ఒకగొప్పయుపాయము సంభవింపనైయుండు టచే లోపలఁ బ్రవేశింపవలసివచ్చినది.

అ—(పూర్వమువలెనే క్రోధవివశయై) మీ కది యుత్తమకార్య మేనా? ఎంతటియుపాయము సంభవించినను నంతఃపురమునందు నిద్రిత యైనస్త్రీయున్నగృహములోని కొంటరిగఁ బ్రవేశించుటకు మీ కధికార ములేదు. ప్రవేశించి యంతటితోడనే నీవు తృప్తుఁడవుకాలేదు. నీవు నాశరీరమును దాకితివి. ఛీ! ఛీ! నీవొనరించినకార్యము నిందితమైనది.

అస్మా—అయేషా ! నీవు నన్నకారణముగ నసంగతముగఁ దిర స్కరించుచున్నావు. నీవు నుడివినట్టియకార్యముల నొనర్చుట కస్మానుఖా నెప్పుడును సమర్థుఁడై యుండలేదు. ఆతఁ డట్టినీచమానవుఁడుకాఁడు.

అ—మరల నట్టియసత్యములను నుడువుటకు నీకుసిగ్గువొడము చుండుటలేదా? నీవిప్పుడు నవాబుగానున్నాఁడవు. అంతఃపురమునందు నీకుఁ బూర్ణాధికారమున్నది. అయినను బురస్త్రీలపై నీవిట్టియత్యాచార ములను నడపుటకుఁ బూనికొనినచో నస్మాన్ఖాన్ ! నీపాపకార్యము లచే నీరాజ్యసంపదలన్నియు రసాతలమునకంట నడుగంటిపోవునని నిశ్చ యముగాఁ దెలిసికొనుము.

అస్మా—(అవనతశిరస్కుఁడై) అయేషా! నీవు నన్ను నిష్కారణముగ నిందించుచు దారుణవ్యథపాలు సేయుచున్నావు నీవు నిద్రితవై యసావధానస్థితియందుంటివని తెలిసికొని లోపలకురాకుండ నీవలనే యుంటిని. ఈవిషయము ద్వారముకడనున్నదాసి పూర్ణముగ నెఱుంగును. కాని నీవొకగొప్పయపాయమునకు గుఱియైయున్నావని యెఱింగి గత్యంతరములేకపోవుటచే లోపలకురావలసివచ్చినది. అప్పుడు నీశరీరమును స్పృశించితిననుమాట యసత్యము. నిన్ను బాగుగాఁజూచుటకైనను నవకాశములేదు. నీతిరస్కారము నాహృదయముబట్టి వేధించుచున్నది. అయినను నేనేయపాయమునిమిత్తముగా నీవున్నమందిరములోపలికిఁ బ్రవేశింపవలసివచ్చెనో దానినెప్పటికిని దెలుపఁబోను. నీదాసికావిషయము తెలియును. కాని దానిని నీకుఁ దెలుపవలదని తీవ్రముగ నాజ్ఞాపించితిని అయేషా! నేను నీచకార్యములయందుఁ బ్రవేశించితినని నిందించి నీవు నాహృదయమున కత్యంతతాపమును గలుగఁజేసితివి. జగదీశ్వరుఁడు నీకుమంగళమొనగూర్చుఁగాతమని ప్రార్థించుచున్నాఁడను. కాని నీనిష్ఠురవాక్యములవలనను నాయందునీవగపఱచిన యవిశ్వాసమువలనను నాహృదయగ్రంథి విచ్ఛిన్నమైపోవుచున్నది. సమాధిస్థలమందలి మన్నుతోఁగూడ మన్నైపోవువఱకును నాహృదయజ్వాల యెన్నఁడును నాశనముకలుగదని తోఁచుచున్నది.

అస్మానుఖా నొక్కనిట్టూర్పునువిడిచి ముఖమును మఱియొకవైపునకుఁ ద్రిప్పుకొనియెను.

అ - అస్మాన్! నామాటలచే నీవు హృదయవ్యథననుభవించుచున్నావని నేనెఱుంగుదును. కాని యీదినమునందలి నీప్రవర్తనమూలమున నాహృదయము మిగులదుఃఖమునొందుచున్నది. నీవు చెప్పఁగూడదని నిషేధించినరహస్యమును జెప్పకపోయినచోఁ జాలకాలము నీవు బాధపడుచుండుటయేగాక నిర్మలచరిత్రముగల నీవంటిమహాపురుషుని నవిశ్వాసియని తలంచుచుండుటచే యావజ్జీవమును యాతన ననుభవించుచుండుటకుఁ గారణమగును అస్మాన్! నీవు నామందిరములోఁ బ్రవేశించుటకుఁ గారణమేమో యెఱింగించుట త్యావశ్యకము.

అస్మానుఖా నవనతశిరస్కుఁడై చాలసేపు యోచించి పిదప "అయేషా! నాజీవముమున్నంతవఱకుఁ దెలుపఁగూడదని నిశ్చయముచేసి కొనిన విషయము నిష్టములేకపోయినను నీబలవంతముచేఁ జెప్పవలసి వచ్చుచున్నది. ఇఁక నేమిసేయుదును! నాతోరమ్ము" అనియెను.

అస్మానుఖాను ముందునడచిపోవుచుండెను. అయేషా యాతని వెన్నంటి పోవుచుండెను. ఇరువురును ఖండఖండములుగఁ దెగిపడి యున్న సర్పశరీరముకడకుఁ బోయి నిలుచుండిరి అస్మానుఖాను అయే షా! అదేమియో చూడుము" అనియెను

అయేషాచూచివడఁకుచు "అదియొక భయంకరకాలసర్పము. దానినిపట్టుకొని యారీతిగ ఖండించినవారెవరు? దానితల యిప్పుడును గదలుచున్నది. ఎంతభయంకరముగానున్నది?" అనియెను.

అస్మాన్—నీవస్వస్థతగానున్నావని నీతల్లివలన నెఱింగి నిన్నుఁ జూచుటకును నీతోఁ గొన్నియితరవిషయములనుగూర్చి యాలోచించు టకును నిచ్చటకు వచ్చితిని. లోపలకుఁ బ్రవేశించినతోడనే యొంటరిగ నిద్రించుచున్న నీవు నాకన్నులఁబడితివి. అనిమిషముననే నేనీవలకుఁ దిరిగివచ్చితిని. నీశరీరముపై నాసర్పము పండుకొనియుండెను. నేను బాగుగా దృష్టించి చూడకపోవుటచే నదిసర్పమో మఱియేదైన పదా ర్థమో తెలిసినదికాదు. తోడనే నీదాసినిపిలుచుకొనివచ్చుటకై వచ్చి యామెను లోపలకుఁబంపితిని. ఆమె లోపలకుఁబోయి చూచివచ్చి సర్పమేయని చెప్పినది. ఆమాటవినుటతోడనే నాకుయుక్తాయుక్త విచ క్షతాజ్ఞానము నశించిపోయినది. నీవేమాత్రి మజాగ్రతవహించినను సర్పదష్టవగుదువనెడివిచారముచే నేను స్వతంత్రుఁడనైపోయితిని. గత్యంత రములేకపోవుటచే లోపలఁబ్రవేశింపవలసివచ్చినది. అట్లుప్రవేశించి దానినిబట్టుకొని యిట్లు ఖండఖండములుగాఁ జేసితిని. నీప్రాణముసంర క్షణముసేయుటలో నాప్రాణమును పోఁగొట్టుకొనుటయనునది యొక యల్పవిషయమగుటచే దానిని నీకుఁ దెలుపుటకు నేనిష్టపడనైతిని. కాని యవిశ్వాసరూపమైన నీతీక్ష్ణవిషజ్వాలల కాఁగలేక యావద్వృత్తాంత మును దెలుపవలసివచ్చినది. అయేషా! నిన్ను నిజముగాఁ బ్రేమించు చున్నవాఁడెప్పుడు నితరసామాన్యమానవులవంటివాఁడు కాఁజాలఁడు

అయేషా యీవాక్యములను వినినతోడనే యాకాశమువంక దృష్టినిగుడ్చి చేతులనుముకుళించుకొని కాతరస్వరముతో "ఓపరమేశ్వరా ! నీదయ లేదు. నీవిప్పుడత్యమూల్యమైన యస్మానుఖానుని ప్రాణమును భయంకరాపదనుండి రక్షణమొనర్చుట నిజముగా నాయదృష్టము" అని భగవంతునిస్తుతించి పిదప సజలనయనయై యస్మానుఖానునికడకువచ్చి యాతనిహస్తమునుబట్టుకొని "అస్మాన్ ఈసామాన్యస్త్రీనిమిత్తము లోకమున కమూల్యమైన నీజీవనమును మహాపదలలోఁ ద్రోయుటయేమి? నీవు చాల నన్యాయకార్యమును జేసితివి సర్వము నాశరీరమును జుట్టుకొనియెనని నాకిప్పుడు తెలిసినది నిద్రావేశముచే నింతవఱకును నెవఁడో మనుష్యుఁడు నాశరీరమును స్పృశించెనని యనుకొనుచుంటిని అస్మాన్ ! నీవు నాపైఁ జిరకాలమునుండియు ననుగ్రహమును జూపుచున్నాఁడవు. ఆకరుణకుఁ బరిమితి లేదు అజ్ఞానముచే నిన్ను నేననేకవిధముల దూషించితిని. అన్నా ! దయయుంచి నాయపరాధములను క్షమింపవా ?" అని వేఁడుకొనియెను.

అయేషా యిట్లుచెప్పుచు నశ్రుపూర్ణనయనయై యస్మానునిపాదములపైఁ బడియెను అస్మానుఖా నత్యాదరభావముతోఁ జేయూతయిచ్చి యామెను లేవఁదీసెను.

అ—నిన్ను క్షమించుటయా! నీవాడిన యానిష్ఠురవాక్యములు నాకర్ణములయం దమృతమువలె సోకుచుండ నీతిరస్కారమునుగూర్చి నేనాగ్రహించుటెట్లు? అందుచే క్షమించుటనుగూర్చి చెప్పకుము. కాని నీవుభ్రాంతిఁజెంది యవిశ్వాసిననియుఁ జరిత్రహీనుఁడననియు, నీచస్వభావుఁడననియుఁ దలపోయఁజొచ్చితివి. ఆకారణముచే నేనిట్లు ముక్తకంఠుఁడనై ప్రతిఘటించి మాటలాడవలసివచ్చినది.

అయేషా మాటలాడకుండ నధోవదనయై నిలుచుండియుండెను. అస్మానుఖాను చెప్పనారంభించెను. "నీవొకదినమున—అయేషా !—జ్ఞప్తియందున్నదా—వంగదేశమునందలి మనస్కంధావారకారాగారమునందున్న జగత్సింహునియెడల నీహృదయమున నెలకొనియున్న ప్రబలప్రేమసంబంధమైన వాక్యములను ఘంటాపథముగ నుద్ఘోషించియున్నావు—జ్ఞప్తియందున్నదా ?—నీయానిశితశరసన్నిభ వాక్యము

లను మాఱుమాటాడకుండ విని సహించుకొనియుంటిని. ఇప్పుడును నీరవుఁడనై సహించుకొనియున్నాను. అయేషా! ఇప్పుడు నీవాడిన నిష్ఠురవాక్యములకు నోరువిప్పి ప్రత్యుత్తరమొసంగుటవలనఁ బ్రణయ విషయము ప్రకటితమైనది. దానిని విని నీవు నన్ను మిగులనసహ్యముగా నైనఁజూడుము! నాజీవితమరణములును సుఖదుఃఖములును నీచేతిలో నున్నవి.

అయేషా నీరవయు నధోముఖియునై యుండెను. అస్మాను చెప్పఁ దొడంగెను. "అయేషా! వినుము. నేను అత్యాచారిని, అవిశ్వాసిని, కలుషితస్వభావుఁడను—అయినచో నీయాతిరస్కార నిష్ఠురవాక్యము లను వినినప్పుడు నిరుత్తరుఁడనై యుండను. మిషచేనైన నేమి, బలముచే నైననేమి,— ఎప్పుడో యొకదినమున నిన్ను నాభోగపదార్థమునుగాఁ జేసి కొనియుందును. తండ్రియు నిన్ను నాకిచ్చి వివాహముసేయవలయునని యభిలాషపడుచుండెడివాఁడు నీజననియు నీకును నాకును పరిణయము కానందులకై దుఃఖితయగుచున్నది. అందుచే నిన్ను నేను బలాత్కార ముగఁ బరిణయమాడినను నన్నెవ్వరును నిందింపరు. అయిన నామార్గ ము నవలంబించుటకు నాకెన్నఁడును నిష్టముకలుగ లేదేమి? నేను నిన్ను మిగులఁ బ్రేమించుచున్నాఁడను. అంతటిప్రేమమును గలిగియుం డుటచేతనే నీయిష్టమునకు విరోధముగాఁ బ్రవర్తింపఁజాలకున్నాఁడను. నీచిత్తము ప్రసన్నముకాకపోయినచో నిన్ను నాజాయగాఁ జేసికొను టకు నాకు సాధ్యముకాదు.

అ—(అస్ఫుటస్వరముతో) నీవు చిరకాలమునుండియు నాపై నను గ్రహమును జూపుచున్నాఁడవు.

అస్మాన్—నేను చెప్పవలసినదింకను సంపూర్ణముకాలేదు— వినుచుండుము—ప్రత్యుత్తర మొసంగవలసిన యావశ్యకము లేదు. నేనిప్పుడు నవాబును. అంతఃపురమునందు నాయాజ్ఞనిరంకుశమైనది నా మాట కెదురులేదు. నీదేహముమాత్రమే నాకావశ్యకమైనచో— అయేషా! నేను చోరునివలె సమయమునుగనిపెట్టి నీశరీరసంస్పర్శనము సేయుటేల? ఇచ్ఛామాత్రమున నెల్లరుఁజూచుచుండ నిష్టమున్నట్లు వ్యవహరించుచు బలాత్కారముగా నీతోఁ గ్రీడింపఁగలను. నేను

భ్రమపడిన్మైన నట్టివిషయమ్మైనయోచనలు చేయుటలేదేమి? ప్రేమ యున్నతావున నత్యాచారము సంభవించునా? హృదయవిహీనమైన నీదేహముతోఁ బ్రణయవిహీనమ్మైన సుఖమునందాసక్తిలేకుండఁ బ్రవ ర్తించుటకు నాకిష్టములేదు. నాప్రణయము గంభీరమ్మైనది—ప్రగాఢ మ్మైనది—మరియు ననంతమయినది.

అ—నీవు దైవస్వభావుఁడవు. దాని నితరులు తెలిసికొనిన తెలిసి కొందురుగాక! తెలిసికొనకపోయిన పోనిమ్ము. నేను నీస్వభావమును బాగుగా నెఱుంగుదును. దానిని బాగుగానెఱిఁగియుండియు నందులకు వ్యతిరిక్తముగా నిష్ఠురములాడి యందులకు ప్రతిఫలముగ మర్మాంతిక వ్యథ ననుభవించుచున్న దానను.

అస్మాన్—నేను చెప్పఁదలఁచినదింకను గలదు. నాజనకున కనేక పట్టమహిషులు కలరు. ఇంతేగాక యుపపత్నులనేకు లుండియున్నారు. నవాబుషాదుమహాకదిగౌరవమునకే కారణమ్మైనది. కాని నిందనీయము గా లేదు నాకు వివాహయోగ్యమ్మైనవయస్సు మిఱిమీరిపోయినది. అయి నను నేనింకను వివాహబంధముచే బద్ధుఁడనుగాలేదేమి? నిన్నుఁ బొం దవలయుననెడియాశచేతనే. యస్మాక్ఖానింకను వివాహితుఁడుగాలేదు. నిన్ను పొందఁజాలకపోయినచో నాయదృష్టమునందు చిరబ్రహ్మచర్యమే బ్రహ్మవిధించినట్లు తోఁచుచున్నది. ఈమహాప్రపంచమున నత్యంత సౌందర్యవతులగు స్త్రీలులేకపోలేదు. గుణవతులగుయువతులకును నభా వముతటస్థింపలేదు. కాని, అయేషా! మఱియేమహిళ్యైనను నాపట్ట మహిషిగానోపుననుమాట యప్రస్తుత ప్రశంస మఱియేవనితను గన్నె త్తిచూచుటకు నాకిష్టములేదు నీరూపమునుజూచిచూచి నాకన్నులు తనివొందనేరకున్నవి. నీగుణపానముచేఁ జిత్రప్రతిమాకారుఁడనై పోయి తిని. నీపైనున్నవలపుచే మోహాంధుఁడనైపోయితిని.

అయేషా కన్నులనుండి ముక్తాఫలసదృశములైన యశ్రువులు జల జల రాలిపడి నేలపైఁబ్రవహింపఁదొడంగెను. అస్మాన్ఖాను చెప్పఁ దొడంగెను. "ఇంకనువినుము. అయేషా! నాసోదరుఁడు విలాససాగర మున దోఁగితేలుచున్నాఁడు. తారకావేష్టితచంద్రునివలె సౌందర్యచాతు ర్యవిలాసినులనడుమఁగూర్చుండి కాలముగడపుచున్నాఁడు. అతని భోగ

లాలసానలమున సురమొదలగునవి ఘృతమువలె నాహుతియగుచున్నవి రాజకీయవ్యాపారమునం దాతని యనిష్టభావము ప్రకటితమగుచున్నది. అయిన నాతని కేకళంకమును లేదు. నీనిష్కలప్రేమపిపాసకీజీవనమసారమగుమరుభూమిగాఁ జేయకుండ మాయున్నవలె సకలసుఖముల ననుభవించుచుఁ గాలముగడపవలయునని నాహితమునుగోరు స్నేహితులనేకులుబోధించుచున్నారు. అదెంతటి దురాలోచన! ఎవ డునిన్ను చూచుచుండునో యెవనిహృదయమున నీమాధురీరూప మంకితమైయొప్పుచుండునో—విధాత శుభసమయమున నసాధారణసృష్టియందు నిన్ను సృష్టించెనని యెవఁడు తెలిసికొనునో పుణ్యమయమై సర్వగుణాధారమైన నీమూర్తి యెవనిహృదయమున ననుపమేయముగఁ బ్రతిష్ఠింపఁబడియుండునో—అట్టియాతఁడు పాపకార్యములను జేయసాహసించునా? అట్టియాతఁడు నీచసంసర్గమునందును, నసహ్యాభోగవిలాసములయందును మునిఁగి నిన్ను మఱచిపోవయత్నించునా?

అయేషా నీరవయు, నధోముఖయునై యుండెను. ఆమెనేత్రములనుండిఁ బడుచున్నకన్నీరింకను నేలపైఁ బ్రవహించుచునేయుండెను. అస్మాన్‌ఖాను మోకాలూని యయేషాసముఖమునఁ గూర్చుండియుండెను. ఒకప్రక్క ప్రాణరహితమై భయంకరముగాఁ గాన్పించుచు ఖండఖండములుగాఁ బడియున్న సర్పకళేబరముండెను. వేఱొకప్రక్క నారీకులరాజ్ఞియు, సుందరశిరోమణియు నైన యయేషా నిలుచుండియుండెను. నడుమ నత్యంతశోభామయమగు విశాలవక్షముతో వీరశ్రేష్ఠుఁడైన యస్మానుఖా నంజలిబద్ధుఁడై యిట్లని చెప్పఁదొడంగెను, “అయేషా! ప్రాణేశ్వరీ నా హృదయదేవతా! నా జీవనమును దగ్ధముసేయుట నీకుచితమేనా? చిరకాలమునుండి నన్నిట్లు వ్యథలనొందించుచుండుట నీకు ధర్మమేనా? సుందరీ! ఇహసంసారమునఁ బ్రేమకుఁ బురస్కారములేదా? ప్రతిదానములేదా? జీవనసర్వస్వదానమునకు విలువలేదా?

అయేషా యప్పు డతిసమాదరభావముతో నస్మానుని హస్తములనుబట్టుకొని యిట్లనియెను. “అస్మాన్! నీప్రేమ నిరుపమానమైనది. ఇహసంసారమునం దేయువతి నీప్రేమము ననుభవించునో యామెధన్య.

ఈజగత్తునందుఁ బ్రేమకుఁ బురస్కారమేయున్నచో నీకది ప్రాప్యముగా గలదు. నీవు దేవతాస్వరూపుఁడవు నేనంటినో? ఒకసామాన్యవనితను, అమూల్యమైన నీప్రేమమును నాపైనుంచుట యపాత్రదానమగును."

ఇట్లుచెప్పి యయేషా యూరకుండెను. అస్మానుఖాను "చెప్పుము ప్రాణేశ్వరీ! నీవాక్యములచే నాహృదయమున నమృతప్రవాహము పొంగిపొరలుచున్నది. చెప్పవలసినదానిని పూర్ణముగాఁజెప్పి మఱి ముగింపుము" అనియెను.

అ—నీకు నాయాత్మసమర్పణము గావించుటకు నాకు సాధ్యమే మైనచో నీచరణసమీపమున విక్రీతదాసినై పడియుందును. కాని, హా! అకటకటా!—నేను మరణింపలేదేమి?—అస్మాన్! నీవు నన్నాసర్పముఖమునుండి యేలరక్షించితివి?

అయేషానోటనుండి యింకముందుమాట వెడలలేదు. ఆమె యచ్చట నిలువకుండ యావలికి వెడలిపోయెను.

అస్మానుఖానచ్చటనే కూర్చుండియుండెను దీర్ఘనిశ్వాసమును విడిచి తనలోఁదాను "అదేమాట! చిరకాలమునుండియుఁ గఠోరమైన యా యొక్కటేమాట! ఆత్మహత్యచేసికొందును. రణక్షేత్రమునం దీజ్వాలలను నివృత్తిచేసికొందునుగాక!" అని యనుకొనియెను.

హతాశుఁడైన యస్మానుఖాను కాతరభావముతో నవనతమస్తకుఁడై యటనుండి వెడలిపోయెను.

పదుమూఁడవ ప్రకరణము.

మానసింహమహారాజు బహుజనపరివృతుఁడై పుణ్యతీర్థమైన పూరినగరమునకుఁ బురుషోత్తమదర్శనార్థమై యేతెంచెను. సముద్రోపకూలమున విస్తీర్ణమైన యొకవిశాలప్రదేశమున నాతని నివాసముకొఱ కనేకపటమండపములు స్థాపింపఁబడియెను. వస్త్రావాసములన్నియు ననేక వర్ణములతోఁ బ్రకాశించుచు నతిరమణీయముగాఁ గన్పట్టుచుండెను. అవియన్నియు ననర్ఘరత్నకంబళములతో నావృతములై పైభాగమున నలంకరింపఁబడిన స్వర్ణకలశములతోడను పతాకపంక్తులతోడను, సుశో

భితములై యుండెను. దాసదాసీజనము, సంగరక్షకులు, నశ్వారూఢులు, మాఘటీంద్రు, శతఘ్నిప్రయోగకులు మొదలగు ననుచరులనిమిత్తము నాల్గుప్రక్కలను వస్త్రగృహములు నిర్మింపఁబడియుండెను. పశుపాలకులకును, అశ్వము, హస్తి, ఒంటె మొదలగు పశు సముదాయమునకును యథాస్థానములయందు యథాయోగ్యములైన నివాసస్థానములు నిర్మితములై యుండెను. నానాస్థానముల యందు నానారూపములైన భాండారములును, పాకశాలలును స్థాపితములై యుండెను. మహారాజు స్కంధావారము మొత్తముమీఁద క్రోశార్ధపరిమిత భూఖండము నావరించుకొనియుండెను. వస్త్రావాసములచే నిర్మితమైన యాస్కంధావారము విన్యాసకౌశలమున సౌధములచే శోభించుచున్న యొకగొప్ప నగరమువలెఁ గన్పట్టుచుండెను.

మహారాజుతోఁగూడ ముగ్గురురాణులు వచ్చియుండిరి అందొకతె యోధపురరాజుతనయయగు నూర్మిళ. ఊర్మిళ మానసింహమహారాజునకుఁ బ్రధానమహిషి కాకపోయినను ప్రధానప్రణయభాగినియై యుండెను. మానసింహమహారాజునకుఁ జాలమంది భార్యలుకలరు. అతఁడు పాదుషాహాకార్యములకొఱకనేకసమయముల యందనేకస్థలములకుఁ బోవలసివచ్చుచుండెను. సర్వత్రభార్యల నందఱను గూడఁదీసికొనిపోవుట సంభవించుటలేదు. సంభవమేమైన నందఱను దీసికొనిపోవఁడు. అయినను నూర్మిళమాత్ర మెల్లప్పుడు నాతనితోఁగూడ నుండును. రణక్షేత్రమందుండెడి స్వల్పకాలముతక్క మిగిలినయెల్లవేళల నామె చాయవలె మానసింహుని విడువక సంచరించుచుండును. మర్యాదయందును, బదవియందును, గౌరవమునందును జగత్సింహునిజనని సర్వప్రధానమహిషియై యుండెను కాని యామె మహారాజుతోఁగూడ నెల్లతావులకుఁ బోవనిష్టపడదు. ఆమెయెడల మహారాజు ప్రణయమును జూపుటకంటె హెచ్చుగా గౌరవమునే చూపుచుండును. ఆదరించుటకంటె హెచ్చుగ భయపడుచుండును. మానసింహమహారాజు వంగదేశమునకు సుబేదారుఁడయినప్పుడు జగత్సింహునిజనని మానసింహునితో వంగదేశమునకు రాలేదు పురుషోత్తమక్షేత్రమునకుఁ మానసింహునితో గూడ వచ్చిన మఱియిద్దరుభార్యలతో మనకథకు సంబంధమేమియును లేదు.

మహారాజు శ్రీక్షేత్రమున నొకవారముదినము లుండవలయునని సంకల్పించుకొనియెను. రెండుదినములు గడచిపోయినవి. మానసింహుఁడు ప్రతిదినము నుదయమున భార్యలతోఁగూడ దేవమందిరమునకుఁ బోవుచుండెను అచ్చట స్నానము పూజమొదలగునవి పూర్తియగునప్పటికి రెండుజాములగుచుండెను. అదిమొదలుకొని యనేక సహస్రస్వర్ణముద్రలను దానముచేయుచు నాను యాత్రికులతోఁగూడ మహారాజు పటమండపములలోని కరుదెంచుచుండెను ప్రతిదినమును జగన్నాథస్వామి పూజార్చనము మంగళహారతులు మొదలగునవి మహారాజుపేరుతో సంకల్పముచేయఁబడి యత్యంతశోభాయమానముగా జరుగుచుండెను. ప్రతిదినమునను దూరదేశమునుండి వచ్చినయాత్రికులకందఱకు మహారాజుద్రవ్యముతో సమారాధనలు జరుగుచుండును. పఠానులతో జరిగిన సంధిననుసరించి పూరినగరముయొక్క యధికారము పాదుషహాహస్తగతమయ్యెను. ఒరిస్సాదేశమునందలి మిగిలినభాగమునందంతటను బఠానులు స్వతంత్రరాజులైయుండిరి ఒరిస్సాదేశమును బఠానులు జయించుటకుఁబూర్వ మాదేశమును దేవవంశపు హిందూరాజులు పరిపాలించుచుండిరి. ఇప్పుడావంశమున రామచంద్రదేవుఁడను నాతఁడుండెను. పూర్తిగ వశమైనతోడనే మానసింహమహారాజు ఒరిస్సాదేశమునకుఁ బూర్వపుభూపాలుర వంశములోనివాఁడైన రామచంద్రదేవునకు దానిపై శాసనకర్తృవ్యభారమునొసంగెను. రామచంద్రదేవరాజు మానసింహుని సుఖసౌకర్యములకుఁ గావలసినవన్నియును సమకూర్చుచుండెను. అందుచే మానసింహున కించుకంతయును బ్రవాసకష్టము గాన్పించుటలేదు. మహారాజు రామచంద్రదేవుని గుణములకు మెచ్చుకొని కృతజ్ఞుఁడైయుండెను.

నవాబు సులేమానుగాని, అస్మానుఖానుగాని వారిదేశపు టెల్లలకడ మానసింహు నెదుర్కొని యుండలేదు. అతఁడు పూరినగరమునకు వచ్చినపిదపనైన నెవరునురాలేదు మంత్రిఖాజాయిసాఖానును రాలేదు. నవాబుకుటుంబములోనివాఁడగు నొకమనుష్యుఁడువచ్చి యొకయుత్తరమునుదెచ్చి మానసింహున కిచ్చెను. ఆయుత్తరమునందిట్లువ్రాయఁబడియున్నది. “ఒరిస్సానవాబులు మహారాజసందర్శనము

చేయఁజాలమికిఁ జింతిల్లుచున్నారు. మహారాజు పూరియందున్నప్పు డస్మాన్‌ఖాను తనపనిమీఁదవచ్చి యాతనిసందర్శనము సేయఁగలఁడు. మహారాజున కేవిషయమందైన ననుకూలమయ్యేనేని యది నవాబులకుఁ దెలిసినతత్క్షణమే దానికిఁ దగినయేర్పాటులుచేయఁగలరు. "ఉత్తరమునుజూచి మానసింహుఁడు సంతుష్టచిత్తుఁడుకాలేదు. పూర్వము మానసింహుఁడు వ్రాసినయుత్తరమునుజూచి యస్మాన్‌ఖానును సంతుష్టచిత్తుఁడుకాలేదు. పైయుత్తర మస్మాన్‌ఖానుని యభిప్రాయానుసారముగ వ్రాయఁబడినది. ఖాజాయిసాఖాను కఠినరోగముచే బాధపడుచున్నాఁడనియును, నాతఁడు జీవించుట కష్టమనియు నుత్తరముతెచ్చిన వానివలన మానసింహుఁడు తెలిసికొనియెను.

పఠానులయుత్తరమును వారిప్రవర్తనమును నసంతోషజనకముగనున్నను మానసింహుఁడు పూరినగరమునఁ బరమానందముతోఁ గాలమును గడపుచుండెను. ధర్మక్షేత్రమున నివసించియున్నప్పుడు ధర్మబుద్ధిప్రభావముచే మనోమాలిన్యము చాలవఱకుఁ దగ్గిపోవును. మానసింహునకును నట్లే ప్రేమము, భక్తి, దయ, శాంతి, యనురాగాకర్షణము మొదలగునవి జనియించుటచే నాతనిచిత్తక్షేత్రము నిర్మలమై యుండెను.

పూరిక్షేత్రముననున్నప్పుడు మూఁడవనాటిప్రదోషసమయమున మానసింహుఁడు జగన్నాథస్వామి మంగళహారతిని దర్శించి బిడారమునకుఁ దిరిగివచ్చి మెల్లమెల్లగ నూర్మిళాదేవియున్న పటమందిరములోపలఁ బ్రవేశించెను. అటనొక గొప్పమండప ముండెను. చిత్రఖచితచందనకాష్ఠావరణముచేఁ బరివేష్టితమైన యామండపోపరిభాగము స్వర్ణసూత్రసమన్వితములైన విచిత్రసూక్ష్మాలంకృతములగు వస్త్రములచే నావృతమైయుండెను. నేలపైనంతటను బలకలను బరచి వానిపై నొకవైపునుండి మఱియొకవైపువఱకు నతిమనోహరమైన రత్నకంబళము వేసియుండెను. అపూర్వమైన యావస్త్రగృహమధ్యమున వెండిమంచముపై పాల నురగవలెనున్న మృదుశయ్య విరచింపఁబడి యుండెను. యథోపయుక్తస్థానములయందుఁ గుర్చీలు సోఫాలుమొదలగునవి యమర్పఁబడియుండెను. అచ్చటచ్చట నత్యుత్తమములగు స్ఫటికపాత్రముల

యందు దీపములు వెలుఁగుచుండెను. నానావిధసుగంధములచే మందిర మంతయు నలరారుచుండెను. మందిరములోపలకు జనులెవ్వరును వచ్చుటలేదు

మానసింహమహారాజా గృహములోపలఁ బ్రవేశించెను. అతని వెనుక విసనకఱ్ఱలనుచేఁబూని యిరువురుదాసీలు కూడవచ్చిరి. ఇంకొక సేవకురాలు బంగారుపాత్రముతో నీరునుదెచ్చెను. ఇంకొకతె తాంబూలపుఁబళ్లెమును జేతఁబూని వచ్చినిలుచుండియుండెను.

మహారాజు క్లాంతుడైవచ్చి శయ్యపైఁ బండుకొని "రాణియెచ్చటనున్నది?" అనియడిగెను.

దాసి — మహారాజుగారి భోజనపదార్థముల సిద్ధముచేయించుటకు వంటలక్కయొద్దకు వెళ్ళియున్నారు. ఇప్పుడేవచ్చెదరు.

మహా — తాంబూలమును నీరునిప్పుడక్కరలేదు. నీవు పోవచ్చును.

ఉదకమును దాంబూలమును దెచ్చిన వారిరువురును వెడలిపోయిరి. వ్యజనధారిణులుమాత్రమాజ్ఞానుసారముగ బాగుగవిసరుచుండిరి.

ఇంతలో మహారాజ్ఞియు లోపలకువచ్చెను. ఆమె ప్రౌఢవయస్క కాని ముప్పదిసంవత్సరములకు మించినవయసుగలదానివలెఁ గాన్పించుటలేదు. ఆమె కొంచెము పొట్టిగ నుండును. కాని; యింక గొంచెము పొడవుగనుండునేని యామెశరీర సౌందర్యమున కించుకహానిగలుగునేమోయని తోఁచుచుండును. ఆమెశరీరము స్థూలమై యుండలేదు. కాని, దేహమునం దెచ్చటను లోపముకాన్పించుటలేదు. ఆమెశరీరము నందంతటను లావణ్యమునుండి తొణుకులాడుచుండెను. పంచవింశతివర్ష ప్రాయయగు దేశీయ యువతిశరీరమునందుఁ గన్పట్టులావణ్యమువలెనే మహారాజ్ఞిశరీరలావణ్యమును సముజ్జ్వలమైకన్పట్టుచుండెను. ఆమెముఖచాయ బంగారమును ధిక్కరించుచుండును. ఆమెశరీరమునందలి రక్తముకాలుచేతుల వ్రేళులనుండి పోవునేమోయని తోపించుచుండును. నేత్రములు యువతీనేత్రములవలెనే యుజ్జ్వలములైయుండెను. లలాటమున రేఖమాత్రములేదు. కృష్ణవర్ణకేశరాశి కబరీబద్ధమైయుండెను.

భగవంతుఁడొసంగినరూపము నభివృద్ధిచేసికొనుటకై మహారాజ్ఞి కృత్రిమాయాసమును బడుచుండకపోయినను, నామె సౌందర్యమున కించుకంతయును హానికలుగ లేదు. కాని, ఊర్మిళాదేవిమాత్ర మావిషయమునందును మిగుల యత్నించుచునేయుండెను. ఆమె యాకబరియందు ముత్యాలహారమును ధరించియుండెను కబరిపైభాగమునుండి వామలలాటమునంటను వజ్రఖచితమైన భూషణము వ్రేలాడుచుండెను. కర్ణములయందు నేత్రములను మిఱుమిట్లుగొలుపు కర్ణాభరణము లుండెను. వానికిముక్తాసమన్వితములైన కుచ్చులుండెను. కంఠమున నమూల్యమైన ముత్యాలహారము—హస్తములందు నవరత్నఖచితములైన కంకణములు బాహువులయందలి మనోహరములగు బాజిబందులు. మరియు దేహముపై యథోచితయుక్తములైన భూషణములుండెను. చరణములయందు మనోహరశబ్దములనిను మంజీరములుగలవు. అతిసూక్ష్మమైన బంగారపుజరీతోఁగూడిన నిలువుటంగీవంటి పావడ నామె ధరించియుండెను. మరియు నామె ముక్తాలంకృతమైన పీతవర్ణపుఁగంచుకమును తొడిగికొనియెను. దానిపై నచ్చటచ్చట దూరదూరముగ బంగారపుపూవులు రచింపఁబడి యుండెను ఊర్మిళాదేవి హాస్యమయియుఁ బ్రసన్నవదనయును గాక పరిహాసనిపుణయుఁగూడనై యుండెను.

ఆమె తనశరీరశోభాసౌందర్యమును పరీక్షించుకొనుచు లోపలకుఁ బ్రవేశించెను. కాని యిప్పు డామెయొక్క తెరయే రాలేదు. ఆమె వెనుక పరమసుందరియైన యువతియొకర్తుకూడ వచ్చియుండెను. ఆ యువతి యవనతవదన— ధీర— మందగమన—

మహారాజ్ఞివెనుక నమ్రవదనయైయున్న యాయువతిని మానసింహుఁడు చూడలేదు.

మాన—ఒక్కనిమిష మీభువనమోహినిని జూడకుండ నుండుటకంటె నొకటిరెండుదినములు భోజనములేకుండ నుపవాసముండుట చాలమేలు.

ఊర్మిళ—ఏమహానుభావులుండుటచే నాకిదియంతయు విలాసమయముగ నగపడుచుండునో, యట్టిమీకు విందుచేయుటుచితము, ఆపనిలోనుండుటచేతనే నేనాలస్యముగ వచ్చితిని.

మాన — కాని, సుందరీ! ఏయదృష్టశాలి నీయధరసుధారస పానముచే నమరుఁడయ్యెనో యట్టివానికి నిందులోఁ బ్రయోజన మేమున్నది?

ఊ — ముసలివారైనకొలఁదిని హాస్యరసము వృద్ధియై పొంగి పొరలుచున్నది కాఁబోలును?

మాన — అందుల కొక కారణమున్నది. ఒకయేఁడు వయసు హెచ్చినకొలఁదిని చిన్నపిల్లవై యావయసునందిట్లు రసవతివై యుండు నిన్నుఁ జూచుటచే హాస్యరసము దానియంతట నదియే యుబికి పొరలు చున్నది.

మహారాజువాక్యములు క్రమక్రమముగా మేరమీరి గాఢతర ములగునని తెలిసికొని యూర్మిళ యొక్కవైపునకు జరగి నిలుచుండెను. అంతట నామెవెనుకనున్న నవీనబాలిక మహారాజుదృష్టిపథమున బడి యెను. ఆతఁడతికుతూహలభావముతో "ఈబిడ్డయెవ్వరు?" అని యడిగెను.

ఊ — ఈమె చాలకాలముక్రిందట నాకుఁ బరిచితయైయున్న నానెచ్చెలితనయ. మహారాజునకు వందనముచేయవలెనని వచ్చినది.

నవీనయు నత్యంతసంభ్రమముతోఁ జీరను సవరించుకొనివచ్చి మానసింహునిపాదముల కెఱఁగి మానసింహునిపాదధూళిని తనశిరసున ధరించుకొనియెను. ఆమెనేత్రము లించుక బాష్పావృతములయ్యెను. కాని, యాసంగతి నెవ్వరును గ్రహింపలేదు. ఆబాలికయు శిరసును బాగుగ వంచుకొని మహారాజ్ఞికడకువచ్చి నిలుచుండెను.

మాన — ఈబాలిక సాక్షాల్లక్ష్మివలెనున్నది రూపమునందును మిగుల సౌందర్యవతి నీకీమె యెక్కడదొరకినది?

ఊ — ఈబిడ్డ తల్లితోఁగూడ జగన్నాథస్వామి దర్శనమునకైవచ్చినది. ఈమధ్యాహ్నమున నా స్నేహితురాలు నన్నుఁ జూచుటకై వచ్చి చూచివెళ్ళిపోయినది. నేనీబాలికను విడిచిపుచ్చుట కంగీకరింపనైతిని. ఈమెను గొన్నిదినములు నాకడనుంచికొందునని చెప్పి యామెను బంపివేసితిని.

మాన——మంచిపని చేసితివి ఈబిడ్డ మిగులసుశీల అత్యంతకోమలస్వభావముకలది లక్షణములన్నియుఁజూడఁ జాలభాగ్యవతివలెఁ గన్పట్టుచున్నది. ఈమెకుఁ బరిణయమైనదా ?

ఊ——పరిణయమైనది. ఆవిషయమున మహారాజుసమక్షమున నేనొకయభియోగమును దేవలసియున్నది అది యిప్పుడువలదు. వేఱొక దినమున మనవిచేసెదను.

మా——నీయిష్టము వచ్చినట్లు చేయుము. ఈబిడ్డ కననుకూలన మేమియు లేకుండునట్లు తగినయేర్పాటులను గావించితివా ?

ఊ——కావించితిని.

మహారాజు శయ్యపైఁబరుండుచు "చాల నుడుకుగనున్నది. చెమట శరీరమునుండి ప్రవహించుచున్నది" అనియెను.

ఊర్మిళ వేఱొకదాసిని పిలువవలయునని యత్నించుచుండెను. ఆమంచముప్రక్క నొకవీవనపడియుండెను. బాలిక మెల్ల మెల్లగ ముందునకుఁబోయి యావీవనను గైకొని మహారాజునకు వీవఁదొడంగెను.

మహారాజు "బిడ్డా! నీ కెందులకు ? పరిచారికలు వచ్చెదరు. నీ చేయి నొప్పియెత్తును" అనియెను.

యువతి యతిమధురస్వరముతో "మీ సేవలభించుట నాకుఁ బరమసౌభాగ్యము" అనియెను.

మహారా జూర్మిళనుద్దేశించి "ఈబాలిక పేరెవ్వరు ?" అని యడిగెను.

ఊ——రాజలక్ష్మి.

మా——మిక్కిలి సొగసైనపేరు. నిశ్చయముగా నీమె రాజలక్ష్మి యే యగును. ఈలక్ష్మి యెవనియింటనుండునో యాతఁడు లక్ష్మితోఁ గూడిన రాజగుటకు సందేహములేదు.

ఇంతలో నిరువురు పరిచారికలు వచ్చిరి. మహారాజు "నీవు వీవనను విడువుము. వారు విసరెదరు నీకుఁ గష్టమెందులకు ?" అనియెను.

రాజలక్ష్మి—కష్టములేదు మీయాజ్ఞకు వ్యతిరేకముచేయరా దని నేనీపీవనను విడుచుచున్నాను.

రాజలక్ష్మి పీవననటనుంచి మెల్లమెల్లగజరగి యూర్మిళవెనుకకు వచ్చి నిలువఁబడియెను.

ఊ—భోజనము సిద్ధముసేయుమనియెదరా? రాత్రిపొద్దు పోయినది.

మా—నీయిష్టము.

రాజలక్ష్మి యూర్మిళహస్తమునుబట్టుకొని యస్ఫుటస్వరముతో "అమ్మా! ఆజ్ఞయిమ్ము, నేనుపోయి యన్నియును జక్కఁగా సిద్ధము చేసెదను" అనియెను.

ఊర్మిళయు మహారాజుముఖమును జూచుచు "మంచిది నీవు పోయి చూడుము నేనును వెంటనే వచ్చెదను" అనియెను.

రాజలక్ష్మి వెడలిపోయెను. కొంచెముసేపయినపిదప మానసింహ మహారాజూర్మిళతోఁగూడ భోజనశాలకేగెను. వారక్కడకువచ్చునప్ప టికే రాజలక్ష్మి యన్నికార్యములను జక్కఁగా సిద్ధముచేసియుంచెను. అదిచూచి మహారాజు మిగుల సంతృప్తుఁడయ్యెను.

అదిమొదలు రాజలక్ష్మి మహారాజునకుఁ దఱచుగా నుపచార ములుసేయుటయందు నిమగ్నయగుచుండెను. మహారాజంతఃపురము నకు వచ్చినతోడనే రాజలక్ష్మిచేసిన ప్రతికార్యమును సర్వాంగసుంద రమై మహారాజున కత్యంతసంతోషదాయక మగుచుండెను. అందు వలన మహారాజునకు శుశ్రూషసేయు భారమంతయు రాజలక్ష్మి మీఁదనే పడియెను మూఁడుదినములకే, రాజలక్ష్మిచేయని కార్యముల యందు మహారాజున కించుకంతయును దృష్టిలేకుండెను. ఆమె చేసిన కార్యమే యుత్తమమయినదని మహారాజు తలంచుచుండెను.

పదునాల్గవ ప్రకరణము.

విజ్ఞాననిధియు వృద్ధుడునైన పఠానుల మంత్రి ఖాజాయిసాఖాను కాలదేవత కాహారమైపోయెను. సామాన్యమైన జ్వరమువచ్చి తన్మూలమున నుదరామయవ్యాధిపీడితుఁడైన యాతని జీవిత మంతలో నంతమై పోయెను. నవాబులగు సులేమానస్మాన్‌ఖాను లిద్దరును ఖాజాయి సాఖానునెడల భక్తిశ్రద్ధలనే గలిగియుండెడివారు. వారిరువురును మంత్రి సమాధికార్యముల నత్యంతశ్రద్ధతో నెరవేర్చిరి. ఆతనికి బదులుగ మంత్రిపదవియందు ఖిజర్‌ఖానును నియమించిరి. ఖిజర్‌ఖాను సాహసికుఁడు. యుద్ధప్రియుఁడు ఆతఁడు నవాబు అస్మాన్‌ఖానున కత్యంతము ప్రీతిపాత్రుఁడై యుండెను ఈ నూతనామాత్యునకు నలువదియారు వర్షములకంటె నెక్కుడువయసులేదు. అస్మాన్‌ఖాను, నీతఁడు ననేక విషయములలో నేకాభిప్రాయులగుచుండిరి అందుచేతనే యస్మాన్‌ఖానీతనిని మంత్రిపదవియందు నియోగించెను

సులేమానును, అస్మానును వేఱువేఱు స్వభావములు కలవారని మొట్టమొదట చెప్పియున్నాము మంత్రి ఖాజాయిసాఖాను లోకాంతరగతుఁడైనపిదప నవాబు లిరువురును జేరి యాలోచించి యికముందు రాజకార్యములు మంత్రిమీఁదఁ బెట్టకుండ నస్మాన్‌ఖాను స్వయముగనే నెరవేర్చుచుండు నట్లేర్పాటుచేసికొనిరి. సులేమాన్‌ఖాను రాజకార్యవేత్త కాకపోవుటచే నాతఁడాభారమును వహింప నిష్టపడలేదు. ఆతఁడు భోగవిలాసములయందుఁ బ్రమత్తుఁడై యందుల కనువగు నుపకరణములకు వ్యాఘాతము కలుగకుండ జరుగుచున్నచోఁ దాను చరితార్థుఁడనగుదునని తలపోయుచుండెను. అస్మానుఖాను చేసిన యేర్పాటులకు వ్యతిరేకముగ నాతఁడేమియు మాటాడుటలేదు.

ఆయేర్పాటుల ననుసరించి కార్యములు జరుగుట కారంభమయ్యెను. అస్మాన్‌ఖానుని పేర రాజ్యవిధులు, శాసనపాలనములు నిర్వహింపఁబడుచుండెను. ఆతని పేరుతో రాజాజ్ఞ ప్రచారమగుచుండెను.

ఈసమాచారములన్నియు మానసింహమహారాజునకుఁ దెలియవచ్చెను. పురుషోత్తమ పట్టణమునకు వచ్చిననవాబుదూత వీనినన్నిఁటిని మహారాజునకు విన్నవించుటయేగాక నవాబువ్రాసినయుత్తరమును మానసింహునకిచ్చెను మానసింహుఁడు రాజ్యసంబంధమైన యీ ప్రవర్తనలను దక్షిణమే యక్బరుషాదుషహాకు వ్రాసి పంపించెను.

పురుషోత్తమ నందు మానసింహుఁ డొకవారముదినము లుండఁ దలఁచుకొని వచ్చెను. అతఁడువచ్చి యిప్పుడే పదిదినములైనది. అయినను శిబిరములనెత్తుట కాజ్ఞయిడలేదు. ఆవిషయమునఁ దనయభిప్రాయము నాతఁడెవ్వరితోడను వ్యక్తపఱచినట్లు గన్పట్టుటలేదు.

మానసింహుఁడు రామచంద్రదేవునితో నొరిస్సాదేశ శాసనాది విషయములనుగూర్చి యప్పుడప్పుడాలోచించుచుండెను. వారు తుదకిట్లని స్థిరపరచుకొనిరి—"అస్మాన్ ఖాను వర్తమానసంధి నియమములకేక నెన్నియోదినములు కట్టుపడియుండఁడు. ఆతని ప్రకృతి యత్యంత దుర్దమనీయమైనది ఆతఁడత్యంత తీవ్రస్వభావముగలవాఁడు అందుచేఁ బ్రస్తుతావస్థతో సంతృప్తినొంది యుండఁజాలఁడు. మరియు నాతఁడు ప్రస్తుతమున మానసింహుని విషయమున నడపిన వ్యవహారమంతయు నౌద్ధత్యప్రదర్శకమై సంపదలక్షణసూచకముగఁ గన్పట్టుచుండెను. ఆతఁడు వచ్చి మానసింహమహారాజును జూడలేదు. మానసింహుఁడు వ్రాసినయుత్తరమునకు సరియైనప్రత్యుత్తరము నీయలేదు. ప్రవాసము నందున్నపుడు మానసింహునకు గావలసినవానినిగూర్చి విచారించి కనుగొనుటయు లేదు. ఇదియంతయుఁ బరికించి చూచినచో నవాబు షాదుషహా గౌరవానురాగముల నభిలషించుచున్నట్లు కాన్పించుటలేదు. మానసింహుని విరాగభావము నాతఁడు గ్రహియించినట్లు లేదు. ఆతని యాత్మీయతను దృఢపఱచుకొనవలయునను నభిలాష యాతనికున్నట్లు తోఁచుటలేదు. సంధియగుటకు బూర్వము మానసింహుఁడు యుద్ధమునకు సిద్ధముకాలేదు. ఇప్పుడాతఁడు యుద్ధమునకు సిద్ధమై యుండెను. అయినను సంధికి వ్యతిరేకముగ యుద్ధముసేయుటయం దాతని కిష్టము లేదు. పఠానులు సంధినియమములను మీరకపోయినచో యుద్ధమునకు దిగకూడదని మానసింహుఁడు నిశ్చయించుకొనియెను.

నవాబిప్పుడు మహారాజును జూడవలయునని పూరినగరమునకు విచ్చేసెను. సన్మానప్రదర్శనార్థమై యాతఁడు రాలేదు ఆతని కాయభిప్రాయమే యున్నచో మొదటనే వచ్చియుండును. ఈరాకకు వేఱు కారణములున్నవి నవాబు తనవిషయమునుగూర్చి మాటలాడవలయునని తలఁచి యందుకొఱకై వచ్చి తనరాకను మానసింహున కెఱింగించెను.

అపరాహ్ణకాలమున మహారాజు సభామండపమునం దాసీనుఁడై యుండెను. మిత్రిమండలియుఁ బరివారజనమేకాకుండ మహారాజగు రామచంద్రదేవుఁడు కూడ నచ్చట నుండెను. ఆసమయమున నస్మాన్‌ఖా నచ్చటకు వచ్చెను.

నవాబువచ్చుసమయమునకు సరిగా భేరీ, నగారా, కాహళ మొదలగువాద్యధ్వనులు ఘోషించెను. తూర్యధ్వనులయ్యెను. మహారాజటనున్నవారితో మండపద్వారమువఱకువచ్చెను వందిమాగధులు హెచ్చరికలను దెల్పుచుండిరి ఆక్షణమునందే యస్మాన్‌ఖాను వారి నందఱ నెదుర్కొనియెను. మహారాజాతనిని యథావిహితశిష్టాచారములతో గౌరవించెను. నవాబుకొఱ కొకవిచిత్రసింహాసనము వేయఁబడియుండెను. అస్మాన్‌ఖానందుపైఁ గూర్చుండెను.

ఎట్టిసుందరసౌమ్యమూర్తి ?—కొంచెము చింతాభావము—కొంచెము సందిగ్ధభావము..—అందుచే నించుక మ్లానభావముతోనున్న యస్మాన్‌ఖానునిమూర్తి యెంతశోభామయమైయున్నది ? అతిమనోహరములగునుడుపులచే నాతనిశరీరము సమాచ్ఛన్నమై యుండెను. వామపార్శ్వమున నవరత్నఖచితమైన యొరయందుఁ గూర్పఁబడినఖడ్గము కటినుండి నేలనుదాఁకుచు వ్రేలాడుచుండెను. మస్తకమున నత్యంతశోభామయమైన యుష్ణీషము ప్రకాశించుచుండెను.

నవాబు పరివారమునందుఁ బ్రతిమనుష్యునిగూర్చియు, క్షేమసమాచారము మొదలగుకుశలప్రశ్నలైనపిదప మానసింహామహారాజు పరలోకగతుఁడైనమంత్రి యుసాఖానుని వ్యాధి, మరణము, సమాధి, మొదలగువానినిగూర్చి చాలసేపడిగి తెలిసికొని ప్రధానశిరోమణియైన యాతనిచేఁతలను గొంతసేపు కీర్తించి సిమ్మట "ఒరిస్సాదేశమునకు

వచ్చియున్నను *నాకు, ఒరిస్సా దేశపునవాబుల సందర్శనము లభించునని నేననుకొనలేదు. ఇప్పుడు మీరాక మాయదృష్టసౌభాగ్యములకుఁ గారణమని తలంచుచున్నాను." అనియెను.

మహారాజాడిన శ్లేషపూర్ణమైన యావాక్య మస్మానునిహృదయమునకుఁ దట్టెను. అతఁడించుకసేపు చింతించి "మహారాజులు నిజమానతిచ్చినారు. మాపైదయయుంచి మమ్ముఁ జూచునాకాంక్ష యుండుట చేతనే మాకు దర్శనమొసంగి మమ్ములను కృతార్థులను జేసినారు. ఆత్మీయులసందర్శనలాభము సౌభాగ్యప్రదమని తలంచుటకు సందేహము లేదు కాని, యాత్మీయులలోఁ బరిగణింపఁబడు నదృష్టము మాకు లేక పోయినది. అట్లేయున్నచో "హాజరుకావలయును" అను 'హుకుము' వచ్చియుండదు. ఎవరు హుకుమునకు దాసులో, అట్టివారిదర్శనము మహాభాగ్యముగాఁ బరిగణించుట కవకాశము లేదు" అనియెను.

మానసింహునకు సంపూర్ణప్రత్యుత్తరమే వచ్చినది. సంపూర్ణమునకు హెచ్చుగనే వచ్చినట్లెంచవచ్చును. ప్రత్యుత్తర మస్పష్టమైనది కాదు. శ్లేషపూర్ణము కాదు. ద్వ్యర్థిబోధకము కాదు. మానసింహుఁడు కొంచెము విసుగుకొని స్పష్టముగాఁ జెప్పవలయుననియే నిశ్చయము చేసికొని "హుకుమునకు దాసుఁడు కూడ నొక్కొక్క సమయమునఁ బరమాత్మీయుఁడగును. అది వానిగుణమును బట్టియు, దక్షతను బట్టియు నుండును. నవాబులు లోఁబడియుండుట కొప్పుకొనిరి. వార లాత్మీయులగుటయుఁ గాకపోవుటయు వారి యిచ్ఛాధీనమైయుండును" అనియెను.

అస్మాన్ ఖాను మిగులదుఃఖాక్రాంతుఁడయ్యెను. ఆతని మొగ మెఱ్ఱవడియెను. మానసింహుఁ డాతనిసమక్షముననే యాతఁడు హుకుమునకు దాసుఁడైనట్లు స్పష్టముగాఁ జెప్పినట్లయ్యెను. అస్మానుని యోప్పనకు మేరలేదు. పరాక్రమము, సాహసము, వీరత్వము నాతనికడ పూర్ణముగ నుండెను. సర్వసామాన్యముగా నామహాగుణములతో హానము చిరవిరోధమును గలిగియుండును. కాని యస్మాన్ ఖానుని హృదయక్షేత్రమున మాత్రము పరస్పరవిరోధగుణములు స్వేచ్ఛగా రిలుచుండెను. ఆయేషా ప్రేమవ్యాపారమునందు నస్మాన్ ఖానుని

యసాధారణసహిష్ణుతాగుణసంచయము నిత్యమును మనేకులు గాన్పించు చునేయున్నది. ఇప్పుడును నస్మాక్ ఖా నసాధారణమైన యోర్పుతో స్థిరభావమును దాల్చియుండెను. అతఁడుచాలసేపు నీరవుఁడైయుండి యీవిధముగఁ బ్రత్యుత్తరమిచ్చెను.

"వంగదేశపుసుబేదారగు నోమానసింహబహదూర్! నేను మీతో వాదములాడుటకురాలేదు. మీవంటివారితోడి వాగ్వాదము నాకుశోభింపదు. అనేకమహావిషయములనుగూర్చి మీతో నాలోచింపవలయునని నాకభిలాషకలదు. అవి యుభయులకు నిష్టానిష్టసంబంధమును గలిగియున్నవై యున్నయవి. కాని దౌర్భాగ్యవశమున మీరిప్పు డీభావముతో మాటలాడఁ బ్రారంభించిరో యాభావమును దెలిసికొనినపిదప మీతో నావిషయములనుగూర్చి యాలోచించుట యుక్తముకాదని తోఁచుచున్నది. నేనిప్పుడే మీశిబిరమునుండి వెడలిపోవుచున్నాఁడను. కాని మీకడ సెలవుఁగైకొనుటకుఁబూర్వము మీతో నొకమాట చెప్పుటకు బాధ్యుఁడనైయున్నాఁడను. ఆవిషయము నాగృహకృత్యసంబంధమైనది. దానిని వెల్లడిసేయుట సిగ్గులచేటు. అయినను ధర్మమును, వివేకమును, న్యాయపరతయు, మీకావిషయమును దెలియఁ జేయ నన్నువేవిధముల పురికొల్పుచున్నవి. అందుచే దానిని మీకెఱింగించుట నాప్రధానకర్తవ్యము. మీరు దానిని విననిష్టపడెదరా?"

మా— మీరు చెప్పునది వినుటకు నాకాక్షేపణమేమియును లేదు. మీతో నేవిధముగను విరోధమును దెచ్చిపెట్టుకొనవలయునను నభిప్రాయము నాకు లేదు. మీరు నాతో సఖ్యభావమునువీడకుండ నుండుట వివేకకార్యమని మీకుఁ బదింబదిగఁ జెప్పుచున్నాఁడను.

అ— ఆసంగతులన్నియు నిప్పుడువలదు. అప్రియకరముగ నామాటలనుగూర్చి యాలోచించుటకు నాకిప్పు డిష్టములేదు. నేన మిమ్ముల నొకవిషయమునుగూర్చి యడుగఁదలఁచినాఁడను. మీర మీతనయుఁడైన జగత్సింహునకు యావజ్జీవకారాగారవాసశిక్ష విధించియున్నారు. ఆవీరపురుషున కేకారణమువలన నట్టిశిక్షవిధించిరో

యా కారణములలో నవాబునందినియగు నయేషాప్రణయ ప్రకాశముకూడ నొక కారణముగా, గైకొనిరని విని యున్నాఁడను, అది సత్యమేనా ?

మానసింహుఁడు కొంచెము వెనుకముందుచూచి పిదప యేషాయం దనురాగిణియై యామెహృదయమునఁ బ్రేమోత్పాదన మొనరించుట జగత్సింహునియపరాధములలో నొకమహాపరాధమే యగును. కాని యాయొక్క-యపరాధమునకే యాశిక్ష విధింపఁబడలేదు అతఁ డవిధేయుఁడై రాజకార్యములయం దశ్రద్ధను జూపినాఁడు మరియు శత్రువులతో స్నేహసూత్రమున బద్ధుఁడైనాఁడు. అవియున్నియు గొప్పయపరాధములు. అందుచే నాతనికి కాదండన విధింపఁబడినది" అనియెను.

అ—ఆతనికి విధింపఁబడినదండననుగూర్చిగాని, శిక్షయొక్క-యుక్తాయుక్తములనుగూర్చిగాని, యాతఁడు చేసినకార్యములనుగూర్చిగాని, వానియందలి ప్రయోజనమునుగూర్చిగాని మాటలాడుటకు నాకిప్పు డేమియు నధికారములేదు. ఆసంగతులన్నియు నాకుఁ దెలియును. అందుచే వానిని విని, వానినిగూర్చి మాటలాడినందు వలన నాకేమియుఁ బ్రయోజనములేదు. జగత్సింహుఁడు నాకు శత్రువు. అనేక కారణములచే నేనాతనిహితమును గోరను. కాని నీచ మానవులవలె నిష్కా-రణముగ శత్రువున కధఃపతనముగలుగుచుండ నేను చూడఁజాలను ఏమనుష్యుఁడైన నితరుఁ డపరాధములేనిదే నిర్నిమిత్తముగా దూషితుఁడగుచుండఁజూచి యూరకుండఁగలఁడా ? అందుచే నారహస్యమును మీకుఁ దెలుపవున్యుక్తుఁడనైతిని

మహా—మీయభిప్రాయమును స్పష్టముగాఁ జెప్పవచ్చును.

అ—అయేషా ప్రణయసంబంధమున జగత్సింహుఁడు సంపూర్ణముగా నిరపరాధి. మనోవాక్కా-యకర్మములచే నాతఁ డెప్పుడు నయేషాయందుఁ బ్రణయమును గనఁబరుపలేదు. అయేషా తనంతట తానే యాతనియెడ ననురాగిణియైనది. ఆప్రణయవృత్తాంతము నయేషావలన వినినపిమ్మటఁగూడ నాతఁ డెప్పుడును దనహృదయ

మున నామె పేరైనఁ దావీయలేదు. ఒక్క దినమైనను బ్రేమసూచకములగు మాటలాడి, అమేషా యుత్సాహము నాతఁడభివృద్ధి పరుపలేదు. జగత్సింహుఁడు నాకుఁ బరమశత్రువైనను సత్యముకొఱకును న్యాయముకొఱకును, ధర్మముకొఱకును నేనీమాటను మీకుఁ దెలుపుటకు బాధ్యుఁడనై యున్నాఁడను. నేనాకర్తవ్యమును నిర్వహించి నామనోభారమును దీసివేయఁగలిగితిని.

మా—అట్లయినచో మీకు జగత్సింహునితో ద్వంద్వయుద్ధమేల సంప్రాప్తమైనది?

అస్మాన్‌ఖాను లజ్జాయుక్తమగు చిఱునగవుతో "ఆవృత్తాంతమునుగూడ మీరు తెలిసికొంటిరా? మేలేమైనది. అయేషా నాజీవనమునకు ధ్రువతార. అయేషాను లక్ష్యమునందుంచుకొని నేను ప్రాణములను నిలుపుకొనుచున్నాఁడను కాని, అయేషాహృదయము జగత్సింహునితో సంపూర్ణముగా నిండియున్నది. ఆ హృదయమునందు నిర్భాగ్యునకించుకంతయును దావులేదు. అందుచే జగత్సింహుఁడు నావధ్యుఁడు. పరమశత్రువు. జగత్సింహుని పేరీప్రపంచమున విలుప్తమైపోయినచో నయేషాహృదయమునం దేమియును లేకపోవును. అప్పుడాస్థానమున నాకించుకతావు దొరకఁగలదు. ఇదియే తుదియాశ. ఆయాశను నాహృదయమునవిడికొని ప్రాణధారణము సేయుచున్నాఁడను. జగత్సింహుడాద్వంద్వయుద్ధమునఁ బరాజయము నొందింపలేకయేపోయితిని. మంచికాలము సంప్రాప్తమైనప్పుడాతనిని నాశనము చేయవలయునని నాసంకల్పము. జగత్సింహుడు యావజ్జీవమును కారాగారమునందుండునేని నామనోరథము నీడేర్చుకొనుటకు సమయము దొరకదు. ఆతఁడు జీవించియున్నచో నయేషా యాతనిని మఱచిపోవుననునాశ నాకులేదు. జగత్సింహునిమరణమే నాకు వాంఛనీయమైనది.

మా—మీశత్రుత్వము మిగుల నద్భుతమునుగలుగఁజేయుచున్నది మీశత్రువుపై నారోపింపఁబడిన మిథ్యాపవాదమును బట్టి యాతనిదోషతను సప్రమాణముగ ధ్రువపర్చితిరి. అట్లయ్యును మీరు నాతనిమరణము మిగులనాత్రముతో నెదురుచూచుచున్నారు.

అ—ధర్మశాసనము. స్వార్థప్రయోజనము. ఈ రెండుప్రవృత్తు లకును వశవర్తనుఁడగుటచే మీవిచారణవిషయమున మిగుల భీతిల్లు చున్నాఁడను. కాని, యీమాటలతో నిప్పుడు ప్రయోజనము లేదు. నేను చెప్పవలసినది పూర్తియైనది. ఇఁక సెలవు గైకొనియెదను.

మా—రాజకీయవిషయమున నొకటిరెండుమాటల నడిగెదను. మీవలన నేను తెలిసికొనవలసిన యంశములున్నవి. మీయాతిథ్యసత్కా రములను జేయవలయునని నాకభీష్టముగలదు.

అస్మానుఖాను సింహాసనమునుండి లేచి "రాజకీయవిషయమునఁ బత్రికనుగాని, దూతనుగాని పంపినచోఁ గార్యము నెరవేరఁగలదు. మిగి లియున్న యాతిథ్యవిషయము—ఎవరుమాకుమునకు దాసులోయట్టివారి విషయమున శిష్టాచారములను నడపకపోయినను హానియుండదు. నేని ప్పుడే వెడలిపోయెదను" అనియెను.

అచ్చటనున్నవారి కందరకును "సలాము"చేసి గౌరవించి యస్మాను ఖాను మండపమునుండి వెడలిపోయెను.

మానసింహమహారాజు, రామచంద్రమహారాజుమిగిలినమిత్రులు మొదలగువారందరును "పఠానులకును మొగలాయీలకునుగల సంధికవ సానము సంభవించుటకిక నెంతయోకాలము పట్టదు" అనియనుకొనిరి.

మానసింహుఁ డించుకయుద్విగ్నచిత్తముతో సభనుముగించి జగన్నాథస్వామికి హారతిసమర్పించుటకై పోవుప్రయత్నము చేయఁ జొచ్చెను.

పదునైదవ ప్రకరణము.

మానసింహుఁ డొరిస్సాదేశమునుండి వెడలిపోయెను. స్వర్ణదుర్గ మునందున్న నవాబగు నస్మానుఖానునకు సర్వవృత్తాంతములును దెలిసి నవి నవాబుయొక్క గుప్తచారులు చెట్టుచెట్టునందును గుట్టగుట్టయం దును నివసించియుండిరి.

నవాబు మానసింహమహారాజును జూడవలయునని పోయియుం డెను. కాని యందలిఫల మేపక్షమువారికిని సంతోషజనకము కాలేదు నవాబు మహారాజునుజూచుటకు వూరికి వెళ్ళినపిదప మహారాజోరిస్సాను విడిచి వెళ్ళుటకుఁబూర్వము మహారాజొకనాఁడువచ్చి నవాబునుజూడ వలసియున్నదనియు నట్లుచేయనిదే యొరిస్సానుండి వెడలిపోవుటసరిగా నుండలేదనియు, నదిపఠానులహృదయమునకుఁ జాలబాధాకరముగ నుం డెననియు వేరుగఁ జెప్పనక్కరలేదు.

అస్మాన్‌ఖానునకు సంధినియమములను గొలదికాలములోనే భంగముచేయవలయునునభిప్రాయముకలిగెను అవమానజనకములగు నాకార్యములకు సహించికొనుచు సంధిని సంరక్షించుట యసంభవము. సామాన్యముగా జనులందరును బఠానులేసంధికిభంగము కలుగఁజేసిరని యనుకొందురని యస్మాన్‌ఖానెఱుంగును. కాని ప్రకృతప్రస్తావమున మానసింహమహారాజే సంధినియమములను విచ్ఛేదము చేసెనని చెప్పెదరు.

నవాబు రణసన్నాహములనన్నిఁటిని జేయుచుండెను. యుద్ధమున జయముగలిగినను, నపజయముగలిగినను సరియేకాని యుద్ధముచేయనిదే మాత్రము మొగలాయీల యధికారము నంగీకరించుట కస్మాన్‌ఖానున కిష్టములేదు. ఆతఁడావిషయమున విశేషప్రయత్నములను జేయుచుండె ను. ఆతనినూతనామాత్యుఁడు నావిషయమున నధికముగ శ్రమపడుచుఁ బనిసేయుచుండెను.

దుర్గమునందలి యొకప్రాసాదమున నస్మాన్‌ఖానొక్కఁడునుగూ ర్చుండి యేదియో యోచించుకొనుచుండెను. ఇంతలో నాప్రాసాదము నకుఁజేరియున్న యంతఃపురద్వారము తెఱవఁబడియెను. లోపలినుండి "ఇప్పుడు నవాబుగారొక్కరే కూర్చుండియున్నారు, ఒక్కింతసేపు నేను నవాబుగారిసన్నిధికి రావచ్చునా?" అనియెవరో యడిగినట్లయ్యెను.

అది యయేషాకంఠస్వరము. అయేషాయొక దినమునందైనను లో పలిమహలునువీడి యివ్వల కాలుఁబెట్టియుండలేదు. ప్రతినిమిషమునను మనసునందామెను ధ్యానముసేయుచున్న యస్మాన్‌ఖానుసైతమామెను

చూచుటకు లోపలకుఁబోయి యామెకు విరక్తి కలిగించుటకు భయపడు చుండెను. అట్టియయేషా యిప్పుడు తనంతట తానే యింటికిగవచ్చి యస్మాన్ ఖానుని చూడనిష్టపడుచుండెను అస్మాన్ ఖానాకంఠస్వరము నువినినతోడనే చకితుఁడై "అయేషా! వచ్చిచూచుట కనుజ్ఞను వేఁడు చున్నావా? నేఁడేమి యాశ్చర్యమైనమాట! చూడవలసిన యావశ్యకమే యున్నచో నీవుస్మరించినంత మాత్రమున నీసన్నిధినుండనా? రమ్ము. ఇచ్చటమఱెవ్వరును లేరు" అనియెను.

నవాబు లేచి ద్వారముకడకేగెను. అయేషాయును నవనతశిరస్కయై యాగదిలోనికరుదెంచెను. నవాబాగది తలుపును తానేమూసివచ్చి "అయేషా! ఇదేమి! నాయదృష్టము నీవిచ్చటకువచ్చుటెందులకు? ఎవరిచేనైన నించుకవర్తమానమంపినచో నేనేవచ్చియుందునుగదా! నీవు తొందరపడి యిట్లువచ్చుటకుఁ గారణమేమి?" అనియడిగెను.

అయేషావదనము విషాదపూరితమైయుండెను. ఆమె దీర్ఘనిశ్వాసమునువిడిచి యవనతముఖియై "రావలయునని వర్తమానమంపినచో నీవు దొందరకలుగదని యెరుంగుదును. కాని యనేకవిషయముల నాలోచించి నేనే నీకడకు వచ్చితిని నేనెప్పుడును నిన్ను స్మరించుచుండుట లేదని నీకుఁ జ్ఞప్తియందున్నచో నంతియేచాలును. అట్లుకానిచో నీకు విషమభ్రమకలుఁగును, ఆమాటవలన నిప్పుడు ప్రయోజనములేదు. నీకొక్కమాట చెప్పవలయునని వచ్చితిని" అనియెను.

అస్మాన్ — చెప్పుము నీమాటలను వినుటయన్న నాకుఁబరమానందము. నిలుచుంటివేమి? ఇచ్చట గూర్చుండి చెప్పవలసిన దానిని చెప్పుము.

అయేషాయును పీఠమునధిష్టించెను. నిలుచుండి మాటలాడినచో మెదడు సరిగా నుండదనియోచించి పీఠముపైఁగూర్చుండెను. కూర్చుండి మౌనమై జారిపోయిన మేల్ముసుంగును రెండుచేతులతోడను సవరించుకొనఁదొడంగెను అస్మాన్ కొంచెము సేపాగి పిదప "చెప్పుము! అయేషా! చెప్పుము. ఏమిచెప్పవలయునని వచ్చితివో, దానిని జెప్పుము" అనియెను.

అయేషాయును బట్టుకొనిన మేలుముసుంగును విడచి "నీవుకొన్ని దినములనుండి రణసంబంధములగు ప్రయత్నములను విశేషముగఁ జేయుచున్నాఁడవు. అనర్థకమైన మాటలను నీతోఁ జెప్పుట కిప్పుడు సమయము కాదు. నేను చెప్పవలసినమాటలను మఱియొకప్పుడు చెప్పెదను" అనియెను.

అస్మాన్:—అయేషా నీ విప్పుడు చెప్పకపోయినచో నన్నతికష్టములలోఁ ద్రోసినదానవగుదువు. నీవుచెప్పునది సంపూర్ణముగా ననర్థకమును కలుగఁజేయునదియైనను దానిని చాలసార్థకమైనదిగా నేను దలంచెదను ఎట్టిపనులున్నను వానినినన్నిటిని రసాతలములోని కణగఁ ద్రొక్కి నీమాటలను వినుటకెల్లప్పుడును నేను సిద్ధముగానుందును. ఆ విషయము నెఱిఁగియుండియుఁ జెప్పవలసినదానిని జెప్పక నీవిట్లనుమానించెదవేమి?

అయేషయు నెడమచేతితో నల్లనఁ జీరచెఱఁగునుబట్టుకొని కుడి చేతితో దానిని మెలివేయనారంభించెను. నోటినుండి మాటవెడలుట చాలబాధాకరముగనున్నట్లుతోఁచుచుండెను. అస్మాన్ ఖాను "చెప్పుము. అయేషా! చెప్పఁదలచినదానిని చెప్పుము. నీవుచెప్పునదిశుభమైన నశుభమైనదానిని వినుటకు నేనుమిగులనువ్విళ్లూరుచుంటిని"అనియెను.

అయేషాయును జీరచెఱఁగునువిడిచి "నీవు నాపైఁజూపుచున్న యనుగ్రహమునకు మేరలేదు. దానినిబోలునది మఱియేమియును లేదు. కాని, నేను నీ కేమియు నుపకారమును జేయలేక పోవుచున్నదానను" అనిచెప్పి యూరకుండెను.

అస్మాన్—అయేషా! నేను నీపై నెట్టియనుగ్రహమునుజూపియుంటినో నేనెఱుంగను. కాని నీవు నన్ను నీహితైషినని భావించుటయే నాకుఁ బరమసౌభాగ్యము. కాని, దానికొఱకు "నేను నీకుకృతజ్ఞురాలనై యుందును" అనిచెప్పుట సరికాదు. నీవు నాకుఁ బరమహితైషిణివి. నీవీనవాబుసియంతఃపురమున కలంకారమవు నీవందఱకు నుపకారిణివైయుంటివి. అట్టినీవిప్పుడిట్లేలనుడివెదవు?

అయేషా యవనతముఖియై "అకృతజ్ఞతాధీనంబులైన యీ దేహప్రాణంబులతో నిచటనుండరాదని తలంచుచున్నదానను." అనియెను.

అస్మాన్ లేచినిలుచుండి యార్తస్వరముతో "నీవిచటనుండకుండుటకే యోచించినచో, బలవంతముగా నిన్నిటనుంచుకొనుట కెవరికిసాధ్యము? నాకిష్టముండునేని నీప్రయత్నమున కభ్యంతరము కలుగఁజేయఁగలను. అట్టిఅభ్యంతరము మాట యట్లుండనిమ్ము. నీయిష్టమునకు విరుద్ధముగా నేకార్యముచేయుటకును నాకుమనసొప్పదు. అయేషా నీవిప్పుడు నాతోఁజెప్పవలసినమాట యిదియా! నీవిచ్చట లేకపోయినచో మఱియెవరుందురు? నీవిచ్చటనుంటివిగనుకనే యధముఁడగు నీయస్మానింకను బ్రాణములతోనుండఁగలిగినాఁడు నాదురదృష్టముచే నిన్నుఁబొందఁజాలకున్నాఁడను. కాని, యింకను నాకాయాశపోలేదు. ఈదేహమునఁ బ్రాణములున్నంతవఱకు నీయనుగ్రహమునుపొందగలుగుదుననునాశ నన్నువీడదు. నాహృదయమునం దాయాశ నెల్లప్పుడు బోషించుకొనుచున్నాఁడను. ఆయాశయే నాపరమసుఖమునకుఁ గేంద్రస్థానమై యున్నయది. అస్మానుని యాశాలతను ద్రుంచివేయుట నీకానందమా?—అయేషా అతని యావద్ధృదయమును సంపూర్ణముగాఁ జూర్ణము సేయుటెందులకు? అయేషా! మమ్ములనువీడి మఱియెచ్చటకుఁబోయెదవు?' అనియెను.

అయేషా ప్రత్యుత్తరము నొసంగుటకు నుద్యుక్తయై "అస్మాన్!" అనియెను. ఆమెకంఠస్వరమించుక వికృతమయ్యెను. ఇంచుక సంక్షుభితమయ్యెను. ఆమె కొంచెముసేపూరకుండి మరల మాటాడనారంభించెను. "అస్మాన్ ! నీహృదయముమిగుల మహత్తరమైనది. అత్యుదారమైనది. నీవలపును నసమానమైనది. మానవలోకమునందంతట నదిదుర్లభమైనది. కాని—" అనిచెప్పి యయేషా మరల నూరకుండెను.

అస్మా—(ఆత్రముతో) "కాని. యనఁగానేమి?" అయేషా?

అయే—కాని దురదృష్టవశమున నీవు నన్నుఁ బ్రేమించి నీమనస్సును గేవలము తాపమునకు గుఱిచేసికొనుచుంటివి. ఈ పాషాణ

ముఱు బ్రేమించి నీవు నిరంతరము ననేక యాతనలపాలఁబడుచున్నాఁడవు. ఈయభాగిని నీసమక్షమునుండి యంతర్హితమైనచో మఱియిరువురకునుగూడ శుభమనియే తోఁచుచున్నది.

ఇట్లుచెప్పి యామె యూరకుండెను. అస్మాన్ ఖానాహృదయవిదారకవాక్యముల నతిధీరభావముతో విని చాలసేపు మౌనమును దాల్చి యూరకుండి పిదప నిట్లుచెప్ప నారంభించెను. "అయేషా! కాతరుఁడగు నీతనిప్రాణోత్క్రమణావస్థపాలు సేయుటవలన నీకుఁ గలుగులాభమేమి? ఏభవనమందయేషా వసించియున్నదో, యాభవనముననే యీయధముఁడును వసించియున్నాఁడు. ఆతని కదిగూడ నొకపరమానందకరవిషయమై యున్నది. అయేషా! ఆనాయానందమును హరింపఁజేయుటవలన నీకుఁ గలుగులాభమేమి? ఇష్టమైనప్పుడు దూరమునుండియే యయేషాను జూడఁగలను లేదా దూరమునుండియే యయేషాకంఠధ్వనిని వినఁగలను. అదినాకుఁ బరమసుఖదాయకము. అయేషా! నన్నాసుఖమునుండి వంచించుటవలన నీకగు నుపకారమేమి?"

అయే—అస్మాన్! నీవుధీరుఁడవు. బుద్ధిమంతుఁడవు. ధీరభావముతో యోచించిచూడుము. దానివలన నుపకారముకాఁగలదు. ఆదర్శనమువలనను దూరమునందుండుటవలనను నీకష్టములకుఁ గారణమైనదానిని నీవు మఱచిపోఁగలవు.

అస్మాన్—(నవ్వుచు) ఎంతటిభ్రాంతి! అయేషా! చూడకపోవుటవలనను, దూరమునందుండుటవలనను బ్రిణయాస్పదుల నెప్పుడైన మఱచిపోవుట తటస్థించునా? ఈనగరమునందున్నను నేనెప్పుడును నీసన్నిధికి వచ్చియుండలేదు. వంగదేశమునుండి తిరిగి వచ్చినపిదప నేను నిన్నొకక్క-సారిమాత్రమే చూచియుంటిని. అంతకాలము నీదగ్గన లాభము లేకపోయినను నాహృదయమున కించుకంతయును, నేపరివర్తనమును గలుగలేదు. అట్టిపరివర్తనమేయున్నచో నీవు ప్రేమించుచున్నవారిని జూచి చాలకాలమైనదిగదా —నీవాతనిని మఱచిపోలేదేమి?

అయే—పురుషున కనేకములగు నవలంబనములును, ననేకములగు లక్ష్యములును ననేకములగు కాంక్షలు నుండును. వనితలకుఁ బ్రేమయొక్కటియే యాటవస్తువు. వారనాయాసముగాఁ బ్రేమబంధము నల్లుకొనఁగలరు.—నేను ధైర్యముతో నుంటిని. అంతియేగాక భగవంతుని బ్రార్థించుచుంటిని. నీవీపాషాణస్త్రీని సులభముగా మఱచిపోవుదువుగాక!

అస్మా—దురాశ—అయేషా! అదియొక దారుణదురాశ. నాయీయాకాంక్ష నాసమాధిమృత్తికతోఁ జేరిపోయినప్పు డేమో చెప్పఁజాలను—కాని యీశరీరమునందు శ్వాసమాడుచున్నంతవఱకు నిన్నుమఱచిపోవుదునను నాశ నాకులేదు మొట్టమొదటనే చెప్పియున్నానుకదా. ఆశయే నాకు బలమును గలుగఁజేయుచున్నది—నేను దానిని బ్రయత్నపూర్వకముగఁ బోషించుచున్నాఁడను. దారుణతాపముచేఁ బాషాణముకూడఁ గరగిపోఁగలదు. ఈశ్వరసంకల్పముచే మరుభూమియందును సముద్రముద్భవింపగలదు. అయేషా! ప్రాణములతో జీవించియున్నచో నొకప్పుడైన నస్మాన్ ఖానుని ప్రేమ ప్రగాఢతను గ్రహింపఁగలవు. అస్మానుని ప్రేమించుట కిష్టమున్నదాన వైన నగుదువు. అప్పుడీదురదృష్టవంతుఁడు ధన్యాత్ముఁడు కాఁగలఁడు.

అయే—నీప్రేమ మిగుల మహత్తరమైనది అత్యుదారమైనది, అతిప్రగాఢమైనది. ఆవిషయమును నేను మొదటనే చెప్పియుంటిని. నేను దానిని గ్రహింపలేనని యంటినచో నీవు నాహృదయమును సరిగాఁ దెలిసికొనలేదని యర్థము నీనిమిత్తమై నాప్రాణములను విడుచుటకు సయితము సిద్ధముగానున్నాను నాప్రాణముత్సర్గీకృతమై పోయినది. నివేదితమైన పదార్థమును దిరిగి దానముచేయుటకు నాకధికారములేదు. దేనినిచ్చివైచితినో దానిని తిరిగి గ్రహించుటకు నాకు సాధ్యముకాదు. సుఖముగానీ—దుఃఖముగానీ—నేనుమనస్సునందైనను ద్విచారిణినిగాఁ జాలను. అస్మాన్! నీవు మొదటినుండియు నన్నుక్షమించుచున్నాఁడవు. ఇప్పుడును నన్నుక్షమింపుము. వ్యర్థముగా నీయభాగినిపై నాశచే నీసుఖమునకు భంగముకలుగఁజేసికొనవలదని, నిన్ను వినీతభావముతో వేడుకొనుచు

న్నదానను. మఱియు నాదొక ప్రార్థన. నీకిష్టమైన కన్యనువరించి నీజీవనమును సుఖమయముగాఁ జేసికొనుము. నిరర్థకముగా నీఘనతనాశించి ముగ్ధుఁడవై లోకోపకారమునకుఁబ్రయోజనకరమైన నీజీవనమును ధ్వంసము చేసికొనకుము.

అస్మాన్ — అయేషా! నాజీవితమరణములయందు నీవు నాకుఁ బూజనీయుఁవు నిన్నుఁ బొందజాలకపోయినను—ఇదివఱకు నాయాతనను నెమ్మదిగ సహించుకొనుచువచ్చినట్లే — ఇఁకముందును సహించుకొనఁ గలను. కాని, యొకతుదిప్రయత్నమును జేసి చూచివిడిచెదను. నీవెవరిని ప్రేమించుచుంటివో, యాభాగ్యవంతుని నాస్వహస్తములతో వధియించెదను. పిదప నీవు స్వతంత్రవుకావచ్చును. అప్పుడు నేను నీయనుగ్రహమునకుఁ బాత్రుఁడనైనను గావచ్చును. అప్పుడును నామనోభీష్టము సిద్ధింపకపోయినచో నస్మాన్ఖానుని ప్రతిద్వంది నాశనమైపోయెనుగదా యను సంతోషముతో సుఖినయ్యెదను.

అయేషా—ఈప్రపంచమునం దమంగళప్రవాహము వృద్ధి నొందించుటకై అయేషా జన్మించినట్లు తోఁచుచున్నది. నిన్ను నేను మిగులఁ బ్రేమించుచున్నదానను. నీవుసుఖివైయుండఁ జూడవలయునని నాయాశ. అదియేనాప్రధానప్రయత్నము. కాని విధాత యీయభాగిని యదృష్టమునం దాసౌభాగ్యమును వ్రాయలేదని తోఁచుచున్నది. నేను చెప్పదలఁచినది సమాప్తమైనది. ఇఁకసెలవుగైకొనియెదను. ఈజీవితమునందు మరల నిన్నుఁజూడఁజాలనని తోఁచుచున్నది ఒకవేళ నెప్పుడైనను నీకు విశేషాపద సంభవించినప్పుడు నావలనఁ గలుగునుపకార మేదైన కలదేని నేనప్పుడునచ్చెదను దానిని దెలిసికొనుము. సోదరా! అస్మాన్ నన్ను దుఃఖితయగు నీసోదరినిగా భావింపుము. వలదు. వలదు వలదు — సర్వప్రయత్నములచేతను నన్నుమఱచిపోవ యత్నింపుము.

అస్మాన్ఖానధోముఖుఁడై యయేషాచెప్పుచుండెడి హృదయవిదారకవాక్యములను వినుచు భయానకములగు నానావిధకల్పనలయందు బ్రమత్తుఁడైయుండెను. అతఁడు తలయెత్తిచూచునప్పటి కయేషాయచ్చట లేదు. అస్మాన్ఖాను నిట్టూర్పుపుచ్చి రెండుచేతులతోడను శిరసును బట్టుకొని "ఓహో" అని యనుకొనియెను.

మొదటిభాగము సంపూర్ణము.

శ్రీరామచంద్ర.

నవాబునందిని

ద్వితీయ భాగము.

మొదటి ప్రకరణము.

జగత్సింహుఁ డెచ్చటనున్నాఁడు? పాట్నానగరమునందలి లోహకారాగారమున సంకెలలచే బంధితుఁడై పడియున్నాఁడు. అట్లుండి నయా పౌరుషశాలి ప్రణయసంబంధమయిన యొకస్వప్నమును గాంచెను. కారాగారమంతయు గాఢాంధకారమయము. శృంఖలములచే నిబద్ధుఁడైయున్న యావీరుఁడొకచాపపైఁ గూర్చుండియుండెను. అత్యంతకఠోరమైన యాదుర్దశ కవసానము లేదా? ఆతఁడిఁక నెన్నఁడును సూర్యచంద్రులను జూడఁజాలఁడా? అయిన నాతనిజీవనసర్వస్వమైన తిలోత్తమతో నొకసారియైనను మరలఁ గలసికొనకుండునా? ఆకారాగారాంధకారమున నాతనిజీవితము సమాప్తమైపోవునా? ఎల్లయాశలకు నదియే తుదియా?

ధైర్యముతో నిరీక్షించినచో నీదుర్దినము నిజముగా దూరమైపోగలదు. జగత్తునం దెప్పుడెచ్చట నెవ్వరికి దుర్దినములు చిరస్థాయిగా నున్నవి? అనిమధురభాషిణియైన యాశాదేవత యాతని చెవియందూదెను. జగత్సింహుఁడు గడచిపోయిన తనజీవితచారిత్రమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని యోచించి చూచుకొనియెను. అత్యల్పకాలములో నాతని స్థితియం దెట్టివిపర్యయములు సంఘటిల్లినవి! ఆతఁడు వానినన్నిటి నతిక్రమించి మరల సౌఖ్యముల ననుభవింపలేదా? మరలనట్లే సంప్రాప్తముకాదా?

అతనికష్టసుఖములనుగూర్చి యోచించువా రెవ్వరు? అతనియాక్లేశభారమునువహించి హృదయవేదన ననుభవించు వా రెవ్వరు? తన విపద్వార్తనువిని తిలోత్తమయత్యంత చింతాభరాక్రాంత యగుననియు నాబాలిక యెట్టియాతనల ననుభవించుచున్నదో యనియు, దారుణమైన

దుశ్చింతచే నామె హృదయశరీరము లెట్లవసన్నములైపోయినవో యని యు నాతఁడాలోచించుకొనియెను. ఆతురవస్థయందుఁ దనకష్టముకంటె దిలోత్తమనుగూర్చినచింతయే జగత్సింహునకు మిక్కిలి బాధాకరమయ్యెను. ఎవరివలననైనను దిలోత్తమసమాచారము వినివచ్చినను, నెవరినోటనైనఁ దనకుశలవార్త తిలోత్తమకుఁ దెలియఁజేయఁగలిగినను, జగత్సింహుడుకొంతవరకు నిశ్చింతుఁడై యుండును—ఆతనికిఁ గొంచెము శాంతియు సుఖమును గలిగియుండును కాని, దాని కుపాయమేది ?

జగత్సింహుఁ డీపరిక్లేశముచేతను, చింతచేతను, దినములను జరుపుచుండెను దినములపై దినములు సాగిపోవుచుండెను. కాని యాతని యాశలేమియు ఫలింపలేదు, ఫలింపకున్నను నాశమాత్ర మాతనిని విడిచిపోలేదు. నిద్రలేకుండ సర్వదా చింతతోడనే రాత్రులు జరగిపోవుచుండెను అతిక్లేశముచే—చేయుటకు పనిలేకుండఁగనే—పగలుఁగడచిపోవుచుండెను. కాని, యాశమాత్రముపోవుటలేదు

ఒకదినమునఁ, బ్రాతఃకాలమునందు జగత్సింహున కించుక కునుకుపట్టెను. రాత్రి యంతయును దిలోత్తమకొఱ కత్యంతము చింతించుటచే నలసియున్న యాతని నేత్రములప్పు డొకించుక మూతపడియెను. కాని యతఁడాయవస్థయందైనను నిశ్చింతుఁడై సుఖము ననుభవింపలేదు. ఆస్వల్పనిద్రయందును దిలోత్తమసంబంధమైన యస్పష్టోద్వేగము క్షీణభావముతో నాతని హృదయవీథికి వచ్చుచుండెను.

ఇంతలో నాకస్మికముగఁ గారాగారపు టినుపతలుపును దట్టు ఘుర్ఘురశబ్దము జగత్సింహునకు వినవచ్చెను కాని, యాతని కాశబ్దము వేఱురీతిగఁ దోఁచెను. అత్యంతకఠోరమైన యాశబ్ద మాతనికర్ణములకుఁ దిలోత్తమ మంజీరసంబంధమగు మధురధ్వనివలె వినఁబడియెను. నిద్రావివశతచే ముద్రితనయనుఁడైన యాతఁడు "ప్రియతమయగు తిలోత్తమ కుసుమమాలను హస్తమునఁదాల్చి నవ్వుచునవ్వుచు ముందునకు జరగి తనయొద్దకు వచ్చినట్లును, తాను "నీయిష్టానుసారముగఁ గత్తిని విడిచిపెట్టితిని, పుష్పమాల తిరిగి తెగిపోవునను భయములేదు" అని చెప్పినట్లును నొకస్వప్నమునుగాంచెను.

తెలుపఁబడినమార్గమునఁ గారాగారరక్షకుఁడు లోపలకు వచ్చి రాజపుత్రునిశయ్యకడనిలుచుండి మధురస్వరముతోఁగూడిన సంభ్రమముతో "యువరాజా !" అని పిలిచెను.

కారాగారరక్షకుఁడు పిలిచినశబ్ద మాతనిచెవినిఁ బడెను. కాని, దానినాతఁడు వేఱుభావముతో గ్రహించెను. తిలోత్తమ "ప్రాణేశ్వరా !" అని పిలిచినట్లాతనికి వినవచ్చెను.

కారాగారరక్షకుఁడు మరల "యువరాజా !" అనిపిలిచెను.

రాజపుత్రుఁడు 'పోవఁదు. పోవలదు. భయమేమి ?" అని పలుకుచు నుద్వేగముతో శయ్యనుండిలేచి నిలుచుండిచూచెను. ఎదురుగ నప్రియమైన కారాగారరక్షకునిమూర్తి గనఁబడియెను. తిలోత్తమయెక్కడ? ఏసుంకరికాపదలు సంభవించునని తెలిసి తాను పరువెత్త మొదలిడెనో, యాతిలోత్తమయేది? పిదప జగత్సింహునకుఁ బ్రకృతస్థితి గోచరమయ్యెను. ఆతఁడు విసుఁగుకొని మనసునందు "అకటకటా ! స్వప్నమందైనను సుఖమునను భవించుట కీనిర్భాగ్యుఁడు నోచిపుట్టలేదుకాబోలు!" అని యనుకొని కాతరభావముతో జదికిలఁబడియెను. కారాగారరక్షకుఁడు వినీతభావముతో నాతనికి వందనము చేసెను.

జగత్సింహుఁడు నేత్రములను దుడుచుకొని కారాగారరక్షకా ! తెల్లవారునప్పటికే నీవు దెచ్చినసమాచారమేమి? అని యడిగెను.

కారా—(విస్మయముతో) మీరు కారాగారమునకు వచ్చిన యొకటిరెండు దినములలో నొకసన్యాసివచ్చి యప్పటినుండియు మిమ్ములను జూడవలయునని ప్రయత్నించుచున్నాఁడు.

జగ—సరియే. తరువాత?

కారా—మీదర్శనముకొఱకు కాతనిని లోపలకు రానిచ్చుటకు నేను సాహసింపఁజాలకపోయితిని.

యువ—అట్లయినచో నామాట నాకుఁ జెప్పుటెందులకు?

కారా—ఆసన్యాసి యిప్పుడువచ్చి "చూచుటకునన్ను లోపలకుఁ బోనీయవైతివేని, నాసంగతి మహారాజునకుఁ దెలిసి యాత్మహ

మిగులవిరక్తుఁడగును మరియు రాజకార్యమునకు విశేషహాని సంభవించును'' అని చెప్పుచున్నాఁడు.

యువ——నేనేమిచేయవలసియున్నది?

కారా——ఆతనికి దేవరసందర్శనముచేయించు టుచితమని యోచించుచున్నాఁడను.

జగ——అయినచో నది నాకుఁ దెలుపు టెందులకు?

కారా——ఆసన్న్యాసిని లోపలకువిడిచిపెట్టినచో యువరాజునకసంతుష్టికలుగవచ్చును. యువరాజునకు మంగళమగునని మేము చేయఁబోవుకార్య మమంగళమైననుగావచ్చును

యువ——(కొంచెముయోచించి) నాకిప్పుడుగలిగిన యమంగళముకంటె గొప్పయమంగళము వేఱొకటియున్నట్లు నాకుఁదోఁచుట లేదు. నన్నాతఁడు వచ్చిచూచినను నాకు హానివృద్ధులేమియు సంభవింపవు. నీకాక్షేపణము లేకపోయినచో నీకిష్టమువచ్చిన నానిని లోపలకు విడిచిపెట్టవచ్చును. అందువలన నాకు సంతోషమేగాని విచారమేమియులేదు.

కారాగారరక్షకుఁడు వందనముచేసి వెడలిపోయెను. జగత్సింహుఁడొంటరిగఁ గూర్చుండి యోచింపనారంభించెను. విడివడుదాశ యేమియుఁ గాన్పించుటలేదు. మహారాజు స్వయముగా యావజ్జీవకారాగారవాసశిక్షవిధించినప్పుడాతని యాజ్ఞనుద్రిప్పుట కెవరికి సాధ్యము? శతసహస్రకారణములు గాన్పించినను మహారాజు తానాడినమాట కన్యథాచేయువాఁడుకాఁడు. న్యాయమునకును, ధర్మమునకును గట్టువడినచో నాతఁడట్లన్యథాచేయఁగూడదు. అన్యథాచేసినచో నాతని పదగౌరవమును శాసనశక్తియుఁ దృణీకృతములైపోవా? ఆతనిప్రతాపము క్షీణించిపోవును. అతనిన్యాయపరతయుఁ గర్తవ్యనిష్ఠయుఁ బరిహాసయోగ్యములైపోవును.

అట్లయినచో జగత్సింహుఁడు విడివడుట కుపాయమేలేదా? ఆతఁడిట్లే చిరకాలము కారాగారమునందు జీవితమును గడపవలయునా?——విడివడుట కొకయుపాయముకలదు. ఫాదుషహాయనుగ్రహ

మున్నచో నన్నికార్యములును జక్కబడును. అతఁ డనుగ్రహించి జగత్సింహునివిషయమున ననుకూలముగ నాజ్ఞయొసంగినచోఁ దన కష్టమున్నను లేకపోయినను మానసింహమహారాజు దానికిఁ బ్రతివాదమును జేయఁడు. కాని, యాకార్యమును చేయువారెవరు? ఢిల్లీ పాదుషాహా దర్బారునకీజగత్సింహుని విజ్ఞాపనమును గొనిపోయి విన్నవించువారెవరు ? ఎవరిమాటగ్రాహ్యమైన నచ్చట వినువారెవరు? దర్బారునకుఁ బోయి జగత్సింహున కుపకారముసేయునిమిత్తము ముంకంజ వేసి వచ్చువారెవరు ?

అప్రసన్నవదనుఁడును, సన్యాసివేషధారియు నగునొకపురుషుఁడవనతశిరస్కుఁడై మెల్లమెల్లగ నాకారాగారములోపలఁ బ్రవేశించెను, ఆతనిని జూచినతోడనే జగత్సింహుఁడాతని గుర్తించి భూమిపై కెఱగి వందనముచేసి “ఇదేమి ! మీరిచటకెట్లువచ్చితిరి ?” అనియడిగెను.

ఆయాగంతుకుఁడు మనకుఁ బరిచితుఁడైన యభిరామస్వామియే.

అభి—నాకిచ్చట చాలసేపు నిలిచియుండుట కధికారములేదు. అందుచే సర్వమును నీకు సంక్షేపముగా నెఱింగించెదను. నీకీబంధన విధింపబడినవార్త నాకుఁ దెలిసిన మఱుచటిదినముననే మందారణదుర్గమును విడిచి వచ్చి యది మొదలిచ్చటనే యున్నాఁడను.

జగ—మందారణ దుర్గసమాచారము లేమైన మీకుఁ దెలిసినవా ?

అభి—తెలిసినవి. అందఱును కుశలముగానున్నారు. నీకొఱకందఱును విచారముతో నున్నారు. తిలోత్తమదుఃఖమునకు మితి లేదు.

జగ—మీరిచ్చటకువచ్చినపిదప మందారణదుర్గసమాచారము లేమైన వచ్చినవా ?

అభి—వచ్చినవి. ఒకనెలకిందట నాశిష్యుఁడైన గజపతి యిక్కడకు వచ్చినాఁడు. ఆతనిచే విమల యొకయుత్తరమంపినది. ఆయుత్తరమువలన నటనందఱును శోకాకులచిత్తులై యున్నట్లు తెలియవచ్చినది

తిలోత్తమ జీవించియున్నదనియు నతికష్టముమీఁదఁ గాలమును గడపుచున్నదనియు నాప్రయత్నముచే నీవీచెఱనుండి విముక్తి నొందుదువను నాశతో నామె ప్రాణములను నిలువఁబెట్టుకొనుచున్నదనియు నాయుత్తరమువలనఁ దెలిసినది

జగత్సింహుఁడు దఢోవదనుఁడై యించుక సేపు యోచించి పిదప "మీరిన్నిదినములనుండి యిట నెందులకుంటిరి.?" అని యడిగెను.

అభి—నిన్నుఁ జూడవలయునను నాశచేతను నీవువిడివడుట కైన నుపాయమునాలోచింపవలయుననియు నుంటిని.

జగ—మీ మొదటియాశ యెట్లుసఫలమైనది?

అభి—కారాగారరక్షకునకు విశేషబహుమానముచేసి వశముచేసికొని కొంచెముసేపుమాత్రము నిన్నుఁ జూచుట కాజ్ఞనియనుమతిని బడసితిని.

జగ—మీ రెండవప్రయత్నము సఫలమగునని తోఁచుటలేదు. మీరావిషయమున వ్యర్థముగా శ్రమపడ నభిలషింపుచున్నారు.

అభిరామస్వామి తనజోలెనుండి యొకకాగితమునుదీసి "నిరాశ పొందవలదు. నిజముగా నారెండవయాశయు సఫలముకాఁగలదు. నీవీ కాగితముపైఁ జేవ్రాలుంచుము. నేను లేఖినిని సిరాను దెచ్చితిని. షాదుషహా దర్బారునందు నాప్రయత్నము నిష్ఫలము కానేరదు" అనియెను.

జగ—అచట ప్రయత్నముచేసినచో మనయాశ సఫలీకృతము కాఁగలదనుమాట నిజమే కాని యాకార్య మెవరివలన నిర్వహింపఁ బడును ? మీ రెవరిసాహాయ్యమును బడసితిరి ?

అభి—ఎవరీకార్యమును జేకొనియుండిరో, యెవ్వరియుత్సాహ ప్రయత్నములచే నేనిప్పుడీకార్యమును జేయుచుంటినో, యెవరియర్థ వ్యయమువలనను నత్యాసక్తి వలనను మనకార్యములన్నియు నెరవేర్పఁబడుచుండెనో, యావ్యక్తియే సమస్తమును నెరవేర్చునని నాకు నమ్మికముున్నది.

జగ—ఆవ్యక్తి యెవరు ?

అభి—నవాబునందిని—అయేషా

జగత్సింహుం డాశ్చర్యముతో "అయేషాయా? ఆమె సాహాయ్యమును మీరెట్లుబడయఁగలిగితిరి?" అని యడిగెను.

అభి—నేను బడయలేదు. ఆమెనిన్ను చెఱసాలనుండి విడిపించుటకై ప్రాణాంతప్రయత్నములను జేయుచున్నది. ఆమెయే యిప్పుడు నాకధికారిణియైయున్నది. ఆమె యిప్పుడు పాట్నానగరమునందున్నది నీవిజ్ఞాపనమును దీసికొని యామె స్వయముగా డిల్లికేగును. అచ్చట సర్వమును చక్కఁజేసికొనవచ్చును. నీవిజ్ఞాపన మర్పించుటతోడనే నిన్నిచెఱసాలనుండి విముక్తిచేయుట కాజ్ఞకాఁగలదు. అందులకు సందేహములేదు.

జగత్సింహుఁడు తనలో "అయేషా! చిరహితైషిణివైన యో యయేషా! నిశ్రమ నిశ్చయముగా సఫలముకాఁగలదు. కృతఘ్నుఁడైన యీనరాధముని కొఱ కిచ్చటకువచ్చి నీవశేషకష్టములననుభవించుచున్నావు. ఈఋణమును జన్మజన్మాంతరములయందైనను నే దీర్పజాలను." అని యనుకొని ప్రకాశముగా "స్వామీ! అయేషా సందర్శనముసేయుట కీనిర్భాగ్యున కేయుపాయమునులేదా?' అని యడిగెను.

అభి—ఉపాయమున్నను నవాబునందిని నిన్నుఁజూచుట కిష్టపడుట లేదు. పరస్పరసందర్శన మిరువురకును క్లేశకారణమని యామె దృఢాభిప్రాయము. నీనిమిత్తము ప్రాణములను విడుచుటకుఁగూడ నామెసిద్ధముగానున్నది. కాని, నిన్నుఁజూచుటకు మాత్రమామె కించుకంతయు నిష్టములేదు తక్కినమాటలను సమయాంతరమునఁ దెలిపెదను ఆలస్యముచేయకుండ నీవీకాగితముపైఁ జేవ్రాలుంచుము.

స్వామి తెచ్చినలేఖినితో నాతఁడాకాగితముపై వ్రాలుచేసెను. స్వామియు నాకాగితమును బుచ్చుకొని నలఁగిపోకుండ జోలెయందు పెట్టుకొనియెను.

కారా—సన్యాసిగారూ! చాలసేపైనది. ఇంతసేపిటనుండుటకు మనము మొదట మాటలాడుకొని యుండలేదు.

అభి—పోయెదను యువరాజా! నాకుసెలవిమ్ము. భగవంతుని కృపచే శీఘ్రముగనే శుభసమాచారమును దీసికొని మరలనిన్నుఁజూడ గలుగుదునను ధైర్యముతో నున్నాఁడను.

జగత్సింహుఁడు వందనముచేసెను. సన్న్యాసి వెడలిపోయెను.

రెండవ ప్రకరణము.

మానసింహ మహారాజు సైన్యసమేతుఁడై శ్రీక్షేత్రమునుండి పాట్నానగరమునకుఁ బోయి యట నియమితకర్తవ్య కార్యములయందు నివిష్టచిత్తుఁడయ్యెను మహారాజుతోఁగూడ శ్రీక్షేత్రయాత్రకుఁబోయిన వారందఱును దిరిగివచ్చిరి. ఇంకొకవ్యక్తి కూడ నధికముగా వారితోవచ్చి యుండెను ఆవ్యక్తి మహారాజునాదరమునకును స్నేహమునకును బాత్రమైనరాజలక్ష్మి.

మహారాజు వెనుదిరిగివచ్చుటయేమో నిజమే. కాని, యాతని చిత్తప్రసన్నతమాత్రము మొరిస్సాసముద్రమునందు విడిచిపెట్టఁబడినది. దానికేమికారణమో చెప్పుటకువీలులేదు. ఒకవేళ నాతఁడాప్రసన్నతను జగన్నాథస్వామిపాద సమీపమున విడిచిపెట్టివచ్చి యుండవచ్చును

మొగలులకును బఠానులకును జరిగిన సంధిసంబంధముచే మానసింహుఁడు కొన్నిదినములవరకును నిశ్చింతుఁడైయుండెనుగాదా! ఆసంధిబంధము శీఘ్రకాలములోనే భంగమైపోవునను విషయమునందాతని కిసుమంతయు సందియములేదు కాని, యదియెవరిదోషము ? అస్మాన్ ఖాన్ మానసింహులిరువురిలో సంధిభగ్నము సేయుటకుఁగారకులెవరు ? దానికిబఠానులే కారకులనుటకు సందేహములేదు. పఠానులు మిగుల నుద్ధతులు. అస్థిరచిత్తులు అందుచేవారీసంధిబంధమునకు లోఁబడియుండ జాలరని సులభముగాఁ దెలిసికొనవచ్చును. విశేషించి యస్మాన్ ఖాన్ శౌర్యసాహసములందసదృశుఁడు అక్లీవీరత్వమునందును దృఢత్వమునందును వందఱకాశ్చర్యమును బుట్టించుచుండువాఁడు. అట్టివానియధికార

మునకున్న సైనికు లొకేవిధముగ సంతుష్టులై యుండఁజాలరా ? మాన సింహాదులే—అనఁగా మొగలాయిపక్షమువారే సంధినియమముల నుల్లంఘించి కళంకమును దెచ్చిపెట్టికొని రనుమాట నిజము. అందుచేఁ దప్పున్నను, లేకపోయినను సంధిని ద్రుణీకరించిన విషయమునఁ బఠానులే యపరాధులని చరిత్రము యందేమేమో వ్రాయఁబడినది.

అయిననీసందర్భమున నొకవిషయముమాత్రము బాగుగాజ్ఞప్తియం దుంచుకొనవలసియున్నది మానసింహు. డుద్ధతస్వభావముతో నస్మాక్ ఖానునకు వ్రాసిన యుత్తరమునందు "నీవు నీరాజ్యపుటెల్లకడకువచ్చి నాయాగమనమును నిరీక్షించుచు నన్నెదురుకొనవలయు" ననివ్రా యుటయుక్తమేనా ? పూరిక్షేత్రమునఁ దనదర్శనమునకు వచ్చినప్పుడ స్మాక్ఖానుఁతోఁ ద్రుణీకారభావమున మాటాడఁదొడంగుట మానసిం హునకుచితమేనా ? మానసింహుఁడీరీతి ప్రశ్నలనుగూర్చి తనహృదయ మున మాటిమాటికి యోచనలఁ జేయనారంభించెను. అందుచే నాతని హృదయము ప్రసన్నమైయుండలేదు.

మానసింహుఁడు కుమారజగత్సింహునకు యావజ్జీవకారాగార వాసశిక్ష విధించియుండెను. వీరపురుషున కుచితమగురీతి నాతఁడుకార్య మునేమో చేసివైచెను. దానికిసందేహములేదు. ఆతని యానిష్పాక్షిక కార్యానుష్ఠానమునకు సమస్తసైన్యాధిపతులు, సైనికులు, నాయకులు, సేవకులు, నందరును నాశ్చర్యపడిరి. వారిసమక్షమున నాతనికర్తవ్య పరాయణతయు, గౌరవమును మిక్కిలియభివృద్ధిఁజెందినవి. అక్బరుషాదు షహాసైతము వీరోచితమైన యాకృత్యమునుజూచి హృదయమునందు మానసింహునిగూర్చి మిక్కిలి మెచ్చుకొనియెను. జరిగినదంతయునుత్త మమేయగును. కాని యందువలన నాతనిహృదయము ప్రసన్నతవహించి నదా? యావనవయోధర్మముచేఁ బ్రకృతికి వశమైపోయినప్పుడుజరిగిన యపరాధములకై యోగ్యుఁడైన వీరపుత్రునకు యావజ్జీవకారాగారవాస శిక్ష విధించుట తండ్రికుచితమైన కార్యమేనా ? అత్యంతకూరతమ మైన యాయాజ్ఞను జేసినప్పటినుండియు మానసింహునిహృదయమునకు స్తిమితభావములేదు. కాని తనహృదయాందోళనము నాతఁడు మాటల చేఁగాని ప్రవర్తనచేఁగాని వ్యక్తపడనిచ్చుటలేదు. ఒకనాఁడు మహారాజ్ఞి

ఊర్మిళాదేవి సాహసించి సాశ్రునయనయై మహారాజుకడ జగత్సింహుని పక్షమున క్షమాపణమును వేఁడుకొనియెను మహారాజందువలన సంతుష్టచిత్తుఁడుకాలేదు అందుచే నాటనుండియు జగత్సింహుని ప్రస్తావన మడఁగిపోయెను.

కొన్నిదినములకుఁ బూర్వము పూరినగరమునందు, అస్మాన్ ఖాను జగత్సింహుని ప్రస్తావనను దెచ్చెను అత్యంతోదారస్వభావముతో నస్మాన్ ఖాను జగత్సింహుఁ డన్నివిషయములయందుఁ గాకపోయిననొక్క విషయమున మాత్రము నిర్దోషియని స్పష్టముగా వాక్రుచ్చి సమర్థించియుండెను. జగత్సింహుఁడు బుద్ధిపూర్వకముగఁ గాకపోయినను, విధివశముచే బరిణయవిషయమున నస్మాన్ ఖానునకుఁ బ్రతిద్వంద్వియైయుండెను అట్టి శత్రుఁడైనను జగత్సింహుని నిర్దోషిత్వమును బ్రకటించుటకై శ్రమపడి వచ్చిన యస్మాన్ ఖాను గొప్పపరాకాష్టగలవాఁడని తోఁచుచున్నది. ఆవిషయమున నస్మాన్ ఖానొక గొప్పమహానుభావుఁడని మానసింహుఁడు గ్రహించెను

నవాబుకన్యయాదలి పరిణయవిషయమున జగత్సింహుఁ డెట్లు నిరపరాధియో యట్లే తక్కినవిషయములయందుఁగూడ నాతఁడు నిరపరాధియైయుండుట యసంభవముగానేరదు జగత్సింహు నాకస్మికముగాఁ బట్టి బంధించి కారాగారమునఁ ద్రోసివేసిరి. సంగతుల నన్నిటిని రుజువుచేసి తన నిర్దోషతను స్థాపించుకొనుటకు జగత్సింహున కవకాశమీయలేదు ఆతఁడు దోషియని నిర్ధారణసేయఁబడిన రాజకీయవిషయములనుగూర్చి యవకాశమిచ్చి విచారణజరిపినను బాగుగ నుండును. అందులకు నవకాశమీయలేదు. విచారణయును లేదు.

ఒక్కతప్పుమాత్రము సహింపవీలులేనిది. క్షమింపనర్హము గానిది. జగత్సింహుఁడు తండ్రికిఁ దెలియకుండ వీరేంద్రసింహునితనయను బరిణయమాడెను ఆకార్యమతిగర్హితమైన దైనను దానికి యావజ్జీవకారాగారవాస శిక్షమాత్ర ముచితమైనది కాదు. ఇట్లుయోచించుకొనుచుండ మానసింహునకుఁ దనయౌవనప్రారంభకాలమున జరగిన యొకవిషయము జ్ఞప్తికివచ్చెను. తోడనే యాతఁడించుక లజ్జవడియెను.

విచారముచే నస్వస్థహృదయుఁడైన మానసింహుఁ డూర్మిళా దేవిమందిరమున కేగెను ద్వారముకడ కేగునప్పటి కూర్మిళయుఁ జిఱు నగవుతోఁగూడిన వదనముతో నాతని కెదు రేగి దర్శన మొసంగెను.

మాన—మహారాజ్ఞీ ! ఒంటరిగఁ గూర్చుంటి వేమి ? నీరాజ లక్ష్మియేది ?

ఊ—నా రాజలక్ష్మియా ? అట్లయినచో రాజలక్ష్మికిని మీ కును నేమియు సంబంధములేదా ?

మాన—అట్లుచెప్పరాదు. రాజలక్ష్మి కేవలము నాయాదరము నకుఁ బాత్రురాలు నేనామెను జాలఁ బ్రీతితో గారవించుచుందును. ఏది రాజలక్ష్మి ?

మహారాజు మంచముపైఁ గూర్చుండి పిదప పండుకొనియెను.

ఊ—మీరు వచ్చితిరని యెఱింగి కాలుచేతులును ముఖము ను గడిగికొనుటకై చల్లనినీటిని దీసికొనిరావలయునని వెళ్లినది. నీరు సరిగా లేకపోయినచో మీరాగ్రహపడెదరు.

మా—ఔను. నిజము. సేవకురాండ్రు నీటియందు గులాబి యత్తరువును గర్పూరమును జేర్చి మిగులఁ గటువుగాఁ జేసి తీసికొని వచ్చెదరు ఆనీటిని నోటఁబోసికొన నెవరికి సాధ్యము ? రాజలక్ష్మి యట్లుచేయదు. అన్నియును జక్కఁగాఁ జేయుచుండును. మనఃపూ ర్వకమైనభక్తితో నామె నాసేవను జేయుచుండును. నేనాబిడ్డను మిగులప్రీతితోఁ జూచుచున్నాను.

మహారాజు తుదిమాటముగియకుండగనే రాజలక్ష్మి నీటినిదీసి కొని లోపలకు వచ్చెను. మానసింహునియావాక్యమామె చెవిని బడి యెను. తనసంబంధమైనప్రస్తావన జరుగుచున్నదని గ్రహించెను. లజ్జయు నానందమును జేరుటచే నామెముఖము విశేషకాంతిని దాల్చెను.

ఊ—ఏలిక రాజలక్ష్మిని ప్రీతితోఁ జూచుచున్నారు. అది యామెయదృష్టమే యగును. కాని, నేనేమిచేయవలయునో యది నాకు గోచరించుటలేదు. మహారాజునకుఁ జాలసంతోసమున్నది.

వారందఱును నన్ను తల్లివలెనే భక్తితోఁ జూచుచున్నారు. కాని, రాజలక్ష్మి నన్ను "అమ్మా!" యనిపిలుచుచుండును. ఆమెప్రేమాస్పదములగు భక్తిశ్రద్ధలనుజూచి నేనామె నౌరసతనయగా భావించుకొనుచున్నాను. ఇట్టితల్లిగానుండు సుఖమును నేనిదివఱకెన్నఁడు ననుభవించియుండలేదు.

ఇట్లు చెప్పునప్పుడా మహారాజ్ఞినేత్రములు జలభారాకులములయ్యెను. కంఠస్వరము సంక్షుబ్ధమయ్యెను.

మాన—రాజలక్ష్మి నిశ్చయముగా మిగులస్నేహపాత్రురాలుఁ నీవామెను నీయంతఃపురమునందలి పరివారములో నొకతెనుగాఁ జేర్చుకొనుటుచితము. నేనావిషయమున నిప్పుడేయేర్పాట్లు చేసెదను.

ఊ—అదియెట్లగును? మహారాజా!

మాన—రాజలక్ష్మి తలిదండ్రుల కామెను మనయొద్దనుంచునట్లుత్తరవుల నొసంగెదను.

ఊ—రాజలక్ష్మిసంబంధులెవరును నీవిషయమునుగూర్చి యాక్షేపింపరని నాయభిప్రాయము.

మాన—అట్లయినచో నీకళవళమునకుఁ గారణమేమి?

ఊ—రాజలక్ష్మిని మనయొద్దనుంచుకొనుట మనకెంతయావశ్యకమో, యామెసౌఖ్యమునుగూర్చి యోచించుటయు మనకంతయావశ్యకమే రాజలక్ష్మి రూపమునందును, గుణమునందును, ననదృశురాలే కాని యొక్క విషయమునందుమాత్ర మామె దురదృష్టవంతురాలు ఆమెభర్త యామెను గ్రహింపఁడు.

మాన—ఏల?

ఊ—భర్త మొట్టమొదట నెంతో యాదరముతో నామెను బరిణయమైనాఁడు. ఎంతో మమతతో [illegible] జేబట్టినాఁడు. కాని, యిప్పుడామె నీచవంశసంజాతయనుకారణముచే గ్రహించుటకయోగ్యయని చెప్పుచున్నాఁడు.

మాన—ఏమి? వంశసంబంధమైనదోష మేమైన నున్నదియా యేమి?

ఊ:—నేనెఱిగియున్నంతవఱ కంతటిదోషమేమియు నున్నట్లు కాన్పింపదు. ఒకవేళ దోషమున్నను నాబిడ్డచేసిన యపరాధ మేమున్నది ? రాజలక్ష్మి సాక్షాల్లక్ష్మీస్వరూప యనుటకు సందియము లేదు. వంశ దోషముమాటఁబట్టుకొని గుణవతియైనభార్యను విడనాడుట భర్తకు న్యాయమేనా?

మాన—నిజముగా భర్తయట్లుచెప్పి విడనాడుట మిగులగర్హింపదగినకార్యము, కేవలమధర్మము. ఏకారణముచేతను నట్టిగుణవతియైన భార్యను గష్టపెట్టుట భర్తకుఁగాని యాతనిస్వజనులకుఁగాని యుచితముకాదు. రాజలక్ష్మి భర్త యెవరు ? ఏమిపనిచేయుచున్నాఁడు ?

ఊ:—మీపరిపాలనమునందు మీకధీనుఁడైన యొకసైనికుఁడుగా నున్నాఁడు. ఆర్యపుత్రు లనుగ్రహించినచో రాజలక్ష్మి కష్టములు దూరమైపోవును

మాన—నాకధీనుఁడైన సైనికుఁడేనా ? అట్లయినచో నందులకుఁ దగినయేర్పాటులను గావించెదను. ఆమెభర్తను నాతనియాత్మీయబంధువుల నొప్పించి యామెనాదరముతో గ్రహించుటకు, దగిన యేర్పాటులు చేసెదను. అదనిశ్చయమని నమ్ముము నీవావిషయమున నిశ్చింతవైయుండవచ్చును. కాని యందువలన మనకేమిజరుగును ? రాజలక్ష్మి భర్త యామెనుగ్రహించినచో భర్తతోడ నామెయు పోవునుగదా ! నీసమీపమున నామెయుండుటెట్లు ? నీవామెకుఁ దల్లివైనందున.గలుగు సౌఖ్యములన్నియు నంతటితోఁ దుదముట్టునుగదా !

ఊ:—మహారాజా ! అదేమి ? మీయనుగ్రహముచే నన్నియును సుఖమయములేయగును ఆసైనికుఁడు మీసమీపముననే యుండును. ఈబిడ్డయు మనయొద్దనేయుండును. ఆమెముఖమున హాసముపొంగిపొరలుటను నేనుచూచుచుందును. ఆమెసుఖమున నాసుఖమున్నది పగలంతయు రాజలక్ష్మి మహారాజుసేవయందుండును. అప్పుడు నాసంతోషమునకు మితియుండదు. మహారాజా ! మీరు పరమధార్మికులు. న్యాయశీలురు. ధర్మపరాయణులు. దయయుంచి రాజలక్ష్మి దుఃఖములను దూరముచేయరా ? మీచరణముల నాశ్రయించియున్న యీదీనురాలిప్రార్థనమును జెవియిచ్చి యాలకింపరా ?

మహారాజ్ఞి నేత్రము లనుండి బాష్పములు ప్రవహించుచుండెను. మానసింహుఁ డత్యంతాదరభావముతో నామెహస్తమును బట్టుకొని యిట్లు చెప్పఁదొడంగెను. "మహారాజ్ఞీ! నేను నిశ్చయముగా నీమనోరథము నీడేర్చెదను. దాని కేయాక్షేపణమును బ్రతివాదమును జెప్పను. నీయిష్టానుసారముగా రాజలక్ష్మిని సుఖవతినిగాఁ జేయుట కెట్టికార్యమైనను జేయరానిదిగాఁ దలంపను. అందుచే సరివారిలోఁ గాని సాధారణులతోఁగాని నేను హీనుఁడనుగాఁ బరిగణింపఁ బడుట తటస్థించినను, జన సమాజమునుండి బహిష్కరింపఁబడుట సంభవించినను నేనావిషయమున వెనుదీయను.

మహారాజ్ఞి చీరనుసవరించుకొని మానసింహుని చరణములను బట్టుకొని "మహాప్రభూ! అట్లయినచోఁ దిలోత్తమను మీకోడలినిగా గ్రహించి మీప్రతిజ్ఞను గాపాడవలయును" అని వేడుకొనియెను.

తత్క్షణమే రాజలక్ష్మియు నశ్రులోచనయై వచ్చి మహారాజు పాదములపై శిరసునిడి యశ్రువర్షమును గురియింపఁదొడంగెను.

మానసింహుఁ డాశ్చర్యముతో "నాకుఁగోడలా? అదేమి మాటయూర్మిళా!" అనియెను.

ఊర్మిళ చేతులుముకుళించుకొని "ప్రభూ! ఔను. రాజలక్ష్మి జగత్సింహునకు వివాహితయైనధర్మపత్ని" అనియెను.

మాన—అట్లయినచో రాజలక్ష్మి వీరేంద్రసింహుని తనయయా? ఓహోహో! ఈమె పేరు తిలోత్తమయా?

ఊ—ఈరాజకులవధువు పేరు తిలోత్తమయే.

మానసింహుఁడు చాలసేపుతలవాల్చుకొని చింతించి పిదప నిట్లనియెను. "ప్రియా! వినుము. నీదీనప్రార్థనమును నేను నిరాకరింపను. నేనాడినమాట నసత్యముచేయను. తిలోత్తను నాకుఁ గోడలగుటకు సర్వవిధముల యోగ్యురాలు. దాని కిసుమంతయు సందియము లేదు. నేనామెను సమాదరభావముతో గ్రహించెదను. ఇది మొదలు తిలోత్తమకు రాజమహిషీకిచితమైనే యుచితమర్యాదలన్నియు

సరిగాజరుగున ట్లేర్పాటుచేసెదను. ఇఁకమీఁదామె నిత్యమును నీతో నుండఁగలదు ”

తిలోత్తమయుఁ గన్నీళ్ళనుతుడిచికొని గద్గదకంఠయై మానసింహునిపాదధూళిని గ్రహించి శిరసునధరించుకొని దూరముగాఁబోయి ముఖమును జీరచెఱఁగుచేమూసికొని యేడువఁదొడఁగెను. ఊర్మిళయు మహారాజుచరణసాన్నిధ్యమునుండి దూరముగావచ్చి యాతనికిఁ బ్రణామముచేసి “ఈదాసి చిరకాలమునుండియు మహారాజు కరుణాలాభముచేఁ జరితార్థయగుచున్నది. ఇప్పుడు చూపిన యీయనుగ్రహమీదాసిజీవనాంతమువఱకును మఱచిపోవదు. ఇది చిరస్మరణీయమైన కార్యము” అని విన్నవించెను.

మాన — అమ్మా ! రాజలక్ష్మి ! నీవిప్పుడు నిజముగా నాకుఁ దల్లివి. మాతృకార్యమును జేయుము. నాకాఁకలివేయుచున్నది. అమ్మా! భోజనమును సిద్ధపరుపుము.

తిలోత్తమయు నాతని భోజనవిషయమునఁ దగినయేర్పాట్లను జేయుటకు వెడలిపోయెను.

మూఁడవ ప్రకరణము

పాట్నానగరమునకువచ్చిన కొన్నిదినములకుఁ బిదప మహారాజు పాట్నానగరమందొకధనికుఁడగు పఠానునిగృహమున నతిథిభావముతో నవాబు కటుల్ఖానుని తనయయగు నయేషా వచ్చియున్నదను సమాచారమును గూఢచారులమూలమునఁ దెలిసికొనియెను మానసింహుఁడాసమాచారమునుగూర్చి యనేకవిధముల నాలోచింపఁదొడంగెను. కాని; యందుమూలమున నేమేనియాపద సంభవింపనున్నదని గాని, తాను ముందుగ మేల్కొని చేయవలసినకార్యము లున్నవని గాని యాతనికిఁ దోఁచలేదు. ఒరిస్సా దేశపు పఠానులకును మొగలులకును సంధిసంబంధములున్నవి. అందుచేఁబఠానులు సామాన్యులుగాని,

గొప్పవారుగాని, మొగలాయీలరాజ్యములోనికి వచ్చుచుం బోవుచు నుండవచ్చును. అందులకాక్షేపణ మేమియు లేదు. కాని నవాబునందిని, సుబేదారునకు సమాచార మెవరిచ్చేనైన నందఁజేసినచో యథారీతిగ నామె నెదుర్కొని యామెకుం దగినబిడారములు మున్నగునవి సిద్ధముచేసి కుశలవార్త నరసి యామెపటకుటీరములోపలకుం గావలసినవాని నన్నిఁటిని కూడఁబెట్టి పంపుట మానసింహున కావశ్యకమై యుండును. కాని యామె యాభావముతో రాకపోవుటచే నాసంబంధమున మానసింహుఁడు చేయవలసినదేమియు లేకపోయెను.

పఠాను లనేకులు పాట్నానగరమునం దమతమకార్యములకొఱకు నివసించియుండిరి. అనేకు లున్నతస్థితియందుండుటయేగాక వారిలోఁ జాలమంది భోగుల సంభ్రమశాలులై యుండిరి. భారతవర్షమునందు మొగలులకును బఠానులకును గల వివాదము చాలదినములకుఁబూర్వమే ముగిసిపోయినది ఢిల్లీసింహాసన మిబ్రహింలోడీతోఁ బఠానుల చేతి నుండి వీడిపోయినది. దావూదుఖాను బంగాళాదేశపు సింహాసనమును బోఁగొట్టుకొని యొరిస్సాదేశమునకుఁ బలాయనుండయ్యెను. ఒరిస్సాదేశమునం బఠానులు స్వాధీనత్వకై యిప్పుడును యుద్ధములో మగ్నులై యున్నవారు. కాని, బంగాళాదేశపు బఠాను లనేకదినములనుండి తమయప్రతిమానవిధేయునియత్రి కధీనులై మొగలాయీలప్రజలై యుండిరి. బంగాళాదేశమందలి పఠానులు మనస్సునందు లేకపోయినను బైకసంతోషాగ్నిని బయల్పడనీక యంతఃమనోని జీవయాత్రను గడపుకొనుచుండిరి. అందుచే నయేషా రహస్యాగమనమును, బఠానుని గృహనివాసమును మానసింహుని సందేహమున కవకాశమును గల్గింప లేదు.

ఒకవారమైనపిదప భయానకమైన యొకవార్త మానసింహుని చెవులఁ బడియెను. దానితో నాతనిశాంతియంతయు ధ్వంసమైపోయెను. నవాబస్మాన్‌ఖానును సులేమాన్‌ఖానును వచ్చి పూరినగరమును ముట్టడించినారనియు, రామచంద్రమహారాజు పలాయనుఁడైనాఁడనియు నాతనికి వార్తవచ్చెను.

ఆవార్తనిజమైనది. అస్మాన్‌ఖాను సంధివిషయమున మొదటి నుండియు నసంతుష్టచిత్తుఁడై యున్నాఁడని మనమెఱుంగుదుము. మానసింహుని వ్యవహారమునెడల నాతఁ డత్యంతవిరక్తుఁడై యున్నాఁ డనికూడ మనమెఱింగియున్నాము. అతని సోదరుఁడగు సులేమాన్‌ఖా నావృత్తాంతముఁ నన్నిఁటిని విని యుత్తేజితుఁడై సంధిబంధములను ద్రెంపి వేయుట కంగీకరించెను మానసింహుఁడు వెడలిపోయిన కొన్నిదిన ములలోపలనే వారిరువురును పూరిపట్టణమును ముట్టడించిరి.

అస్మాన్‌ఖానునియుద్ధతభావము మానసింహునకుఁ జాలవిరక్తిని గల్గించెను. ఆతఁ డొక్కమారుగఁ బఠానుల నందఱ నేలఁగలిపి ప్రపంచమునఁ బఠానుశబ్దము లేకుండఁ జేయవలయునని సంకల్పించుకొని తానే స్వయముగ నొరిస్సాపైకి యుద్ధమునకుఁ బోవలయునని నిశ్చయము చేసికొనియెను. సైన్యముఁనకును సేనాధిపతులకును సిద్ధముగా నుండవలయునని యుత్తరువులఁ జేసెను.

పఠానుల నందువిశేషించి యస్మాన్‌ఖానునిజయించి మర్మపీడితుం నిగాఁజేయుట కొక్కయుపాయమున్నది. అయేషా యాతని యంతఃపురము నంతంతయాదరభావముతో నుండకపోయినను నస్మానుఖానున కామెయత్యంతము ప్రణయభాజనమై యుండెను. అందుచే నామెనవరోధించిరేని యస్మాన్‌ఖానునకుఁగాతర మధికమగును. అప్పుడాతని యుద్ధమున సర్వనాశనము సేయవచ్చును. ఆతనిని సులభముగాఁ గథ తేర్చుటకు సుకరముగనున్న యీయుపాయమును విడిచిపెట్టుటకు మానసింహున కిష్టముఁ లేకపోయెను.

అయేషా ప్రచ్ఛన్నభావముతోఁ దాజఖానను వాని యింటవాసముసేయుచుండెను. తాజఖాను,కటుల్‌ఖానుని కాశ్మీరబీగమునకు సమీపబంధువుఁడు. ఆసంబంధముచేఁ దాజఖానును నాతనిభార్యయు నప్పుడప్పుడు కటుల్‌ఖానుని మందిరమునకుఁ బోయివచ్చుచుండెడివారు. అందుచే వారియందయేషా మిగులగౌరవమును నభిమానమును, బంధుభావమును గలిగియుండెను. ఆకారణముచే దాజఖానునిభార్య యయేషాను దనయింటకిరమ్మని తఱచు వేఁడుకొనుచుండెను. చాలకాలమునకిప్పుడాకస్మికముగ నయేషాయామెకుత్తరమును వ్రాసి పాట్నానగరమునకు

వచ్చెను. తాజఖానుఁడు నాతనిభార్యయు నామె నత్యంతగౌరవముతోఁ జూచుచుండిరి. అయేషాయును నచ్చట మిగుల నానందముతోఁ గాలము గడపుచుండెను.

సాయంకాలమైనపిదప మొగలాయిసైనికులువచ్చి తాజఖానుని గృహమును ముట్టడించిరి తాజఖానేసంగతియు నెఱుఁగడు. అందుచే నాతఁడానిగ్రహమునకుఁ గారణమునుగూర్చి తెలిసికొనఁ బ్రయత్నించెను. కాని, ముట్టడివేసినవారిలో నెవరును దానికిఁగల కారణమును దెలుపఁజాలకపోయిరి, తాజఖాను మహారాజు దర్శనముచేసికొనుట కనుజ్ఞ వేఁడికొనియెను. ముట్టడివైచినవారందుల కంగీకరించిరి.

మఱునాఁడు ప్రాతఃకాలమున భటులచేఁ బరివేష్టితుఁడై తాజఖాను బంగాళాబీహారు దేశములకు సుబేదారయిన మానసింహునికడకు బోయెను. అతనిగృహమునందు నవాబుకటుల్‌ఖానుని తనయ యున్న దనియు నామెను బట్టుకొనుటకై ముట్టడివైవఁబడినదనియు నవాబునందినిని మొగలాయీల కప్పగించినచో ముట్టడిమానవేయఁబడుననియుఁ దాజఖానున కెఱింగించిరి. ఆప్రస్తావనము కేవల మసంగతముగానున్న దని తాజఖాను తనహృదయమున ననుకొని తానువర్తకముచేసి కొనువాఁడననియు ననేకులు తనయింటికెప్పుడును వచ్చుచుఁ బోవుచుందురనియు నది నిలిచిపోయినచోఁ దనకును నితరులకును విశేషధననష్టము సంభవించుననియు మహారాజునకు విన్నవించుకొనియెను మానసింహుఁ డయేషానొప్పింపకపోయినచో నేమాటలను విననొల్లననియు అయేషాకేవిధమగు నమర్యాదయును జరుగదనియు నామెస్థితికిఁ దగినమర్యాదలతో నంతఃపురమున నుంచెదననియుఁ దాజఖానునకు తెలియఁజేసెను తాజఖాను "నాప్రాణముల నెవరైనఁ గైకొనినను సరియే కాని, యింటికి వచ్చినయామెను విడువనొల్ల"నని విన్నవించెను. అందుచే నాతఁడుభటులతోఁగూడ మరల నింటికిఁదీసికొనిపోఁబడియెను.

అయేషా కీసమాచారములన్నియుఁ దెలియవచ్చెను. ఆమె తాజఖానునికడ కేగి తనకు మానసింహునిఁ జూడవలసి యున్నదని చెప్పెను. చూచుటకుఁ గాలమును స్థలము నేర్పడియెను. యథాసమయమున నిరువురు పరిచారికలు తాజఖానుని సమేతముగా భటులచేఁ

బరివేష్టితమైన శిబిక నిరీక్షస్థలమునకుఁ బోయెను. నిశ్చితహృదయయై యసంకుచితభావముతో నయేషా మానసింహుని కెదురుగవచ్చి నిలుచుండెను.

సజీవదేవీమూర్తియే గౌరవముతోఁ దనశోభామహిమలను బ్రసరింపఁజేయుచు ముందునునకువచ్చియున్నదని మానసింహునకుఁ దోఁచెను. ఆమెసమీపమునకువచ్చినతోడనే మానసింహుఁడు "అమ్మా! నీవునాతనయవు నేను రాజనీతిప్రయోజనార్థము నీకుఁ గష్టములను గలుగఁజేయవలసివచ్చినది. నీవు నాతనయవని భావించుచున్నాఁడను అందుచేఁ నీవు జెప్పవలసినదానిని నిస్సంకోచభావముతోఁ జెప్పవచ్చును." అనియెను.

అ—తండ్రీ! మీరు నన్నవరోధించుటకు నిశ్చయించినట్లున్నది. తండ్రియవరోధమునందు (అంతఃపురమునందు) తనయ స్వల్పకాలము వాసముసేయుట యసంగతముకాదు. నేను సంతుష్టచిత్తనై మీయంతఃపురమున నివసించియుండెదను. ఆసంబంధమున నేను చెప్పవలసిన దేమియును లేదు.

మా—నీవు చెప్పవలసిన దేమియును లేదు. కాని నేను వినవలసినది చాలఁగనున్నది. నీవు నాప్రశ్నలకు నిజమైనయుత్తరముల నొసంగితివేని నేను సుఖినయ్యెదను.

అ—అయేషా జీవితమునందు దాచియుంచఁదగిన ఘటనము లేవియు లేవు. ఆకారణమున నసత్యములను నుడువుటకు కించుకంతయు నావశ్యకము లేదు. మీరు వినవలసినసంగతుల నడుగవచ్చును.

మా—నీవు నీయాత్మీయులనువీడి యొరిస్సానుండి పాట్నానగరమున కేలవచ్చితివి?

అ—(కొంచెముయోచించి) నిజమునే జెప్పెదను. మీకొమరుఁడైన జగత్సింహుని చెఱనుండివిడిపించవలయునను నభిప్రాయముతో నిటకు వచ్చితిని.

మానసింహుఁడు తనపుత్రుని కారాగారవిముక్తికై యించుక వ్యాకులపడుచుండెను పైకి వెల్లడిచేయకపోయినను హృదయమునం

దంపుల కుపాయములను వెదకుచుండెను. ఇప్పుడంపులకు సహజమైన సనుపాయము దొరకినదని మనస్సునందు సంతుష్టుడయ్యెను.

మా—నీవందుల కేయుపాయముల నవలంబించుచున్నావు ?

అ——యువరాజుకడనుండి పాదుషహాకు విజ్ఞాపనపత్రికను బంపించుట—

మా——నేను సుబేదారుఁడను. నాకుఁ దెలియకుండ పాదుషహాకు విజ్ఞాపనపంపుటకుఁ బ్రియత్నమేలచేసితివి?

అ—మీవలన నీవిషయమున నేయుపకారమును జరుగదు. మీరు స్వయముగా బహిరంగమైనసభలోఁగూర్చుండి యపరాధియని నిశ్చయించి యువరాజునకు దండవిధానమును జేసియేయున్నారు. ఆ మొదటియాజ్ఞకు విరోధముగాఁ జేయుటకు మీకిప్పుడిష్టముండదు. ఒక వేళ నిష్టపడినచో సర్వత్ర సమాదృతమై విఖ్యాతినొందిన మీనామ మత్యంతపరిహాసమునకు గుఱియైపోవును. మహారాజుగారి మర్యాదను గ్రహించి రాజపుత్రుని యావేదనపత్రమును నాతని జనకునియొద్ద సమర్పింపక తండ్రికంటె నుచ్చపదస్థుఁడగు పాదుషహాకడ కంపుటకు నిర్ధారణచేసితిని.

అయేషాయిచ్చిన ప్రత్యుత్తరమునకు మహారాజుపరితుష్టుఁడై "ఆవేదనపత్రము సిద్ధమగుటకవకాశము కావలదా?" అనియడిగెను.

అ——ఆవేదనపత్రము సిద్ధమై కుమారజగత్సింహుని చేవ్రాలుంపఁబడి వెడలిపోయినది. అది యిప్పుడే ప్రయాగనుదాటి ముందునకుఁ బోయియుండవచ్చును.

మా—ఆకాగితము కారాబద్ధుఁడైయున్న జగత్సింహునిదొంగ చేవ్రాలుంపబడినదియా ?

అ—లేదు. మహారాజా ! దొంగచేవ్రాలుచేయుట కగత్యము లేదు. కారాబద్ధుఁడైయున్న కుమారజగత్సింహుఁడు స్వయముగా సమస్తవిషయములను జదువుకొని చేవ్రాలుంచినాఁడు.

మా—కారాగారమునందున్న యాతనికడ కా విజ్ఞాపన పత్రి పెట్లుపోయినది ?

అ—ఆవిషయమున నాకుఁగొంచెము కష్టముకలిగినది. అందుచేఁ గారాగారాధ్యక్షునకు విశేషద్రవ్యమునిచ్చి వశముచేసికొనవలసి వచ్చినది.

మా—నీవు మిగుల బుద్ధిమంతురాలవుగను, గార్యకుశలినివిగను గన్పట్టుచున్నావు. కాని ముఖ్యవిషయమున నేమిచేసితివి? ఆవేదనపత్రము ఫాదుమహాదర్బారునకుఁ బోవుటెట్లు? అదియేగొప్పసందేహము—ఆవిషయమున నేమైన నేర్పాట్లను గావించితివా?

అ—మహారాజా! ఆవిషయమునఁగూడఁ గావలసిననన్నియేర్పాటులైనవి. విజ్ఞాపనపత్రము దర్బారునకుఁ జేరుటకును, జేరినవెంటనే పాదుమహాచేతికందుటకును, నందినతోడనే యనుకూలములైన యుత్తరవులగుటకును దగినయేర్పాటులను గావించితిని. కార్యానుకూలమగుట కించుకంతయును సందేహములేదు.

మా—నీయుద్దేశమేమి? నీవా యసమసాహసకార్యము నిర్వహించుట కేలపూనుకొంటివి? దానినిగూర్చి తెలిసికొన నభిలాషపడుచున్నాఁడను.

ఆయేషా యవనతమస్తకయై యోచించుచుండెను. ప్రశ్నకుత్తరము రాలేదు

మా—నీకాప్రశ్నకొక్కమారుగ నుత్తరమిచ్చుట కిష్టము లేనట్లు తోఁచుచున్నది. నేనావిషయమున నిన్ను మరలఁ బ్రశ్నింపను. నీవెప్పుడైనను జగత్సింహుని కారాగారమునందుఁ జూచియున్నావా?

అ—లేదు.

మా—నీసమాచారము నెప్పుడైన నాతనికి వర్తమానమంపితివా?

అ—లేదు.

మా—నీప్రయత్నములచే జగత్సింహునకు విముక్తియైన పిదప నిజముగా నీవాతనినిజూడనొల్లవా?

ఆ—చూతును—

అయేషా పరిణయవిషయికవిద్యమానము లేమియు మానసింహునకుఁ దెలియకుండలేదు అయేషాయొసగిన ప్రత్యుత్తరములను వినినపిదప నాతఁ డాయనుపమాననారీరత్నము జగత్సింహుని యందనురక్తయైయున్నదని తెలిసికొనియెను. ఇంతేగాక జగత్సింహుఁడు తనహృదయమున నయేషాయెడ తదనురూపమైన యనురాగమును గలిగియుండలేదనియు, నందునేతనే యామె యంతవఱకును జగత్సింహునిఁ జూచియుండలేదనియు, నికముందును జూడనిష్టపడుటలేదనియు నందులకాయబల నితాంతమనఃపీడితయైయున్నదనియుఁగూడ మానసింహుఁడు స్పష్టముగాఁ దెలిసికొనియెను. తనయునకుఁ గారాగారవిముక్తియైనపిదప నానారీరత్నముయొక్క మనఃక్లేశమును బారద్రోలుటకై శక్తివంచనములేకుండఁ బ్రయత్నముచేయవలయునని యాతఁడు మనసున సంకల్పముచేసికొనియెను.

పరిణయసంబంధమైన విషయముల నింకను దెలిసికొనవలయు ననునభిప్రాయముతో మానసింహుఁడు తనతనయుఁడగు జగత్సింహుని కృతఘ్నుఁడనియు, నరాధముఁడనియు నుడివి పిదప "అమ్మా! నీవాతని నిమిత్తమై యంతటియాయాసము నెందులకుఁ బొందెదవు?" అని యడిగెను.

అయేషా నీరవయు, నధోముఖియుఁ జింతాకులస్వాంతయు నయ్యెను.

మా—తల్లీ! సామాన్యప్రశ్నల కుత్తరమిచ్చుటకు సందేహించుచుంటివేమి?

అ—మహారాజా! మీరొకకట్టుపుల్లను గూర్చి "పరులకొఱకు దగ్ధమై నీవెందులకు భస్మమయవయ్యెదవు?" అనిప్రశ్నించిన బాగుగ నుండును. జగత్సింహుఁ డకృతజ్ఞుఁడుగాఁడు. నరాధముఁడునుగాఁడు. ఆతఁ డత్యంతధర్మపరాయణుఁడైన మహాపురుషుఁడు.

మా—బిడ్డా! అయేషా! నీవు రమణీలోకమున కంతకును రత్నమవు. నీకు సౌఖ్యముగలుగఁజేయుటకై నేననేకవిధములఁ బ్రయత్నించెదను.

అ—అతిప్రగల్భవలె మహారాజంతటివారి సముఖమున నిలుచుండి విశేషముగా మాటలాడితిని. కాని, నేనామాటలను నామనః పూర్వకముగా నుడివియుండలేదు. మహారాజుగారి యాజ్ఞనైనఁబ్పుడు చెప్పకపోయినచో నాగ్రహమువచ్చునను భయముచే నానాలుక లజ్జావిహీనమై విశేషముగా మాటలాడినది అందుకొఱకు మహారాజు చరణ సముఖమున క్షమాపణమును వేఁడుకొనుచున్నదానను

మా—అయోమా! రాజకార్యార్థము నిన్నుఁ గొన్నిదినముల వఱకును నిర్బంధములో నుంచవలసివచ్చినందులకు నేనెంతయో దుంఖించుచున్నాఁడను. కాని, అమ్మా! నిన్నుఁజూచి నీతో మాటాడినపిదప నామనస సర్వథా పరిణమించినది. ఇప్పుడావిచారమువలదు. ఒరిస్సాదేశమునఁ బఠానులతో యుద్ధముప్రారంభమైనది. రేపటిదినముననే నేనక్కడ కేగుచున్నాఁడను. యుద్ధముసమాప్తమగువఱకును నీవునా యొద్ద నుండవలయును. ఆయుద్ధసంబంధమున నీవు చెప్పవలసినదేమైనఁ గలదా ?

అ—నేను చెప్పవలసిన దేమియునులేదు. సంధివిగ్రహశాసన పాలనములన్నియు రాజసంబంధమైనవి. మేము స్త్రీలము. మాకవియేమియుఁ దెలియవు. నేనావిషయమున మాటాడుటెట్లు ?

మా—నవాబుస్మార్కఖాను కాసంబంధమునఁ దెలియఁజేయవలసిన దేమైనఁగలదా ?

అ—తెలియఁజేయవలసిన దేమియును లేదు. నవాబు స్వతః తేజస్వి, సాహసికుఁడు. పరాక్రమవంతుఁడు, ఆతనిబుద్ధి కేదితోఁచునో, యేకార్యమునందాతఁడు ప్రవర్తింపనుద్యమించునో యట్టివాని విషయమున నావంటివారాలోచనఁజెప్పనుద్యమించుట మహాసాహసము. అతఁడు చేయఁబూనినకార్యముయొక్క పరిణామమును ఫలాఫలములు నాతఁడు బాగుగా నెఱుఁగును. ఆతఁడందులకు సిద్ధముగాఁగూడ నుండును.

మా—అంతపర్యంతమును నీవీయంతఃపురమునందే యుండవలయును. ఊర్మిళాదేవి నీకుఁగావలసినవన్నియు సమకూర్చి నీక్షేమ

ము నరయుచుందును. యుద్ధానంతరమున నేను మరలవచ్చి నిన్నుఁ జూచెదను. నేనిప్పుడు బహుళకార్యాంతరనిమగ్నుఁడనై యున్నాఁడను. వెడలిపోయెదను. నీవు తాజఖాను నాతని గృహమున కంపివేయుము.

మహారాజు వెడలిపోయెను. తాజఖాను మరల దనగృహమున కేగెను అతనిగృహము కావలివారినుండి విముక్తినొందెను.

నాల్గవ ప్రకరణము.

ఒరిస్సాదేశమున విషమసమరానలము ప్రజ్వలితమయ్యెను. పఠానులు సంధినియమములను బాటింపక పూరినగరమునాక్రమించుకొనిరి. రామచంద్రదేవ రాజాయుద్ధమునకు సన్నద్ధుడై యుండకపోవుటచే నతి సులభముగా పూరినగరము పఠానులవశమై పోయెను రామచంద్రదేవుఁడు పూరిసివిడిచి పలాయనుఁడై పోయెను. సర్వవృత్తాంతములును మానసింహునకు వర్తమానమంపి యాతఁడంతటితో నిశ్చింతుడై యుండెను.

మానసింహుఁడు విశేషప్రయత్నములతో నొరిస్సాకు బయలు దేరివచ్చెను. వర్ధమానమునుండి సైదుఖానుగూడ విశేషసైన్యములను దీసికొని యొరిస్సాకు రానారంభించెను. సంధినియమములకు భంగము చేసినారను క్రోధమొకటి— ఇంతియేగాక హిందువులకు బ్రధానతీర్థక్షేత్రమగు పురుషోత్తమ నగరము నాక్రమించుట యొకటి— విశేషించి యస్మాన్ ఖానుని నితాంతగర్వోద్రేకము — వీనియన్నిటిమూలమునను బఠానులను సర్వనాశము చేయవలయునని మానసింహుఁడు దృఢనిశ్చయుడయ్యెను.

పఠానులును దమప్రయత్నముల యందేమియు గొఱతలేకుండ జేసికొనిరి. ధరపురవిజయుడైన యస్మాన్ ఖాను సంధినియమములకు భంగము కలిగినతోడనే యుద్ధముతప్పక సంప్రాప్తమగునని యోచించి యున్నవాఁడగుటచేఁ జాలదినములనుండి యుద్ధసంబంధములగు నాలోచనలను జేయుచు సంపూర్ణముగా రణసన్నద్ధుఁడయ్యెను. యుద్ధవిషయ

ములన్నియును జరిత్రలయందు వివరముగా వర్ణింపఁబడి యున్నవి. మేమిట నాయుదంతమంతయును వర్ణించిచెప్పుట నావశ్యకము. ప్రస్తుత కథతో సంబంధించినంతవరకు సంక్షేపముగా నాయంశములనిట సూచించెదము.

వనపురసమీపమున మొగలాయీలకును బతానులకును తుముల యుద్ధము ప్రారంభమయ్యెను. పఠానులు రణరంగమునకు విశేషముగ నేనుఁగులను దెచ్చిరి. మొగలాయీలనేక శతఘ్నులను దీసికొని వచ్చిరి. వాని ఫెళఫెళశబ్దములను వినినతోడనే కరిబృందమునకు గుండెలవియఁ జొచ్చెను మావటీండ్రు కరిసంకులసంరంభము నణంపలేకపోయిరి. ఆమత్తగజము లొక్కమారుగ విశృంఖలవృత్తి చెలరేగి సమీపసైన్యములఁ జిందరవందరఁ జేయుచు నల్గుదిక్కులకును బారిపోవఁదొడంగెను. యుద్ధాంగణమునకు ముందుగ నేనుఁగులనుంచిన యవివేకముచేఁ బఠానుసైన్యవ్యూహము భంగమయ్యెను. అనేకసైనికు లేనుఁగులకాళ్ళక్రింద బడి ప్రాణములంగోలుపోయిరి.

అయినను బఠానులొకరి నొకరు హెచ్చరించుకొని మరలరణోన్ముఖులైరి. కాని, మొట్టమొదటి ప్రయత్నమంతయు భంగమైపోవుటచే రెండవసారిచేసిన యీరణమునందు హతోత్సాహులైపోయిరి. యుద్ధము భయంకరముగనే జరిగినది. కాని తుదకుఁ బఠానులు పరాజితులైపోయిరి. వనపురమునందట్లు ఘోరరణముజరిగెను ఆరణముమూలముననే వనపురము చరిత్రయందుఁ బేరుగాంచినది. వనపురరణమున జయమొందిన మానసింహుఁడంతటితో శాంతచిత్తుఁడుకాలేదు. ఒరిస్సాదేశమునఁ బఠానుల ప్రాముఖ్యమును నాశనముచేయవలయునని యాతఁడు సంకల్పించుకొనియెను ఆతఁడు క్రమక్రమముగ దుర్గమువెనుక దుర్గమునుఁ నగరమువెనుక నగరము నాక్రమించుకొనఁ జొచ్చెను. జలేశ్వరమును, కటకమును మొగలాయీల యధీనమయ్యెను. ప్రతిదుర్గమునందును మొగలులపతాక మెగురనారంభించెను. మొగలుల స్వర్ణదుర్గము మొగలాయీలవశమైపోయెను ఇఁక జేయునదిలేక యస్మాన్‌ఖాను పరాజయమునొప్పుకొనవలసివచ్చెను నవాబు సులేమాన్‌ఖానును నస్మాన్‌ఖానును, అక్బరునధికారము నంగీకరించి యాతనికి సామంతులై కప్పముగట్టి

టకంగీకరించిరి. ఒరిస్సాదేశము సంపూర్ణముగా మొగలాయీల స్వాధ్యమునఁ జేరిపోయెను

ఒరిస్సావిజయసమాచారము యథాసమయమున నక్బరునకుఁ దెలిసెను. సస్యశాలినియు, రత్నగర్భయు నగునాప్రదేశము చాలకాలమునుండి మొగలాయీల కశాంతిని, నుద్వేగమును బుట్టించుచునదిగ నుండెను. ఇప్పుడది సంపూర్ణముగ మొగలులస్వాధీనమైనందున నక్బరుషాదుషహా సంతోషమునకు మితిలేకుండెను. అదిమొదలు మానసింహ మహారాజు బంగాళా, బీహారు, ఒరిస్సాదేశములకు సుబేదారుగా నెన్నఁబడుచుండెను రామచంద్రదేవుఁడు మొదలుగు పూర్వభూపతు లవిచలచిత్తులై మొగలాయీపక్షము నవలంబించి వారికి సామంతులై తమపదగౌరవములను నిర్విచారముగాఁ గాపాడుకొనుచు వచ్చిరి.

అస్మాన్ఖాను హతాశుఁడైపోయెను. అట్టిదుర్గతిసంభవించునని యాతఁడెప్పుడు ననుకొనియుండిలేదు ఈరణము ప్రారంభమైనది మొదలాతనిచిత్తము స్థిరముగానుండక నానావిధయాతనలకును దుశ్చింతలకును, విచారములకును, నాకరమయ్యెను. యుద్ధారంభమున కించుకపూర్వమయేషా యంతఃపురమునువీడి వెడలిపోయెను. అయేషాయస్మాన్ఖానునేభావముతోఁ జూచుచున్నను, నామె యాతని ప్రాణములకుఁ బ్రాణమై, సకలానందములకును సకలోత్సాహములకును సకలప్రయత్నములకును గారణభూతురాలై యుండెనని చెప్పుటకు సందేహములేదు. అయేషాయు నస్మాన్ఖానును బాల్యమునుండియు నొక్కచోనాడుకొనుచు హాస్యపరిహాస్యములను జేసికొనుచువిహారముసేయుచుండుడివారు వారిరువురు నొక్కచోఁ బెరిగి పెద్దవారైరి. ఆమెపై నస్మాన్ఖానునకుఁ గలప్రీతివిశ్వాసములకు మేరలేదు. అతనిప్రేమ కవధిలేదు. అట్టియయేషా యిప్పుడంతఃపురమును వీడిపోయినది. అతనిసాహసోత్సాహములన్నియు నాతనివిడిచి యామెతో మాయమైపోయినవి. అంతటి నిరాశతోడను నసంతుష్టితోడను వ్యాకులహృదయముతోడను జేసినకార్యములకు విరుద్ధఫలమే లభియించెను. అస్మాన్ఖాను నిజముగ నవసన్నుఁడైపోయెను.

ఐదవ ప్రకరణము.

కారాగారవాసియైన జగత్సింహుని విముక్తినొందించుటకై విజ్ఞాపన పత్రికాదులను తీసికొని యభిరామస్వామి ఢిల్లీకిఁబయనమయ్యెను. ఆతనితోఁగూడ నైదుగురు రక్షకులు బయలువెడలిరి. బయలుదేరిన వారందరు నాశ్వికులైయుండిరి. అనేకస్థలములయం దనేకులకు లంచములీయవలసిన యవసరముండును. షాదుషహా దర్బారునకు విజ్ఞాపనపత్రమును గొంపోవుటయన సామాన్యమగుపని కాదు. దానికెంతయో ద్రవ్యము వెచ్చింపవలసియుండును అందుకొఱకయేషా యనేకరత్నములను, విశేషధనమును నభిరామస్వామి కిచ్చియుండెను.

అయేషా యింకను ననేకసదుపాయములను జేసెను. షాదుషహా యంతఃపురమునందును దర్బారునందును గలయనేకులతో సదివఱకామె పరిచయమును గలిగియుండెను. ఆపూర్వపరిచయమును జ్ఞప్తికిఁదెచ్చుచు నామె వారికుత్తరములను వ్రాసియిచ్చెను. ఇంతియేగాక మానసింహునకు సోదరియు, జగత్సింహునకు మేనత్తయు నగుబీగమునకొకవినయపూర్వకవిజ్ఞాపనమును వ్రాసి యామెకరుణావిలోకమును బ్రసరింపఁజేయుటకై వేడుకొనియెను. ఆమెవ్రాసిన యుత్తరములన్నియు వారలకుఁ జేర్పఁగలిగినచోఁ గార్యసాఫల్యమగుట కించుకంతయును సందియములేదు. ఆమె యేకొఱంతయు లేకుండఁ జేయవలసిన ప్రయత్నముల నన్నిటినిఁ జేసెను.

అయేషా కొన్నిదినములు గడచినపిదపఁ దాను స్వయముగ ఢిల్లీకిఁబోవలయుననికూడ నిశ్చయించుకొనియెను. బహుశః ఆమె ఢిల్లీకిఁ బోవుటకుఁ బూర్వమే యభిరామస్వామి కార్యమును సఫలముచేసికొని తిరిగివచ్చునని యందఱు ననుకొనుచుండిరి. ఇంతలో నాకస్మికముగ మానసింహమహారాజు నాజ్ఞాప్రకార మయేషా పాట్నానగరమున బందీగానుండవలసివచ్చెను. మానసింహుఁడు యుద్ధవిషయములలో మునిఁగియుండెను. అందుచే నయేషా యటనుండి కదలుట కవకాశము లేకపోయెను. అయిన నామె యసంతుష్టచిత్తయై యుండలేదు. ఎందు

వలన ననఁగా—ఆమె తనయభీష్టసిద్ధికిఁ గావలసినప్రయత్నములన్నియుఁ జేసినపిదపనే మానసింహుని యంతఃపురమున నవరుద్ధయయ్యెను. కొంత కాలమేకాదు.—బ్రదికియున్నంతవఱకును బందీగనుంచినను నామెకు విచారములేదు. కర్మమయమును నుత్సాహమయమును నానందమయ మునగు జగత్సింహునిజీవన మంధకారమయమైన కారాగారమునందు నష్టమైపోవుచున్నది ఆతని నాయంధకారమునుండి విముక్తినొందించు టకై యావజ్జీవమును నాతనిస్థానమునఁ గారాగారమునం దుండవలసి వచ్చినను నయేషా సంతోషచిత్తముతో నందులకు సిద్ధముగానుండును.

ఐదవదినమున నభిరామస్వామియు నాతనితోఁ గూడవచ్చిన యైదుగురువీరులును గుఱ్ఱములనెక్కి కౌనపురమునకు వచ్చిరి. అక్బరు పాదుషహా డిల్లీనుండి యాగ్రకువచ్చెనని యభిరామస్వామి కచ్చటఁ దెలియవచ్చెను. ఆసమాచారము తెలియుటతోడనే యభిరామస్వామికిఁ బట్టరాని సంతోషముకలిగెను. వెదక బోయినతీవపదములఁ దగిలి నట్లయ్యెను. అచ్చటనుండి రెండుదినములలోనే యాగ్రకుఁ బోవచ్చును. విధాత యనుకూలుఁడై యున్నాఁడనియు, నేవిషయమునందుఁ బ్రతికూలత లేదనియు నభిరామస్వామి సంతోషించుచుండెను.

వారందఱును కౌనపురము చేరునప్పటికి మధ్యాహ్నకాలము తిరిగిపోయెను. అశ్వము లాయాసమునొందుచుండెను. అశ్వారోహకులును క్షుధాతురులై దప్పిఁగొనియుండిరి. అభిరామస్వామి యంగడి వీధికి సమీపప్రదేశమునందలి యొకగొప్పవటవృక్షముక్రింద నాశ్రయమును గల్పించుకొనియెను. తక్కినయశ్వారోహకులు కొంచెముదూరములో మఱియొకచెట్టున కశ్వములను గట్టివేచిరి. స్వామి వీపునకుఁ గట్టుకొనిన చర్మమును నేలపైఁబఱచి దానిపైఁ గూర్చుండెను. జగత్సింహుని విజ్ఞాపనమును, నయేషాయిచ్చినయుత్తరములును, నామె యొసఁగిన ధనరత్నములును దనయుత్తరీయమున మూటగట్టి దాని నాతఁడు తనవక్షోభాగమునఁ జేర్చి కట్టుకొనియెను. ఆతఁడామూటను విప్పి చర్మాసనము క్రిందనుంచి దానిపైఁ దనశిరసుంచి పండుకొనియెను.

రక్షకులుగావచ్చినవారు తమకమచెంబులను, బగ్గములను దీసికొని సమీపములోనున్న బావిలోనినీటిని దోడుకొని ముఖమును, గా

లు చేతులను గడిగికొనిరి. వారు వరుసగా గుఱ్ఱములకు సేవచేసిరి పిదప వారిలో నిరువురు గుఱ్ఱముల కాహారమును దేబోయిరి. వారందఱు నొకేజాతివారు. ఒకవంటకమునందు వారందఱును గలిసి భుజించెదరు కాలుసేతులను గడిగికొనినపిదప నొకఁడుప్పు, బప్పు మొదలగు పదార్థములను దీసికొనివచ్చుటకై యంగడికిఁ బోయెను. ఇంకొకఁడు వంటఁజేయ దొడఁగెను. ఐదవవాఁ డభిరామస్వామికడకు వచ్చి "ప్రభువు వారిసేవకొఱ కేమి సిద్ధముచేయవలయును?" అనియడిగెను.

అభిరామస్వామి "కొంచెము పిండిలోఁ బంచదారనుగలిపిపుచ్చుకొనియెదను. నానిమిత్త మేమియును జేయవలసినపనిలేదు. మీరు తెచ్చినదానిలోఁ గొంచెమైనను జాలును వేఱుగ నేమియు నక్కఱలేదు" అనియెను.

అనుగవచ్చినవాఁడు వంటచేయువానికి సాహాయ్యముసేయుటకై వెడలిపోయెను. గుఱ్ఱములను జూడఁబోయినవారు రెండుమోపుల గడ్డినిగోసి తలబుట్టలలోఁ గట్టి దానిపై నీటినిజల్లి తోడివారందరితో గుఱ్ఱములను దీసికొని నీటినదియొద్దకు వచ్చిరి. భోజనమునకుఁ గావలసిన పదార్థములను దేఁబోయిన యాతఁడు యథేష్టముగాఁ బదార్థములను గొని తీసికొనివచ్చెను. వంటచేయువారిలో నొకఁడు వానినన్నిఁటిని దీసికొని యభిరామస్వామికొఱకు కొంచెముపిండియు బంచదార మొదలగునవి వేరుగనుంచి మిగిలినవానితో వంటకముచేయనారంభించెను. వంటప్రారంభమయ్యెను. గుఱ్ఱములు మేపబోయినవారు వానికిఁ జక్కగ నాహారమిడి తమకాలుచేతులను గడుగుకొన నారంభించిరి. ఎల్లెడఁ జీకటులుక్రమ్మనారంభించెను.

సాయంకాలమయ్యెను. రతుకు లంగడికిఁబోయి దీపపుసామగ్రిఁదెచ్చి దీపములను వెలిగించిరి. భోజనమునకు సర్వమును సిద్ధమయ్యెను.

రాత్రి తొమ్మిదిగంటలైనది. ఆకస్మికముగ నంగడివీథియందొకగొప్ప కోలాహలముత్పన్నమయ్యెను. "పోయినది! అగ్నిహోత్రము! నీరు! నీరు! తెండు! తెండు!" ఈమొదలగు శబ్దములు

హెచ్చుగవినవచ్చుచుండెను. అందఱిదృష్టియును నావైపునకే పోయెను. అతిభయంకరముగాఁ గనుపట్టుచుండెను. అంగడివీధి కగ్నిహోత్రము ముట్టుకొనియెను, "హా! హా! ఏమైనది? అయ్యో! సర్వమును నాశనమైనది" ఈమొదలగు హృదయవిదారకశబ్దములు నిరంతరమును వినవచ్చుచుండెను. చూచుచుండఁగనే యగ్నినాల్గుమూలల వ్యాపించెను చీకటిలో నాయగ్నిశిఖ లగ్నిమయశైలమువలె గనుపట్టుచుండెను. అగ్నిశిఖలు నభోమండలమున కంట వ్యాపించెను ఆపైని నాల్గుదిక్కులకును బరువులెత్తుచున్నమంట లగ్నిశైలముపైఁ బరువెత్తు వహ్నివిహంగములవలెఁ దోఁచుచుండెను. సర్వభక్షకుఁడగు నగ్నిభగవానుఁడు తనసహస్రజిహ్వలను విస్తరించి సర్వభక్షణకార్యమునం దుద్యుక్తుఁడయ్యెను. భయంకరముగు చీత్కారధ్వనులును నార్తనాదములును దిఙ్మండలమంతయు వ్యాపించి కలగుండువడఁ జేయుచుండెను.

అభి—అయ్యో! అన్నలారా! చూచినఫలమేమి? విపద్గ్రస్తులకు సాహాయ్యముచేయువారు లేకపోయినచో మీరుపోయి యూప్రయత్నములను జేయుఁడు.

ఈమాట ముగియకపూర్వమే రక్షకులందఱును సిద్ధముగానున్నపదార్థముల నట్లేవిడిచిపెట్టి మండుచున్న యంగడివీధికిఁ బరువెత్తుకొనిపోయిరి. అభిరామస్వామి యచ్చటనే నిలుచుండి మనోవ్యథాజనకమగు నాదారుణవ్యాపారమును జూచుచుండెను.

ఇంతలో నొకయార్త నాదమాకోలాహలమునంతను నతిక్రమించి వినవచ్చెను. అది నారీకంఠస్వరము, హృదయభేదకమై యీక్రింది విధముగ వినఁబడియెను. "అయ్యో! నాబిడ్డ! నాసర్వస్వము. రక్షింపుఁడు! కాపాడుఁడు! నేను మీకు దాసినయ్యెదను. అయ్యో! నాబిడ్డ! కాపాడనిచో నాతోఁడు! లేదేని నన్నాయగ్నిలోఁ దోసి వేయుఁడు! అయ్యోబిడ్డా!"

అభిరామస్వామి యాయార్తనాదమునువిని యేమియుఁదోఁచక జ్ఞానశూన్యునివలెనై యతిశీఘ్రముగ నాశబ్దము వినవచ్చువైపునకుఁ బరువెత్తుకొనిపోయెను. అతిసాహసముతో నుస్మత్తప్రాయుఁడైన యభి

రామస్వామి యాయగ్నికుండమునఁ బడియెను. అబిడ్డ రక్షింపఁబడియెను. పరుండినిద్రించుచున్న యాబిడ్డనెత్తుకొని వక్షస్స్థలమున గదియించి పట్టుకొని నిర్విఘ్నముగా నీవలకుఁ బరువెత్తుకొనివచ్చెను అతని దేహ మనేకస్థలముల నగ్నిచుట్టుముట్టుకొనియెను. కాని, యాతఁడు దానిని గన్నెత్తిచూడ లేదు.

రాత్రి పండ్రెండుగంటలకు వీతిహోత్రునియాటోప మింపుక యడంగెను. రక్షకు లభిరామస్వామినిజూచి యాతనితోఁగూడ తమ విశ్రమస్థానమునకు వెనుదిరిగివచ్చిరి. అందఱును ధూళిధూసరిత గాత్రులై దగ్ధప్రాయములైన దేహములతో సమీపముననున్న వటవృక్షముక్రింది కరుదెంచిరి. కాని, యెంత భయానకము! గుఱ్ఱములలో నొక్కటియు నచ్చట లేదు అగ్నిభయముచేఁ బగ్గములఁ ద్రెంచుకొని యెచ్చటికైన పారిపోయియుండునా? రక్షకులు సిద్ధముచేసికొనిన కూర, పచ్చడి, రొట్టె మొదలగునవియేమియు నచ్చట లేవు. కుక్కలు నక్కలు తినిపోయియుండవచ్చును. చెంబులు మొదలగు వస్తువులు కూడ లేవు. అట్లయినచో దొంగలెవ్వరైన వచ్చియుండవలయును. అభిరామస్వామి యాందోళనముతోఁ దనచర్మాసనము నెత్తి చూచికొనియెను అచట నుత్తరీయమునఁగట్టినమూట లేదు. ఆవిజ్ఞాపనపత్రమును లేదు. ఆయుత్తరము లేమియును లేవు. ఆనవరత్నముల యందొక్కటియును లేదు. "హా! ఏమైపోయినవి?" అని యఱ కొనుచు నిశ్చేష్టుఁడై యభిరామస్వామి యచ్చటనే కూలబడియెను

ఆ ఱ వ ప్ర క ర ణ ము.

అంధకారమయమైన కారాగారమునందుఁబడియున్న జగత్సింహుఁడు తనకతిశీఘ్రకాలములోనే విముక్తికలుగునని యొకకలగాంచెను. ఆనందపంజరమున బద్ధమైయున్నయయేషా హృదయమునందుఁ దనహృదయేశ్వరునకు సుఖాసుఖానందములు గలుగునవెడి యాశను గల్పించుకొని సంతసించుచుండెను. మానసింహమహారాజు దారుణ

యుద్వ్యాపారనిమగ్నుఁడై యుండియు నితరప్రయత్నముచేఁ దనశిష్యునకుఁ గారాగారబంధము తొలఁగిపోవునని యాశపడుచుండెను. వారి యాశలన్నియు వ్యర్థములైపోవునని యెవ్వరుననుకొనలేదు. ఎవ్వరు ననకొనియుండని యొకయపూర్వకార్యముమూలమున నాయాశలన్నియు వ్యర్థములైపోవునని వారిలో నొక్కరైన నెప్పుడును దలఁపోసికొనియుండలేదు

అభిరామస్వామియు నాతని యనుచరులు నారాత్రి యేమియుఁ జేయకుండ నూరకుండిరి. పరిశ్రమమూలమున నాదినమెల్ల నేమియు భుజింపకుండుటవలనను, నుత్కరమూలమునను వారందఱుఁ [illegible] ముల నడచేతినిడుకొని వటవృక్షముక్రింద నారాత్రి పడియుండిరి. మఱునాటియుదయమునననే లేచి చోరులుపట్టుకొనిపోఁగా మిగిలినసామగ్రిలను గైకొని యాయూర్ధ్వగుణధికులును నగరమునందలి కొత్వాలు కడకుఁబయలుదేరిపోయిరి.

కొత్వాలు యమునివలె నత్యంతభయంకరుఁడుగా నుండెను. ఆతనియెదుటకుఁబోయి నిలుచుండి మాటలాడుటకు జంకెదరు వారలు. అభిరామస్వామి చాలనుండి పాదుషాహాదర్బారులకుఁబోయి చూచి యున్నవాఁడు. ఈకొత్వాలుని దర్బారు పాదుషాహాదర్బారులకంటెఁ జాలభయానకస్థానమని యభిరామస్వామికిఁ దెలియదు. కొత్వాల పదవిలోని యనేకులు కారణమున్నను లేకపోయినను దమప్రభుత్వాధికారమును జూపి తమకెదురుగవచ్చిన మనుష్యులనుబట్టి దండించి తమ ధర్మమును విద్యుక్తముగా నెరవేర్చినట్లు సంతోషించుచుండురు. అట్టి వారిలోని యమస్వభావచర్యలుగల యాకొత్వాలుకడ కభిరామస్వామి తన యనుచరులతోఁగూడఁ బోయి నిలుచుండెను.

అభిరామస్వామిచేసిన యభియోగవిషయములనన్నిఁటిని విని యాకొత్వాలు "వీరందఱును నితరదేశమునుండి వచ్చినచోరులు ఈసన్యాసి నిశ్చయముగా ప్రాఁతచోరుఁడు. (K. D.) సుప్రసిద్ధచోరుఁడు. అందుచేతనే యీతఁడు సన్యాసివేషమునుదాల్చి నిజస్వరూపమును గప్పిపుచ్చయత్నించుచున్నాఁడు. వీరందఱు నిచ్చటకు దొంగతనముచేయుటకై వచ్చియున్నారు. తమదుష్కృత్యములు వెల్లడి

యగు నుభయముచే, దమస్త్రీత్వమును లోకమునకుముందే తెలుప వలెనను కృత్రిమోద్దేశముతో నీయభియోగమును జేయుటకై వచ్చి నారు" అని నిశ్చయము చేసెను. అత్యంతసమర్థుఁడగు నాకొత్వా లీరీతిగ లోకవిలక్షణసిద్ధాంతమును జేసికొని తక్షణమే "ఈసన్యాసిని, ననుచరులను గొంపోయి చెఱసాలలో నేయుఁడు" అని తనసేవకులకాజ్ఞ యొసంగెను

అభిరామస్వామి ఘోరవిపత్తునఁ బడియెను. చోరులవృత్తాంతము తెలియనిమ్ము. తెలియకపోనిమ్ము—పోయినవస్తువులు దొరకనిమ్ము దొరకకపోనిమ్ము—ఆ నిక్షేపము సంగతియేమియు నక్కఱలేదు. అవకాశము చిక్కినేని పాట్నానగరమును విడిచి పోవలయును. పోయినచో సంగతు లన్నిటిని నవాబునకుఁ దెలిపి విహితకార్యమును జేయవచ్చును. అందువలన కొంతకాలము వ్యవధి యగును. పదిదినములధికముగఁ గాలవిళంబము కావచ్చును. అంతకాలము పనిసాగిపోవును. కాని పదిదినములు వ్యవధియైనందువలన నష్టమేమియును లేదని యాతఁడను కొనియెను.

అభిరామస్వామి కొత్వాలునితో నావిషయమునుగూర్చి యే మియో చెప్పఁదొడంగెను కాని, యాతనిమాటను వినువారెవరు? స్వామినోటనుండి మాటరాకపూర్వమే కొత్వాలు "ఈచోరులను గొనిపోయి కారాగారమున ద్రోయుఁడు" అని కర్కశభావముతో నాజ్ఞయొసంగెను. అభిరామస్వామి విషాదబుద్ధితోఁ బడిపోయెను." అనుచరులతోఁగూడ బందిఖానఁ జేర్చెను

ఆచెఱసాల కనుపట్టనిదై దుర్గంధమయమై యంధకారావృత మై భయంకరముగా నుండెను. అందుఁగూర్చుండి వారందరు నీరీతిగ యోచింపదొడంగిరి "ఇకముందు మనలనందరను వీరు ఖాజీకడకుఁ గొనిపోయెదరు. ఖాజీసాహేబు కొత్వాలుమహాశయునికంటెఁ గూడ సూక్ష్మదర్శి యందుచే మనకిఁకఁ గారాగారవాసశిక్ష దప్పదు. కావున మనమెట్లయిన నిచ్చటనుండి తప్పించుకొనిపోవుటయే శ్రేయ" మని యోచించుకొనిరి. ఎట్లయినఁ బారిపోవలయునని సిద్ధాంతము చేసి కొనిరి కాని, దానికేమి యుపాయమున్నది? పలాయనమై పోవలయునని

నిశ్చయించుకొనిన పిదప నొకఁడు "ఆగదిగుమ్మమునకు వైచిన యినుప కమ్మి పరిశోధించి నూడఁగొట్టవచ్చుననియు, నాకమ్మి నాధారముచేసి కొని యొకనిపై నొకఁడెక్కి గోడపైనున్న కిటికి నూడఁగొట్టవచ్చుననియు పిమ్మట దానినుండి యొక్కరొక్కరుగ నందరు నావలకు దాటిపోవ చ్చుననియు నాలోచనము చెప్పెను అదిసంభవమేయని యందరు నొప్పు కొనిరి. మొదట నాలోచన చెప్పినయాతఁడు తలుపుబంధము నూడఁదీయఁ దొడఁగెను క్రిందటిదినమున వారెవరును భుజించియుండలేదు. అగ్ని మూలమున మిగులశ్రమఁగొని దగ్ధప్రాయులైయుండిరి ఈదినమునను నన్నములేదు. మొదట నాలోచన చెప్పినయాతఁడు నడిచినరీతిగ నన్ని యుననుకూలమయ్యెను. క్రమక్రమముగ నొకనిపైనొకఁడు నిలుచుండి శ్రమపడి యెట్లయిననేమి గోడపైనున్న వెలుఁగునిచ్చు కిటికిత్రోవను పెద్దదిగాఁ జేసిరి. నిర్విఘ్నముగా నందరు నీవలఁబడినచో నాయార్వురిలో ముగ్వురు మరల పాట్నానగరమునకేగి నవాబునందినితో జరిగిన యావ దుదంతమును దెలిపి యామె యాజ్ఞానుసారముగ ముందుకార్యములను నిర్వహింపవలయుననియు, నభిరామస్వామి మిగిలినయిరువురితో నాగ్రా నగరమునకుఁబోయి, ఏయుపాయముచేనైనను పాదుషహాదర్బారునందు జగత్సింహుని విషయముగూర్చి ప్రస్తావింపవలయుననియు, మఱియు సమయము నిరీక్షించుచు నయేషా యాజ్ఞానుసారముగాఁ గార్యమును నిర్వహించుకొఱ కచ్చటనే యుండవలయుననియు నేర్పాటులను జేసి కొనిరి అర్ధరాత్రమున రంధ్రపథమున నొక్కొక్కఁడుగ నీవలఁబడియెవ రికిని గనఁబడకుండ మిగులజాగరూకతతో వారందరును బలాయనులైరి రాత్రియంతయును విసుఁగులేకుండ నడచి నగరమునకుఁ జాలదూరము నందున్న యొకమహారణ్యమధ్యమునకు వచ్చి చేరుకొనిరి. సూర్యోదయ మునకుఁ బూర్వమే వారు రెండుతెగలుగ విడిపోయి ముగ్వురు పాట్నా నగరాభిముఖులై నడచిరి అభిరామస్వామియు మఱియిద్దరును నాగ్రాభి ముఖులై పోయిరి అందరును భిక్షావృత్తి నవలంబించిరి. ఔరా! కాల మహిమ! తానొకటిదలచిన దైవమొకటి దలఁచెనుగదా!

పాట్నానగరాభిముఖులై పోయినవారు యథాకాలమున గమ్య స్థానమును జేరఁగలిగిరికాని వారేకార్యమునుఁ జేయలేకపోయిరి. వారు

లిన్నగా తాజఖానుని గృహమునకువచ్చి కనుఁగొనిరి నవాబునందిని బం దీయై మానసింహమహారాజు ప్రాసాదమున నున్నట్లు వారికిఁదెలియ వచ్చెను. ఆమెనుజూచుట కవకాశములేను కారాగారవాసియైనజగత్సిం హునిదర్శించుటకును వారికి శక్యముకాకపోయెను. అందుచే వారికిఁ జేయునదిలేక కార్యాంతరముల నవలంబించి పొట్టపోసికొనుచు జీవ మును నిలుపుకొనుచుండిరి.

ఇఁక నిచ్చట నభిరామప్రముఖు లరణ్యమార్గమునఁబట్టి యా గ్రాభిముఖులై తమప్రయాణమును సాగింపనారంభించిరి. మధ్యాహ్న వేళఫలములు మొదలగు సస్యపదార్థములతోడను, నదీజలములతోడను వారు తమక్షుత్పిపాసలను నివారణచేసికొనుచుండిరి. రాత్రిలు చెట్లపై కొమ్మలలో నొకదానికిఁ దమదేహమును భద్రముగాఁ గట్టుకొని కును కుచు గడపుచుండిరి. ఈవిధముగ రెండుదినములు గడచిపోయినవి. మూఁడవనాటి యుదయమునకు వార లాగ్రానగరసమీపమందలి యమునానది కుత్తరభాగముననున్న మహారణ్యమునకు వచ్చిరి. ఆస్థల మునకుత్తరపుదిక్కునందు వేఱొకఘనారణ్యమునుండి యొకమార్గము వచ్చి యభిరామస్వామి మొదలగువారు వచ్చినమార్గముతో నచ్చటఁ గలిసికొనియెను. వారచ్చటకువచ్చుట కించుకపూర్వ మశ్వారోహ కులుకొందఱామార్గముగుండవచ్చి వెళ్ళినట్లుఁ గన్పట్టుచుండెను. పద చిహ్నములను బరికించిచూచినచో నొకటిరెండునిమిషములకు: బూ ర్వమే యశ్వములాదారిని బోయినట్లు తోఁచుచుండెను. అట్టిమహా రణ్యమున నట్టిసమయమున నశ్వారోహకు లట్లుపోవుటకుఁ గారణ మేమో తెలిసికొనవలయునని యభిరామస్వామి తనయనుచరులతో వడివడిగ ముందునకు నడచిపోయెను. ఇంచుకదూరమేగునప్పటి గుఱ్ఱ ములు దక్షిణపుదిక్కునకు మరలి వేఱుమార్గమునఁ జనినట్లుగఁగన్పట్టెను ఆమార్గమున బోవుట కభిరామస్వామి కిష్టములేకపోయినను దనకౌతూ హలమును దీర్చికొనుటకై తనయనుచరులతో నాతఁ డామార్గమునఁ జనియెను.

కొంచెముదూరముపోయినపిదప నాతని కశ్వపదాంక మొక్క టియును దృష్టిగోచరముకాలేదు. ఆపార్శ్వమందలి ఘనవనాంతర

మున నొకపర్యాయ గుల్మలతాదులు తునిఁగియు వృక్షశాఖలు విఱిగియు గన్పట్టెను అచ్చట తీగెలు నాకులు మొదలగునవి తునిసిపడియుం డుటఁజూచి యట మనుష్యులెవరో తిరుగాడుచున్నారనియు, గుఱ్ఱములు మేయునప్పు డవియట్లు చెదరిపడియుండవచ్చుననియు నభిరామ స్వామి యూహించి తెలిసికొనియెను. అతికుతూహలభావముతో మరికొంతదూరము ముందునకుఁబోయి తనరక్షకులలో నొకనింజూచి "మిగులజాగ్రత్తగఁబోయి విశేషములేమియో తెలిసికొని త్వరలో రాఁగలవా?" అని యభిరామస్వామియడిగెను.

అభిరామస్వామియు నొకపరిచరుఁడును నొకరహస్యస్థలమును గురుతుగానేర్పరచికొని యచ్చటఁ గూర్చుండియుండిరి రెండవవాఁ డచటనుండిబయలువెడలి ధ్వనియగుచున్న యామార్గమునుబట్టి పోయెను. ఇఁట వీరిరువురు నొకముహూర్తకాలము గూర్చుండి "అతఁ డింకనురాలేదేమిచెపుమా?" అని యోచించుకొనుచు కళవళమొందుచుండిరి ఇంతలో నాతఁడుకు వచ్చెను.

అభి—ఏమైనఁగనఁబడియెనా?"

"ఒక్కశుభసమాచారము"

"ఏమది ?"

"మనయాఱుగుఱ్ఱములు—"

"(ఆశ్చర్యముతో) ఏమి! చెప్పుము. చెప్పుము."

"నేను బాగుగాఁ బరికించిచూచితిని. ఆయశ్వములాఱును మనవియే యగును. లేశము ననుమానములేదు."

"మనుష్యులెందఱున్నారు?.'

"పదిమందియున్నారు. మనచెంబులు మొదలగు సామానులన్నియు వారికడనున్నవి. వానినన్నిఁటిని బాగుగాఁ జూచితిని."

"అస్త్రశస్త్రము లేమైన నున్నవా?"

"అందఱిమొద్దను గత్తి, చురియ, మొదలగు నాయుధములున్నవి.

అభి — ఇప్పుడు తెలిసినది. మనసర్వస్వమును దొంగిలించినవారు వారేయగుదురు వారినిబట్టికొనినచో మనవస్తువులన్నియు దొరకఁగలవు.

ఒకఁడు — ఔను అందుల కించుకంతయును సందియములేదు. కాని యదియెట్లుసంభవమగును ?

అభి — మీరిరువురు నీయడవియందేయుండి చోరులను జూచుచుండవలయును అట్లుచేయుటకు మీకేమైన సందియమున్నదా ?

ఒకఁడు — అట్లేచేయవచ్చును. కాని మీరేమిచేసెదరు ?

అభి — ఈమార్గముగుండఁబోయి కొంచెము పశ్చిమముగఁదిరిగి నడచినచో నట యమునానదికలదు. యమునానదినిదాటినచో నాగ్రాకుఁబోవచ్చును. నేనాగ్రాకుఁబోయి యచ్చటనుంచి సర్కారుసిపాయీలను దీసికొనివచ్చెదను.

రెండవ — మరల కొత్వాలు కడకుఁబోయి చెప్పవలయునా యేమి ?

అభి — అవును చెప్పవలయును. కాని యన్నితావులయందును కాశపురపుమహాత్మునివంటి కార్యదక్షులును, యుక్తాయుక్త విచక్షణులునే యుందురని తలంపవలనుపడదు ఆగ్రానగరము రాజధాని అచ్చట కుశాగ్రబుద్ధులును వివేకవంతులు నుందురు. కొత్వాలువలనఁ గార్యసిద్ధి కాకపోయినచో మనకిఁక వేఱుమార్గములేనేలేదని తలంపరాదు.

రెండవ — మీరు తిరిగివచ్చువరకును, లేదా మీసమాచారము మరలమాకుఁ దెలియువరకును మేమిచ్చటనేయుండి చోరులగతివిధానములను దెలిసికొనుచుందుము. కాని దొంగలిచ్చటనుండి వెడలిపోవుచుండినచో మేమేమిచేయవలయును ?

అభి — మంచిమాటనడిగితివి మీలోనొక్కఁడు చోరులను వెంబడించి వారివెనుకనే దూరదూరముగఁ బోవుచుండవలయును. ఒక్కఁడిక్కడనే యుండవలయును. తస్కరు లిటనుండి వెడలిపోయి వేఱొకతావున విడిసినతోడనే వారివెనుకనేపోయి వారు నివసించినస్థలము. మార్గముమొదలగువానినిగూర్చి తెలిసికొని యాతఁడు మరలనిక్కడకు

వచ్చి యిక్కడనున్నవానితో నావివరములనన్నిఁటిని దెల్పి మరల ముం దునకుఁ బోవుచుండవలయును.

మొదటి— మీాయుద్దేశము తెలిసినది. మేమట్టికార్యములను నెరవేర్చుచుందుము. కాని యాచోరులు చాలదూరముపోయినచో వెనుకకువచ్చి మరల ముందునకుఁబోవుట కెట్లుపీలుపడును? తుదకు వారియానుపానులు తెలియకుండఁ బోవునుగదా!

అభి— అదియు నాలోచింపవలసినదే. ఇప్పుడేడుగంటలైనది. నేనాగ్రికుఁ జేరునప్పటికిఁ బండ్రెండుగంటలగును. అచ్చటఁగార్యము లన్నియు జక్కనగునప్పటికి రెండుగంటలకాలము పట్టవచ్చును. సాయం కాలమగునప్పటికి దప్పకుండ నేను మరల నిక్కడకువచ్చెదను.

అట్లయినచో నీకనేమియు సంశయింపనక్కరలేదు. ఆచోరులు మూఁడుదినములనుండి నడచినడచివచ్చి యిక్కడ విడిసియున్నారు. వారెవ్వరు నంతగాఁ కాతరము నొందుచుండుటలేదు. వారీనాడిచ్చటనే యుఁదురనుటకు సందియములేదు.

అభి—వారిక్కడనే యుందురని నానమ్మకము వారిక్కడనే యుండి యొక్కొక్కఁడే యాగ్రాకుఁబోయి క్రమ క్రమముగ నశ్వములను రత్నములను విక్రయించెదరు. వారికాయుద్దేశమే లేకపో యినచో రాజధానియగు నాగ్రామార్గమునుబట్టి వచ్చి యింతసమీా పములో విడియరు.

మొదటి—మీారుసెలవిచ్చినది సరియైయుండుననియే తోచు చున్నది.

అభి—విశేషముగ మాటలతోఁ బ్రయోజనములేదు. నేని ప్పుడేపోయెదను. సాయంకాలమునకు రాకపోయినచోఁ దుదకుఁ దెల్ల వారుసరికైనను నేనొక్కఁడనైనను దప్పక వచ్చితీరెదను. సందేహము లేదు. మీారు జాగరూకులై యుండవలయును.

అభిరామస్వామి వెడలిపోయెను.

ఏడవ ప్రకరణము.

పాట్నానగరమున మానసింహమహారాజుచే నేర్పఱుపఁబడిన యొకమహాభవనమునం దయేషా సంపూర్ణస్వేచ్ఛతో నివసించియుండెను. ఊర్మిళామహారాజ్ఞియు ననేకవిధముల నామె సుఖముగాఁ గాలముగడపుటకు సదుపాయములనన్నిటిని సరిగాఁజేయించుచుండెను. ఆమె స్వామియు ననేకపర్యాయము లయేషాకడకువచ్చి చూచిపోవుచుండెను. చాలసేపామెతో గూర్చుండి మాటలాడుచుండును. ఈప్రపంచమున నయేషాతో మాటలాడి ప్రీతిజెందనివారెవరు? అయేషా హృదయమునందలి సద్భావములను దెలిసికొని యూర్మిళ యత్యంతము విమోహితయయ్యెను

రెండునెలలు గడచిపోయినవి. సుఖదుఃఖసమ్మిశ్రితమైన కాలము సమభావముతో గడచిపోవుచుండెను. పఠానుల పరాజయవృత్తాంతము లనుదినమును గ్రొత్తకొత్తగ నయేషాకుఁ దెలియవచ్చుచుండెను. స్వచ్ఛందమైన కారాగారమునందున్నను, సంతతమును మొగలాయీల విజయవృత్తాంతములును వానితోడనే యస్మాన్ఖానుని భయానకము లగు సంతతపరాజయోదంతములును వినవచ్చుచుండుటచే నయేషా హృదయము మిగులకళవళ మొందుచుండెను. అస్మాన్ఖాను విపద్గ్రస్తుఁడైయుండెను. ఇట్టికష్టకాలమున దానొరిస్సాదేశమును వీడివచ్చుట సరికాదనియు, నిట్టిసమయమున బితృభవనమును వీడియుండుట తనకు శ్రేయస్కరముగాదనియు, నబాబగు నస్మాన్ఖానువిడిచి దూరముగా నుండు టుచితముకాదనియు, నామె యోచించుకొనుచుండెను. ఈ సమయమున నామె సమీపమునందున్నచో నస్మాన్ఖా నంతటియుత్సాహశూన్యుఁడై యుండఁడు వివేకావివేకవిచారమునఁ దప్పు[illegible]మును ద్రొక్కియుండఁడు. పఠానుల పరాజయమునకుఁ దానేకారణమని యయేషా తనమనసున భావించుకొనుచుండెను అస్మాన్ఖా నయేషాయెడల నత్యంతకరుణామయుఁడు. అతిచలితప్రేమమయుఁడు. అట్టిమహాపురుషున కట్టియాపదలువచ్చినప్పుడు దూరమునుండి చూచుచు

నూరకుండుటచేఁ దాను మిగులఁ గృతఘ్నురాలనని యామె తలపోయు చుండెను.

ఒరిస్సాదేశమున మానసింహమహారాజు సంపూర్ణవిజయము నొందినాఁడనియు, నస్మానుఖాను సర్వవిషయముల నక్బరుషాదుమహా యధికారపాశముచే బద్ధుఁడైయున్నాఁడనియు నయేషాకుఁ దెలియ వచ్చెను అందుచే నస్మానుఖానింకను బ్రాణములతో నిలిచియున్నాఁ డని యామె తెలిసికొనియెను. తేజస్వియు సాహసికుఁడునగు నావీరా గ్రేసరుఁడు ప్రాణములతో నిలిచినామెపాలిటికి సర్వమునున్నట్లగును. ఉత్కలవిజయియైన మానసింహుఁడు పాట్నానగరాభిముఖుఁడై నాఁడ నియుఁ త్వరలోనే రాజధానికి వచ్చునినియు నయేషాకు వార్తవచ్చెను.

రాజనైతికప్రయోజనార్థమై తా నవరుద్ధనైతినని యయేషా తెలిసికొనియెను. ఆమె తనచేఁజిక్కినదనువార్త తెలిసికొనినచో నయేషా యుద్ధముచేయక తనయధికారమున కంగీకరించునని మాన సింహుఁడు యోచించుకొనియెను. మఱియొకవిధముగ నయేషా యవ రోధము మానసింహునికార్యసిద్ధికి సాహాయ్యమే యయ్యెను. ఆయేషా తనసమీపమున నుండకపోవుటయేగాక మానసింహునిచే నవరుద్ధ యయ్యెననువార్తవిని యస్మానుఖాను విచలితుఁడై విషయజ్ఞానరహిత ముఁను హితాహితవివేకశూన్యుఁడు నగు కార్యములను జేసెను. అందు వలన మహారాజున కనుకూలఫలమే లభించెను. అది యెట్లనఁ గాఁ ముందు. ప్రకృతమున నారాజనైతిక ప్రయోజనము ముగిసినట్లు తోఁచుచున్నది బహుశః మానసింహమహారాజు పాట్నాకుఁ దిరిగి వచ్చినతోడనే యయేషాను విడిచిపెట్టఁగలఁడు.

ఈమొదలగు చింతనలతోడను, నాశలతోడను నయేషా కాల మును గడపుచుండెను మూఁడుగంటలవేళ సుసజ్జితమైన యొకప్రాసా దమున నయేషాయొక్కతెయె గూర్చుండి ముందుజరుగఁబోవు తనస్థితి గతులనుగూర్చి యేమేమో యోచించుకొనుచుండెను. అంతలోఁ బార్శ్వమునందున్న ద్వారముకడ నొకపరమసుందరనారీమూర్తి యామెకు దృష్టిగోచరమయ్యెను ఆస్త్రీ లోపలకు వచ్చెను అయేషా యును సంభ్రమముతోఁ బీఠమునుండి లేచి యాస్త్రీమూర్తి కెదురుగఁ

బోయెను. ఆస్త్రీయును వేగముగా ముందునకువచ్చి యయేషా వక్షమునఁ బడియెను. ఆసుందరులిరువురును జాలసేపు పరస్పరాలింగనముఁ జేసికొని యట్లే నిలువఁబడియుండిరి వారిరువురి నేత్రములనుండియు నశ్రుధారలు పరంపరగాఁ వచ్చుచుండెను. క్రొత్తగావచ్చిన యాసుందరి తిలోత్తమయే.

అయేషా మొదట మాటలాడుటకుఁ బ్రారంభించెను. "నేను నిన్ను మరలఁజూచుట సంభవించునని యెన్నఁడు ననుకొనలేదు. నీ యదృష్టము ప్రసన్నమైనది. నీకు నీమామగారిగృహమునఁ దాపుదొరకినదను శుభసమాచారమును విని సంతోషించితిని"

అయేషావక్షఃప్రదేశమునుండి తిలోత్తమ తనమస్తకము నెత్తికొనియెను. అపారవివేకమును, ననుపమాన తేజస్వితను సూచించు నయేషాముఖమండలమువంక నొకసారి యామె తనదృష్టిని సారించి "అదృష్టమెట్లుప్రసన్నమైనది ? ఆయన యింకను గారాగారమునందే యుండిరిగాదా !" అనియెను.

చీఱచెఱఁగును ముఖముపైఁ గప్పుకొని చిన్నబిడ్డవలెఁ దిలోత్తమ యేడువనారంభించెను అయేషా యామెహస్తమును బట్టుకొని ముఖమును, నేత్రములను దుడిచి పిదప నామెను దనసమీపముననున్న పీఠముపైఁ గూర్చుండఁబెట్టికొని తానామెపార్శ్వమునఁ గూర్చుండి "విచారింపకుము వీరపత్ని యెన్నియోదుఃఖములను దుర్దశల ననుభవింపవలసియుండును ఎంతయోధైర్యవంతురాలై యుండవలయును. ఈసామాన్యవిపత్తునకే యింత కాతరమునొందుచుంటివా ?" అనియెను.

తి—ఇంతటిక్లేశముతోఁ గాలమునుగడపుటెట్లు ? నాయీ దుఃఖమునుజెప్పుకొనుటకు నాకీ ప్రపంచమున నెవ్వరునులేరు. అందుచే నీకడ నాదుఃఖమును జెప్పుకొనుటకై వచ్చితిని.

అ—మంచిపనిచేసితివి. "సోదరీ ! నిన్నుఁజూచుటచే నేను చాలసుఖినైతివి. నీయీదుఃఖదినములు త్వరలోనే పూర్ణముగా గడచి పోవును. రాజపుత్రునకు శీఘ్రకాలములోనే విముక్తి గలుగును.

తి—నీవట్లూహించుటకు గారణము లేమైనగలవా ?

అ—అభిరామస్వామి విజ్ఞాపనపత్రమును ఢిల్లీకిఁ గొంపోయినాఁడు. ఆవిజ్ఞాపనము వ్యర్థముకాఁజాలదు.

తి—అతఁడు ఢిల్లీకెప్పుడు వెళ్ళినాఁడు ?

అ—రెండునెలలకు పైగానైనది.

తి—అయినచో నింతయాలస్యమేమి ?

అ—మధ్య విఘ్నము లుగల్గుటకు గారణమేమియుం గాన్పించదు. పాదుషహాదర్బారునుండి యాజ్ఞాపత్రిక రావలయునన్నచోఁ గాలవిళంబము కాకమానదు. సోదరీ! రెండునెలలుగాదు— నాలుగు నెలలైనను బాధకమేమి ?

తిలోత్తమయించుక యాశ్చర్యపడి మనసులో "ఇదేమి ప్రేమప్రదర్శకమైనమాట! నేనెవనిని మనసార ప్రేమించుచుంటినో, యట్టి నాహృదయేశుఁడు శృంఖలాబద్ధుఁడై యంధకారమయమైన కారాగారమునందున్నాఁడు. ఆవిషయము తలపునఁబారినచో హృదయము వ్రక్కలైపోవుచున్నది. ఒక్కముహూర్తము— తుదకొక్క నిమిషమైనను ముందుగ నాతనికి విడుగడయయ్యేనేని, యది నాకుఁ బరమలాభముగాఁ బరిగణించుకొనెదను. నవాబునందిని రెండునెలలకు బదులుగ నాల్గునెలలను లెక్కించుచున్నదేమి ?" అని యనుకొని ప్రకాశముగా "అక్కా! సర్వమును పోఁగొట్టుకొనినమైనను యువరాజు నీము హూర్తమునఁ జెఱసాలనుండి విడిపింపఁగలిగినచో నదియే మేలని నా యభిప్రాయము. రెండునెలలైనపిదప యువరాజు సకలైశ్వర్యములతోడను, గారాగారమునుండి విముక్తినొందనున్నను, నది కోరదగినది కాదని నాకుఁదోచుచున్నది" అనియెను.

అయేషాచిఱునగవుతో "ప్రణయమహిమచే హృదయమునకట్లు తోఁచుచుండుటనిజము" అనియెను.

తి—అట్లయినచో నీవు వేరువిధముగాఁ దలంచుటేమి ?

అయేషా యించుకసేపధోముఖియై చింతించి పిదప నిట్లు చెప్ప నారంభించెను. "రాజపుత్త్రుఁడు వీరాగ్రగణ్యుఁడని నేనెఱుంగుదును వీరులు తమదేహము తీక్ష్ణమైనకత్తిచే గాయపఱుపఁబడినను వానినించు

కంతయు యాతనగాఁ బరిగణింపరు. తమశిరస్సునొక్కపెట్టున దెగవ్రేయుటకై శత్రువుఁ ఖడ్గ మరుదెంచుచున్నను దానినిజూచి యించుకంతయును విచలితులుఁగారు. అట్టిమహాత్ములకు లోహశృంఖలములుగాని యంధకారమయమయిన కారాగారముగాని లేశమాత్రమును భయజనకములుగాఁజాలవు. అజ్ఞానులగు మనవంటి యాత్మీయ జనులకది కష్టతరముగాఁదోఁచి దుఃఖించుచుందురు. ఆకష్టానుభవమునకుఁ గేవలము స్వార్థపరత్వముదక్క వేఱుకారణములేదు. మన మనేకపర్యాయములు ప్రేమాస్పదుని హృదయమునకంటె నాతనిశరీరమును మిక్కిలిగాఁ బ్రేమించుచుందుము. అందుచేతనే మనమాతనినిచూడఁజాలనప్పుడును, లేదా యాతఁడు మనసమీపమున లేనప్పుడును మనము మిగులవ్యాకులపడుచుందుము. అట్టియుద్వేగమువలనఁ బ్రయోజనమేమో నాకుఁ దోఁచుటలేదు.

తి—నీవు చెప్పినదంతయు సత్యము. వాస్తవముగా రాజపుత్రుని క్షణవియోగమునుసైతము నేనుసహింప జాలను. అదిస్వార్థపరత్వముయొక్క ఫలమేయైనచో నిజముగా నేను స్వార్థపరనేయగుదును. అక్కా! నిన్నొకవిషయమునుగూర్చి యడుగ సాహసించుచున్నదానను. నీవును రాజపుత్రుని యథేష్టముగాఁ బ్రేమించుచుంటివిగదా! నావలె నీవును నాతనినిమిత్తమై వ్యాకులపడుచుండుట లేదేమి?

అయేషా యవనతముఖియై తిలోత్తమహస్తమును బట్టుకొనియెను. పిదపఁ దనముఖమును వేఱుదిక్కునకు ద్రిప్పుకొని యిట్లనియెను. "సోదరీ! నీవాక్యములను విని నేను సంతుష్టచిత్తనగుటలేదు. నేను యువరాజును బ్రేమించుచున్నాననుమాట నిశ్చయము. ఆనాప్రేమ యనంతమైనది; అపారమైనది; గంభీరమైనది. కాని, యీప్రపంచమునందావిషయము నెవ్వరు నెఱుఁగరు. ఎఱుంగవలసినసంభవమును లేదు. దైవవశమున నాహృదయమించుక విచలితావస్థయందున్నప్పుడు యువరాజు సమక్షమున నేనే దానినివ్యక్తముచేసితిని. అట్లుచేయవలసి వచ్చినందులకు నేనెంతయో సిగ్గునొందుచున్నదానను. ఆవిషయమును నీవెవరితోడను జెప్పఁదగదు. నీవు పలుమారులావిషయమును జ్ఞప్తికి

దెచ్చుకొనవలదు. నీవాసంగతిని బూర్ణముగా మఱచిపోవలయును. ఇవే నా ప్రార్థనలు.

తి—అక్కా! అదేమి? దానిని మఱచిపోఁగలవా? ఆవిషయము నితరులకేల తెలుపఁగూడదు? ప్రేమ దోషాకరమైనదికాదు. ప్రేమించినచోఁ బాపమున్నదా? అందులకు నీవేలసిగ్గుపడుచుంటివి?

అ—సోదరీ! నీకునేఁజెప్పునదేమన,—ప్రేమ, లేక ప్రణయమనునది ప్రియములలోఁ బ్రాణపదార్థము. అతిసావధానముగఁ బ్రయత్నపూర్వకముగ వానిని ప్రాణములలోనిమిడ్చి యుంచఁదగిన పదార్థమని తెలిసికొనవలయును. దానిని బహిరంగముచేసి ప్రపంచమంతటను వెల్లడిసేయుచువచ్చిరేని యదినిస్సారమైపోయి తుదకుఁ బరిహాసాస్పదమగును. అప్పుడది లజ్జాహేతువగును.

తి—ప్రణయము ప్రాణిపదార్థమనుమాటయేమో నిశ్చయమే. కాని, మనమెవరిని బ్రేమించుచుంటిమో, యతనికావిషయము తెలిసినందువల్ల దోషమేమి? అతనికాప్రేమ తెలియకపోయినచోఁ బ్రేమించుటవలన సుఖమేమి?

అ—సోదరీ! అట్లయినచో నది ప్రణయమును గ్రయవిక్రయ వ్యాపారమును జేయుట కారంభించినట్లగును. మనమెవరిని బ్రేమించుచుంటిమో వారికాప్రేమను దెలియఁజేయఁదలంచితిమేని మనప్రణయమునకు బదులుగ నాతనిప్రణయము నాకాంక్షించుచున్నామనుట స్పష్టము. ప్రణయమునకుఁ బ్రణయమును బడయఁగోరినప్పు డంగడియందలి యితరపదార్థమువలెనే ప్రణయముకూడ నొకవ్యాపారపదార్థముగాఁ బరిగణింపఁగలదు. నేను నీకొకపదార్థము నిచ్చినప్పుడు నీవు దానికి బదులుగ వేఱొకపదార్థమును నాకొసఁగితివేని యది యంగడివ్యాపారమనిపించుకొనును. మిక్కిలిపవిత్రమైన యమూల్యమైనప్రణయమును, బదులువస్తువునుకోరి విక్రయించి యంగడిపదార్థమునుగాఁ జేయుటకేవలము లజ్జాకరమని నాయభిప్రాయము.

తిలోత్తమ తనహృదయమునఁ బ్రణయసంబంధమగు నాభావము మిక్కిలిమధురమైనదియు, నత్యుచ్చతమైనదనుట కించుకంతయును సంది

యము లేదనియూహించి పిదప "మన మెవనిని బ్రేమించుచుంటిమో యాతని సుఖము కొఱకైనను నా ప్రణయము నాతనికిఁ దెలుపు టుచితము" అనియెను.

అ—ఉచితమేయగును కాని, చూడుము! మన మెవనిని బ్రేమించుచుంటిమో యాతఁడా ప్రేమననుభవించుట కాతురపడుచున్నప్పుడును బ్రేమాభావముచే దరిద్రుఁడై యున్నప్పుడును మాత్రమే మన్వప్రాణములయందలి ప్రణయమును సంపూర్ణముగ నాతనికిఁ దెలుపుటుచితమగును.

తి—కాని, అక్కా! మనము స్త్రీలము ప్రేమించుచుండుటయే మనపని. మన మెవనిని బ్రేమించుచుంటిమో యాతఁడు ప్రేమాభావముచే దరిద్రుఁడు కాకపోయినను మనము సకలాంతఃకరణములచేతను నాతని నేల ప్రేమింపఁగూడదు? నిరంతరమును బ్రణయప్రవాహమున నాతని నేల తేలునట్లు సేయుచుండఁగూడదు?

అ—ప్రేమింపఁగూడదని నేను చెప్పుటలేదు. మన సర్వాంతఃకరణములచేతను బ్రేమించుచుండుటకు మనకధికారము కలదు. కాని, మన మెవనిని బ్రేమించుచుంటిమో యాతనికి మన ప్రేమను దెలియనీయరాదు.

తి—అక్కా! నీవట్లనుచున్నావేమి? పురుషుని హృదయము సముద్రము వంటిది. ఆసముద్రమునందు మన ప్రణయఘటములను ముంచి మనకుఁ గావలసిన ప్రణయము నేల తెచ్చుకొనఁగూడదు? మనుష్యజీవితమునందు సర్వమునకును బ్రణయము ప్రధానసుఖవిషయముగ నున్నది. వలపుచేవలచుటయును, వలపుచేవలపించుటయును నను నీరెండును మనుష్యునకాతని జీవితమునందు సర్వశ్రేష్ఠమైన యధికారములు. అక్కా! అయేషా! నీవు రాజపుత్రుని ప్రాణములవలె మనసార బ్రేమించుచుంటివనుమాట నిశ్చయము. అట్లయినప్పుడు నీవు ప్రకాశముగా నాతని బ్రేమించి యేల సుఖపడఁగూడదు? రాజపుత్రుని మఱియెవ్వరైనఁ బ్రేమించినచోఁ దిలోత్తమ దుఃఖించునని నీవొకవేళ తలంచియుండవచ్చును. నీవట్లు యోచించినచో—అక్కా! ఆసంబంధ

మైన యోచన కేవలము భ్రమాత్మకమైనదని నిశ్చయముగాఁ జెప్పు చున్నాను. నీయంతటిగుణవతియు, హితైషిణియు నగుస్త్రీ యువ రాజును బ్రేమించినదనువిషయమును స్మరించుకొనినంతమాత్రముననే నాహృదయము ముప్పొంగి యానందముచే నాదేహము పులకలెత్తుచుం డెను. నీవును నేనును నొకగుత్తియందుండు రెండుపూవులవలె విక సించియుండవలయునని నేను సదాకోరుచుందును. శోభామయమైన యొకయుద్యానమునఁ బూవు లెన్నివిధముల వికసించుటలేదు. ఒకగిరి హృదయమును భేదించుకొని యెన్నినిర్ఝరిణులు హృదయరంజకముగ గలగలధ్వనులనుజేయుచుఁ బ్రవహించుచుండుటలేదు? ఒక్కసాగర మున నెన్నినదులు తమదేహముల నర్పించుకొనుటలేదు? నీవెవనిని బ్రేమించుచుంటివో నేను నాతనినే ప్రేమించుచున్నదానను. ఇఁక ముందు శరీరములు వేరయినను మనమిరువురము నొకేప్రాణముగలవా రమై యొకేసహానుభూతికలవారమై యుండుటుచితము అక్కా! నీవు కూడ యువరాజు వక్షఃప్రదేశమున "కోహినూరు" వలె నెందులకుఁ బ్రకాశింపఁ గూడదు.

ఇట్లుచెప్పి తిలోత్తమ యమేషాకంఠమును గాఁగిలించుకొని యెను. అమేషాయు నాదరభావముతో నామెగడ్డమునుబట్టుకొని నీవంటిసరళహృదయయగుస్త్రీనోటినుండి వచ్చువాక్యములన్నియు నతి మధురములై హృదయరంజకముసేయుచుండును. నీవంటిగుణవతియైన సహధర్మిణి పార్శ్వవర్తినియైనప్పుడు యువరాజుజీవితమునం దొకప్పు డును దీర్ఘనిశ్వాసమును విడువవలసిన యావశ్యకముండఁజాలదని నా నమ్మకము. కాని, సోదరీ! నీకొక్కభ్రమయుండెనని నాకుఁ బాధ గట్టుచున్నది. నాప్రణయమును వేఱొకస్వతంత్రమార్గమునఁబెట్టి నే నత్యంతము సుఖమునొందుచున్నదానను. ప్రేమించుటను నేనెఱుం గుదును. ప్రేమించి యమితానందమును నేననుభవించుచున్నదానను. ప్రేమను సంపాదించుటకుఁగాని ప్రేమాడంబరమును గనపర్చుటకుఁ గాని నాకిష్టములేదు. సోదరీ! నావిషయమునుగూర్చి యిఁక నీవెప్పు డును యోచింపవలదు. నేను క్లేశమునొందుచున్నానని తలంచి నీవు విచారపడవలదు." అనియెను.

తి—(దీర్ఘనిశ్వాసమునువిడిచి) ఈసారి నీప్రాణసంయమున మెట్లు చేయఁగలదానవో నేనెఱుఁగఁజాలకున్నాను. ఈప్రపంచమునం దెవ్వరును నిన్నుఁబోలినవారు లేరు.

అ—(విషాదసూచకమగు చిఱునగవుతో) నేను పాషాణహృదయను. ఈకుమ్మనీరసపాషాణహృదయమున నీకోమలతకు స్థలములేదు. ఆమాటల నటుంచుము. మనము చాలసేపటినుండి మనసంబంధములగు మాటలనే మాటాడుకొనుచున్నాము. రాజపుత్త్రుని కారాగారవిముక్తి విషయమున నేను నిశ్చింతనైయున్నాను. నీవుకూడ నావిషయమున నిశ్చింతనై యుండవలయునని నాయభిప్రాయము.

తి—ఆవిషయమున నీకు సందియములేనప్పుడు నాకు విచార మెందులకు?

పిదప నయేషా ప్రేమభావముతోఁ దిలోత్తమను గౌఁగిలించుకొని యిట్లుచెప్పనారంభించెను. "నాయీజీవితమున మరల నిన్నుఁ జూచుభాగ్యము నాకుండదు. నాసోదరుఁడు యుద్ధమునందుఁ బరాజితుఁడైనాఁడు. మహారాజుగారియనుగ్రహమువలన నేనిటనుండివిముక్తి నొందినతోడనే యొరిస్సాదేశమునకు నాయన్నయొద్దకేగెదను ప్రకృతమున సంభవించిన యనేకకారణములచే నికముందుఁ బఠానులును, మొగలాయీలును సద్భావముతోనుందురనునాశ నాకులేదు. బహుశః పఠానులు నశించిపోవుదురనియే తోఁచుచున్నది పఠానులతోఁగూడ నయేషాపేరు విలుప్తమైపోయినను బోవచ్చును. ఒకవేళ నాకు మరణము సంభవించినచో మీకాసమాచారము తెలియుటకూడ సందేహముగాఁదోఁచుచున్నది. నాకు నీయీదర్శనమే తుదిసందర్శనమని నేను తలంచుచున్నదానను.

తి—అక్కా! అంతటిమాట యనఁబోకుము చిరకాలము నిన్నుఁ జూచుచుండఁగలపినెడియాశతో నున్నాను. చిరకాలము నా సుఖదుఃఖములు నీకుఁ దెలుపుచుండెదను. ఆపదలయందు నీసాహాయ్యమును వేఁడుకొనుచుండెదను. సంపత్కాలమునకువచ్చినప్పుడు నీతో సమభాగినినై సుఖానుభోగములనందెదను. అంతటి కఠోరవాక్యములను బలికి నాయాశలన్నిఁటి నొక్కమారుగ నేలనిర్మూలముచేసెదవు?

అ——సోదరీ ! మానవులు తమహృదయమునందు నాశాకాం క్షలు లేకుండఁజేసికొనినచో వారికది మంగళదాయకమగును ఆశా కాంక్షలను ద్రోసివేయుటకు నామనస్సునకు శక్తికలదు అందుచేత నేను కాతరమునొందుచుండుటలేదు నీవును నానిమిత్తమై కాతరము నొందవలదని ప్రార్థించుచున్నాను.

ఇంతలో దాసియొకర్తువచ్చి "మహారాజ్ఞిగారు మిమ్ములను దీసి కొనిరమ్మని యాజ్ఞాపించినారు" అని విన్నవించెను

తోడనే తిలోత్తమ లేచి నిలుచుండి యయేషాతో "నేనిఁక నిట నుండుట కవకాశములేదు. భర్తృజననియగు నూర్మిళాదేవిగారి యను గ్రహముచే నిన్నుఁజూచుభాగ్యము నాకుఁభించినది. అది యదృష్ట ముగా భావించుకొనుచున్నదానను కాని అక్కా- ఇందుచే నాకు సుఖముగలుగనేరదు ఈ నీదేశమునుండి వెడలిపోవుటకుఁ బూర్వ మిం కొకసారి వచ్చిచూచెదను. అప్పుడు నీహృదయము వేఱుమార్గము ననుసరించుటనుజూచి సంతోషించెదను ఇప్పుడు నాకు సెలవొసం గుము" అనియెను.

అ——ఇంకొకసారి చూడఁగలిగినచో నేమును సుఖవతి నయ్యె దను. నాహృదయము వేఱుమార్గము త్రొక్కుటను నీవు నాయీజ న్మమునందు చూడఁజాలవు నీకు సర్వదా సకలసుఖములను గలుగఁ జేయవలయునని యీశ్వరుని ప్రార్థించుచుండెదను. మహారాజ్ఞి గారికి నాయనంతప్రణామములను నివేదింపుము నేనీ దేశమునువిడిచి వెళ్లుటకుఁ బూర్వము మనమింకొకసారి కలిసికొనఁగలిగితిమేని చరితార్థ నయ్యెదను.

తిలోత్తమయు విషణ్ణభావముతో సెలవుఁగైకొనివెడలిపోయెను.

ఎనిమిదవప్రకరణము.

ఒరిస్సాదేశమునుజయించి మానసింహమహారాజు పాట్నానగర మునకుఁ దరిగివచ్చెను. అతఁడయేషాను సంపూర్ణముగా విడిచిపెట్టలేదు కాని; పూర్వముకంటె నధికముగ స్వాతంత్ర్యమునొసంగి యిఁకకొంఁది

కాలములోనే యామెను విడిచిపుచ్చెదనని చెప్పియుండెను ఇంచుకస్వా తంత్ర్యమువచ్చినతోడనే యయేషా పాట్నానగరమునందలి యాత్రి యుల సమాచారములను దెలిసికొనియెను.

తాజఖానుని కుటుంబములోనివార లయేషాను జూడవచ్చిరి. వారు చెప్పినదానినిబట్టి యభిరామస్వామిదౌత్యము నిష్ఫలమయ్యెనని యు నాతనిచేతికొసంగినవిజ్ఞాపనపత్రము, ధనము, రత్నములు నుత్త రములు, మొదలగునవన్నియును గానపురసమీపమున దొంగలచేతిలో బడిపోయినవనియు, నచ్చటనుండి యాతనితోఁగూడ వెళ్లిన ముగ్గురు రక్షకులు పాట్నాకు వెనుదిరిగి వచ్చిరనియు, మనయభిరామస్వామియును మరియిరువురును డిల్లీకేగిరనియు నయేషా తెలిసికొనియెను. ఆసంగతు లను వినినపిదప నామె తానచ్చటనుండి శీఘ్రముగ విముక్తినొందవల యునని తొందరపడఁజొచ్చెను. తానే స్వయముగ డిల్లీకిఁ బోవలయునని యామె నిశ్చయముచేసికొనియెను

ఒకనాఁటిమధ్యాహ్నమున నయేషా యొంటరిగఁగూర్చుండి యొకయుత్తరమును వ్రాసెను. అంతవఱకును నామె కాస్వాతంత్ర్యము లేదు. ఆమె యెవరికిని నుత్తరములను వ్రాయఁగూడదు ఎవరియొద్ద నుండియు నుత్తరములను దెప్పించుకొనఁగూడదు ఇప్పుడట్టి స్వాతం త్ర్యమామెకు లభించినది ఉత్తరము నించుకసేపటిలోనే వ్రాసిముగిం చెను. ఆయుత్తరమస్మానఖానునకు వ్రాసెను వ్రాసి యిట్లు చదువఁ దొడంగెను.

"సోదరా! అస్మాన్!

అనేకయుద్ధములలో నీకుఁ బరాజయము సంభవించినదని విని యున్నాను. కాని, నేనావార్తవలన విశేషవిచలితను గాలేదు ఏమనిన నీహృదయబలమునందు నాకు విశేషవిశ్వాసమున్నది. రణరంగమునఁ బరాజయముగలిగినను నీహృదయమును జయించువీరు లెవ్వరును ప్రపం చమునందింతవఱకును పుట్టియుండలేదు

నిన్నువిడిచి చాలదూరము వచ్చియుండుటవలన నేను మిగుల నన్యాయకార్యమును జేసినదాననగుచున్నాను. స్నేహమయమైన నీ యాశ్రయమును విడిచివచ్చుటకు నాకించుకంతయు నధికారములేదు.

అట్టి యధికార మిప్పుడును లేదు—ఇకముందును నుండదు. చాలదూరము వచ్చినపిదప నాయపరాధ మెంతమహోత్తరమైనదో నేను తెలిసికొంటిని. అందుమూలమున ననేకయాతనలకు లోనగుటయేగాక నిత్యమును నన్ను నేనే నూరారునూరులు నిందించుకొనుచున్నదానను. నేనాస్వాతంత్ర్యమును గైకొనినందువలన నీహృదయమునకుఁ జాల వ్యథఁగలుగఁజేసితినని తలంచుచున్నాను. ఇంతేగాక, యందుమూలమున నీచిత్తస్థైర్యముకూడ పోయియుండునని యూహించుచున్నాను నాయెడలఁ జిరకాలమునుండి నీవుకరుణామయుఁడవై యున్నాఁడవు నాయపరాధము క్షమింపఁదగినది కాదు అందులకు సందేహము లేదు. కాని నీవు నన్నుఁ దప్పక క్షమించి యనుగ్రహించెదవని ధైర్యముతో నున్నాను నాయీధైర్యము విఫలమగునా ?

నేనెందుకొఱకు నిన్నువిడిచి వెడలివచ్చితినో యాప్రయోజనమును నీవు తెలిసికొనవలసిన యావశ్యకము లేదు నాయాస్తినిగూర్చిన వ్యాపారములను జక్కఁజేసికొనుటకై కరుణామయమైన నీయాశ్రయమును విడిచివచ్చితినని యాయమ్మవలన నీవు వినియుందువు కాని, తుచ్ఛములైన ధన సంపదలనాశించి, యయేషా స్నేహమయమైన నీసాన్నిధ్యమును విడిచిరాలేదు. నీయనుగ్రహముతో నీప్రపంచమునందలి సమస్తసంపదలను వినిమయముచేసికొనుట కయేషాకసంభవము కాదు

అత్యవసరమైన యేకార్యముకొఱకు నేను నీభవనమును విడిచి వచ్చితినో యాకార్యమింక ముగియలేదు. ఆకర్తవ్యకార్యము స్వల్పకాలములోనే నెరవేరునని తోఁచుచున్నది.

నేనును శీఘ్రకాలములోనే నీకడకరుదెంచెదను. నేనెప్పుడెట్టులు వచ్చునదియు వెనుకనుండి నీపేర వ్రాసెదను.

అపారమగు నీస్నేహమువలనను, కృపవలనను నాదరమువలనను నార్ద్రీభూతమైన నా ప్రాణము, నాదారుణాపరాధమువలనఁ గలిగిన నీక్రోధముచే క్షమ్యమైనదగునా ?

నీకు సంభవించిన దశావిపర్యయమునుగూర్చి నెనెంతగా జింతించుచుండుటలేదు. ఈరాజగౌరవమనున దెవరియందును జిరస్థాయిగా

నుండ నదికాదు. ఆవిషయమును నేను బాగుగా నెఱుంగుదును. అది వచ్చుటకును బోవుటకువిశేషకాల మావశ్యకములేదు. కాని, హృదయ మహాత్త్వమును సౌన్నత్యమునుమాత్రి మెవ్వరును సులభముగాఁ బొంద జాలరు. వానిని బొందినవాఁడే మానవులలో ధన్యతముఁడు, నీహృదయ మసాధారణసద్గుణ గణాశ్రియమని నేనుబాగుగా నెఱుంగుదును. ఐహికములగు నైశ్వర్యసంపదలకు హానివృద్ధులు తటస్థమైనప్పు డందుమూలమున నీకుఁగలుగు లాభనష్టము లేమియునులేవు.

ఈయవస్థాంతరమునందున్నప్పుడు నీకు సంభవించెడి యాతనలను, నాపదలను నీవెంతధైర్యముతో సహించుచుందువో నేనెఱుంగుదును. నీధైర్యమును సామర్థ్యమును, నోర్పును, నసాధారణములైనవి. అవస్థాపరివర్తనము మూలమున వర్తమానకాలమున నీకు సంభవించిన కష్టములకంటె వేయిరెట్లధికకష్టకారణమైన హృదయజ్వాలను బైకిఁగనఁబడకుండ నీవు ధైర్యముతో మానముగా సహించుకొనుచు వచ్చుచుండుటను నేను బాగుగా నెఱుంగుదును. అందుచే నల్పమైన యీాపత్కాలావస్థయందు నీవు ధైర్యముచెడియుండవనియే నాదృఢవిశ్వాసము.

ఈదుస్సమయమునం దతిశీఘ్రముగా నీయొద్దకు రావలయునని యు, నవస్థాంతరమునందు నీహృదయము చెక్కుచెదరకుండఁ బర్వతమువలె స్థిరమైయుండుటను గన్నులారజూడవలయుననియు, నావశ్యకమైనచో సాహాయ్యముచేసి నీకు సంతోషముఁగలుగఁ జేయవలయుననియు నేనెంతయో తొందరపడుచున్నదానను. స్థానాంతరమునకు వచ్చిన నేను స్వల్పవిషత్తునకు లోనైతిని. దానిని నీవు వినియేయుందువు. అందుచే నావిషయమునుగూర్చి యీాయుత్తరమున వ్రాయలేదు. కాని తన్మూలమున నాకేమియు నష్టముకలుగలేదు.

చాలఁగా వ్రాసితిని. నాశతాపరాధములును జిరకాలమునుండి క్షమించుచువచ్చుచున్నాఁడవు. అతివినీతభావముతో మరల నాయీయపరాధమును క్షమింపవలయునని వేఁడుకొనుచు నుత్తరమును ముగించుచున్నదానను. క్షమింపుము.

ఇట్లు
అభాగిని.
"అయేషా"

ఉత్తరమును సరిగా నస్మానుఖానున కంపుటకై రాజఖానుని కడకంపెను. వేరువిషయములనుగూర్చి చెప్పవలసినదంతయుం దాజఖానునకుం జెప్పుటకై నమ్మకముగలయొకమనుష్యునితోం జెప్పి యుత్తరమునాతని చేతికిచ్చి పంపించెను.

ఆమె యచ్చటనే కూర్చుండి చింతామగ్నయయ్యెను. తాను శీఘ్రముగా నాయవరోధమునుండి విముక్తినొందుట యావశ్యకమై యుండినను, నందునిమిత్తము మానసింహుని వేడుకొనుట మంచిదని యామె యోచింపలేదు.

తొమ్మిదవప్రకరణము.

ఏదినమున మధ్యాహ్నమున నయేషా యస్మానుఖానునకు త్తరము వ్రాసెనో యానాటి సాయంకాలమునం గొంచెమురాత్రియైన పిదప నూర్మిళాదేవియును మానసింహుండును రాజాంతఃపురమునకు రావలయునని యయేషాకు వర్తమానమంపిరి. అయేషాయును సంతుష్టచిత్తయై యచ్చటకువచ్చుట కంగీకరించెను.

అయేషా రాజనగరునకు వచ్చినదనువార్త తెలియుటతోడనే యూర్మిళాదేవి ద్వారమువఱకు నేగి యామె నత్యంతసమాదరభావముతో నెదుర్కొని గౌరవించి తీసికొనివచ్చెను. అయేషా మహారాజ్ఞితోంగూడ విశాలమై, మనోహరమైన యొకప్రాసాదములోని కరుదెంచెను. అచ్చట నొకరత్నసింహాసనముపై మానసింహుండొంటరిగం గూర్చుండియుండెను.

అయేషా లోపలికరుదెంచినతోడనే మానసింహమహారాజు సింహాసనమునుండి లేచి ముందునకువచ్చి యామెకూర్చుండుటకై యొక పీఠము నామెకుం జూపించెను. అయేషా కూర్చుండకయే యధోవదనయై మహారాజ్ఞిపార్శ్వమున నిల్చుండియుండెను. మహారాజ్ఞి యత్యాదరముతో నయేషాచేయిపట్టుకొని యటనున్న యొకపీఠము కడకుం దీసికొనివచ్చి దానిపై నొకప్రక్కం దానుగూర్చుండి యయేషాను వేఱొకప్రక్కం గూర్చుండం బెట్టికొనియెను.

పిదప మహారాజు తనసింహాసనముపైఁ గూర్చుండి యయేషాను గూర్చి యిట్లు చెప్పఁదొడంగెను.

మా—బిడ్డా! నిన్నింతవఱ కనేకకష్టములకు గుఱిచేసినందులకు నేనెంతయో సిగ్గుపడుచున్నాఁడను. ఈనిమిషము మొదలుకొని నీయిష్టమువచ్చినట్లు మెలంగవచ్చును. ఒకరాజకార్యవిషయమున నిట్టియుపాయము నవలంబించి నిన్నింతకష్టపెట్టుట గొప్పతప్పిదమేగును. నీయవరోధమును దొలగించి స్వాతంత్ర్యమునొసంగితినను సంగతిని నేనేనీకడకు వచ్చి చెప్పవలయునని యనుకొంటిని. కాని, మహారాజ్ఞి నిన్నుఁజూడవలతునని యాశపడుచుండుటచే నామె యభీష్టానుసారముగ నిన్నిటకు రప్పించుటకై తొందరనొసంగుచు వర్తమానములపంపితిని.

అ—జననిమహారాజ్ఞి నన్నుస్మరించుచుండుట నాపరమసౌభాగ్యము మహారాజుగారు నన్నియవరోధమునుండి విడిపించినందులకు నేనెంతయుఁ గృతజ్ఞురాలనై యున్నాను.

మా—అమ్మా! ఇఁకముందు నీవేమిచేసెదవు? ఎక్కడకేఁగెదవు? ఎచ్చటనుండవలయునని నీయభిప్రాయము?

అ—బహుశః ఢిల్లీ కేగెదను.

మా—ఢిల్లీయందుండవలెనని నీయభిప్రాయమా?

అ—అదేమి? అట్లుయోచించుచున్నారు?

మా—నీకు ఢిల్లీయందు పరిచితులనేకులున్నారని నేనెఱుంగుదును. పాదుషహాకూడ నిన్నెఱిఁగియుండునని తోఁచుచున్నది. నేనెఱింగియున్నంతవఱకు మొగలాయీలతోడనే నీకు విశేషసంబంధమున్నది.

అ—అందుచేత నేను ఢిల్లీయందుండుటయే శ్రేయస్కరమని తోఁచుచున్నదా?

మా—అంతేకాదు. భారతవర్షమునఁ బఠానులప్రాబల్యము విలుప్తమైపోయినవి. ఒరిస్సాయందు నీతోసంబంధముగలిగియున్న పఠానులందఱు నిష్పక్షతిదైన్యావస్థనొందియున్నవారు. అందుచే నీవు వారియాశ్రయమును విడిచిపెట్టుట విధియై యున్నది.

అ—(కొంచెముయోచించి) ఇప్పుడు మహారాజుగారు సెల వొసంగినదంతయు వినినపిదప నేనిప్పుడుపఠానులయాశ్రయమును విడువ కుండుటయే మంచిదని తోఁచుచున్నది నాకెవ్వరు మొదటినుం డియు నాశ్రయభూతులైయుండిరో, యెవరు ప్రతిపాలకులైయుండిరో, నాయం దెవరపారస్నేహకృపాదరములను గలిగియుండిరో, నాసుఖదుఃఖ ములయం దెవరు సమభాగులైయుండిరో, యట్టివా రిప్పుడు ఘటనా చక్రముయొక్క పరిభ్రమణముచే హీనావస్థనొందియున్నారని వారిని విడనాడుట న్యాయమగునా ? పఠానులిప్పుడు హీనస్థితియం దున్నా రుగనుక నే యవిచ్ఛిన్నముగా నేను వారితోఁగూడ నుండుట నాకత్యం తావశ్యకము. ఉచ్ఛదశయందున్నప్పుడు కూడనుండుగారు వేనవే లుందురు. హీనావస్థయందున్నప్పుడు కూడనుండువారే బంధువులు. కృతజ్ఞులు.

మహారాజావాక్యములను విని యించుకయప్రతిభుఁడయ్యెను. సరియైనప్రత్యుత్తరము నొసంగుటకు సమర్థుఁడుకాకపోయెను. మహా రాజ్ఞియగు నూర్మిళాదేవి తనవిభునియవస్థ నెఱింగి యయేషాతో "నీవెచ్చటకును పోవలసినయావశ్యకములేదు. నీవు మావస్తువవు. మాకాత్మీయవు. బిడ్డా ! మాయొద్దనేల యుండఁగూడదు?" అని యెను

అ— అమ్మా ! నాపై నీకుఁగల యనుగ్రహమునకు మేరలేదు. కాని, నాప్రాణాకర్షణయు, నాకర్తవ్యబుద్ధియు నేను వేఱుమార్గమును బట్టిపోవునట్లు నాకుపదేశముచేయుచున్నవి.

మా—ఒరిస్సాదేశమునకుఁ బోవలయునని నీకుద్దేశమున్నప్పుడు నీవు ఢిల్లీకిఁబోవుటెందులకు?

అ—కుమారజగత్సింహుని కారాగారమునుండి విడిపించు విష యమై యవసరములగు ప్రయత్నములుసేయుటకు.

మా—అందునిమిత్త మిదివఱకే విజ్ఞాపనపత్రమంపబడెనని విని యున్నాఁడను. ఇప్పుడు నీవు మరల నచ్చటికిఁ బోవలసిన యావశ్యక మేమి?

అ—దౌర్భాగ్యవశమున నావిజ్ఞాపనపత్రికాదులన్నియునుజోరులచే నపహరింపఁబడినవి.

మా—మరలఁగొత్త విజ్ఞాపనపత్రమును వ్రాసి దానిపై నాతని చేవ్రాలు చేయింపవలదా?

అ—అక్కఱలేదు. నేనే స్వయముగాఁబోయి దర్బారునందీవిషయమును బ్రస్తావించి ప్రయత్నముచేసినచో విజ్ఞాపనపత్రమక్కఱలేకుండఁగనే కార్యసిద్ధికాఁగలదని నానమ్మకము.

మానసింహుఁ డయేషా నుడివినతీరున కార్యసిద్ధియగుట కభ్యంతరముండదని మనసునందనుకొని యిట్లనియెను.

మా—రాజాజ్ఞచే దండితుఁడైన యొకమనుష్యునకు నీవీరీతిగ సాహాయ్యమునుజేసి యతిగర్హితకార్యమును జేయుచున్నావు. నీవు స్త్రీవగుటచే నీయపరాధము నొకసారి క్షమించినాఁడను. మరల మరల నదే రీతియపరాధములు చేయుచున్నచో క్షమింపవలనుపడదు. నీవాప్రయత్నమును విడిచిపెట్టుము. నీవాప్రయత్నమును విడువకున్నచో నిన్ను గూడ దండింపవలసిన వాఁడనగుచున్నాను.

అ—నన్నుదండించుటకు మీకు సంపూర్ణాధికారముకలదు. కాని, మీరెప్పుడునట్లుచేయరు.

మా—ఏమి?

అ—ప్రపంచమునం దెప్పుడును హితముచేయువారిని దండించువారుండరు

మా—నీవు నాయధికారము నుల్లంఘించి దానికి విరుద్ధమైన కార్యములను జేయుచున్నావు. నీవు మొట్టమొదట నాకుఁ దెలియఁజేయకుండ నాయాజ్ఞను బడయకుండ రాజదండనచే దండితుఁడైనయొక మనుష్యునకు సాహాయ్యమునుజేసితివి. అందువలన నిన్ను హితముచేయుదానినిగాఁ బరిగణించుటెట్లు?

అ—మహారాజుగారు వాక్కుచే సెలవొసంగునది యంతయును సత్యమేయగును. కాని, వారిమనోభిప్రాయముమాత్ర మట్లున్నదా? నిజముచెప్పవలసివచ్చినచో యువరాజును దండించుటయనునది యహా

రమైన మీరాజనీతికౌశలమును సూచించుటయే యనిచెప్పవలయును గదా! అందఱియెదుటను, విశేషించి యక్బరుషాదుషహాసనముసందు మీరాజభక్తియును న్యాయనిష్ఠయుఁ గర్తవ్యపరాయణతయు స్పష్టముగాఁ దెల్లమగుటకై యొకసామాన్యకారణమును నెపముచేసికొని మీప్రియపుత్త్రిని నాజన్మాంతము బందీగానొనర్చితిరి కాదా? ఇప్పటి కనేకదినములనుండి మీహృదయమున యువరాజున కేయుపాయముచే విముక్తి గలుగునా యనుయోచన యుదయించి నిరంతరమును మీరు వ్యాకులపడుచుండుటలేదా? అట్లయినప్పుడు స్వతస్సిద్ధముగ మీకుపకారమును జేయనుద్యమించిన యీయబల మీకు యథార్థముగా హితకారిణియగునో కాదో నిజమానతిచ్చి యనుగ్రహింపవలయును.

మా—నీవు చెప్పినది సత్యమో యసత్యమో యావిచారణతో నిప్పుడు ప్రయోజనమేమియు లేదు. నీవు నాయిష్టానిష్టములను దెలిసికొని యీకార్యమునందుఁ బ్రవృత్తవుకాలేదు. నీస్వార్థముకొఱకు రాజ్యనిబంధనలకు వ్యతిరేకముగాఁ గార్యమునుచేయఁ దొడంగితివి. అందుకొఱకు నిన్నేలదండింపఁగూడదు?

అ—నేను స్వార్థమునకే రాజపుత్త్రిని విముక్తికై ప్రయత్నించుచుండవచ్చును. కాని, యీకార్యమునందుమాత్రము నాస్వార్థపరతయును మహారాజుగారి స్వార్థపరతయును సమానములైనవి. అందుచేఁ నాప్రయత్నము మహారాజుగారికి హితకరమైనది. అట్టిసందర్భమున నన్ను మీరు దండించినచో మీహృదయమెప్పుడును సంతోషమును బొందఁజాలదు.

మానసింహమహారాజు మాటకు సరిగామాటనందించుటకు సమకట్టిగానుండనసమర్థుఁడై యూరకుండెను. ఊర్మిళామహారాజ్ఞియు "నీవంటిగుణవతియగు కన్యను నేనెప్పుడును విడిచిపెట్టఁజాలను. నిన్నుఁ గోడలనుగా గ్రహించి సంసారమును జక్కఁగా నిర్వహించెదను." అనియెను.

అయేషాయును లజ్జచే నధోముఖియై యుండెను. ఊర్మిళాదేవి మఱల నిట్లుచెప్పఁదొడంగెను. నీవు యవనకన్యవను నాక్షేపణము

మాకిసుమంతయును లేదు. మహారాజుగారిదివఱకే ముసల్మానులు సం బంధమును జేసియున్నారు. మరల నా సంబంధము భివృద్ధినొందినచో నష్ట మేమియును లేదు." అనియెను.

అయేషా యధోముఖియై కూర్చుండియుండెను. ఊర్మిళాదేవి మరలఁజెప్పనారంభించెను. అమ్మా! "మాటాడవేమి? నీరూపమును, గుణమును, బుద్ధియు ననదృశములు, నిన్నెవరు తమయాత్మీయురాలని చెప్పుకొందురో వారేధన్యులు; వారేసుఖులు నేనాసుఖము ననుభ వింపకుండ విడిచిపెట్టజాలను"—

అ—మీరు నాయందుఁజూపుచున్న యనుగ్రహమునకుఁ బార ములేదు. నేను మీ సేవకురాలను, కాని.

ఇట్లుచెప్పి యయేషా యూరకుండెను. ఊర్మిళ "కానియేమిటి? చెప్పుమతల్లీ!" అనియెను.

అ—కాని, నేనట్టియనుగ్రహమును బొందుటకుఁ దగినదానను కాను. నాకర్తవ్యమును, నాజీవితముయొక్క భవితవ్యగతియును నిది వఱకే దృఢముగా నిశ్చితములైయున్నవి.

మా—నీవు డిల్లీకిఁ బోవుటకుఁ బూర్వము జగత్సింహునిఁజూడ దలంచుచుండుటలేదా? ఇష్టమున్నయెడలఁ గారాగారమునందాతనిఁ జూచుటకు నీకిప్పుడే యాజ్ఞయొసంగెదను

అ—అందువలన నేప్రయోజనమును గాన్పించుచుండుటలేదు. దయచేసి మీరిప్పుడే నాకు సెలవొసంగవలయును. రేపటియుదయము ననే బయలుదేరివెళ్లెదను. చేయవలసినకార్యము లనేకములున్నవి.

ఊ—నీవీరాత్రి యిచ్చటనేయుండవలయును. రమ్ము. నిన్ను నాకోడలియొద్దకుఁ దీసికొనివెళ్లెదను. నీవామెయొద్దనుండవలయును.

అయేషాయును సంభ్రమముతో లేచి మహారాజునకు వందనము చేసెను. మహారాజ్ఞియు నామెహస్తమును దనహస్తముతోఁ బట్టుకొని యామెను దీసికొనివెళ్లెను.

మానసిక సౌందర్యమనశీలయగు నయేషానుజూచుచు హృద యమునందు "ఆశ్చర్యమాశ్చర్యము! ఈ సౌందర్యసంపద దేవకన్యను

బోలియున్నది! ఎంతసాహసము! ఎట్టితీక్ష్ణబుద్ధి! ఎట్టివాక్పటుత్వము! ఎట్టినిర్భీకత! ఆహా! ఇంతియేకాదు. ఎంతకోమలత్వము! ఎంతసరళత! ఎంతమధురత! ఎంతలజ్జాశీలత! ఈసుకుమారి యేకులమునకుఁ గోడలగునో, యాకులము ధన్యతమమైనది. నాకంతటిమహాభాగ్యముకల్గునా?" అనియనుకొనియెను.

పదియవప్రకరణము.

అభిరామస్వామి మఱునాఁడుదయమగుసరికి కొత్వాలునితోడను మఱికొందఱుసిపాయిలతోడను యమునానదీపరిసరారణ్యమున కరుదెంచెను. చోరులందఱు నచ్చటనే యుండిరి. బిడారములనెత్తి యుండకపోవుటచే వారందఱును సులముగాఁ బట్టుపడిరి వారు దొంగిలించి తీసికొనిపోయిన ధనము, రత్నములు, విజ్ఞాపనపత్త్రిము, ఉత్తరములు, పాత్రిలు, మున్నగుసామానులన్నియు వారియొద్దనే యుండెను. ఆ వస్తువులనేకాకుండ సశ్వములు, వస్త్రములు మొదలగువాని నన్నిఁటిని కొత్వాలుస్వాధీనముచేసికొని యింకను మిగిలినవస్తువులుసహితముగ దొంగలనుబట్టి బంధించి నగరమునకుఁ గొనితెచ్చెనును. అభిరామస్వామియును దనయిరువురు సహచరులతోడను కొత్వాలు ననుసరించి నగరమునకువచ్చెను.

అన్నియును సరిగానడచినవికాని, యభిరామస్వామి యభీష్టసిద్ధి మాత్రిముకాలేదు. తన ధనరత్నాదులనన్నిఁటిని దనకొసంగవలయునని యాతఁడు కొత్వాలుతో విన్నవించుకొనియెను. వస్తువులు సహితముగాఁ జోరులు విచారణనిమిత్తము ఖాజీకడకంపఁబడిరనియు, విచారణయైనపిదప వస్తువులుగలవారి కీయవచ్చునని వారియుత్తరువు కావలసియుండుననియు, నుత్తరువైన పిదపఁగూడ నీవస్తువులు మీవైనట్లు మీరు సప్రమాణముగా రుజువుచేయవలయుండుననియు, నెప్పుడైనను మీరీవస్తువులకు పూఁచీ యీయవలసియుండుననియుఁ గొత్వాలాతనితోఁ జెప్పెను. అదివిని యభిరామస్వామి దశతాళప్రమాణమగు నీటిలో మునిఁగినట్లయిపోయెను.

అభిరామస్వామికడ నొకచిల్లికాసయినను లేదు. కాని, సన్యాసివేష మనేకవిషయములలో మానవునకు విశేషసాహాయ్యము చేయుచుండును. క్షుత్పిపాసానివారణార్థమాతఁడు భిక్షాటనము సేయ నిశ్చయించుకొనియెను. ఆతఁడొకయుచ్చపదస్థుఁడగు రాజపుత్రసైనికుని యొద్దకేగి తనయవస్థయును జరిగినయాపద్వృత్తాంతమును జెప్పి యేమైనద్రవ్యసాహాయ్యముఁ జేయుమనియు, మహాపదనుండి విడివడుటకు సరియైనయాలోచనను జెప్పుమనియు వేడుకొనియెను. ఆసైనికపురుషుఁడు స్వామి యవస్థను విని యాతక్షణమే యొకరూపాయనొసంగి వస్తువులు మరల లభించెడివిషయమై విహితమైన సాహాయ్యమును శక్తికొలఁదిఁ జేసెదనని వాగ్దత్తముచేసెను.

నగరమునకుసమీపమునందున్న యమునానదీతీరమందలి యొక వృక్షచ్ఛాయయం దభిరామస్వామియు నాతనియనుచరులును దమ జఠరజ్వాలను గొంతవఱకు నివారణచేసికొనిరి. అచ్చటనే నివాసముగా నుండుటకు నిశ్చయించుకొని తనయనుచరులనిరువుర నటనుంచ నియమించి స్వామి మరలనగరమున కేగెను. నగరమునకేగి తనకుఁ గనఁబడిన గొప్పవారితోనెల్ల తనదుఃఖసమాచారమును జెప్పఁదొడంగెను. హిందువుఁడుగానీ మహమ్మదీయుఁడుగానీ యెవరుకనఁబడినను వారితోనెల్ల మానసింహునితనయుఁడగు జగత్సింహునకుఁ దండ్రి శిక్షవిధించుట, యాతని విడిపించుటకై తానువిజ్ఞాపనపత్రముం దెచ్చుట, యుత్తరముమూలముగ నవాబునందినియగు నయేషా సాహాయ్యముం జేయుటయేగాక ధనము, రత్నములుఁగూడ నొసంగుట, కానపురారణ్యమున సర్వమును జోరులచే దొంగలింపఁబడుట, యొకమహోపాయముచే. జోరులనుగనిపెట్టి యావార్త కొత్వాలుకు విన్నవించుట, కొత్వాలువారిని పట్టిబంధించుటఁ గొత్వాలావస్తువులను దనకీయకపోవుట మొదలగు నీసంగతులనే యేకరువు పెట్టుచుండెను. అభిరామస్వామి యిట్లందఱితోడను జెప్పుచుండ టచేఁ గొలదిదినములలోనే యీయుదంతము నగరమంతటను వ్యాపించెను. అత్యల్పకాలములో నుచ్ఛపదస్థులైన గొప్పయధికారులకడఱకును నీసంగతులన్నియుఁ దెలియవచ్చెను. మొదటిదినమున ధనసాహాయ్యమును జేసిన సైనికునియొద్దకుఁ బోయి

ప్రతిదినమును నభిరామస్వామి యాతనిని దర్శించుచుండెను. అతఁడును శీఘ్రకాలములోనే యభీష్టసిద్ధియగునని యభిరామస్వామికి ధైర్యము జెప్పుచుండెను.

ప్రతిదినమును రెండువేళలను దప్పకుండ నభిరామస్వామి కొత్వాలుకడకుఁ బోయి చూచుచుండెను. కొత్వాలును దోడనే సమస్తమును నెరవేర్చునట్లు మాటలు చెప్పుచుండెను. అతిచింతాకులుఁడై యున్న యభిరామస్వామి శిరస్సుపై, ధైర్యము, సహానుభూతి, సాహాయ్యముకొఱకు వాగ్దానము, మొదలగున వనుదినమును వర్షించుచుండెను. కాని, క్రియమాత్ర మింకొకంతయును జరుగుటలేదు. ఇంచుమించుగ మూఁడునెలలీరీతిగ గడచినవి. ఈనడుమ నయేషా యాగ్రాకు వచ్చినదనువార్తను విని యభిరామస్వామి తనమనోభీష్టము నెరవేరుట కనుకూలోపాయములు తటస్థించినవని సంతసించెను.

అభిరామస్వామి విశేషప్రయత్నములనుజేసి యయేషానివసించి యున్నస్థలమును దెలిసికొనియెను. స్థలమేమో తెలిసినది. కాని, యామెదర్శనమాత్రము లభించినదికాదు అయేషా యాగ్రకువచ్చి యొక గొప్పయమీరుని భవనమున విడిసియుండెను. అభిరామస్వామికచ్చట ప్రవేశించుటకు మార్గములేదు. అనేక ప్రయత్నములు చేయఁగాఁ జేయగా నొక్కపరిచారిక స్వామివార్తను నవాబునందిని కెఱింగించెదనని చెప్పి వార్తను గొనిపోయెను; కాని, యామె తిరిగిరాలేదు. మఱియెవరును వచ్చి యయేషాయభిప్రాయము నభిరామస్వామికిఁ దెలుపలేదు. చేయునదిలేక యభిరామస్వామి వికలచిత్తుఁడై యచ్చటనుండి తిరిగి వచ్చెను.

అయేషాను జూడకపోయినను, నామె సమాచారమేమియును నాతనికిఁ దెలియకపోయినను, నభిరామస్వామి యభీష్టసిద్ధి కనుకూలము లగు నేర్పాటులు వానియంతటనవియే సులభముగా జరుగునని యాతఁడనుకొనుచుండెను. మఱునాఁడుదయమున నభిరామస్వామి కొత్వాలునుజూడఁ బోయెను. కొత్వాలింతకుపూర్వమునకంటె హెచ్చుగౌరవముతో నభిరామస్వామినిఁ జూచి "చోరులయొద్దదొఱికినయుత్తరములు మొదలగునవి పంపవలయునని హుజూరుదర్బారునుండి సర్కారాజ్ఞయై

నది. ఆజ్ఞానుసారముగా నా కాగితములన్నియు నచ్చట కంపబడినవి. ధనము, రత్నములు. నాయొద్దనున్నవి. వాని విషయమై యుత్తరవు లేవియుఁ గాలేదు" అనియెను.

అభిరామ స్వామియు నచ్చటినుండి తిరిగివచ్చి కార్యములన్నియును నయేషాప్రయత్నముచేఁ జక్కగా జరిగిపోవుచున్నవని యనుకొనియెను తానన్నిదినములు ద్వారద్వారముకడకుఁబోయి తిరిగి విన్నవించుకొనినను సానుకూలముకానికార్య మిప్పుడాకస్మికముగ ననుకూలమగుచుండుటకుఁ గారణమేమని యోచించుకొనియెను. అన్నిదినములైన పిదప యువరాజు విజ్ఞాపనపత్రము గమ్యస్థానముచేరినదని తెలిసికొని నిశ్చింతుఁడయ్యెను.

అభిరామస్వామియును మఱునాఁడు కొత్వాలుని జూడనేగెను తానిఁక నాగ్రాయందుండవలసిన యావశ్యకములేదనియు, నిష్టమున్నచో స్వదేశమునకుఁ బోవచ్చుననియుఁ దానాగ్రాకువచ్చిన కార్యమువిషయమై యథాసమయమున నుత్తరవులీయఁబడుననియు, నాయుత్తరవులు సర్కారుమూలమునఁ జేరవలసినస్థలమును జేరుననియు నభిరామస్వామి కొత్వాలువలనఁ దెలిసికొనియెను.

అభిరామస్వామి యచటనుండి తిరిగివచ్చి యెట్లయిన నయేషాను జూచిపోవలయునని తలంచి యందులకువలయుప్రయత్నము లొనర్పఁ జొచ్చెను. కాని యాప్రయత్నములవలనఁ బూర్వమువలెనే ఫలమేమియును లేకపోయెను. వర్తమానము నామెకెఱింగించుటకై చెప్పిపంపుటకుఁ గూడ నవకాశములేక విఫలమనోరథుఁడై తిరిగి వచ్చెను.

మఱునాఁడుదయమునఁబోయి మరలఁ గొత్వాలు దర్శనము చేసెను. స్వామియు, నాతనితోఁగూడవచ్చిన రక్షకులును, బంచుకొని పుచ్చుకొనుటకును, మార్గమధ్యమున వలసినవ్యయముచేసికొనుటకును నైదువందలస్వర్ణముద్రికల నిచ్చుటకుఁ గొత్వాలు సిద్ధముగానున్నట్లును స్వామియిఁకఁగష్టపడి యాగ్రాయందుండుటవలనఁ బ్రయోజనమేమియునులేదనియును, దొంగలకు విశేషదండన విధింపబడుననుటకు సందేహములేదనియు, వారివిచారణకాలమునందు స్వామి యుండవలె

సినయావశ్యకములేదనియు, నవసరమున్నచో గుఱ్ఱములను స్వామి తీసికొనిపోవచ్చుననియు, లేదా వానినచ్చటనే విక్రయించుకొనిపోవచ్చుననియుఁ గొత్వాలువలన నభిరామస్వామికిఁ దెలియవచ్చెను

ఆవిషయమును గూర్చి యేమి చెప్పుటకును నభిరామస్వామికేమియుఁ దోఁచలేదు. మఱునాఁడు మరలఁబోయి యభిరామస్వామి కొత్వాలుని జూచెను. అభిరామస్వామి యభీష్టసిద్ధివిషయమున నించుకంతయును సందియములేదనియు, దొంగలచే నెత్తుకొనిపోబడినధనము రత్నములు మొదలగువాని విషయమున నాతఁడు చేయవలసినకార్యమేమియును లేదనియును, నావిషయమున నాతనిసంబంధ మదివఱకే ముగిసినదనియుఁ గొత్వాలెఱింగించెను.

యువరాజువిషయమునఁ గాఁబోవునాజ్ఞనుగూర్చి యేమియు నభిరామస్వామికిఁ దెలియలేదు. దానిఛాయయైనను దెలిసినఁగాని యాతనికి సంతుష్టిలేదు. ఆవిషయమున బిందుమాత్రమైనను నాతనికిఁ దెలియలేదు. కాని, యనుకూలమగునాజ్ఞ యీయఁబడునని మాత్రము తెలిసెను. మూఁడునెలలకాల మభిరామస్వామి యెంతప్రయత్నించినను నొక్కరైన నావిషయమును గమనింపరైరి. అయేషా యాగ్రాకు వచ్చినతోడనే యందఱును నావిషయమునే గమనించుటయేఁగాక యాతనిస్వవిషయమునఁగూడఁ గార్యమనుకూలముగాజరిగినది. అయేషా యెవరియవలంబనముచే నాకార్యముల నట్లుజరుపుచున్నదో యావిషయమై యిసుమంతయు నభిరామస్వామికిఁ దెలియదు. కాని యీ కార్యములన్నియు నయేషాప్రయత్నములవలననే చక్కఁబడినవనుటకించుకంతయును సందియములేదు.

అయేషాకడ సెలవుఁగైకొనిపోవలయునని యభిరామస్వామి మఱియొకసారి యమ్రావుమహాశయుని యింటికడకేగెను. ఆమెదర్శనముకాలేదు. అయేషా అభిరామస్వామికి ప్రణామపురస్సరముగా నిట్లువర్తమానమంపెను. "ఈజన్మమునందిఁక మీరు నన్నుజూడఁ జాలరని తోఁచుచున్నది. యువరాజగు కుమారజగత్సింహుఁ డాతని స్వజనులతోఁ గుశలముగా నుండవలయునని సదా నేను కోరుచుందును. ఆతనినిగాని, యాతనితోఁగూడనుండువారినిగాని నేను చూడ

వలసిన యావశ్యకములేదు నావిషయమై మీరెవరును వ్యాకులపడ వలదు. నాసమాచారము లేమియు నికమీఁద మీకు వచ్చుసంభవము లేదు. నాకుఁ జిరకాలమునుండి సెలవొసంగుఁడు."

హృదయభేదకములగు నావాక్యములనువిని యభిరామస్వామి కన్నుఁ నీరుఁ బెట్టుకొనియెను. కాని, చేయునదేమియును లేదు మఱు నాఁడు కొత్వాలుకడ కేగి ధనమును, గుఱ్ఱములను దీసికొని యిరువురు సహచరులతోఁగూడ నప్రసన్నమనస్కుఁడై వెడలిపోయెను.

పదునొకొండవ ప్రకరణము.

ఒరిస్సాదేశమునందలి కటకనగర మనేకకారణములచేఁ జరిత్రల యందుఁ బ్రసిద్ధివహించినది. శిల్పసంబంధములగు ననేకకార్యములచే నానగరము జనసమూహమునందు సుపరిచితమై యుండెను. అత్యంత శోభామయమైన యానగర మొకానొకకాలమునఁ జాలఁ బ్రతిష్ఠవహిం చినది. అనేకకాలములలోఁ జరిత్రకారులదృష్టి నాకర్షించు విశేషకార్య ముల కానగరము రంగభూమియై ప్రకాశించుచువచ్చెను. ఆర్యులు, పఠానులు, మొగలులు, మహారాష్ట్రులు వీరందఱికాలములలో నానగ రము మిక్కిలి ప్రాధాన్యము వహించినందులకు నిదర్శనము లిప్పటికి నానగరమున విరాజిల్లుచున్నవి.

కటకనగరప్రాంతమునఁ బ్రవహించెడిది మహానది. విశాలము నందు పద్మా, మేఘనానదులతో సమానముగా కాకపోయినను నెప్పు డును నీరులేక శుష్కించిపోయియుండుటలేదు. మహానదీ నిర్మల ప్రవాహ మెప్పుడును దాల్మియు మృదుభావమునుఁగలిగి మనోహర ముగఁ బ్రవహించుచుండును. దానిమధురకల్లోలధ్వని నిరంతరమును వినువారల హృదయముల నాకర్షించుచుండును. నానాదేశములనుండి వచ్చినపడవలు విశేషముగ నానదిపై నానగరప్రాంతమునఁ దేలియా డుచుండును. ఒకపడవనుండి కూలిమనుష్యులు పణ్యద్రవ్యములను మోసికొనివచ్చి యొడ్డునఁ జేర్చుచుండిరి. ఒకపడవలోఁ గూలిమను ష్యులు విశేషాయాసముతో ననేకవిధములగువస్తువులను తీరమునుండి

కొనిపోయి వేయుచుండిరి. ఒక్కొక్కపడవనుండి పథికులు విశేషాయాసముతో దిగి యొడ్డునకుఁ బోవుచుండిరి. స్థానాంతరగమనాభిలాషులు మఱికొందఱ అతివేగముతో నాపడవలోని కెక్కుచుండిరి ఒక్కొక్కస్థలమున దీర్ఘకాలప్రవాసులగు కొందఱు మనుష్యులు చాలకాలమునకుఁ బునర్దర్శనభాగ్యములభించుటచేఁ బరమానందముతోఁ దమబంధుమిత్రులఁగలిసికొని యానందించుచుండిరి. ఒక్కొక్కస్థలమునందుఁ బ్రియజనులు వీడిపోవుకాలమున హృదయములయందుఁ బొడసూపెడి వియోగచింతాసూచకములగుచేష్టలు వారివారిముఖభావములఁ బొడగట్టుచుండెను. ఒకపడవ తీరమునువిడిచి దూరమునకుఁబోయి జలములలోఁ దేలియాడుచుండెను. ఒక్కొక్కపడవ చాలసేపు నదీవక్షస్థలమున నాట్యముచేయుచుఁజేయుచుఁ గూలమును చేరి నిట్టూర్పును విడుచుచు నిలుచుండెను.

నగరమున కఱక్రోసుదూరములో నదీతీరమున నస్మాన్‌ఖాను బ్రచారముఁ జేయుచుండెను. అనుచరులిద్దఱుమాత్రము సశస్త్రులై యాతనికిఁ గొంచెముదూరములో నిలుచుండియుండిరి. నవాబు నిల్చుండియున్నస్థలము జనశూన్యమై యుండెను. నవాబుమూర్తివిషణ్ణమై పరాజయము వలనను హీనావస్థచేతను విచారగ్రస్తమై యున్నట్లు గాన్పించుచుండెను. నవాబునడయాడుచు నొక్కొక్కసారి యొకచో నిల్చుచు నదివైపు చాలదూరమువఱకుఁ బరీక్షించిచూచుచుండెను. అతఁడు ధరించినవస్త్రము లతిసామాన్యములైనవిగ నుండెను. ఒకపాయిజామా, యొకశిథిలమైన పంజాబుచొక్కాయిఁ శిరస్సుపై నొకసామాన్యమైనయుష్ణీషము—అన్నియును దెల్లనివి—పరిశుభ్రమైనవి—పాదములకు జలతారుజోడు—కటిప్రదేశమునకత్తి లేదు. అతఁడు శిరస్త్రీఁడై సామాన్యములైన దుస్తులనుధరించియుండెను. స్వాభావముచే సౌందర్యముకలవాఁడగుటచే నెల్లప్పుడును సకలభావములయందును మనోహరుఁడుగనే కన్పట్టుచుండును. అస్మాన్‌ఖానావేషముతోఁ జాలసుందరపురుషుఁడుగ గన్పట్టుచుండెను.

భాద్రపదమాసము—పొద్దుతిరిగినది. అపరాహ్ణమైనను వేఁడిగాలివిసరుట లేదు. అస్మానుఖాను తిరుగాడుచున్నతావున ననేకములగు

గొప్పవృక్షములు చక్కగా పెరిగి విరాజిల్లుచుండెను. నవాబతిశీతలము గనున్న యావృక్షచ్ఛాయను బరిచారము సేయుచుండెను. నదిపైనుండి బయలువెడలిన మారుతమతిశీతలమై వృక్షచ్ఛాయను మఱింతచల్లఁబఱి నవాబుశరీరమును సోఁకుచుండెను. అటునిటు నడయాడుచున్న యాతఁ డాకస్మికముగ నొకసారి యచ్చో నిలువఁబడియెను. నిలువఁబడి మిక్కిలి యాత్రముతో దృష్టిపోయినంతదూరము నదివంకఁ బరీక్షించిచూచెను. పిదప నావైపునుండి తనదృష్టినిమరల్చి ముఖము నిటుత్రిప్పుకొని యుత్కంఠభావముతోఁ బాదచారణము చేయ దొడఁగెను.

అయేషాయొక్క పెద్దపడవపైఁ గటకనగరమునకు వచ్చుచుండె ననివార్తవచ్చెను మార్గమధ్యమున నే యాటంకమును సంభవింపకుండునేని యాపడవ యిప్పటికప్పుడే కటకనగరము వచ్చియుండవలసినది. ఆసంగతినెఱింగి యస్మాన్ ఖా నాసమయమునకు సరిగానదీతీరమునకువచ్చి తనహృదయేశ్వరి యాగమనమును నిరీక్షించుచుండెను. నౌక రావలసిన కాలము మీరిపోయి చాలసేపైనది కాని, యది యెచ్చటను గాన్పించుటలేదు. అస్మానుఖా నుద్విగ్నుఁడగుచు నచ్చటనే యుండెను

తుదకు విశేషదూరమున నదీగర్భమునందుఁ జాలపడవలు పరువెత్తుకొని వచ్చుచుండుట యాతఁడుచూచెను. నీటిపైఁదేలి చాలదూరమున వచ్చుచుండుటచే నవి పక్షులవలెఁ గన్పట్టుచుండెను. అస్మానుఖాన్ స్థిరదృష్టితో వానినిఁజూచుచుండెను. పడవలు మఱింతదగ్గరగా రానారంభించెను. అందైదుపెద్దనౌకలును రెండుచిన్నపడవలును గనఁబడియెను. అన్నియును జాలవేగముతోఁ బరువెత్తుకొని వచ్చుచుండెను. అస్మానుఖాను వానివంకఁ దదేకదృష్టితో నీక్షించుచుండెను. వానియం దొకపెద్దనౌక తక్కినవానికంటె నెక్కుడుమనోహరముగ నలంకరింపఁబడియుండెను. ఆపెద్దపడవయందే నవాబునందిని యుండెనని స్థిరము చేసికొని యస్మానుఖాను తనశిరోవేష్టనమునుదీసి పైకెత్తి విసరి యల్లాడించుచు సంజ్ఞనుజేసెను గొప్పదైనయానౌకయందలి యొకగవాక్షద్వారము తెరువఁబడియెను ఆగవాక్షమునుండి స్వర్ణసూత్రరచితమైన వస్త్రరాజమొకటిజారుచు నసదృశమైనయొకకోమలహస్తముచే నదిపట్టుకొనబడి మెల్లగనటునిటు నాందోళనము నొందుచుండెను.

అస్మానుఖానానందపరవశుఁడై చంచలపదములతో మెల్లమెల్లగ నాజలయానాభిముఖుఁడై నడవఁజొచ్చెను పడవలు తమపాలకులతోడను శరీరరక్షకులతోడను, దాసదాసీజనముతోడను, సామగ్రిమొదలగువాని తోడను నిండినిబిడీకృతములై యుండెను. అయేషాయున్న పెద్దనౌక యందు మఱెవరును జనులున్నట్లు నవాబునకుఁ దోఁచలేదు.

అస్మానుఖాను గవాక్షముగుండ ప్రఫుల్లకమలసదృశమైన య యేషాముఖమండలమును స్పష్టముగాఁ జూచెను ఇరువురును బరస్పర మభివాదనముచేసికొనిరి. ఆనందజ్యోతిచే నిరువురివదనములును బ్రదీప్త ములయ్యెను.

అయేషాయాజ్ఞానుసారము పడవనడపువారు కష్టపడి చాలసేపు వేగముగాఁ బడవను నడపఁజొచ్చిరి నౌకలును, జిన్నపడవలును వేగ ముగా ముందునకుఁ బరుగెత్తుకొనివచ్చెను. ఆయేషాయున్ననౌక శీఘ్ర గమనమును వీడలేక మెల్లగావచ్చుచుండెను మిగిలినజలయానములన్ని యు ముందైనవి. అయేషాయున్ననౌక వెనుకఁబడియెను ఆనౌకను నడపుసేవకులు తమయశక్తతకుఁ జాలసిగ్గువడి శక్తివంచనలేకుండ శ్ర మపడుచు నౌకను నడపుచుండిరి. కాని, ఫలములేకపోయెను. ఎంతశ్ర మపడినను నౌక నడచుచుండకపోవుట కాశ్చర్యపడి కళాసులందులకుఁ గలకారణము నరయఁజొచ్చిరి.

వారాకారణమును నిర్ణయించుటకుఁ బూర్వమే యస్మానుఖాన్, నౌక, నీటిపైభాగమున నెంతయుండవలయునో, యంతయుండలేదనియు నింతేగాక క్రమక్రమముగ నది నీటియందు మునుగుచుండెననియు, నీటిపైఁదేలియున్నభాగము మిక్కిలితక్కువగనున్నదనియు గ్రహించెను పడవనడపువారి కది గోచరముకాలేదు నౌకయడుగుభాగ మంతభద్ర ముగాలేదని వారెఱుంగుదురు, ఇప్పుడాభాగమే మఱింతపాడైపోయినది. అడుగుభాగము దృఢముగానుండలేదనుమాట నిశ్చయము. కాని, యది కదలిపోవుననుభయము వారికిలేదు. నవాబునందిని యాజ్ఞాప్రకారము చాలతొందరగ పడవనునడపుటచే నత్యంతవేగముతోఁ గూడినజలప్రతి ఘాతమువలనను, విశేషబలముజూపించి నడపుటచేఁగలిగినవిషమాందో ళనమువలనను నౌకకాదుర్దశసంభవించినది.

అస్మాన్‌ఖాను వ్యాకులచిత్తుఁడై యాత్రముతో నీటిలోనికిదుమికెను. అయేషా గవాక్షముఁనుండి నవాబుచేసిన కార్యమునుజూచి యుద్వేగముచేతను, నాశ్చర్యముచేతను, నిశ్చేష్టయైపోయెను. నీటమునికిన యస్మాన్‌ఖాన్ "నవాబునందినీ! శీఘ్రముగా పడవగదినుండి యీవలకు వెడలిరమ్ము—ఇంచుకంతయు నాలస్యముసేయవలదు. ఆగదియందింకను నెవరోయున్నట్లున్నది. ఈవలకు రండు" అనియెను.

అప్పు డస్మాన్‌ఖానెదబంటినీటియం దుండెను. పడవయందలిగదిలో నయేషాతోఁగూడ నింకొక స్త్రీయుండెను. కారణమునడుగకుండ నయేషాయును దక్షణమే కూడనున్నయామెతో నీవలకువచ్చిచూచెను తానున్ననౌక మునుఁగుట కికనెంతోకాలము పట్టదని యామె తెలిసికొనియెను. పడవనడుపువారు నౌక మునింగినచో నవాబు తనుప్రాణములనుండనీయఁడని యెఱుంగుదురు. మునుఁగకుండఁ గాపాడుట కుపాయమేమియుఁ గాన్పించుటలేదు. అందుచే వారుదాసీనులైయుండిరి.

అయేషా నవాబువంక చూఁచి "ఏమిచేయుచున్నావు? నీటిలో దుముకుటెందులకు? అస్మాన్ తీరమునకు శీఘ్రముగాఁ బొమ్ము! ఇదియే నాప్రార్థనము" అనియెను.

అస్మాన్‌ఖానంతటిలో నీదుటకారంభించి "నిన్ను పైకెత్తుకొని తీరమునకుఁబోయెదను. లేనిచో, నీతోఁగూడ——"అనియెను.

మాటపూర్తి కాలేదు. ఇంతలో నౌకలోనివారు గందరగోళము చేయనారంభించిరి. అయేషాతోఁగూడ నున్నస్త్రీ యేడువఁదొడంగెను. అయేషా చేయూడించుచు నస్మాన్‌ఖానును వెనుకకుదిరిఁగి పొమ్మని సంజ్ఞ చేసెను. పడవమునిఁగిపోయెను.

నౌకమునుఁగుటతోడనే భయానకమైన సుడియొకటి బయలుదేరెను. ఘూర్ణాయమానమైన యావారిరాశిమధ్యమున మఱియొక మనుష్యుఁడు మునిఁగిపోయెను. నవాబస్మాన్‌ఖానీఁదుచు నానదిపై నడపలేదు. నౌకాసేవకు లీఁదుకొని తీరమునకు వచ్చిచేరిరి మిగిలిననౌకలును బడవలు నాయావర్తమునఁ జిక్కి దానియందే గిఱ్ఱుమని తిరుగుచు నాపదకు లోనైనవి. మఱియొక పడవయందలి కొందఱుమనుష్యులు వస్త్రములనువిప్పి పాఱవైచి నదిలోదుమికిరి.

అస్మాన్ ఖానుపైకి తేలెను. కాని, మిగులకాతరుడై యుండెను ప్రాణావసానసమయమున మానవుని నోటనుండి వచ్చెడితీరుననే యస్మాన్ ఖాను నోటనుండి యుచ్ఛ్వాసనిశ్వాసములు వెడలుచుండెను. మాటాడుటకు సామర్థ్యములేదు. చాలబరువుగలపదార్థమొక్కటి యాతనిదేహమునకుఁ గట్టిపెట్టినట్లుఁ గన్పట్టుచుండెను. అతఁడు పైకి తేలినతోడనే యొకపడవ యాతనిసమీపమునకు వచ్చెను. కాని, యాతఁడందులోని కెక్కునుపాయములేదు అప్పుడాతఁడు మఱల మునుఁగు నట్లుండెను. పడవలోని మనుష్యులు నీటివఱకును వ్రేలాడునట్లొకవస్త్రమును విడిచి యొకప్రక్కదానిని బట్టుకొనియుండిరి అస్మాన్ ఖానొక చేతితో రెండవప్రక్కను బట్టుకొనియెను. చాలమంది యావస్త్రమును బట్టి మెల్లగఁ బైకిలాగిరి కొందఱు క్రిందికివంగి యాతనిచేతిని బట్టుకొనిరి.

అనేకులుచేరి జ్ఞానశూన్యప్రాయుఁడైన యస్మానుని దేహమును బైకిఁ గొంచెముదూరము లాగిచూచిరి. అస్మాన్ ఖానొక్కఁడే నీటిపై తేలలేదు. ఆతనికటిప్రదేశమునకొకబట్ట బిగించి కట్టఁబడియుండును. ఆబట్టయొక్క మఱియొకయంచున భారమైనయొక పదార్థము కట్టఁబడియున్నట్లు తోఁచుచుండెను. అది యచేతనప్రాయమైన యయేషాకళేబరము. ఆమెశిరోబంధము విడిపోవుటచే దానినుండి నీరోడుచుండెను. జనులందఱు నతిజాగరూకతతో నిరువురను పైకీఁదిసిరి.

అస్మాన్ ఖాను తెలివిఁదెచ్చుకొని "దానిని బ్రదికించినవారికి విశేషబహుమానమిచ్చెదను" అనియెను.

ఒక్కఁడప్పుడే యయేషాతోఁగూడవచ్చిన యామెనునీటినుండి తీసి మఱియొకపడవయందుఁ బరుండఁబెట్టెను.

అయేషాశరీరముపై వస్త్రమించుకంతయును జెదరలేదు. మనుష్యులతిజాగరూకతతో సుర్మరప్రసరనిర్మితమో, సంఘటితమో యొప్పు ప్రతిమవలెనున్న నామెశరీరము నాపడవయందుఁ బెట్టిరి.

పండ్రెండవప్రకరణము.

అయేషా చాలసుకుమారి. ఆమెకుఁ దటస్థించినయాపద ప్రాణాపాయకరమైనది. అస్మానుఖానుని ప్రయత్నముమూలమునను, బరిశ్రమమూలమునను నామె సలిలసమాధినుండి నిష్కృతిఁజెందినది. కాని, యాదుర్ఘటనమూలమున నామెదారుణజ్వరపీడితయై బాధపడుచుండెను. విజ్ఞులగు ననేకాయుర్వేదచికిత్సకులును, యూనానివైద్యులునువచ్చి విశేషకౌశలముతో నామెకు వైద్యముచేయనారంభించిరి. నవాబుగృహమునందామె రోగముచేఁగలిగిన యుద్వేగమునకుఁ బారములేదు. కటుల్ ఖానున కనేకభార్యలుండిరి. అయేషా వారందఱికిని ప్రేమధనమైయుండెను వారందఱు నిప్పుడు వ్యాకులచిత్తలైయుండిరి కాశ్మీరబీగము నిద్రాహారములనువీడి రాత్రింబవళు లయేషా శయ్యాపార్శ్వముననుండి యామెకు శుశ్రూషచేయుచుండెను. అయేషా నవాబునంతఃపురమున కలంకారమై యొప్పారుచుండును. ఎల్లరకును లోచనానందదాయకయై సర్వజనప్రసాదనకారిణియై మెలంగుచుండు నవాబునందినికి రోగము కఠినముగానుండుటనుజూచి దాసీజనము మొదలుకొని యాభవనమునఁగలవారందఱు వ్యాకులచిత్తులై కన్నులవడివెట్టుకొనుచుండిరి.

సర్వదా విలాసమయుఁడై సాంసారికవ్యాపారముల యందించుకంతయును లక్ష్యముంచకుండ నుదాసీనుఁడై యుండెడినాబు సులేమానుఖానుగూడ నయేషాకఠినరోగసమాచారమునువిని విచలితుఁడై సురాపాత్రనువీడి, రూపవతులగు సుందరుల సహవాసమును ద్యజించి, విలాసములనొల్లక యనుదినమును బదింబదిగ నయేషా సమాచారము నత్యావేగముతోఁ దెప్పించుకొనుచుండెను.

ఇకనస్మానుఖానో! ఆతనిసంగతి నేమనిచెప్పుదుము? ఆతని హృదయావస్థనుగూర్చి చెప్పఁబూనుట కేవలమాడంబరమని తలంచెదము. రోగియుండెడి గదిప్రక్కనున్న యొకవసారాయం దనవరతము రాత్రింబవళు లాతడు విరామములేకుండఁ గూర్చుండుచుండెను. ఆతని

యీరాజ్యమెక్కడ ? ఆయుధములెక్కడ ? సంధియెక్కడ ? ఆతని యుత్సాహమేది ? అతనియాదురాకాంక్షయేది ? అన్నియుఁ బోయినవి. ప్రపంచమందలి వ్యాపారములనన్నిఁటి నాతఁడు మఱచిపోయెను. ఇంతయేల ? ఆతని దేహమునే యాతఁడుమఱచిపోయెను. యూనానివైద్యులామెరోగమునుగూర్చి చెప్పెడివృత్తాంతముఁను బదింబదిగవినుటకై పార్శ్వమందున్న వసారాయం దధైర్యముతో నొంటరిగఁ గూర్చుండి యుండెను.

దినములు జరిగిపోవుచుండెను భగవంతుఁడు తనకృపాకటాక్ష విలాసము నొక్కింతయిటు బఱపెను. రోగికి క్రమక్రమముగ నొక్కించుక గుణము కనఁబడఁజొచ్చెను. చికిత్సకులు ధైర్యవంతులై ధైర్యమును జెప్పుచుండిరి నవాబునకుఁ బోయినప్రాణము వచ్చినట్లయ్యెను. యూనానివైద్యులును నాయుర్వేదభిషఙ్మణులును ననేకులచే బహుమతులను బడయసాగిరి. అనేకవిధములుగ విశేషధనము వ్యయమగుచుండెను. అనేకదానధర్మములు, దరిద్రులకు భోజనములు పుణ్యకార్యములు, దేవతాపూజలు, మొదలగునవెన్నియో నడచుచుండెను. నవాబుగారి నగరమున నందఱు నానందజనకకార్యములయందుఁ బ్రవృత్తులై యుండిరి. క్రమముగా నవాబునందినియు నారోగ్యమునొందెను పథ్యము సేయుటవలనను, నౌషధసేవవలనను, క్రమముగా నామెశరీరమున రక్తముపట్టి శక్తియభివృద్ధికాఁ జొచ్చెను. రోగముచే నవగతమైపోయిన యీమెపూర్వ మనోహరకాంతి మరలఁ గనుపట్టనారంభించెను.

అస్మన్నుఖా ననవరతమును నయేషాగదిప్రక్క వసారాలోఁ గూర్చుండుటమాని, యనుదినమును బదింబదిగవచ్చుచుఁ బోవుచు రోగమునుండి క్రమక్రమముగ విముక్తయగుచున్న యయేషా సమాచారమును స్వయముగఁ దెలిసికొనుచుండెను. ఆమెకు స్వాస్థ్య మభివృద్ధియైనకొలఁదిని నస్మన్నుఖానుసిరాకపోకలు, క్రమక్రమముగఁ దగ్గిపోవుచుండెను. తుదకొకటి రెండుదినముల కొకమాఱువచ్చి యాతఁడయేషానుజూచి పోవుచుండెను.

అయేషాతల్లి యంతవఱకును ననన్యవ్రతయై సదా కుమార్తె పార్శ్వముననే గూర్చుండుచువచ్చెను. అయేషా శయ్యనుండిలేచి

యటునిటు తిరుగాడుచుండుట కారంభించెను అందుచే నెప్పుడు నామె కుఁ బరిచర్య సేయుటకై పార్శ్వముననే యుండవలసిన యావశ్యకము తల్లికి లేకపోయెను. ఒకనాటి మధ్యాహ్నకాలమున నయేషా యొక్క- తెయు మంచముపైఁ గూర్చుండియుండెను. పరిచారిక లెవ్వరు నా సమీపమున లేరు; నవాబునందినియు ననేకవిధములగు విచారములలో నిమగ్నయై యుండెను "ఇప్పుడేమి జరిగినది? పఠానులదైన్యావస్థకుఁ దానేకమాత్రకారణమా? ప్రియత్నము చేసినచోఁ బ్రస్తుతమున సం భవమై యున్న యాయవస్థ నన్యథా చేయవలనుపడదా?" ఈ మొదలగు ననేకాలోచనలలో నయేషా మునిఁగిపోయియుండెను.

ఇంతలో ద్వారముకడనుండి "అయేషా! ఎట్లున్నది?" అని యస్మాన్ ఖానడిగెను.

అయే — నెమ్మదిగనున్నది; అస్మాన్! లోపలకురమ్ము

అస్మాన్ — (వెనుకముందుచూచుచు) అయేషా! నీవొక్క- తెవే కూరుచుంటివేమి? నేనిప్పుడు రాఁజాలను. మఱొకసమయమున వచ్చి నిన్నుఁ జూచెదను.

అయేషా తానొక్క-తెయే యుండుటనుజూచి యస్మానుఖాను లోపలకు వచ్చుటకు సంశయించుచున్నాఁడని తెలిసికొని, లేచి ద్వార మువఱకునుబోయి "అస్మాన్! లోపలకురమ్ము. నీతో మాటలాడవల యునని యున్నది." అనియెను.

అస్మాన్ ఖాను మాఱుమాటాడక యామె యున్నగదిలోనికి వచ్చెను.

అయే — నిలుచుంటివేమి? ఇచ్చటనే కూర్చుండవచ్చును.

కూర్చుండుటకచ్చట శయ్యతక్క- వేరుస్థలములేదు.

అస్మా — నీవుకూర్చుండుము. నేను నిలిచియుండెదను. నాకు బాధకమేమియు లేదు.

అయే — సంకోచపడవలసిన యావశ్యకమేమియును లేదు. నేను చెప్పినపిదప నిస్సంశయముగా నీవీశయ్యపైఁ గూర్చుండవచ్చును.

అస్తానుఖానామంచముపై నొకతట్టునఁ గూర్చుండెను అయేషాయు నామంచముపై వేఱొకతట్టునఁ గూర్చుండుటనుజూచి యస్తానుఖా నాశ్చర్యనిమగ్నుఁడయ్యెను.

అయే—నేను నీసాన్నిధ్యమునువీడి కొంచెముకాలము చాల దూరము పోయియుంటిని. తిరిగి వచ్చినతోడనే జబ్బుచేయుటచే నీతోఁగలసి విశేషముగ మాటలాడుట కవకాశము లేకపోయినది. నేనబలనుఁ నీశాసనాధీనమునందుండుట నాకుఁగర్తవ్యము. అట్లుచేయకుండుట గొప్పయపరాధమగును నాయపరాధమును క్షమింపవలయునని నిన్ను వేఁడుకొనుచున్నదానను.

అస్తాన్—క్షమింపుమని వేఁడుకొను టెందులకు ? నాకేమైన నీపైఁగోపమున్నదా? నీవు మరల దయయుంచి నవాబునగరమునకు వచ్చుటచే మృతప్రాయమైన నాకళేబరమునకు జీవనకళ వచ్చినట్లయినది. నీవపరాధమును జేసితివని నేనెన్నఁడు ననుకొనలేదు. అగుటచే నీవు క్షమాపణమును వేఁడుకొను టెందులకు?

అయే—నేనిచ్చట లేనిసమయమున మనభాగ్యమంతయు ననేకవిధములుగాఁ బరివర్తనమైపోయినది సోదరా! అందుకొఱకు నీవు హృదయమున నేమైనవిచారించుచున్నావా?

అస్తా—అదృష్టమునందు విషమపరివర్తనమైనదనుమాట నిశ్చయము. అందునిమిత్తమై నాహృదయ మవసన్నము కాలేదని చెప్పఁగలను. నీవపరాధమునఁ గూర్చి చెప్పితివికదా? ఈ మనభాగ్యపరివర్తనమునకు నిజముగా నీవే కారణమవు నీవస్తానుఖానుని బాహువులయందు బలమును, హృదయమందు సాహసమును, మనస్సునందు బుద్ధియు, కార్యములయం దుత్సాహమునై యున్నావు. అస్తానుని యాబలమును, సాహసమును, బుద్ధియును, నుత్సాహము నపహరించుకొని నీవెచ్చటికోపోయియుంటివి. ఇఁక నదృష్టమెట్లునిలుచును ? అదియును బరివర్తనమైపోయినది. దురదృష్టము సంభవమైనది.

అయే—ఔనట్లే జరిగినది కాని, యిప్పుడందుల కుపాయమేమియును లేదా ?

అస్మా—లేకేమి? ఉపాయముల కేమికొదవ? నీవీనగరమునకు మంగళమయమైన యధిష్ఠాత్రివి. నీవు నాశుభమునుగోరుటలో సదా లీనతను వహింపవేని సర్వమును శుభమగును

అమే—అన్నా! అస్మాన్! అట్లనెదవేల? నీయిష్టానిష్టములతో నాసుఖదుఃఖములు జడితములైయున్నవనుసంగతి నీవెఱుంగవా?

అస్మా—నేనాసంగతి నెఱుంగుదును. ఎఱింగియుంటినిగనుకనే యింతవఱకును మేనఁ బ్రాణములు నిలుపఁగలిగితిని. కాని, యొక్క విషయమును నిన్నడిగి తెలిసికొనుట మేలని తోఁచుచున్నది. నీవు సర్వదా నాహితమునకు గోరుదానవైయుండియు నాకుఁ గష్టకాలము సంప్రాప్తమైనప్పుడు నీవు నన్నువిడిచి యేలవెళ్ళిపోయితివి? అమేసా! దారుణములైన యీదుర్దినములలో నీవు నన్నెట్లువిడిచిపోఁగలిగితివి?

అమే—(చాలసేపుయోచించి పిదప) నాయీజీవితమునందలి కార్యములయందొక్కటైనను నెవనికిఁ దెలియకుండనుండదో. యట్టివానికడ నావిషయమును దాచిపుచ్చుటెందులకు? విషయమేమో నీకుఁ గష్టదాయకమైనదగును నీవు దానినిగూర్చి నన్ను బ్రశ్నింపకయుండినచో నేనావిషయమును నీతోఁ జెప్పకయేయుందును. నేను యువరాజగుజగత్సింహుని చెఱనుండి విడిపింపవలయుననునభిప్రాయముతోఁ బాట్నానగరమునకును బిదప నచ్చటనుండి యాగ్రాపట్టణమునకును వెళ్ళితిని.

అస్మా—నాకాసమాచారము తెలియనే తెలియదు. అదృష్టవంతుఁడగు జగత్సింహుఁడు నీహృదయరాజ్యమునకు రాజనువిషయమును నీవు గోపనముచేయుచుండుటలేదు అందుచే నాతనిని చెఱనుండి విడిపింపవలయునను కోర్కెయు నసంగతముకానేరదు. నీయాకార్యమువలనఁ బ్రకారాంతరముగా నాయిష్టార్థముకూడ నాకుఁ జేకూరినట్లయినది.

అమే—అదెట్లు?

అస్మా—జగత్సింహుఁడు నాకు వధ్యుఁడు ఆతనిని వధించుటకొఱకే నేనింకను జీవించియున్నాఁడను. ఆతఁడు యావజ్జీవమును గారా

గారమునందే యున్నచో నేనాతనిని నాశనమొందించుట కవకాశమే లేకపోవును. నీవాతనిని జెఱనుండి విడిపింపఁబ్రయత్నించుటవలన నాకు మహోపకారమైనది.

అయేషా తనవదనమును మఱియొకవంకకుఁ ద్రిప్పికొని యాలోచింపఁదొడంగెను.

అస్మా—మాటాడుటలే దెందువలన ? అయేషా ! నావాక్యముల వలన నీహృదయమున కేమైనఁ గష్టముకలిగినదా యేమి ?

అయే—లేదు

అస్మా--అట్లయిన యోచించుచున్నావేమి ?

అయే—నేను యోచించుచున్న దేమంటివా ? నావంటియభాగిని నీప్రపంచమున సృష్టించినందువలన విధాతకుఁగలిగిన లాభమేమి ? నేను ప్రపంచమున కేయుపకారమును జేయుటకును వచ్చినదానను గాను నావలన నొకరికిని హితముకలుగుచుండుటలేదు. నానిమిత్తము కేవలము కలహద్వేషప్రవాహమే యవ్యాఘాతముగా బ్రవహించుచున్నది. నీవంటిమహాపురుషుఁడు నా నిమిత్తమై నిరంతరము నాంతరికజ్వాలలచే దగ్ధుఁడైపోవలసివచ్చినదికదా?

అస్మా—అనంతమైన యీజ్వాలననుభవించుటకు నేనెప్పుడును వెనుదీయను. ఆమహాజ్వాలను హృదయమున భద్రముగా నిడికొని సహించుటకు సమర్థుఁడనై యున్నాఁడను. అట్లునిరంతరమును సహించుకొనుచు వచ్చుచున్నాను. అయేషా ! నాకీజ్వాలవలనఁ గలిగెడి సుఖమునకుఁ బారములేదు. నిజముగా నట్లుకాదేని నాజ్వాల నణఁగించుట నేను ప్రయత్నపడుటలేదేమి? మఱియు, నట్లు కాదేని, యెవరి నిమిత్తము నాజ్వాలయుదయించినదో, యట్టి నీవుసృష్టిపథమునుండి దాటిపోయినప్పుడు ప్రపంచమే శూన్యమైనట్లుఁ గన్పట్టుచుండుటేమి? సత్యముగా నాజ్వాలవలన సుఖమే కలుగుచున్నది. అట్లుకాదేని నిన్ను మఱచిపోవుటకై దయామయుఁడైన భగవంతుని పాదపద్మములను బ్రార్థించుటకు నాహృదయము ప్రయత్నింపదేమి? అట్లుకాదేని, నా జ్వాల కెవ్వరుకారణమో?, యామె యేభవనమున నివసించియుం

డునో, యదేభవనమున వేఱొకపక్షి వాసముసేయుటకు నాకవ కాశము చిక్కనేని యెంతయో సుఖ మనుభవించుచున్నట్లు నాహృద యమునకు సంతుష్టికలుగు టేమి? అట్లుకాదేని నీహృదయమునందించు కంతయును నాకు దావులేదని స్పష్టముగాఁ దెలిసికొనియుండియు నా హృదయ మహర్నిశమును నీయందే నివిష్టమైయుండుటేమి ? అట్లుకా దేని, ప్రపంచమునందలి సర్వపదార్థములకంటె నాజ్వాలయుదయింపఁ జేసెడిపదార్థమే సర్వోత్కృష్టమైనదిగాఁ దోఁచుచుండుటేమి? అయేషా ఆజ్వాల సర్వదా నాకానందదాయకము సుఖదాయకము.

అయే ఆజ్వాలనిట్లనుభవింపుమని భగవంతుఁడు నీకు విధించినట్లు తోఁచుచున్నది. సర్వగుణాధారుఁడవగు నీవంటిమహాత్మున కిట్టిచిరకాలయాతన తటస్థించుట కీయభాగినియే కారణము అస్మాన్ ! నీవీపిశాచమును మాటిమాటికి మృత్యుముఖమునుండి రక్షించెద వెందులకు?

అస్మా—అయేషా ! ప్రపంచమున దేనిని బ్రియమని చెప్పుచుందురో, దానిని నీవు బాగుగా నెఱుంగుదువు? జగత్సింహుఁడు కారాగారమునందు బద్ధుఁడై యున్నాఁడనువార్తను వినినంతనే పితృభవనమునువీడి దేశాంతరమున కెందుల కేగితివి ? సామాన్యమైన కారాగారవాసమునుగూర్చి వినినప్పుడే నీవు సహింపఁజాలకపోయినప్పుడు, నీకు మరణము సంభవించుపట్ల నేనున్మాదుఁడను గాకుండ నుండుటెట్లు?

అయే—అస్మాన్ ! నేను కాతరముతో వేఁడుకొనుచున్న దానను. నీహృదయమును వెనుకకు మరలించి ప్రస్తుతకార్యాసక్త మగునట్లు చేయుము. నీవు వీరుఁడవు—సాహసివి—విశేషించి రణ కోవిదుఁడవు. రణక్షేత్రమునఁ గీర్తినిసంపాదించుటయందును, సామ్రా జ్యసంపాదనమునందును బ్రమత్తుఁడవుకమ్ము. అంతటిసుఖసౌభాగ్యము లేమహాత్మునకుఁ దంగేటిజున్నువలెనుండునో యట్టిమహానుభావుఁడ వగు నీవొకసామాన్యస్త్రీ విషయికమగుచింతచే నయోగ్యయగు నొక యభాగిని ప్రేమపిపాసచే నీమహత్తరములైన యాకాంక్షలను, నాదర్శ ములను సంపూర్ణముగఁ ద్యజించి, ప్రవర్తించుట నీకుఁ గర్తవ్యమేనా?

అస్మ్రా—నేను నాహృదయమును బ్రికృతిస్థముచేసియున్నాను. నేనెంతవఱకుఁ బ్రికృతిస్థము చేసినదియు నీవువినినచో స్తంభితవై నివ్వెఱ పడుదువు. నేనిప్పుడు నిన్నుఁ బొందఁజాలనని తెలిసికొనియున్నను నాప్రాణమింకను దేహమున నిలుపుకొనియున్నాఁడను నేనిప్పుడు నిన్నుఁ బొందఁజాలనని తెలిసికొనియున్నను, నా హృదయము కార్యాసక్తమై ప్రియత్నములను జేయుచునేయున్నది నీతో నాకుసమప్రాణత లేదని తెలిసియున్నను నాహృదయము జయపరాజయములచేఁ గలిగిన సుఖదుఃఖముల ననుభవించుప్రివృత్తిలోనున్నది. ఇంతకంటె విశేషాశ్చర్యమును గలుగఁజేయునది వేఱేదియులేదు. అయేషా! రణరంగమున నప్రిమత్తుఁడవుకమ్మని కాదా చెప్పితివి నా ప్రికృతావస్థయందదియొక్కటియే నాకుఁ గర్తవ్యమైయున్నది. ఆమార్గమే యిప్పుడు ముఖ్యముగ నవలంబనీయమైనది కాని, అయేషా! నాదొక్కవిన్నపమున్నది. నా హృదయమును నేను పూర్ణముగా ప్రికృతవ్యాపారములకు మరలించుకొనెదను దానికి సందేహములేదు. కాని నాయందుదుర్బలత్వమొకటి సంపూర్ణముగానున్నది నీవు నాకులభింపకపోయినను నేనికఁ గాతరము నొందను. నీవెవరిదానవైనను నాయోచనమువలన నేను వ్యాకులుఁడను గాను. కాని దూరమునుండియైన నొక్కసారి నిన్నుఁ జూచుచుండవలయునను నాశను నేనింకను విడువఁజాలకున్నాఁడను. ఒక్కసారి నీతో నొకటి రెండుమాటలు మాటలాడవలయునను నాశను త్యజించుట కింకను సమర్థుఁడను గాఁజాలకున్నాఁడను. నీవేభవనమున నివసించుచుందువో యాభవనమున వాసముసేయుగౌరవమును బరిత్యజించుటకింకను శక్తుఁడను గానేరకున్నాఁడను. నీకుశలమునందు సుఖమును నీకష్టమునందు దుఃఖమును బొందకుండనుండుటకు నేనింకను సమర్థుఁడను గాఁజాలను. అయేషా! నిర్భాగ్యుఁడగు నీదీనునియాశలన్నియును ద్రోసివేయబడినవి. నీవు నాయాచిన్నికోరికలనుగూడ నసంగతములైనవిగనే యోచించెదవా? భిక్షుకునకు రత్నములవలెనున్న నాయీయభిలాషలను నిరర్థకముగా జేయుటయే నీయభిప్రాయమా?

అయే—కాదు. అస్మాన్! జీవితమునందును మరణమునందును నీతోఁగూడ నెప్పుడునుండెదను. వివాహరూపమైన శాశ్వతబంధము

ము; యదృష్టమందు లేదు. కాని యందువలన బాధకమేమి? నాయీ దేహమును నీచరణపద్మములయం దుత్సర్గము సేయుటకు నాకు స్వాధీనముకాకపోయినను, విధివిధానముచే నీసేవయందు నాయాత్మ సమర్పణముగావించుకొనుటకు నాకధికారములేకపోయినను, నందువలన బాధకమేమి? అన్నా! మనము సుఖమునందును, దుఃఖమునందును, సంపదయందును, విపత్తునందును, సహానుభూతులమై యేలయుండరాదు? మనమిరువురము నొకేహృదయముతోఁ గష్టసుఖములయం దొక్కటిగ నుండి, యొకేప్రాణముతోఁ గార్యసాగరమునఁబడి యీఁదులాడుచు జీవితమును గర్మమయముగ నేలచేయరాదు? అస్మాన్! నేను చావు బ్రదుకులయెడ నిన్నెడబాయకుండ సదా చరించుచుండెదను. నీకు సంతోషదాయకములగు కార్యముల నొనర్చుటయే నాకు వ్రతము.

అస్మా — అయేషా! ఈనిర్భాగ్యునిజీవితము నిప్పుడీవు సుఖమయముగను, నానందమయముగను జేసితివి. నీయీయపారకృపాకటాక్షము నన్ను ధన్యతమునిఁగఁ జేసినది ఈభిక్షుకుఁడు మఱి దేనినిగావలయునని కోరుటలేదు. అయేషా నాకవిచలితహితైషిణి అయేషా నాసుఖదుఃఖములలో సహానుభూతి. అయేషాయాజ్ఞచేఁ బాలితుఁడనై కార్యసాధనముకొఱకు నియుక్తుఁడనైనాఁడను. అదియే నాకుఁ బరమగౌరవము. మఱియు నదియేపరమానందదాయకము. ఇంతకంటె నాకు విశేషప్రార్థన మేమియునులేదు

అయే — ఆమాటలవలనఁ బ్రయోజన మించుకంతయునులేదు. మనమిప్పు డేయుపాయముచే నపహృతమైపోయిన మనరాజ్యమును మరల సంపాదింపఁగలమో, యాయుపాయము నారయుట మనకుఁ గర్తవ్యము.

అస్మా — అందుకొఱ కంతగాఁ జింతింపవలసినయావశ్యకము లేదు. ఇఁకముందు రణరంగమున నాపరాక్రమముఁజూచి మానవసమాజము విస్మయావహముగాకపోదు జయముపై జయమువచ్చి నన్ను సాదరభావముతో నాలింగనము చేసికొనును మంగళమయమైన యయేషాప్రసన్నతకును, నాకార్యసూత్రమందలి సఫలతకును నిత్యసంబంధమున్నది.

అయేషాజనని ద్వారముకడనిలుచుండి "తల్లీ! ఔషధమును సేవించువేళయైనది" అనియెను.

అయే—అమ్మా! లోపలకురమ్ము! ఔషధమును బుచ్చుకొనక పోయినను బాధకము గాన్పించుటలేదు.

అయేషాయును నస్మానుఖానును మంచముపైనుండి లేచిరి బీగము గదిలోపలకువచ్చి యువతీయువకుల వదనప్రసన్నతాలక్షణములనుజూచి పరమానందము నొందెను. వారియాభావ మత్యంతశుభసూచకమని యామె యనుకొనియెను.

పదమూడవ ప్రకరణము.

జగత్సింహుఁ డంధకారమయమైన కారాగారమునందు లోహశృంఖలాబద్ధుఁడై యతికష్టముతోఁ గాలమునుగడపుచుండెను. ఆదారుణ దుఃఖదినము లెప్పటికిని గడచునవా? మరల నాతఁడు స్వతంత్రుఁడై తోడిమానవకోటిం జేరి సుఖమయములైన కార్యములయందు జీవితమును నియోగింపఁజాలఁడా? ఆతనియాశయును, సుఖానందములును సంపూర్ణముగఁ గారాగృహమునందు దీర్ఘనిశ్వాసములతోఁ బర్యవసితములై పోవలసినదేనా?

అభిరామస్వామి స్వయముగాఁ జెఱసాలకువచ్చి విజ్ఞాపనపత్రముపైఁ జేవ్రాలుంపించి దానిని దీసికొనివెళ్ళియున్నాఁడు. నవాబునందినియుఁ జెఱనుండి విడిపించుటకై వ్యాకులపడుచున్నది. ఆమె స్వజనులను వీడి యొరిస్సాదేశమునుండి పాట్నానగరమున కిందునిమిత్తము వచ్చియున్నది. వారియందఱి ప్రయత్నములును, వ్యర్థములు గాజాలవు. కాని, చాలకాలము గడచిపోయినది అయినను, శుభసమాచారమేమియు నింకను రాలేదు. ఏమిచెప్పుమా! ఈధైర్యవిశ్వాసములు వ్యర్థముగా నంతమొందవలసినదేనా?

కారాగారమునందు జగత్సింహుఁ డొంటరిగఁ గూర్చుండి యీరీతిగ యోచించుకొని, పిదప నయేషావిషయమున ననేకవిధములుగ

యోచింపఁదొడంగెను. అంతటిస్నేహమును, నంతటిహితైషిణి మెచ్చ టను గానరాదు. ఆమె సాహాయ్యమునుబడసిన యాతఁడే మానవులలో ధన్యుఁడు. అయేషాను మనుష్యస్త్రీగాఁ జెప్పినచో నన్యాయము చేసిన ట్లగును. స్వర్గమునందుఁగూడ నట్టిదేవి యుండదు కాని, అహా! అంతటి పూజనీయురాలగు నావనితారత్నము తనయసామాన్యప్రణయము నొక యయోగ్యునియందుంచి చిరవిషాదమును దెచ్చిపెట్టుకొనినదికదా! ఆమెపడుచుండు యాతనల కన్నిటికిని నీదురదృష్టవంతుఁడే యేకమాత్ర కారణము. ఈయదృష్టహీనుఁ డామె దృష్టిపథమునఁ బడకుండెనేని యా దేవి యీప్రపంచమున సర్వసుఖములకు నధికారిణియై యుండునుగదా! అసదృశమైన యారత్నమును నిజముగాఁ బ్రేమముగ్ధుఁడైనపురుషశ్రేష్ఠుఁడు సమాదరభావముతోఁ దనవక్షస్స్థలమునధరించి యనంతసుఖభోగముల ననుభవించుటకంటె నీప్రపంచమునఁ గావలసిన దేది? నిజముగా శోభామయమైన యాప్రసూన మాదరములేమి, మలినమై శుష్కించిపోవుట కంటె దుఃఖకరమేమున్నది? కృతఘ్నుఁడగు నీనరాధముఁడు దేవదుర్లభమైన యాప్రణయమునకుఁ బ్రతిదానము జేయనశక్తుఁడుగ నున్నాఁడు అట్టివానిపైఁగూడ నాకరుణామయి యనుగ్రహమా! ఆహా! ఈజీవితమునందు జగత్సింహుఁ డామె నొక్కసారిచూడఁగలఁడా? లేక, తన కృతజ్ఞత నామెకుఁ దెలుపుటకవకాశమే లేకుండఁబోవునా?

తిలోత్తమ యతికష్టముతోఁ గాతరమైకాలము నెట్లోగడపుచుండెనని యభిరామస్వామి చెప్పియున్నాఁడు. ఆశ్యములేని యాతనల ననుభవించుటచే కోమలమైన యాప్రాణ మిదివఱకుఁ బోవకుండ నింకను నిలిచియుండునా? ఆమె యింకను జీవములతో నుండునా? ఆప్రేమమయి జీవించియుండఁగాఁ జూచుభాగ్యము జగత్సింహునకు లభించునా? ఆమెతోఁ దనమనోవ్యథలనుగూర్చి మాటలాడుకొనుట కెప్పుడైన నీతని కవకాశముకలుగునా?

కర్తవ్యమును జేయనందులకై తనతండ్రి తన్నుఁ గారాగృహమున కంపినాఁడు. కాని, కుమారునియాదుర్దశను స్మరించుకొని తండ్రి హృదయ మించుకంతయును విచలితముకాలేదా? పాట్నానగరమునందున్న తనసవతితల్లులెవరును దన్ను చెఱనుండి విడిపించుటకై వ్యాకుల

పడుచుండుటలేదా ? అట్టి స్వజనులున్నను జగత్సింహుఁడీరీతిగ నీయంధకారముననే కాలము గడపవలయునా ?

ఆకష్టము సహింపశక్యముగానిది. లోహశృంఖలములను వహించుటకష్టముగాదు. అంధకారమందుండుటయుఁ గష్టముకాదు. బంధము వలనను గష్టములేదు ఒక్కసారి——ఒక్కసారిమాత్రమే——దూరము నుండి——ప్రాణమునకుఁ బరమప్రియమ్మైన యామనోహరాకృతిని జూడ గల్గినచో నీకష్టములను సహింపవచ్చునని తోఁచుచున్నది. దూరము నుండియైన నొక్కసారి——ఒక్కసారిమాత్రమే తిలోత్తమనుఁజూచు నుపాయ మేమియునులేదా?

జగత్సింహుఁడీరీతిఁ బరిపరివిధములఁ జింతించుచు "నొక్కమారుగఁ దనకాలుచేతులకున్న సంకెలలనూడఁ బెఱికిపాఱవైచి శక్తికొలఁది యాకారాగారపుటినుపతలుపుఁను బ్రద్దలుకొట్టి మందారణ దుర్గాభిముఖముగఁ బారిపోయినచో——" అని యనుకొనియెను

ఇంతలో నాకారాగృహసింహద్వారము వికటమగుఘుర్ఘురశబ్దముతోఁ దెఱవఁబడియెను. తెఱచిన యాద్వారమునుండి చల్లనిగాలివచ్చి జగత్సింహున కించుక వినోదమునుగలిగించెను. ఆద్వారమునుండి కారాగారాధ్యక్షుఁడును, మఱియొక యనుచరుఁడును లోపలకువచ్చిరి అనుచరునిచేతియందు వివిధవస్త్రాలంకారములుండెను.

కారాగృహరక్షకుఁ డెదురుగవచ్చి నిలుచుండి విశేషసన్మానముతో యువరాజునకు బ్రణామముచేసెను.

జగ——సమాచారమేమి ?

కారా——(వినయముతో) యువరాజుగారికి విముక్తి కలిగినది.

యువరాజాశుభవార్తను దాల్మితోవిని కారారక్షకునితో నిట్లనియెను——

జగ——నీమాట నిజమనినమ్ముటకు నిదర్శనములేమైన నీయొద్దనున్నవా ? నిదర్శనములేకుండఁ జెఱసాలనుండి యవ్వలకువచ్చితినేని రాజద్రోహినిగాఁ బరిగణింపఁబడవచ్చును.

కారా——నాయొద్ద నట్టినిదర్శనము లేవియులేవు. ఆగ్రానుండి షాదుమహావారిపేరుతో ముద్రాంకితమైనయొకయాజ్ఞాపత్త్రికను దీసి

కొనివచ్చి సిపాయి యొకఁడు మహారాజుగారిచేతికిచ్చినాఁడు. మహారాజుగారిస్వంత సేవకుఁడొకఁడు వారియాజ్ఞను నాకెఱింగించినాఁడు. మహారాజు గారి సైనికు లనేకులు యువరాజునిక్కడనుండి తీసికొనివెళ్ళుటకై వచ్చి ద్వారముకడ నిలుచుండియున్నారు.

యువ—నీమాటయందు నాకవిశ్వాసము లేదు. కాని, నీవు కార్యమును సరిగాఁ జేసియుండలేదు. సిపాయిలతోఁగూడ మహారాజుగారియుంగరముఁగాని, లేదా వారిముద్రాంకితమైయున్న యాజ్ఞాపత్రికగాని తీసికొనివచ్చినచో సరిగానుండును. నీవుదానినిజూచి నన్ను విడిపించుటకు వచ్చియుంటివేని నీకర్తవ్యమును నీవు సరిగాఁ జేసినట్లగును.

కారా—(కొంచెమాలోచించి పిదప) చిత్తము. ఏలిక న్యాయముగా నాజ్ఞయొసంగినారు. ఆనందాతిశయముచే నేను చేయవలసిన పనిని మఱచిపోయితిని. ఇప్పుడేమియాజ్ఞ ?

జగ—నీవుపోయి యాసైనికాధికారితో "మహారాజుగారియాజ్ఞగాని, లేదా ఫాదుషవారియాజ్ఞగాని పడయనిదే చెఱసాలనుండి యివ్వలకువచ్చుటకు యువరాజంగీకరింపలేదనియు, హుజూరు కచ్చేరికిఁబోయి యట్టినిదర్శనమును దీసికొనిరావలసినిదనియుఁ జెప్పి నీవుతిరిగిరమ్ము. అంతవఱకును శృంఖలావిమోచనమును వేషపరివర్తనము ననావశ్యకములు.

కారాగృహారక్షకుఁడు యువరాజుబుద్ధిస్థైర్యమును సావధానతయును జూచి విస్మితుడై మఱియేమాటయును జెప్పకుండ "ఆజ్ఞాప్రకారమగుఁ" అని యటనుండి వెడలిపోయెను. పోవునప్పుడా కారాగృహముయొక్కతలుపు వేసిపోవలేదు. యువరాజును జెఱనుండి విడిపింపవలయునని వచ్చిన యాజ్ఞావిషయమున నాతనికించుకంతయు ననుమానము లేదు

ఒకించుక సేపటిలోనే కారాగృహారక్షకునితోఁగూడ మధురాసింహుఁడు కారాగారములోపలఁ బ్రవేశించి సన్మానముతో యువరాజున కిట్లువిన్నవించెను. "యువరాజా ! మందారణదుర్గసమీపమున

నీసేవకుఁ డేయుంగరమును యువరాజునకుఁజూపి మహారాజుగారి యాజ్ఞను నివేదించెనో, యదేయుంగరమిప్పుడీదాసునియొద్ద నున్నది. ఏలికకు విముక్తిగలిగెనుగదా యనునానందముతో దానినిమీకుఁ జూప మఱచితిని. దాసునియపరాధమును క్షమింపవలయును” అని విన్నవించి మధురాసింహుఁడు తనయుష్ణీషమునందున్న ముద్రికనుదీసి యువరాజు రాజుసమ్ముఖమునఁ బెట్టెను. యువరాజాముద్రికను సన్మానించి కారాగృహాధ్యక్షునితో “నాశృంఖలములను దీసివేయుము” అనియెను.

కారాగారాధ్యక్షుఁడు పరమానందముతో జగత్సింహుని కాలు సేతులయందున్న సంకెలలను దీసివేసెను. మధురాసింహుఁ డనుచరుని చేతియందున్నవస్త్రాలంకారములనుదానుతీసికొని యువరాజు కాలుచేతులును మొగమును గడుగుకొనుటకై యుదకమును దెమ్మని యనుచరున కాజ్ఞాపించెను. నీరువచ్చినపిదప జగత్సింహుఁడు తనవదనమును గాలుచేతులను గడిగికొని యపహ్యములగు కారాగృహమందలి దుస్తులను దీసివేసి మధురాసింహునిచేతనున్న యమూల్యవస్త్రాలంకారములను ధరించెను. మస్తకమున వజ్రఖచితమగు నుష్ణీషము, కర్ణములయందు రత్నకుండలములు, కంఠమున ముత్యాలహారము మొదలగు నాభరణములచే నలంకృతుఁడయ్యెను. కటియందు కత్తి— పాదములయందుర రత్నఖచితములగు పాదుకలు ధరించెను. చాలకాల మంధకారమయమగు కారాగారవాసము, దారుణదుశ్చింత, మొదలగు కారణములచే జగత్సింహునిమూర్తి మలినమైయుండెను. అయినను నాతని స్వభావసిద్ధమైన యాకాంతి రాజవస్త్రధారణముచే మిగుల శోభాయమానమై ప్రకాశించుచుండెను.

సమస్తయాతనానిలయస్వరూపమై నరకసదృశమగు కారాగారమునుండి జగత్సింహుఁడు విడివడియెను. అనేకవిధములగు దుశ్చింతలతోడను, భయవిచారములతోడను బ్రపీడితుఁడై జగత్సింహుఁ డెచ్చట బహుకాలమతికష్టముతోఁ దనజీవితమును గడపెనో, యాస్థానముతోడి సంబంధ మిప్పు డాతనికిఁ దొలగిపోయినది. ముందు మధురాసింహుఁడు—నాతని వెనుక యువరాజు—ఆతని వెనుక కారాగారరక్షకుఁడు—అనుచరులు— ఈరీతిగ నందఱు నివ్వలకరుదెంచిరి. జగత్సింహుఁడు చాల

కాలమునకుఁ బ్రపంచములోనికి వచ్చెను. అవ్యాహతమైన వాయు సముద్రమునకువచ్చి యాతఁడు క్రొత్తజీవనమును బొందెను. క్రొత్త ప్రపంచమునకువచ్చిన ట్లాతఁ డనుకొనియెను.

మధురాసింహునియధీనమున నేయేబదిమంది సిపాయీలు జగ త్సింహుని బందీగాఁ జేసితీసికొనిపోవుటకుఁ బూర్వము వచ్చియుండిరో, యాయేబదిమందిసిపాయిలే మరలఁ గారాగారమునుండి యాతనిని తీసి కొనివెళ్ళుటకై వచ్చి యాప్రాంతమున నిలిచియుండిరి. జగత్సింహుని శ్వేతాశ్వము సుసజ్జితమై చాలకాలమునకు మరలఁ దనప్రభువునెక్కిం చుకొని తీసుకొనివెళ్లుటకై యచ్చటకువచ్చియుండెను అశ్వసమీపమున ఛత్రధారుఁడొకఁడు ముత్యములజాలరుచే నలంకృతమై యున్నవిశాల శ్వేతఛత్రమును జేతఁబూని నిలుచుండియుండెను. కిన్ కాఫ్ వస్త్రముతో నంచువేసికట్టఁబడిన యొకవీవనను జేతఁదాల్చి యొకమనుష్యుఁడు ఛత్రధారిప్రక్క నిలుచుండియుండెను.

యువరాజునుజూచుటతోడనే యాయేబదిమంది సైనికులును తమకత్తులనెత్తి ప్రణామమును జేసి సమస్వరముతో "జయము! జయ ము! యువరాజు జగత్సింహునకు జయమగుగాక!" అని జయఘోష ములను జేసిరి.

యువరాజుకూడ నదేరీతిగఁ గత్తిచే వారికిఁ బ్రతివందనముచేసి "జయము! అక్బరుపాదుషహాకు జయమగుగాక! జయము! మానసింహ మహారాజునకు జయమగుఁగాక!" అనియెను

జగత్సింహుఁ డశ్వము నధిష్టించెను. చాలకాలమైనపిదపఁ దనప్ర భుసందర్శనమగుటచేఁ బరమానందముతో నశ్వము నృత్యముసేయుచు ననేకవిధములఁ దనయానందమును సూచించుచుండెను. కారారక్షకుఁడు వచ్చి యువరాజునకుఁ బ్రణామమును జేసెను. జగత్సింహుఁ డాతనితో "కారాగారము నందునేనున్నకాలమున నీవు నావిషయమునఁ జక్కగాఁ బ్రవర్తించితివి. నీప్రవర్తనము నెడల నేను మిగుల సంతుష్టచిత్తుఁడనై నాఁడను. నీవు మఱియొకప్పుడువచ్చి నన్నుఁ జూచినచో నీకు సన్మా నమును జేసెదను" అనియెను.

కారాగృహరక్షకుఁడు యువరాజునకు మరలఁ బ్రణామముచేసెను. సైనికులలో నిరువదియైదుగురు గుఱ్ఱపురౌతులు యువరాజునకు ముందు నడచుచుండిరి. మిగిలిన యిరువదియైదుగురును నాతనికి వెనుక వచ్చుచుండిరి. మధురాసింహుఁడు పూర్వమువలె యువరాజుపార్శ్వమునందుండక తనసైన్యమునకుముందు నడచుచుండెను. ఛత్రధరుఁడును, వ్యజకుఁడును యువరాజున కుభయపార్శ్వములయందు నడచుచుండిరి. పిదప మధురాసింహుఁ డుచ్చైస్స్వరముతో "జయము! జయము! యువరాజు కుమారజగత్సింహునకు జయమగుఁగాక" అనియెను.

ముందునడచుచున్న యిరువదియైదుగురును పునరుక్తిగ నా వాక్యములనే యనుచు జయఘోషములను జేసిరి. వెనుకనున్న యిరువదియైదుగురు నదేరీతిగ మరల "జయము! జయము! యువరాజగు కుమారజగత్సింహునకు జయమగుఁగాక" యని జయజయధ్వానములను జేసిరి.

ఆస్వరము తరతరముగ లేచి యాకాశమార్గమునఁ జాలదూరము వ్యాప్తమయ్యెను. వారందఱును మెల్లమెల్లగ ముందునకు నడచుచుఁ గ్రమక్రమముగ నగరములోఁ బ్రవేశించిరి. నగరమునందలి రాజ వీధులన్నియుఁ దోరణములచేతనుఁ బతాకాదులచేతను, బత్రపుష్పాదులతోడను నలంకృతములై యొప్పారుచుండెను. రాజమార్గమున కిరు పార్శ్వములయందు నున్నసౌధములమీఁదను, వసారాలలోను, వాతాయనములయందును నన్నియెడల నౌత్సుక్యభావములతోఁ బురుషులును స్త్రీలును గుంపులుగుంపులుగఁ జేరి నిల్చుండియుండిరి. అట్టాలకములన్నియు రంజితవస్త్రములతోడను, బుష్పమాలికలతోడను, కేతనములతోడను, బరిశోభితములైయుండెను. ఆపూట కన్నములేని బీదవారి పతనోన్ముఖకుటీరములయందును యథోచితముగ శృంగారము చేయఁబడియెను. ప్రతిగృహముయొక్క ముంగిలివాకిలియందును వారి పూర్ణ కలశములుంపఁబడెను. కదళీవృక్షములు స్థాపితములైయుండెను.

యువరాజు మొదలగువారు నగరమునఁ బ్రవేశించినతోడనే యుచ్చైస్స్వరముతో "జయము! జయము! యువరాజు జగత్సింహునకు జయమగుఁగాక" యను జయధ్వానములు బయలువెడలెను.

ఐక్యకంఠ్యముగా వచ్చుచున్నయాశబ్దము పాట్నానగరమునం దంతటను వ్యాపించెను. రాజవీధిగుండ రాజపుత్త్రాదులు మెల్లగ నడచుచుండిరి పుణ్యాంగనలు గవాక్షములగుండ రాజపుత్రునిపై నక్షతలు, లాజలు, పుష్పములు, చల్లనారంభించిరి. వివిధములగుమంగళ వాద్యధ్వనులతో దిఙ్మండలము ప్రతిధ్వనించుచుండెను. జగత్సింహుఁ డవనతమస్తకముతో నందఱిశుభాశీర్వాదములను గ్రహించుచు నడచు చుండెను,

క్రమముగా వారందఱును మానసింహమహారాజు కొలువుకూ టముకడకు వచ్చిరి. ఆకొలువునందే కుమారునినేరములను విచారణచేసి మహారాజు కారాగారశిక్ష విధించియుండెను. కుమారజగత్సింహుఁడా దర్బారుగృహముకడ నశ్వావరోహణముచేసెను. తోడనే పండ్రెండు గురురాజపుత్త్రి మొగలాయిసైన్యాధిపతులు వచ్చియాతని కవనతమ స్త కములతోఁ బ్రణామముచేసి సమాదరభావముతో నాతనినిగూడఁ దీసి కొనివెళ్లి సభామండపమును బ్రవేశించిరి.

పదునాల్గవ ప్రకరణము.

ఏసభయందు సర్వజనసమక్షమున శృంఖలాబద్ధుఁడై కారాగారపు వస్త్రములనుధరించి జగత్సింహుఁడు దండితుఁడయ్యెనో, యాసభ యందు మరల విశేషసన్మానముతో రాజవేషమునుదాల్చి యాతఁడు ప్రవేశించెను. ఎత్తుగనున్న యాభద్రాసనమునందే మానసింహమహా రాజతిగంభీరభావముతోఁ గూర్చుండియుండెను. వెనుకటిపాటివదులు, సభాసములే యిప్పుడును; కొంచెము తగ్గియున్నపీఠములపైగూర్చుండి యుండిరి. సైనికులతోడను, రాజసేవకులతోడను, సాధారణజనసమూ హముతోడను, గొలువుకూటము పరిపూర్ణముగా నిండియుండెను. పూ ర్వమువలెనే సాధారణజనులు దర్బారునకువచ్చుట కెట్టియభ్యంతరము నులేదు. జగత్సింహుని శుభాగమనమును సందర్శింపవలయునని వీధివీధి యందును జేరినజనులందఱు తండోపతండములుగ దర్బారుమహాలునకు రానారంభించిరి.

సభామధ్యమున జగత్సింహుఁడు ప్రవేశించినమాత్రముననే యుచ్చైస్స్వరముతో "జయము ! జయము ! యువరాజుజగత్సింహునకు జయమగుఁగాక !" అని జయధ్వానములుచేసిరి.

జగత్సింహుఁడును వెంటనే "జయము ! జయము ! అక్బరుషాదుషహాకు జయమగుఁగాక ! జయము ! జయము ! మానసింహమహారాజునకు జయమగుగాక !" యనియెను.

జగత్సింహుఁడు ముందునకునడచి క్రమముగా మానసింహమహారాజుకూర్చుండియున్న భద్రాసనమును సమీపించెను భద్రాసన మెత్తుగనున్నయొకగద్దెపై స్థాపింపఁబడియుండెను జగత్సింహుఁడాసమీపమున నిలుచుండి తనయుష్ణీషమును శిరసునుండితీసి మహారాజుపాదముకడసర్పించి చేతులుజోడించి "మహాపరాధియగు తనయుఁడు కాతరభావముతో మహారాజుగారిని క్షమాభిక్షను వేడుకొనుచున్నవాఁడు" అనియెను

మహారాజు—(గంభీరస్వరముతో) వత్సా ! నీయపరాధములన్నియుఁ దొలఁగిపోయినవి. అక్బరుపాదుషహావారు స్వయముగామహానుగ్రహముతో నీయపరాధములనన్నిఁటిని క్షమించినారు. ఇంతేగాక కారాగారమునుండి నిన్నువిముక్తుఁజేసినారు.

సభవారందఱు నైకకంఠ్యముగా "జయము ! జయము ! అక్బరుఫాదుషహాకు జయమగుఁగాక !" యను జయఘోషములను జేయసాగిరి.

జగ—పాదుషహావారియనుగ్రహము నాకు శిరసావహింపఁదగినది. కాని, యెవరునాకీజగత్తునందుఁ బరమగురువులో, యెవరునాకిహపరములయందుఁ బ్రత్యక్షదేవతాస్వరూపులో, యట్టిపితృదేవతానుగ్రహమును బొందినఁగాని నా జీవితమంతయు వ్యర్థమైపోఁగలదు. తండ్రీ ! మీ మనోభావము నెఱుంగఁగోరి యధముఁడగు నీతనయుఁడు కాతరభావముతో నిటనిలుచుండియున్నాఁడు.

మాన—వత్సా ! నీయపరాధములనన్నిఁటిని సరళహృదయముతో నేనుక్షమించితిని. నీవు నాయుష్ణీషమునుదీసికొని శిరస్సునందు

ధరింపుము నీవు కర్తవ్యపరాయణుడవై కీర్తినిసంపాదింతువుగాక యని యిదే యాశీర్వదించుచున్నాను

సభాసదులమధ్యనుండి జయము! జయము! మానసింహ మహారాజునకు జయము గుగాక!" అను జయధ్వానములు వెలువడియెను.

జగత్సింహుడు తండ్రిపాదములకడనున్న యుష్ణీషమునుదీసి శిరస్సున ధరించుకొనియెను.

జగ—ఇప్పుడు నాజీవితము సార్థకమైనది. తండ్రిగారియసంతృప్తిభారమును దప్పెనిడుకొని జీవించుటకంటెఁ గొమరునకు మరణమే మంగళకరమైనది నేనింకవఱకును జీవించియున్నను మృతప్రాయుడనే దయామయుడవగునో తండ్రీ! నాయపరాధము లనేకములు. నాయపరాధములయం దేయపరాధములు క్షమింపఁబడినవి? మరియేయపరాధములచే నేనింకను నపరాధిగా నున్నాఁడను? అడుగనర్హతకలదేని దయచేసి సెలవిండు

మాన—ప్రియకుమారా! పారివారిక సంబంధమైనట్టియు, రాజనీతిసంబంధమయినట్టియు నీనేరములన్నియును బూర్ణముగా క్షమింపబడినవి నవాబునందినియగు నయేషా హృదయమునందుఁ బ్రేమానలమును ప్రజ్వలింపఁజేయుటకు నీవెట్టిప్రయత్నములును జేసి యుండ లేదనియు, అందుల కేవిధమగుసాహాయ్యమును నీవొనర్చియుండ లేదనియు నాకు స్పష్టముగాఁ దెలిసినది ఒకనాఁడవాబగు నస్మానుఖాను స్వయముగా వచ్చి యీవిషయములను నాకెఱింగించినాఁడు అందుచే నావిషయమునని న్నపరాధిగా దలంచుట యసంగతము.

జగ—(అవనతమస్తకుఁడై) నాయపరాధములింకను జాలగలవు.

మాన—వీరేంద్రసింహునితనయను నీవు పరిణయమాడుటచే నీవొకమహాపరాధమును జేసితివనియే నిశ్చయింపఁదగియున్నది. అయిన నొక్కటి యున్నది రూపమునందును విశేషించి గుణమునందును వీరేంద్రునితనయతో సరిపోలినవారెచ్చటనులేరు తిలోత్తమ నిజముగా రాజలక్ష్మీస్వరూపురాలు. అందుచే నామెను బరిణయమాడుటచేఁ జేసిన మహాపరాధమును క్షమార్హమైనది.

జగత్సింహునిహృదయ మానందముచే నృత్యముసేయ దొడంగెను.

మాన — రాజకార్యముపట్ల నీవు గావించినమహాపరాధములు భూమండలాధిపతియే స్వయముగా క్షమించినాఁడు దానినిగూర్చి యే యభిప్రాయమునైనను వెల్లడిచేయుటకుఁ బ్రయత్నింప బూనుట మహాపరాధమగును. నీవిప్పుడు షాదుషహావారియెడల సంపూర్ణముగా నిర్దోషివైతివి.

సభాసదులందఱు నైక్యకంఠ్యముగా "యువరాజునకు జయమగుగాక!" అని జయజయధ్వనులను జేసిరి

జగ — నావిషయమున నిప్పుడు మహారాజువారి యాజ్ఞయేమి? ఏకార్యమును జేసి మహారాజుగారి యనుగ్రహమునకుఁ బాత్రుఁడనుగావలయును?

మహారాజు పారిషదునకొకనికి సంజ్ఞచేసెను. ఆతఁడు లేచివచ్చి జగత్సింహునిచేతియం దొకయాజ్ఞాపత్రిక (సనదు)ను బెట్టెను.

మాన — యువరాజా! జగత్సింహా! చక్రవర్తిగారికృపచే నీవిప్పుడోరిస్సావంగవిహార దేశములకు రాష్ట్రపరిపాలకుఁడవైనాఁడవు నీకులభించిన యీమహాభాగ్యము సామాన్యమనుష్యునియదృష్టము నందుఘటియింపదు నేను నిన్నాశీర్వదించుచున్నాఁడను కర్తవ్యపరాయణతయందును, న్యాయనిష్ఠయందును సాహసమునందును సువిచారమునందును నసదృశుఁడవై చిరస్థాయియగుకీర్తిని నీవు సంపాదింతువుగాక!

సభాసదులందఱు నుచ్చస్వరముతో "జయము అక్బరుషాదుషహాకు జయమగుఁగాక! జయము మానసింహమహారాజునకు జయమగుగాక! జయము! కుమారజగత్సింహునకు జయమగుఁగాక!" అని జయఘోషములను జేసిరి.

సభయందున్న గొప్పసభాసదులును పారిషదులును దమతమ పీఠములనుండి లేచి సంభ్రమముతో జగత్సింహునకుఁ బ్రణామములు జేసిరి. వారిలోనొకఁడు ముందునకువచ్చి "మేము నవీనరాష్ట్రపరిపాలకునియధికారము నంగీకరించుచున్నాము. మేమాతనికి వశ్యులమై

యుందుము. అవిచలితచిత్తులమై మేమాతనియాజ్ఞలను శిరసావహించుట కంగీకరించెదము మేము మనఃపూర్వకముగ నాతని శుభమును సదా గోరుచుందుము. ప్రస్తుతమున నాతని కీయున్నతపదవిలభించినందులకై సర్వాంతఃకరణములచేతను మేమానందించుచున్నాము. మేము మనోవాక్కాయములచే నాతనికి సంపూర్ణసన్మానమును జూపుచుందుము. ఉత్సాహపూర్ణహృదయములతో మేమాతనికి సర్వదా జయజయధ్వానములు జేయుచుందుము." అనియెను.

జగత్సింహుం డాశ్చర్యాన్వితుండయ్యెను. అంధకారావృతమైన కారాగృహమునందు లోహశృంఖలనిబద్ధుండై యున్నయాయవస్థ యెక్కడ? ఒరిస్సా, బీహారు, వంగదేశములకు సుబేదారుపదప్రాప్తి యెక్కడ? దీనికిని, దానికిని గలయంతరము కల్పనాతీతమైనది. ఈయవస్థాద్వయమునకుఁ గలభేదము నాలోచించిచూచినచో శరీరము కంపమొందెను. ఈపరివర్తన మాకస్మికముగ నప్రార్థితమై యెన్నఁడు ననుకోననిదై వచ్చియుండుటచే దానిరహస్యమును దెలిసికొన నసమర్థుండై జగత్సింహుఁడు ముగ్ధుండై యుండెను.

మాన — కుమారజగత్సింహా! నీవిప్పుడే కార్యభారమును వహింపవలయును రేపటినుండియు నేనీకార్యమునుండి విడివడ వలయును.

జగ — అదేమి?

మాన — చక్రవర్తిగారియాజ్ఞ యట్లైనది. ఈయుత్తరవు చేరినతోడనే నన్ను పాట్నానగరమునువిడిచి రావలయునని యాజ్ఞాపించినారు. ఒకవిశేషకార్యార్థ మాలస్యముచేయకుండఁ బోయి యాగ్రాయందుండవలయును. అచ్చటనుండి ఢిల్లీకిని ఢిల్లీనుండి, అజ్మీరునకును వెళ్ళవలసియున్నది. అచ్చటనుండి మఱియేకార్యములకొఱ కెచ్చటకుఁ బోవలయునో యింకను స్థిరపడలేదు. నేనిచ్చటనుండని సమయమునందు నిన్నొరిస్సావంగవిహారదేశములకు సుబేదారుగా చక్రవర్తి నియమించినాఁడు. అదియంతయు భూమండలాధిపతి స్వయముగాఁ జేసినది. దానికి నేఁజేయవలసిన దేమియును లేదు.

అంతసేపటికి జగత్సింహుఁడు తనప్రకృతావస్థను గ్రహించెను. పిదప నేలపై మోకాళ్లూని "రాజాధిరాజుగారియాజ్ఞను శిరసావహించుట కీసేవకుఁడు చిరబాధ్యుఁడై యున్నాఁడు. మహారాజుగారి యాజ్ఞాపరిపాలన మీదాసునకుఁ బరమధర్మమై యున్నది. నాపైఁ జూపిన యీ మహానుగ్రహమునకుఁ జక్రవర్తిగారియెడలను మహారాజుగారి పాదపద్మములయెడలను సదాకృతజ్ఞుఁడనై మెలంగెదను" అనియెను.

పిదప మానసింహుఁడు సింహాసనమునుండి దిగి జగత్సింహుని కడకువచ్చి యాతనిహస్తమునుబట్టుకొని "వత్సా! రమ్ము వచ్చిసింహాసనముపైఁ గూర్చుండుము నీకు నేను జనకుఁడనైనను నీశాసనాధికారమునకు లోఁబడినప్రజలలో నేనొకఁడను. ఏముహూర్తమునఁ జక్రవర్తిగారియాజ్ఞాపత్రము నీచేతికందినచో యాముహూర్తము మొదలుకొని వంగవిహారములకును నొరిస్సాదేశమునకును నీవు సుబేదారుఁడవైనాఁడవు నిన్నుసుబేదారుసింహాసనముపైఁ గూర్చుండఁబెట్టుట నాకుఁ గర్తవ్యము" అనియెను.

జగత్సింహుఁడు తండ్రిపాదములకు వందనముఁజేసి యాతనిపాదధూళిని శిరస్సునందు ధరించెను. పిదప మానసింహుఁడు తనయుని హస్తమునుబట్టుకొని సభాసదులవంకఁ జూచి యుచ్చైస్స్వరముతో "నేను రాజాధిరాజుగారియాజ్ఞానుసారముగ సర్వజనసమక్షమున నీసభయందు యువరాజగు జగత్సింహుని నొరిస్సావంగవిహారరాష్ట్రపరిపాలక సింహాసనమునఁ గూర్చుండఁబెట్టుచున్నాను. ఈనవీనరాష్ట్రపరిపాలకుని యధికారకాలమున నీతనిపరిపాలనమునకు లోఁబడిన దేశములయందు శాంతి సదా విరాజిల్లుచుండుననియుఁ బ్రజలుసర్వవిధములచేతను నిరుపద్రవులై యుందురనియుఁ యుద్ధములయం దకారణముగ రక్తపాతము లేకుండనుండుననియు నమ్ముచున్నాఁడను" అనియెను.

క్రొత్తసుబేదారు — నా సర్వప్రయత్నములచేతను బాదుషహా వారి యభీష్టమును నెరవేర్చుచుందును. పరిపాలనావిషయమున నా తండ్రిగారవలంబించిన పద్ధతులనే యనుసరించుట కించుకంతయు శక్తివంచనము లేకుండఁ బ్రయత్నించెదను. సర్వవిధములచేతను నాయధికారముక్రిందనున్నప్రజల కనురంజనమగులాగునఁ బరిపాలించెదను.

మాన—జయము! జయము! క్రొత్తసుబేదారునకు జయమగుఁగాక!

దాని ననుసరించి సభాసదులందఱును "జయము! జయము! క్రొత్తసుబేదారునకు జయమగుగాక!" అని జయఘోషలను జేసిరి. మిగిలినసైనికులును జూడవచ్చినవారందఱును సమస్వరముతో నదేరీతిగ జయధ్వానములను సల్పిరి. పిదప సభముగిసెను.

పదునైదవ ప్రకరణము.

ఒరిస్సా వంగవిహారదేశముల సుబేదారగు కుమారజగత్సింహుఁడు తండ్రితోఁగూడ సభనుండి వెడలిపోయెను. తండ్రికొడుకు లిరువురు నొకేయంతఃపురమున కేగిరి. అచ్చట మహారాజు కుమారునితో "నీవేగి మీతల్లులను జూచిరమ్ము" అనిచెప్పి యాతఁడింకొకతావునకుఁ బోయెను.

యువరాజు మొట్టమొదట నూర్మిళాదేవిసదనమున కేగెను అచ్చట నాతనిసవతితల్లులు ముగ్గురుండిరి. భక్తిభావముతో నాతఁడు వారందఱిచరణముల కెఱఁగెను. వారు జగత్సింహునకు శుభాశీర్వాదములను జేసి పిదప జరగిపోయినక్లేశవృత్తాంతమునెత్తి తమ తమహృదయములయందలిదుఃఖమును దెలియఁజేసిరి.

ఊ—బిడ్డా! ఆఁకలిఁగొనియున్నావుకాఁబోలును. విశ్రాంతి యావశ్యకమని తోఁచుచున్నది. నీతోడ మాటలాడవలసిన సుఖదుఃఖసమాచారము లనేకములున్నవి. కాలాంతరమునందు వానిని గూర్చి మాటాడుకొనవచ్చును. నీవిప్పుడు నాతోఁగూడరమ్ము.

జగత్సింహుఁడు మాటాడకుండ నూర్మిళాదేవితోఁగూడ నేగెను. కొంచెముదూర మేగినపిదప నచ్చటనున్న యొకగదిగుమ్మమునకడ నిలుచుండి యూర్మిళ "నీవీగదియందు విశ్రమింపుము. నేనువెళ్ళి నీభోజనమునివయమున నన్నియు సిద్ధముచేసెదను" అనియెను.

జగత్సింహుఁడాగదిలోఁ బ్రవేశించెను తోడనే పార్శ్వము నుండి సాశ్రునయనయైనసుందరి యొక్కర్తు శీఘ్రముగవచ్చి యాతని వక్షమునఁబడియెను. ఆసుందరి తిలోత్తమ.

యువరాజు నిశ్చేష్టుఁడై యేమియు మాటలాడలేకపోయెను. ఇదేమిస్వప్నమా ? లేక నిజముగా జరుగుచున్నదియా? ప్రేతావిష్టుఁడైన మనుష్యునివలె నిప్పుడాతనికన్నియు భ్రాంతిమయముగా కన్పట్టుచుండెను. ఆకస్మికముగఁ దనకున్మాదరోగము జనించి బుద్ధి భ్రంశమయినదని భయపడియెను. కాని, నిజముగా నశ్రుపూర్ణ నయనయైన యాసుందరి తనప్రాణమునకుఁ బ్రాణమైన తిలోత్తమయే గాని మఱియెవరునుగారు. నిజముగా నాతనిహృదయ వినోదినియే యాతనివక్షస్థలమున నశ్రువులఁ గురియించుచుండెను. మానవున కాకస్మికముగ నీరీతిగ నదృష్టమునఁ బరివర్తనము సంభవించునా ? విశేషయాతనమువలనఁ గలిగినదుశ్చింతలచేఁ గొట్టఁబడినపిమ్మట నాకస్మికముగ నిట్లు పూర్వసుఖసంపద లొక్కమారుగఁ జేరుట యెచ్చటనైన సంభవించునా ? అదియెచ్చట ననుసంభవముకాకపోయినను, నీసందర్భమున నట్లేసంఘటితమైనది అందులకు సందేహములేదు.

తిలోత్తమకు నయనములయందునీరు—అధరమునందు నగవు అత్యద్భుతసమావేశము ! జగత్సింహుఁడా ప్రేమపుత్తలిని గాఢాలింగనము జేసికొని యాశ్చర్యముతో "తిలోత్తమా? నీవిచ్చట కెట్లువచ్చితివి" అని యడిగెను.

తిలోత్తమ నవ్వుచునవ్వుచు "నన్ను తిలోత్తమయని సంబోధించి మీరు తిలోత్తమకుఁ జాల నన్యాయముచేసిన వారగుచున్నారు. భువనవిఖ్యాతుఁడగు నంబరేశ్వరుని కోడలును, నొరిస్సావంగవిహార దేశములకొత్తసుబేదారునకు ధర్మపత్నియు నైననన్ను పేరుపెట్టిపిలుచుట కెవరికిధైర్యమున్నది ?" అనియెను.

జగ—సరిగా మాటలాడని యపరాధమునకై తరువాత నీవు విధించెడిశిక్షను గ్రహించెదను. కాని, దయచేసి నీవిప్పుడిక్కడ కెట్లు వచ్చితివో చెప్పుము?

తిలోత్తమ మరలఁ జెఱునగవుతోఁగూడిన మొగముతో "మా మగారిగృహమునకు, భర్త్రాశ్రయమునకు నెట్లువచ్చితివని మీరడుగుచుండులు? అట్లుమగవచ్చునా? నాయంతట నేనేవచ్చి నాస్థానాధికారమును గైకొంటిని" అనియెను.

జగత్సింహుఁ డాసుందరివదనమును చుంబనమాడి "నిజముగాఁ జెప్పుము అదియంతయు నెట్లుజరిగినది?" అనియెను.

తిలోత్తమ నవ్వుచు జగత్సింహుని సమీపముననున్న సింహాసనముపైఁగూర్చుండఁబెట్టి "మీరు చాలశ్రమపడియున్నారు భోజనాదికమైనపిదప సమస్తమును జెప్పెదను" అనియెను.

జగ—ఇప్పుడు సంభవించిన యపూర్వఘటనా విశేషములన్నిటివలనను నాబుద్ధి భ్రమసిపోయినది. దీనిని స్పష్టముగాఁ దెలిసికొనినఁగాని నాబుద్ధి స్థిరముగానుండదు.

తిలోత్తమ వీవనగైకొని యువరాజునకు వీవఁదొడంగెను. యువరాజామె చేతివీవనను దీసికొని "అంబరేశ్వరునికోడలికనేకపరిచారికలుకలరు. వారువచ్చి విసరెదరు. దయచేసి మొదట నాసంభ్రమమును నివారణచేసి నామనస్సును స్థిరముచేయుము" అనియెను.

జగత్సింహుడత్యాదరముతోఁ దిలోత్తమను దగ్గరదీసికొని తొడపైఁ గూర్చుండఁబెట్టుకొనియెను రాకొమరుని బందీగాఁజేయుటకు బూర్వపుదినమున సాయంకాలమైనపిదప మందారణదుర్గమందలి సౌధముపైఁ దిలోత్తమ యేభావముతో జగత్సింహునివక్షస్థలమునఁ దనమస్తకమునంచుకొనియెనో చాలకాలమునకుఁ దరువాత నిప్పుడుమరల నదేరీతిగ, నదేసుఖోపధానముపైఁ దిలోత్తమ మస్తకము నిడికొనియెను. కాని, యప్పటికి నిప్పటికి నెంతభేదమున్నది! అప్పుడెంతభయానకమైన యాశంకఎంతభయవిశిష్టమైన విషాదము! ఇప్పుడో; అసదృశమైన యెంత యానందము! ఎంతటిసుఖము!

ఆరీతిగఁగూర్చుండి తిలోత్తమ యావదుదంతమును గ్రమక్రమముగ నాతనికెఱింగించెను. మానసింహమహారాజు యాత్రార్థము శ్రీక్షేత్రమునకు విచ్చేయుటయు, తానుతనసవతితల్లియగు విమలతోఁగూడ

వచ్చుటి కూర్మిళామహారాజ్ఞికడకు వచ్చుట, కరుణామయియగు నామహారాజ్ఞి సాహాయ్యమునుబడయుట, యామెయనుగ్రహముచే మహారాజునకుఁ బరిచయమగుట, తానుచేసినసేవకు మహారాజు మెచ్చుకొనుట, మహారాజ్ఞియొక్క కౌశలముచే మహారాజుక్షమించి తన్నుఁ గోడలనుగా గ్రహించుట, మొదలగుసంగతులనన్నిఁటిని దిలోత్తమఁ మెల్లగ సంక్షిప్తముచేసి మధురములైన మాటలతో జగత్సింహునకుఁ దెలియఁజెప్పెను.

జగ—(సంగతుల నన్నిఁటిని వినినపిదప) నాకిప్పుడు తెలిసినది. తిలోత్తమా! నీబుద్ధికౌశలముచేతనే నాకీభాగ్యము లభించినది? నీప్రేమయందు ముగ్ధుఁడై నీదాసత్వమునంగీకరించిన మహారాజు తనమనోభిప్రాయమును నీకేమని తెలియఁజెప్పినాఁడు? ఏమిచెప్పియాతనికృతజ్ఞతను నీకడవెల్లడిచేసినాఁడు? నన్నుఁ జెఱనుండివిడిపించుటకుఁగూడ నీకౌశలమే కారణమైనదని తోఁచుచున్నది

తి—మీరు ప్రేమాంధులు. అందుచేఁ బ్రకృతవ్యాపారములను దెలియఁజాలరు. నేను ప్రయత్నముచేసి నాస్థానాధికారము బొందితిని అజ్ఞాతమగుహీనభావమునందు నా జీవితమును వ్యర్థమవకుండ న్యాయసంగతమైన నాస్థానమును నేనుపొందితిని నావలననైనదింతియే. అందువలన నాకు విశేషగౌరవమేమియులేదు. మిమ్ములను విడిపించువిషయమున నేనేప్రయత్నములను జేసియుండలేదు ఆవిషయమునఁ బ్రయత్నముచేయుటకు నాకు సాధ్యమగునా? నవాబునందినియగునయేషా, శక్తియందును, బుద్ధియందును, కౌశలమునందును, నద్వితీయ ఆమె స్వయముగానాగ్రాకువెళ్లి మిమ్ములనువిడిపించినది. మీకులభించినయున్నతపదవికూడ నామెప్రయత్నఫలమేయని తోఁచుచున్నది. మీరు వినియున్నారో లేదో, నాకుఁ దెలియదు. నాకుసంవత్సరమునకు లక్షస్వర్ణముద్రికలయాదాయమువచ్చుజాగీరు నిచ్చితిమని చక్రవర్తియాజ్ఞనంపినాఁడు. దానిని నిజముగా నవాబునందినియే చేసినది. కల్పనాతీతములైన మనయీసుఖోదయముల కన్నిఁటికి నామెయనుగ్రహమే కారణము. ఈయుపకారమునకు మనము కృతజ్ఞతఁజూపఁదలంచితిమేని సరఁ

శక్తిమయియగు నాయమయేషాకు మనము యావజ్జీవమును దాసులమై యుండవలయును.

జగ — అందులకు లేశమును సందేహము లేదు. ఆ దేవిఋణము నించుకయైన నెట్లు తీర్పఁగలమో నాకుఁ దెలియుట లేదు.

తిలో — (సాదరముగ జగత్సింహుని కంఠాలింగనమును జేసికొని) ఆయుపాయమును నేనెఱుంగుదును మీరీదాసిమాటల నాదరింతురా ?

జగ — అట్లనెదవేమి? తిలోత్తమా ! నీమాట కన్యథా యెన్నఁడైన జరుగునా? న్యాయసంగతమైన నీవాక్యమును విని యసాధ్యమైన దానిని జేయవలసిపచ్చినను నేనట్లు చేయుటకు వెనుకంజ వేయను.

తిలోత్తమ జగత్సింహుని రెండుచేతులను బట్టుకొని "మీరయేషాను పత్నీభావముతో గ్రహింపవలయును" అని బ్రతిమాలుకొనియెను.

జగ — ప్రాణేశ్వరీ! నీయీప్రస్తావమును విని నీసరళస్వభావమును నుదారతను, సహృదయతను మిక్కిలి కొనియాడుచున్నాఁడను. కాని యొక్కవిచారము మాత్రమున్నది. నీబుద్ధినిగూర్చి ప్రశంస సేయఁజాలను. కేవలము కృతజ్ఞతను వ్యక్తముచేయుటకు పొందిన యుపకారమునకుఁ బ్రత్యుపకారముసేయుటకు, ఋణవిముక్తి చేసికొనవలయునను నాశతో నేస్త్రీమణియొక స్త్రీని సపత్నిగా గ్రహించుటకిష్టపడియెనో, యట్టియబల హృదయము చాలఁ బవిత్రమైనదనుట కించుకంతయును సంశయము లేదు. నేను నీహృదయమహత్వమును మోదించి యానందముతోఁ బదింబదిగ నిన్నుఁ గొనియాడుచున్నాను

తి — కొనియాడినచోఁ గొనియాడవచ్చును. లేదా మాన వచ్చును. కాని, నన్ను నిందించు టెందులకు?

జగ — నిందించుట లేదు. అయేషాను పత్నీభావముతో గ్రహింపుమని నీవుచేసినప్రస్తావమునకై నీబుద్ధిని ప్రశంసింపఁజాలకున్నాను.

తి — అదేమి ? మహారాజునకును మహారాజ్ఞికినిగూడ నిదే యాశ! వారిరువురును బదింబదిగ నీవిషయమునుగూర్చి యయేషాతోఁ బ్రస్తావించియున్నారు. ఆమె యంగీకరింప లేదు. కాని, మీమనో

భిప్రాయమును దెల్పినచో నామెహృదయమును ద్రిప్పవచ్చునని నా నమ్మకము.

జగ:—మీనమ్మకము మిగులఁ దప్పైనదియే. అయేషాహృదయసముద్రమందలి యొకతరంగమునైనను మీరెవరును జూచియుండలేదు. మహారాజును, మహారాజ్ఞియును, వివాహము చేసికొనినచో భార్యకాఁగలదనియు, ప్రేమించినచో నదియే ప్రణయమనియుఁ దలఁచుచున్నారు. కాని, ప్రేమతత్త్వమును బూర్ణముగ నెఱింగిన యయేషా యట్లనుకొనుటలేదు. ఆమెయభిప్రాయము వేఱు హృదయవినిమయములేకుండ వేయిమందిపురోహితులుచేరి మన యిప్పటిపురోహితులవలె నసందర్భముగాఁ గర్ణకఠోరములైన తప్పుమంత్రముల నేకరువుపెట్టక సుస్వరముతోఁ గ్రమమెఱిఁగి సరియైనమంత్రముల నన్నిఁటిని జెప్పి పరిణయముచేసినను నది పరిణయముకాదనియు, నేప్రణయము తనంతట నదియుదయించి మనసునవృద్ధిఁజెంది ప్రాణమును దేల్పఁజాలదో, యట్టిప్రణయము ప్రణయముకాఁజాలదనియు, నామెయభిప్రాయము. అయేషాకు వివాహముకాదు. నాయీక్షేత్రమునందు హృదయవినిమయముగలుగునను ధైర్యములేదు. అయేషా తనహృదయమున నాకొఱకగాధప్రణయమును బోషించుచున్నదని నేనెఱుంగుదును. కాని నా హృదయతంత్రి యాప్రణయస్వరము నాలాపించు టెఱుంగదు. నేనయేషాను మిక్కిలిగఁ ప్రేమించుచున్నానను మాట నిశ్చయము. కాని యాప్రేమ యయేషాప్రేమ కనురూపమైయుండలేదు. అందుచే నేనామెను బత్నీభావముతో గ్రహింపఁజాలను. ఆమెయు నాకుఁ బత్నియగుట కంగీకరింపదు.

తిలో—మీరు మీహృదయము నయేషా కెందులకీయఁజాలరు? ఆమెవలెనే మీరు నామె నేలప్రేమింపఁజాలరు?

జగ—ఇది మిగులమంచిప్రశ్న; పిల్లలడిగినట్లే యడిగితివి? ఇంకను గొన్నిప్రశ్నలను నీవడుగవచ్చును. పగలు రాత్రియగుటలేదేమి? రాత్రిపగలగుటలేదేమి? నీటియందగ్ని యేలయుండదు? అగ్నియందు నీరేలయుండదు? ఇట్టిప్రశ్నలనేక మడుగవచ్చును. కోమలీ! ఏది

యెట్లు కావలయునో యట్లుజరగును. ఎందుకొఱ కేదిసృష్టింపబడినదో యదియా కార్యములను జేయుచుండును.

తిలో—అట్లయ్యును, ప్రయత్నములవలనను ప్రయాసమువలనను ప్రబలమైనయనురాగమువలనను ననేకవిషయములలో ననేకపరివర్తనములు జరుగుచుండవచ్చును. మీరు ప్రయత్నించినచో మీహృదయము నవశ్యముగఁ ద్రిప్పవచ్చును. నిజముగా మీహృదయతంత్రి యామెహృదయరాగము నాలాపనచేయఁగలదు.

జగ—హృదయమనునది యిష్టమువచ్చినప్పు డిష్టమువచ్చిన వారికొసంగుట కవకాశములేనిది. నీయేకమాంత్రాధికారమునకు లోఁబడియున్న యీహృదయమునందు మఱియెవరికిని స్థలము దొరకదు. ఒకయాకాశమున వేలకొలఁది నక్షత్రములుండవచ్చును. కాని యిరువురు సూర్యులకుఁగాని, యిరువురుచంద్రులకుఁగాని యట స్థలముండదు. నీప్రణయరాగము నాలాపించుట నాహృదయతంత్రికిఁ దెలియును. అది మఱియేరాగము నెఱుఁగదు. అయేషా, యాకాశమున నొకప్రక్క మిణుకుమిణుకుమనుచుండెడి యొకసామాన్యనక్షత్రము వంటిదికాదు. అయేషాప్రణయవిశిష్టమగురాగము నాలాపించుటకు నాహృదయతంత్రి కాస్వరములేదు.

తిలోత్తమచాలసే పధోముఖియై చింతించెను రాజపుత్రుని వాక్యములయందలి మర్మమును దెలిసికొనలేక నిట్టూర్పువిడిచి "అట్లయినచో శోభామయమైన యాపుష్పము దానియంతట నదియే ముకుళించిపోవలసినదేనా? అనర్ఘమగుచోటనుంచిన ప్రణయ సంబంధమగు తీవ్రజ్వాల ననుభవించుచు నసదృశమైనయాజ్యోతి తనంతటతానుహరించిపోవలసినదేనా ?" అనియెను.

జగ—విధాతృని నియమమేమో నేనెఱుఁగను. కాని నీవుచెప్పినదే యయేషానుదుట వ్రాసినట్లుతోఁచుచున్నది. నేనామె నతిశయముగఁ బ్రేమించుచున్నాఁడను. ఆమెగుణములయం దత్యంతము ముగ్ధుడనై యున్నాఁడను. ఆమెరూప మసదృశమైనదని నేనెఱుంగుదును. నేనామెకు విశేషముగ ఋణపడియున్నాఁడను. ఆమె నిమిత్తము ప్రాణములనర్పించుమన్న నందులకు సిద్ధముగా నున్నాఁడను. కాని దేవిని

పొందినచో నామెకు సుఖముగలుగునో, దానినామె కొసంగుటకు నాకు సాధ్యములేదు. ఏమంటివా ? అది నాదికాదు. ఏప్రణయముచే నరకము స్వర్గమైపోవునో, యేప్రణయముచేఁ బ్రపంచమందలి సర్వదుఃఖములును దూరములైపోవునో, యేప్రణయముచే మానవుఁ డమరత్వమును బొందునో, యాప్రణయము నిప్పుడు నాయంకపీఠిని గూర్చుండియున్న దేవికి నిశ్శేషముగా నర్పించివైచితిని. అయేషాయిప్పు డాప్రణయమును బ్రార్థించుచున్నది. ఆప్రణయము నీదేవీచరణసమీపమున నీవలనకే యర్పితముఁజేసివైచితిని. అందుచే నాదేవికొసంగుటకు నాదైనపదార్థ మేమియు నాకడలేదు.

తిలోత్తమ మాటాడకుండ మౌనమై యుండెను మిక్కిలి ప్రగాఢమైన ప్రేమవిషయము! అయేషాపూర్ణహృదయము పూర్ణప్రేమమునఁదక్క మఱి దేనివలనను బరితృప్తి నందనేరదు. అల్ప మతులగు స్త్రీలవలె మానసింహ మహారాజుగారి యసంఖ్యాక మహిషులవలె ప్రణయాస్పదుఁడగు వానిని భర్తయనిచెప్పుకొనుపాటి యధికారమును బొందినచో నయేషాహృదయమునకు సంతుష్టిలేదు అందుచే నామె దుఃఖము నివారణముగుట కుపాయమే లేదు

జగ—కృతజ్ఞతనుగూర్చి చెప్పియుంటివికావా ? అయేషాయెడలఁ గృతజ్ఞతావిషయమునుగూర్చి యోచించినఁ బ్రయోజనము లేదు. ఎవరిహృదయమునందు నన్నుఁగూర్చిన యగాధప్రేమముకలదో, యట్టి యయేషా కృతజ్ఞతాప్రత్యాశచేఁగాని ప్రేమోద్దీపనము చేయవలెనను నాశచేఁగాని నాకట్టియుపకారమును జేసినదా ? అట్లయినచో నొకప్పుడైన నామె నన్నుఁ జూచుట కిష్టపడియుండును. ఒకప్పుడైనను బ్రస్తావవశమునఁ దన ప్రణయ వృత్తాంతమునుగూర్చి నాకుఁదెలిపియుండును. ఆదేవిహృదయ మగాధమైనమహాసముద్రమువంటిది. ఆసముద్ర తరంగమాలలో నొకతరంగమునైనను నీవు చూచియుండలేదని నేను మొదటనే చెప్పియుంటిని.

పార్శ్వమునందలి ద్వారముకడ నిలుచుండి యూర్మిళాదేవి "కుమారా !" అని కేకవైచెను.

తిలోత్తమ వేఱుమార్గముగుండ శీఘ్రముగ నవ్వలకుఁ బరువెత్తి కొనిపోయెను జగత్సింహుఁడు "అమ్మా! లోపలకు దయచేయుము" అనియెను.

యువరాజు పీఠము నుండి లేచి నిలుచుండెను. తోడనే యూర్మిళా దేవి వివిధఖాద్యవస్తుపరిపూర్ణమైన సువర్ణపళ్లెరమును దీసికొని లోపలకువచ్చెను.

పదునాఱవ ప్రకరణము.

మానసింహమహారాజు భార్యలతోడను, నితరానుచరులతోడను నాగ్రాపట్టణమునకుఁ బయనమైపోయెను. జగత్సింహుఁ డతి సమర్థతతో వంగవిహారాది దేశములను బరిపాలనము సేయుచుండెను. వెడలిపోవునప్పుడు మానసింహుఁడు కుమారునకు రాజకార్యసంబంధములగు ననేక సదుపదేశములను జేసి మనఃపూర్వకాశీర్వాదముల నాతనిశిరముపై వర్షించెను.

మహారాజ్ఞియగు నూర్మిళాదేవి ప్రయాణసమయమున రాజలక్ష్మీస్వరూపయగు తిలోత్తమను దనతోఁగూడ దీసికొనివెళ్ళవలయునని యెంతయో యాశపడియెను. మానసింహుఁడ గూడఁ దిలోత్తమ లేకపోయినచోఁ దనకుఁ గష్టముగనుండునని తన యభిప్రాయమును వ్యక్తము చేసెను. కాని, మహారాజును, మహారాజ్ఞియుఁగూడ యువరాజొక్కఁడేయున్నచో ననేకవిధములగు కష్టముల కతఁడు పాల్పడునని యుఁ దిలోత్తమ నాసమయమున స్థానాంతరమునందుంచుట యుచితముగాదనియుఁ దలంచి యామె నచ్చటనే యుంచిరి. మహారాజును మహారాజ్ఞియు వెడలిపోవునాఁటికథను వివరముగా మేమిచ్చట చెప్పుట లేదు సంక్షేపముగా నింతమాత్రము చెప్పినచో మనకథకుఁ జాలునని మా యభిప్రాయము. బాష్పాకులనేత్రయైన తిలోత్తమ ప్రణామము నుజేసిన పిదప నాశీర్వాదము సేయునప్పుడు కఠిన హృదయుఁడగు మహారాజు కపోలములయం దశ్రువులు ప్రవహించుచుండెను. మహారాజ్ఞియగు నూర్మిళయ కోడలను గాఢాలింగనముచేసికొని కన్నుల

నీరు పెట్టుకొనుటనుజూచి కూడనున్నవారనేకులు మిగులవ్యాకులచిత్తులైరి. జగత్సింహుఁడొక్కఁడే పాట్నాయందున్నచో నాతనికి కష్టముగ నుండునని యోచించి మానసింహమహారాజు తన రెండవతనయుఁడగు మహాసింహుని జగత్సింహునకుఁ దోసటగఁ బాట్నాయందుంచిపోయెను. మహాసింహుఁ డతిసమర్థుఁడగు సేనాపతియు, సాహసియు, రణకుశలుఁడును పేరొందిన ఘాదుమహావారిసేవకుఁడునై యుండెను. మహాసింహుఁడువయసునందు జగత్సింహునికంటె రెండుసంవత్సరములు చిన్నవాఁడు

జగత్సింహుని యాత్మీయులందఱును బాట్నానుండి వెడలిపోయిరి కాని, తిలోత్తమ యాత్మీయులలోఁ జాలమంది పాట్నానగరమునకు వచ్చియుండిరి దీర్ఘకాలవ్యాప్తియైనదుర్దశ జరిగిపోయినపిదప యువరాజునుజూడవలయునని విమలయాతురతపడుచుండెను కాని, యా సమయమునఁ బాట్నానగరము నువీడి మందారణదుర్గమునకు వచ్చుట జగత్సింహున కుచితముగాదనితలంచి తనయను, నలునిఁ జూచుకొఱకు విమలయే పాట్నానగరమునకు వచ్చెను. ఆమెతోఁగూడ నాపాత్రసీయునువచ్చెను. ఆపాత్రని ప్రియాణమగుచుండుటనుజూచి తిక్రణి యుఁదనమాటనుగట్టెను వారినందఱఁదీసికొని యభిరామస్వామి పాట్నానగరమునకు విచ్చేసెను. గజపతివిద్యాదిగ్గజుఁడును పాట్నానగరమును జూడవలయుననునాశను విడువలేకపోయెను. వీరేకాకుండ దాసదాసీజనులును, నితరజనులును, నారితోఁగూడవచ్చిరి

విమల యల్లునియింటియందుండదు. అందుచే గంగాతీరమునందొక పెద్దసౌధము నామెకు నివాసమేర్పఱుపఁబడియెను. ఆమెతోఁ గూడ వచ్చినపురుషులందఱు వేఱుగృహమున నివసించియుండిరి. జగత్సింహుని యనుమతిఁబడసి తిలోత్తమ సవతితల్లికడకు వచ్చియుండెను చెవిని బట్టుకొనినచో శిరసుగూడవచ్చునుగదా! కుమార జగత్సింహుఁడుగూడఁ దనప్రాసాదమునువీడివచ్చి గంగాతీరమునందలి యా సౌధమునందే కాలముగడపుచుండెను. అంతయుఁ బరమానందముగ నుండెను. చూచుచుండగనే రెండునెలలు గడచిపోయినవి.

ఒకనాఁటియుదయమున నాసౌధమునందొకగదియం దభిరామస్వామియును విమలయుఁ గూర్చుండి మాటలాడుచుండిరి.

విమల—కావలసినదంతయు నైనది. అసహనీయమైన మహా జ్వాల నింతవఱకును మాటలాడకుండ సహించితిని. ముందును నిట్లే సహించుచుండుటవలనఁ బ్రయోజనమున్నట్లు కాన్పింపదు. తిలోత్తమ యిప్పుడు సర్వసుఖములకు నధికారిణియైనది మానసింహమహారాజామెను దనయునకు దాసిగానైన నొప్పుకొనుననుమాటయు గూడ నక్కఱలేకుండ మనయదృష్టముచే నామెను మహాదరముతోఁ గోడలనుగా గ్రహించినాఁడు. ఆమెభర్త పదవియందును ధనమునందును గౌరవమునందును నగ్రస్థానము వహించినాఁడు.

అభి—నీయవివేకముచేతనే మనకిన్ని దుర్దశలును దుర్ఘటనలును సంభవమైనవని నిన్నొకప్పుడు తిరస్కరించియున్నాఁడను. ఇప్పుడైనచో, నీబుద్ధిని, సద్వివేచనను గూర్చి శ్లాఘింపవలసియున్నది. మహారాజ్ఞియగు నూర్మిళా దేవి చిరకాలమునుండి నీపైఁ జాలదయ గలిగియున్నది. ఆమె యాశ్రయమునఁ జాలకాలము నీవు సుఖమనుభవించితివి. ఆమెయనుగ్రహమువలననే నీభర్త మానసింహునిరోషాగ్నినుండి రక్షింపఁబడినాఁడు ఆమెయనుగ్రహమువలననే నీవు వరించినపురుషుని నీవుపతిగాఁ బడయఁగలిగితివి. ఆమహారాజ్ఞి పురుషోత్తమనగరమునకు వచ్చినదని తెలిసికొనిపోయి తిలోత్తమనామెకు శరణాగతగాఁ జేసినావు. అందుమూలముననే నీయుక్తాయుక్తవివేచనాజ్ఞానము వ్యక్తమగుచున్నది. ఆ మహారాజ్ఞి బుద్ధికౌశలమువలననే తిలోత్తమకిప్పుడు సంభవాతీతమగు మహాభాగ్యము లభించినది.

విమల—ఆమహారాజ్ఞి పాదపద్మములకు నేను నిత్యమును వందనములను జేయుచుందును. భగవంతుఁడామెకు సదా సర్వసుఖములు నొసంగి రక్షించుచుండుఁగాక ! ఆమహారాజ్ఞియనుగ్రహముచే నిప్పుడు నాసకలాభీప్సితములును నెరవేరినవి. తండ్రీ ! ఇఁకముందు నేనీ ప్రపంచమునందుండు టెందులకు?

అభి—ఏమిచేయవలయునని యాలోచించుచున్నావు ?

విమల—ఎవనికి జీవితము నర్పించితినో యాతఁడీప్రపంచమున లేఁడు. నేనీప్రాణము నిఁకనిలుపు టెందులకు?

అభి—ప్రాణపరిత్యాగమువలన విశేషపాపము కలుగును. అందువలన నభీష్టసిద్ధి యిసుమంతయుఁ గానేరదు. వత్సా! నాయుపదేశమును వినుము. నీవు జీవన్మృతవుగమ్ము. దానివలన సకలశుభములును గలుగును. జీవితమానందమయమగును. సమస్తాశలను ద్రోసివేసి పూర్ణానందమున కధికారిణివగుట కభ్యాసమును జేయుము. ఇదియే నాయుపదేశము.

విమల—మీయుపదేశము శిరసావహింపఁదగినది. కాని యీ విషమహృదయజ్వాలానివృత్తికి మఱియేమియు నుపాయములేదా?

అభి—ఉన్నది. సుఖదుఃఖములను సమముగాఁజూచు జ్ఞానమును సంపాదించితివేని యాతనలన్నియు నశించిపోవును.

విమల—ఆజ్ఞానములభించుటెట్లు? సుఖదుఃఖములు రెండును సమానమని దెలిసికొనఁగలిగినచోఁ గష్టములు నశించిపోవుననుమాట నిజము. కాని, యాజ్ఞానమును బడయుటకుపాయమేమున్నది?

అభి—బిడ్డా! జ్ఞానసంపాదనమున కుపదేశమును సాధనము నావశ్యకములు. ఏకారణములచే నేనిచ్చట బద్ధుడనైయుంటినో యవి యన్నియు ముగిసిపోయినవి. ఇక నీకు సాధనవిధానముల నుపదేశించి వెడలిపోయెదను మనము మరల బాట్నానగరమునకు రావలసిన యావశ్యకములేదు. నీవొకనెలదినములు కుమారిరయొద్దను, నల్లుని యొద్దనుండి యానందమున ననుభవింపుము. దీర్ఘమగు నీలౌకికానందము నందు సుఖములేదని నీవు తెలిసికొనియుండవచ్చునని తోఁచుచున్నది. వ్యర్థమై, నిర్మలానందరహితమైన యీయానందమువలనఁ బ్రయోజన మేమి? బిడ్డా! అక్షయమై యనంతమైన యానందమునుబడయుటకు నీకు మార్గమునుజూపఁ బ్రయత్నించుచున్నాడను. ఇప్పుడే యీస్థలమును విడిచిపోవుట కుచితములగు నేర్పాటులను జేయరాదా?

విమల—ఆజ్ఞాప్రకారమట్లే. మొదట తిలోత్తమతోడను బిదప రాజపుత్రునితోడను నీవిషయమునుగూర్చి ప్రస్తావించెదను. రాజపుత్రుఁ డిప్పుడే యింటనుండి వెడలిపోయినాడు. సాయంకాలమువఱకును నాతని జూచుట కవకాశముండదు. ఈలోపుగఁ దిలోత్తమతో నీవిషయమును గూర్చి ప్రస్తావించి నిర్ధారణచేసెదను.

విమలయు నభిరామస్వామియుఁ గూర్చుండి మాటలాడుచున్న గదిసమీపమున నతికౌతుకావహమగు కార్యమొకటి జరుగుచుండెను. గజపతి విద్యాదిగ్గజుఁడు గృహపార్శ్వమందలి యొక వృక్షచ్ఛాయను లక్ష్మణిపాదములనుబట్టుకొని యేడ్చుచుండెను ఆతఁడట్లు యేడ్చుచుండెనో తెలుపవలయుననిన నంతకుఁబూర్వవృత్తాంతము నించుక మీకు ముందుగఁ దెలుపవలసియుండును.

గజపతి విద్యాదిగ్గజుఁడు చాలమర్మపీడితుఁడై యుండెను. ఎవతె పేరునందు మొదటియక్షరము "ఆ" యును నంత్యాక్షరము "ని"యు నుండెనో యామె తనప్రియురాలని తెలిసికొనియుండెను. అదియొక్క దైవజ్ఞునివచనము ఇంతేకాదు. ఆతనిలలాటలిపికూడ నట్లేయున్నది. అందుచే నామాట యసత్యముకానేరదు. ఒకప్పుడభిరామస్వామికడ నుండి విమలకొకయుత్తరమును దీసికొని పాట్నానగరమునకుఁ బయలు దేరెను. ఆసంగతిపాఠకులకు జ్ఞప్తియందుండవచ్చును. అప్పుడు మధురా సింహుని సైన్యములోనిపూర్వపరిచితుఁడును, హాస్యప్రియుఁడును జ్యోతిశ్శాస్త్రవిదుఁడునైన సైనికుఁడొకఁడు దైవవశమున నీగజపతినిజూచెను. గజపతి యాతని నానవాలు పట్టలేకపోయినను, సైనికుడు గజపతిని సులభముగా నానవాలుపట్టెను. విశేషామోదముగ నుండునని యోచించి యాసైనికుఁడు తన గురువనిచెప్ప వేఱొక సైనికుని గజపతియొద్దకుఁ దీసికొనివచ్చెను. ఆగురువుగజపతివిద్యాదిగ్గజునిలలాటముఁజూచి "ఎవతె నామాక్షరములలో మొదటియక్షరము "ఆ" యును, నంత్యాక్షరము "ని" యుండునో యామె నీప్రణయినియని స్పష్టముగా వ్రాసియున్నది" అనిచెప్పెను ఆలలాటలిపి నిస్సందేహముగాఁ దెలిసినపిదప గజపతి విద్యాదిగ్గజుఁడు మిగుల సంతుష్టచిత్తుఁడయ్యెను. కాని దానివలననైన దేమి ? ఘటనయాతనికిఁ బ్రతికూలమే కాఁదొడంగెను.

అభిరామస్వామి ప్రస్తావవశమున విమలతో "గజపతివిద్యాదిగ్గజునితోఁ బరిహాసమాడుచుండు టనుచితమని నుడివియుండెను. అప్పుడచ్చట నాష్మానీకూడనుండెను అది మొదలుకొని విమలయు నాష్మానీయును నావిషయమునఁ జాలజాగరూకులైయుండిరి. ఆష్మానీ గజపతి కెదురుగఁబోవదు పోయినను మాటలాడదు. మరియొకదిక్కునకుఁ

దాఁగిపోవుచుండును సూర్యచంద్రులే శాస్త్రమునకు సాక్షులో యా శాస్త్రమసత్యమేనా?

గజపతివిద్యాదిగ్గజు డామెనిచేసెడు నన్యాయమైన యత్యాచారమునుగూర్చి యామెపై నభియోగమును దెచ్చుటకుఁ దనకధికారము గలవని స్థిరపరుచుకొనియెను. దేశమునకంతకు నధిపతియైన యువరాజతనికి విశేషపరిచయుఁడు. అందుచే నాతనికడ "ఫిర్యాదు" చేయుటావశ్యకము. జగత్సింహుఁడు గంగాతీరమునందున్న సౌధమునకు వచ్చుసమయమునందు గజపతియునువచ్చి సింహద్వారముకడ కాచినిలుచుండి జగత్సింహుని యాగమననిర్గమనములను జూచుచుండెను. కాని, రాజపుత్రునకెదురుగఁబోయి నిల్చుండుటకు, నాతనితో మాటలాడుటకు గజపతికి ధైర్యము లేకపోయెను. రాజపుత్రునితోఁగూడ వెనుకనుముందును విచ్చుకత్తులతో రక్షకులుండుటనుజూచి గజపతికిఁ జేతులుకాళ్లువడంక "తలయెగిరిపోవునేమో" యనుయోచన హెచ్చయ్యెను. అభియోగమును గూర్చినయోచన యెక్కడనో యదృశ్యమైపోయెను

ఒకానొకనాఁడు గజపతి లక్ష్మణికన్నులఁబడియెను. యువరాజు వచ్చుటనుజూచి దిగ్గజుఁడొక వృక్షచ్ఛాయకుఁబోయి నిలుచుండియుండెను. యువరాజుసౌధమునుండి తిరిగివెళ్లినపిదప గజపతియు నాస్థలమునుండి యీవలకువచ్చెను. ఎక్కడనుండియో నచ్చటకు వచ్చినలక్ష్మణి యాతనిహస్తమును బట్టుకొనియెను గజపతితోఁ బరిహాసమాడు టభిరామస్వామికిఁ గోపహేతువని యామె యెఱుంగదు. అందుచే నామె గజపతితో నించుకపరిహాసమాడవలయుననితలంచి ముఖమును జిట్లించుకొనుట నభినయించి క్రోధభావమును గనఁబరుచుచు నాతనిహస్తమును బట్టుకొనియెను.

దిగ్గజున కిప్పుడా మొదటి వేషము లేదు. కటియందు ధోవతిని ధరించి భుజముపై నామావళియున్న వస్త్రమును వేసికొని, కంఠమునందు తులసిమాల నలంకరించుకొనియెను లలాటమునందును నాసాగ్రమునందును దిలకముండెను. శుద్ధమైన యావేషముతోనున్న యా నాగరికుని హస్తమునుబట్టుకొని లక్ష్మణి "ఆహా! దొంగచిక్కినాఁడు చాలఁగా వెదకివెదకి తుదకుఁ బట్టుకొంటిని" అనియెను.

లక్ష్మణినాకస్మికముగఁ జూచినను గజపతి భయపడక మనస్సు నందిట్లు తర్కముచేసికొనఁదొడంగెను. "యత్రధూమోతత్రవహ్నిః" లక్ష్మణీరూపమేఘ మెచ్చటనుండునో, ఆప్మానీరూపజల మచ్చట వర్షించును. మొదటచూడ నిట్లే తటస్థమైనది లక్ష్మణి నాతృష్ణామేఘము—జలములేదు శ్రీరాధాపాదపద్మనూపురధ్వనులున్నవి—శ్రీరాధిక లేదు. దూరమందున్న కుసుమసౌరభ మిటనున్నది—కుసుమములేదు. ఆగత శీలుఁడైన నరపతియొక్క పరివారపదజనితధూళియున్నది—నరపతిలేఁడు" ఈవిధముగాఁ దనలో వితర్కించుకొనుచుండుటచే లక్ష్మణినిజూచి గజపతి పూర్ణానందమునొందకపోయినను, నాతని కానందముగనేయుండెను. కొంతసేపటికి ధైర్యముఁదెచ్చికొని "నీవు లక్ష్మణివైనచో నీయాప్మానీ యేది ?" అనియెను.

ల—ఆప్మానీయెచ్చటనున్నదో నేనెఱుఁగుదునా ? నన్నుజూచిన నీకుఁజాలదా? ఈవిధముగాఁ గాళ్లచేఁదన్నుకొనిపోవువాఁడవు, నన్నెందులకు వ్యామోహపెట్టితివి ?

నేను నీనిమిత్తమై చాలగ నలసియున్నానని నీహృదయము నందొక్కమారైనఁదోచకపోయెనా ?

దిగ్గజ—ఆసంగతిని నేను బాగుగా నెఱుంగుదును. నేనును నీని మిత్తము నిజముగఁ బిచ్చివాఁడనైపోయితిని. కాని, యావిషయము బాగుగా నీకుఁ దెలియలేదు. ఆప్మానీతో నాకుఁ జాలపనియున్నది. అనేకదినములనుండియున్న ప్రణయము; తటాలున నామెను విడనాడ వీలులేదు నీవుదయచేసి యామెనొక్కమారు తీసికొనివచ్చెదవా?

ల—నాకేమి యగత్యము ? తమశత్రువును దామే తీసికొని వచ్చి పాలుద్రాగించువారుందురా ? నేనామెనెప్పుడును దీసికొనిరాను. నేను నిన్నుఁకవిడువను. నావాఁడవగుదువో, లేదోచెప్పుము.

దిగ్గ— నిజముగా నీవాఁడనయ్యెదను. కాని, సుందరీ ! ఆప్మానీని విడిచి నీతోఁగూడవచ్చుటకుఁ బూర్వమొక్కసారి యామెను గడసారి చూచి యామెకడ సెలవుగైకొనుటుచితముకాదా? నాతోడు! అందుల కేదైనఁ దగినయుపాయ మాలోచింపుము.

ల—అదెప్పుడును జరుగదు. నిన్నాపుష్మనీతో మాటలాడ నీయను. నీవామెను దూరమునుండియుఁ జూడఁగూడదు. ఆపుష్మనీయును నీవును నొక్కచోనుండగా నెప్పుడైన నేను జూచుటతటస్థించెనేని నీకా క్షణముననే సమ్మార్జనీప్రాయశ్చిత్తము తప్పక సిద్ధించును.

విషమసమస్య—దిగ్గజుఁడు చాలసేపుయోచించి పిదప "అట్లయి నచో నీజన్మమున నిఁక నాపుష్మనీని జూడఁగూడదా ?" అనియెను.

ల—ఎప్పుడును జూడఁగూడదు.

దిగ్గజుఁడేడ్చుచు లక్ష్మణిపాదములను బట్టుకొని "సుందరీ! అట్ల యినచో నేను చచ్చిపోయెదను. నన్నుఁజంపుటవలన నీకులాభమేమి?" అనియెను.

లక్ష్మణియు మిగులఁగష్టముమీఁద నగవునాపుకొని "నీవుచచ్చి పోయినను మంచిదే. నిన్ను యమసదనమునకైన పంపించెదను గాని, యాపుష్మనీవాఁడవగుట కామెయొద్దకుఁ బంపుట కొప్పుకొనను" అని యెను

గజపతి విద్యాదిగ్గజుఁడు రోదనముచేయుచు లక్ష్మణిపాదము లనుబట్టుకొనియుండఁగా నభిరామస్వామి యచ్చటకువచ్చెను ఆతనిని జూచినతోడనే లక్ష్మణి పారిపోయెను. పారిపోవుటకు శక్తియు నిష్ట మునుగలవాఁడైనను దిగ్గజుఁడు పారిపోవలేదు అధోముఖుఁడై యచ్చటనే నిలుచుండియుండెను.

అభి—మూర్ఖా! ఆస్త్రీలందఱు నిన్నుఁ బరిహాసముసేయుచు న్నారు. ఆసంగతి తెలిసికొనుటకు నీకు బుద్ధిలేదా ? నీలలాటము నందీ పరిణయము వ్రాసియున్నదని యెవఁడనియెనో యాతఁడు నిన్నుఁ బరి హాసముచేయుటకై యట్లుచెప్పినాఁడు అది యసత్యపుమాట. నేను జ్యోతిషమునందు బాగుగా గణితముచేసి చూచినాఁడను. నీలలాటము నందట్టిదేదియు వ్రాయఁబడియుండలేదు. నీవు నాయనుగ్రహమును గోరుచుంటివేని, యాకుత్సితవ్యాపారములనన్నిఁటిని విడిచిపెట్టుము. నాతోఁగూడరమ్ము.

చేయునదిలేక గజపతివిద్యాదిగ్గజుఁ డధోముఖుఁడై గురువు నను సరించి వెడలిపోయెను.

పదునేడవ ప్రకరణము.

జగత్సింహుని రాజ్యప్రారంభమునందు విశాలమైనయాప్రదేశమునం దెచ్చటను నెట్టియశాంతియుఁ గనుపట్టలేదు. సర్వత్ర ప్రకృతిపుంజము నిరుపద్రవమై నిశ్చింతతో నెమ్మదిగనుండెను భిన్నభిన్నములుగానున్న యామూఁడు దేశములందును నసంతోషమనునది లేదు. విద్రోహావహ్నిప్రధూమము లెగయుచుండెననియెడివార్త లెచ్చటను లేవు స్వాతంత్ర్యభావముతోఁ బ్రేమమయియైన హృదయేశ్వరినిగూడి నూతనముగ సంపాదించిన పదగౌరవములననుభవించుచు జగత్సింహుడు పరమానందముతోఁ గాలమును గడపుచుండెను.

కాని, ప్రపంచమునం దెచ్చటను నానందము చిరస్థాయియై యుండఁజాలదని తోఁచుచున్నది ఆనందకుసుమము వికసింప గనే నిరానందకీట కమలత్వ్యభావముతో వచ్చి దానినాక్రమించుకొని, దానిశోభాసౌందర్యములను హరించి, దానినివికృతముగను విరూపముగను జేసివేయును. ఆకస్మికముగ నొరిస్సానుండి రామచంద్రదేవమహారాజు— నవాబగునస్మాన్ ఖాను విశేషసైన్యములను సంగ్రహించుచున్నాఁడనియు, యుద్ధమునకు సన్నద్ధుఁడగునట్లు తోఁచుచున్నదనియు శీఘ్రకాలములోనే యొరిస్సాదేశమున నశాంతికలుగుననియు జగత్సింహునకు వర్తమానమంపెను.

ఆవార్తనువిని జగత్సింహుఁడు మిగులఁ జంచలచిత్తుఁడయ్యెను. కుమారమహాసింహునితో నాలోచించి యేమిచేయవలసినదనియు, నిర్ధారణముసేయవలయునని నిశ్చయించుకొనియెను. యుద్ధమును జేయుటయే కర్తవ్యమని నిశ్చయించి యప్పుడే తాముకూడ రణసన్నద్ధులుకావలయునని యన్నదమ్ములిరువురు నాలోచించుకొనిరి. మొగలాయీలపక్షమున నాలోచన లారంభమయ్యెను

కొలఁదిదినములలోనే యొరిస్సాదేశపుఁబఠానుల నవాబగు నస్మాన్ ఖాను స్వయముగా సైన్యములనుదీసికొనివచ్చి చాలనల్లరి చేయుచున్నాడనియు, పూరిపట్టణమును మరల నాక్రమించుకొని తమకైవశమున నుంచుకొన్నాఁడనియు, రామచంద్రదేవరాజు వేఱుదుర్గము నాశ్రయ

ముగాఁ జేసికొనియున్నాడనియు దుర్గము పఠానులవశమగు ననుభయముగలుగుచున్నదనియు సమాచారమువచ్చెను.

పఠానులను నాశనముసేయవలయునను నుత్సాహముతోఁ గుమార మహాసింహుఁడు గొప్ప సైన్యమునుదీసికొని యొరిస్సాకుఁ బయనమైపోయెను. భద్రికుసమీపమందలి యొకస్థలమున నాతఁడు శత్రుసైన్యములనుజూచి యచ్చటనే యుద్ధమునకుఁ బ్రారంభించెను. అస్మానుఖాను స్వయముగా సైన్యముఁ నడపుచు నత్యంతోత్సాహముతో రణమొనర్చుచుండెను. యుద్ధమునందు జయలక్ష్మి యస్మాన్ఖాను నాశ్రయించెను. మొగలాయీల కతిలజ్జాకరమైన పరాజయమయ్యెను. మహాసింహుని సైన్యము చాలవఱకు మృత్యుముఖమునఁ బడిపోయెను. హతశేషులగు సైనికులు ప్రాణభయముచే బలాయనులైపోయిరి. తుదకు మహాసింహుడును రణక్షేత్రమునుండి వెనుదిరుగవలసివచ్చెను.

పఠానులు మరల నొరిస్సాదేశమునంతను జయించి తమస్వాధీనములోనికిఁదీసికొనిరి. కాని, యుత్సాహశీలుడును నయోపాయములమునఁ గలిగినక్రొత్త బలముచే మిగులధైర్యమును జెందిన సాహసుఁడు నగునస్మానుఖానున కొరిస్సాదేశముతోఁ దృప్తికలుగలేదు. వంగదేశమునుగూడ జయింపవలెనను నుద్దేశముతో నాదేశమున కభిముఖముగ సైన్యమును తీసికొనివెళ్లెను. మహాసింహుఁ డెంతయో ప్రయత్నించియు నామహాప్రవాహము నాపలేకపోయెను.

జగత్సింహుఁడుగూడ రణరంగమునకు వచ్చిచేరెను. అప్పటికప్పుడే పఠానులు వంగదేశమునఁ జాలభాగము తమవశముచేసికొని రాజ్యపాలనముసేయుచుండిరి. అత్యల్పకాలములోనే పఠానులు మేదినీపురము మల్లభూమి కోల్హానులను సంపూర్ణముగాను, వీరభూమి వర్ధమానములయందుఁ జాలభాగమును దమవశముఁ జేసికొనిరి. ప్రతియుద్ధమునందును నస్మానుఖానునకే జయముగలుగుచుండెను. ఆతని శక్తి సాహసాదులనుజూచి శత్రుపక్షమువారు ముగ్ధులగుచుండిరి. ఆతని బాహువులయం దెప్పుడును జూడనిశక్తియు, నాతని హృదయమునం దనంతమైన యుత్సాహోద్యమములును వర్ధిల్లుచుండుటఁజూడ జయలక్ష్మి యాతనికి నిత్యసంగినియేమోయనునట్లు తోఁచుచుండెను. ఒరిస్సా

దేశము మొగలాయీలచేతినుండి వదలిపోయినదనియు, వంగవిహార దేశములుగూడఁ గొలఁదికాలములోనే మొగలాయీలనుండివీడి యస్మానుఖానుని యధికారపాశమున బద్ధములైపోవుట కవనతమస్తకములతో నిలుచుండియున్నవనియు నందఱు ననుకొనఁజొచ్చిరి.

అస్మాన్ఖానుని యాజయోల్లాసమునుజూచి యయేషాపొందెడి యానందమునకు మితిలేకుండెను. కేవలము నస్త్రధారణముచేసి రణక్షేత్రమునందవతరింపకపోయినను నాదేవియే యాసమరవ్యాపారమునఁ బ్రధానాధిపత్యమును వహించియుండెను. ఆమె యనేకయుద్ధములలో దనదాసీజనసహితముగ నేగి యస్మానుఖానునితోఁగూడ నుండుచు వచ్చెను. అనేకయుద్ధములలో రణవిరతిసమయమున నస్మానుఖా నయేషాపటకుటీరమునకువచ్చి యామెతో నాలోచనము సేయుచుండెను. అయేషా మంత్రిత్వముచేతను బుద్ధికౌశలముచేతను సులభముగా నస్మానుఖాను ప్రతియుద్ధమునందును జయమునుబొంద నారంభించెను. రోగమునుండి విముక్తయైనపిదప నయేషాయు నస్మానుఖానును జేయవలసిన దానినిగూర్చి యేమేమిమాటలాడిరో యదియంతయు నిప్పుడు సఫలమగుచువచ్చెను. అస్మానుఖానుని యుత్సాహమునకుఁ బారములేదు. రణరంగమునకు జగత్సింహుఁడు వచ్చినను నస్మాన్ఖానునకుఁ బరాజయము గలుగుటలేదు. తుదకు జగత్సింహుఁడు సమ్ముఖమున యుద్ధము చేయుటనువీడి కౌశలముచే నస్మానుఖానుని వినాశనమునకు వలయు నుపాయముల వెదకఁదొడంగెను. వెంటనే యందుల కవకాశమును దొరకెను.

అస్మానుఖాను వర్ధమానమును జయించినచో బంగాళాదేశాధిపత్యము సంపూర్ణముగా దనకుఁ గరగతమగునని యూహించి యట్లు చేయ స్థిరముచేసికొనియెను. వర్ధమానమును జయించునిమిత్త మూతఁడు మొట్టమొదట మందారణదుర్గము నాక్రమించుకొన వలసియున్నదని తలంచెను. మందారణదుర్గము పఠానులవశమై యచ్చట వారి సైన్యము నుంచుకొనుట కనుకూలమయ్యెనేని వర్ధమాన మతిసులభముగా వారికిఁ జిక్కఁగలదు ఈయభిప్రాయమును మనమున నిడికొని యస్మానుఖాను తనసైనికులలోఁ జేరొందినవారిని మందారణ

దుర్గాభిముఖముగ నేగ నియమించెను. జగత్సింహుఁ డప్పుడు వర్ధమానమునందుండెను. ఆసంగతి యస్మాన్ఖా నెఱింగియుండెను. జగత్సింహుఁ డొకొక్కప్పుడు వర్ధమానమునుండి మందారణదుర్గమునకు వచ్చుచుండవచ్చునని యూహించి మందారదుర్గ సమీపారణ్యములలో నచ్చటచ్చట నెవ్వరికిని గనఁబడకుండ దాఁగియుండి యాతఁ డెప్పుడైన నత్తవారింటికి వచ్చునేమో చూచుచుండుఁడనియు వీలైనచో నాతని ప్రాణముఁతో బందీగాఁజేసి తీసికొనిరావలసినదనియు నట్లుసాధ్యపడనిచో నాతనిని వధింపవచ్చుననియు, దానుసరిగా సమయమునకువచ్చి స్వర్గస్థుఁడైన వీరేంద్రసింహుని దుర్గము నాక్రమించుకొని యుద్ధముచేయుమార్గమును జెప్పెదననియు నస్మాన్ఖాను తనసైనికులకుఁ జెప్పిపంపెను.

సైనికులుపదేశానుసారముగ మందారణ దుర్గసమీపారణ్యమున దాఁగియుండి జగత్సింహునియాగమనమును నిరీక్షించుచుండిరి. జగత్సింహుఁ డొక్కసారియైనను మందారణదుర్గముకడకు రాలేదు. అతఁడు వర్ధమానమునుండి యల్పసంఖ్యగల సైనికులనుగూడఁ దీసికొని యొరిస్సాభిముఖముగ బయలుదేరెను. ఎవరునుసంచారముచేయని యొకకాలిమార్గముగుండ నేగి యస్మానుఖానుని జుట్టుముట్టవలయునని యాతనియభిప్రాయము. యోధులిరువురు నొకేరీతి యాలోచనతోఁ బరస్పరజయాభిలాషులై పోవుచుండిరి వారిరువురును గొంచెముకొంచెముగ సైనికులను దీసికొని ప్రచ్ఛన్నభావముతోఁ బోవుచుండిరి.

సువర్ణరేఖానదీతీరమున కత్యల్పదూరమున నస్మానుఖానుపక్షమువారు విడిసియుండిరని జగత్సింహునకు వార్త వచ్చెను. జగత్సింహు డస్మానఖానునిబట్టుకొనుట కిదేయదనని యెంచి తత్ప్రయత్నములో నచ్చటకు వచ్చుచుండ నస్మానఖాను శత్రుని యభిప్రాయమును గ్రహించి యుద్ధవిరతిసూచకమైన యొకపతాకము నొకదూతచేతికిచ్చి జగత్సింహునియొద్ద కంపించెను.

దూత యువరాజుసమక్షమునకువచ్చి వినీతభావముతో నిట్లు విజ్ఞాపనము చేసికొనియెను.

"నేఁటియుద్ధమునం దుభయపక్షములవారికిని లక్ష్యమొకటియే యని తోఁచుచున్నది. అస్మానుఖాను నంత మొందింపవలయునని యువ రాజుగారియభిప్రాయము యువరాజుగారి నంతమొందింపవలయునని నవాబుగారియభిప్రాయము. ప్రకృతమునసంభవించిన యీఖండయుద్ధమువలన నింతకంటె వేఱుద్దేశముండునని తలంచుట కవకాశములేదు. అట్లయినచో నకారణముగా నరహత్యలను జేయకుండ యువరాజును, నవాబును ద్వంద్వయుద్ధముచేసినచో సులభముగా నుభయపక్షముల వారి యుద్దేశములును సఫలములగును ఈవిషయమున యువరాజుగారి యభిప్రాయమేమి ?"

జగత్సింహుఁడు యుద్ధోద్యమమును నిలుపుచేయవలసినదని సైనికులకాజ్ఞయొసంగి యాదూతతో "నేనావిషయమున నంగీకారమొసంగుచున్నాఁడను. నీవు నవాబునకుఁ దెలుపుము. నేను యుద్ధమునకు సిద్ధముగ నున్నాఁడను. నవాబు యుద్ధమునకువచ్చుట కాలస్యమయ్యెనేని నాకాసమాచారమును దెలియఁజేయుమని నేను వేఁడుకొనుచున్నట్లు మీప్రభువుతో విన్నవింపుము" అనియెను. దూతయభివాదనముచేసి వెడలిపోయెను దూత తిన్నగ నస్మానుఖానుని శిబిరములోనికిఁ బోవుటను జగత్సింహుఁడును నాతనిసైనికులును దూరమునుండిచూచిరి. పిదపఁ గొంచెముసేపటిలోనే యస్మానుఖాను సశస్త్రుఁడై బయలువెడలి జగత్సింహున కభిముఖముగ వచ్చుచుండెను. యువరాజు సమీపమున నాతనియశ్వము సుసజ్జితమై నిలుచుండియుండెను. కాని యస్మానుఖాను నడచివచ్చుచుండుటనుజూచి జగత్సింహుఁడును నశ్వము నధిష్ఠింపక యత్యుత్సాహముతో నస్మానున కభిముఖముగఁ గొంతదూరము ముందునకుఁబోయెను.

వీరాగ్రగణ్యు లిరువురును సమీపించినతోడనే జగత్సింహుఁడు మీసందర్శన మప్పుడొకసారియైనది. మరల నిదియొకమారు—ఈసందర్శనమే మనకిరువురకును దుదిసందర్శనమని నానమ్మకము. ఈ స్థలమునుండి మనయిరువురిలో నొకఁడుమాత్రమే వెనుదిరిగిపోవుట సంభవించును" అనియెను.

అస్మాన్—మనయిరువురకును మున్నుజరగిన ద్వంద్వయుద్ధసమయమునందైనసందర్శనమే కడసందర్శనమనుకొనుఁడు. ఇప్పుడు మన మిరువురము నాద్వంద్వయుద్ధముకొఱకే యిచ్చటఁజేరితిమి. మీరు నాకుఁబరమశతృవులు నాశతృవును నాస్వహస్తముతోడనే కడతేర్పవలయునను నాశతో నీద్వంద్వయుద్ధము నేర్పఱచితిని. ఈసారి నాయాశ సఫలముకాఁగలదనియే నానమ్మకము.

జగ—వ్యర్థముగా వాగ్వ్యయముఁజేయుటకై మనమిచ్చటకు రాలేదు. మీరు యుద్ధమునకు సంసిద్ధులైయుండవలయును

అస్మా—(గర్వముతో) నేను సిద్ధముగా నున్నాఁడను మీరు ప్రాణములను రక్షించుకొనుట కుపాయమును వెదకుకొనవలయును.

తుములయుద్ధమున కారంభమయ్యెను. ఉభయపక్షములయందలివీరులును దూరముననిలుచుండి చింతాకులులై భయానకమైన యాయుద్ధమును బ్రత్యక్షముగాఁ జూచుచుండిరి. ఇరువురి నైపుణ్యమును హస్తలాఘవమునుజూచి దర్శకు లాశ్చర్యమునొందుచుండిరి. ఇంతలో నస్మానుఖానునికత్తి జగత్సింహుని కత్తిదెబ్బచేఁ జూర్ణమైపోయెను. అస్మానుఖాన్ భల్లమునుదీసికొని రాజపుత్త్రునిఁ గొట్టవలయునని యత్నించెను. జగత్సింహుఁడును గత్తినివిడిచి భల్లమును గైకొనియెను.

అస్మానుఖాన్ వేసినభల్లము యువరాజుకంఠమునకుఁదగిలి యించుకచర్మము ను రాచికొనిపోయెను. ఆశ్చర్యకరమైన శిక్షాకౌశలముచే నస్మానుఖాను శరవేగముతోఁబోయి తనభల్లమును దీసికొనియెను. రాజపుత్త్రుఁడు వైచినభల్ల మస్మానుఖానుని శిరమునకుఁ దగిలెను. ఆయాఘాతముచే నాతనియుష్ణీషము దూరముగఁ బడిపోయెను. కాని, తలకువిశేషముగ దెబ్బతగులలేదు. విచిత్రదక్షతతో రాజపుత్త్రుఁడు తనభల్లమును మరలఁ దీసికొనియెను. కాని, యాతఁడు దానిని దీసికొనుటకుఁబూర్వ మస్మానుఖానువేసిన భల్లము జగత్సింహునిపార్శ్వమునకుఁ దగిలెను. జగత్సింహుఁడు దానిని మరలఁబుచ్చుకొనుట కస్మానుఖానునకు సావకాశమీయకుండ దానినిఁగూడఁ దానేతీసికొని యస్మానుఖానునితలకుఁ గుఱిపెట్టి బలముగా విసరివైచెను. అది ప్రచండవేగముతోఁబోయి యస్మానునితలకుఁదగిలెను. మెదడునుగదపివైచిన యా

యస్త్రాఘాతముచే నస్మానునకుఁ 'గన్నులు చీకట్లుగ్రమ్మెను. నాల్గు దిక్కులును ధూమాకారముగాఁ గనుపట్ట నించుకసేపాతఁడు నిశ్చేష్టుఁడై నిలుచుండియుండెను

జగత్సింహుఁడాసమయమునఁ గొంచెముదూరము దగ్గరకువచ్చి యస్మానుని వక్షస్థలమునకు సరిగాగురిపెట్టి బలముకొలఁదిని భల్లమును విసరివైచెను. అప్పు డస్మానుఖా నాత్మసంరక్షణముచేసికొనుట కశక్తుఁడై యుండెను. ప్రేక్షకులందఱును రాజపుత్రుని యాభల్లముచే నస్మానునిప్రాణములు పోయినవనితలంచిరి. జగత్సింహుఁడు తనబలము కొలఁది నాభల్లమును విసరివైచెను. ఆక్షణమున భూమినిజీల్చుకొని యుద్భవించినట్లొక స్త్రీ యటఁబ్రత్యక్షమయ్యెను.

ఆసుందరి మానసికచింతవలె నతిసూక్ష్మగామినియై తెప్పపాటు కాలములో రాజపుత్రునిచేతినుండి వచ్చుభల్లమునకును, నస్మానుఖానునకును నడుమవచ్చి నిలుచుండెను. చూచువారందఱు నేమియుఁ దోఁచక యూరకుండిరి. వారినోటినుండి యాతనాసూచకమైన "ఓహో!" అనుశబ్దముబయలువెడలెను. అస్మాన్‌ఖానుని నిమిషమాత్రాజ్ఞానావస్థ యప్పటికి వదలిపోయెను. జగత్సింహుఁడు శరీరము వడకుచుండ నార్తభావముతోఁ దనరెండుచేతులను బైకెత్తెను. ఆతనిహస్తమునుండివెడలిన యాభల్ల మాసుందరి వెన్నును భేదించుకొనిపోయెను తోడనే యాస్త్రీ యస్మానునివక్షస్థలముపైఁబడి బిగ్గఱగా "గుణమయసోదరా! అస్మాన్! నాజీవితము నీయశేషయాతనలకుఁ గారణమైనది. జన్మాంతరమునందు నేను నీదుఃఖమునకుఁ గారణముగా నుండకుండ వలయునని ప్రార్థించుచున్నాను" అనియెను.

ఆసుందరి, అయేషా! అప్పుడిఁక యుద్ధసంబంధములగు యోచన లెవ్వరికిని లేవు అస్మానుఖానాసుందరిని వక్షమునఁజేర్చుకొని భల్లము నామెవక్షమునుండి పెరికివైచెను. జగత్సింహుఁడు చేతితోఁ దలను మోదుకొనుచు "అయ్యో! జగత్తునందలిసారరత్న మీవిధముగా నాభల్లముచేఁబడిపోయినదే. నాకుఁ బరమహితైషిణియైనదేవి మహాషష్ఠిస్నానమును జేయుచున్నది! అస్మానునియస్త్రాఘాతముచే నీకక్షతముని

ప్రాణమింతకుముందే నష్టమైపోయినచో నింతటిదారుణము సంభవించి యుండదుకదా!" అని వాపోవఁజొచ్చెను.

అయేషా—రాజపుత్రా! సమీపమునకు రమ్ము—ప్రేమ మయుఁడవగునో సోదరా! అస్మాన్! నాకికఁగాలములేదు చెప్పవలసినదియు విశేషముగ లేదు రాజపుత్రుఁడు బుద్ధిపూర్వకముగ నాపై భల్లమును విసరలేదు. అందుచే నాతఁడు దోషియని తలంపఁగూడదు. అదృష్టదోషమువలన నాహృదయముపైనాకుఁ గలయధికారమును బోఁగొట్టుకొని యావజ్జీవమును దుఃఖమునకు లోనైతిని. నిన్నును దుఃఖసాగరమునందు ముంచివైచితిని అభిన్నహృదయసోదరా! నీవుప్రేమమయుఁడవు. నీప్రేమమున లవలేశమునొందఁగలిగినను జనులుధన్యులగుదురు. స్వర్గమునందును నంతటిప్రేమయుండదు. జన్మాంతరమునందును నీయీయలౌకికప్రేమ ననుభవించు నధికారమునుండి వంచితముగాకుండునట్లు నాకాశీర్వాద మొసంగుము" అనియెను.

శిబిరమునుండి వైద్యులువచ్చి నిలుచుండిరి.

అయేషా—వైద్యులవలనఁ బ్రయోజనమేమియును లేదు. ఈ యాఘాతమునకుఁ బ్రతీకారము లేదు. రాజపుత్రా! నేను నిన్నత్యంతముఁ బ్రేమించుచున్నాను. ప్రతిదానమును బడయవలెనను నాశ లేకుండ నాప్రాణములయందలి ప్రణయమునంతను నీపాదపద్మముల కడ నర్పించితిని. అర్పించినదానిని వెనుకకుఁదీసికొనుటకు నాకుసాధ్యము కాదు. వేఱొకప్రక్క నానిమిత్తముప్రణయసాగరము సిద్ధమైయున్నది. నేను దానినిజూచియుఁ జూడనిదానివలె నున్నాను అందునిమిత్తమై నేననేకులహృదయములను దుఃఖసాగరమునముంచి చిరకాలము సెలవు గైకొనుచున్నదానను. రాజపుత్రా! నన్ను క్షమింపవలయును. నే నీజన్మమునందు మరలనిన్నుఁజూడకుండునని యనుకొనియుంటిని. కాని, నాజీవనమునకు జీవనమైన యస్మానుఖానునివక్షమున భల్లముగుచ్చుకొనునని యెడిభయముచే నేనిప్పుడు కనఁబడవలసివచ్చినది. అయేషా దురదృష్టవంతురాలు. ఆమెజీవనము శీఘ్రముగఁ బోయినచోఁ బరమ మంగళమగును.

జగ—ఏ దేవికీజీవితము చిరఋణబద్ధమై యున్నదో; యెవ్వరియం దీజీవిత మసంఖ్యాప్రకారములచే బద్ధమైయున్నదో, యెవరికిసమానమీ ప్రపంచమునందేమియును లేదో, యెవరియెడల నాకృతజ్ఞత యనంతమైయున్నదో, యట్టి యయేషాను గరుణామయిని, నిష్కారణముగ నాహస్తములతో నంతమొందించితిని అసహనీయమైనయీదుఃఖ మాజన్మాంతము నాహృదయమును వీడిపోవునది కాదు ఈకృతఘ్నుఁ డిందులకే ప్రాణాంతములగు ననేకాపదలనుండి విడివడియెఁగాఁబోలు! హా! దైవమా!

అయేషా—యువరాజా! మఱచిపొమ్ము. విషమయమైన యయేషాజీవితమునందలి విషయములనన్నిఁటిని మఱచిపొమ్ము. నీవు సుఖముగా గాలముగడపవలయునని ప్రార్థించుచున్నాను. నా సోదరి తిలోత్తమ కీవర్తమానమును దెలియనీయకుము నాకు సెలవొసంగుము. పోయెదను.

రాజపుత్రుఁ డధోముఖుఁడై రోదనముచేయఁదొడఁగెను. అయేషాశరీరమందలిగాయమునుండి రక్తము ప్రవహింపనారంభించెను. ఆమె కంఠస్వరము మిగులసంక్షుబ్ధమైపోయెను. అతికష్టముతో నామె యిట్లు చెప్పఁదొడఁగెను "అస్మాన్! ప్రేమమయా! నీముఖమునిపుడు బాగుగా జూడఁజాలను ఇకనావకాశములేనట్లు తోఁచుచున్నది. ఈజీవితమునందు నీకనేకయాతనలను గలుగఁజేసితిని. నీకిప్పుడు కడసారికష్టమును గలిగించి వెడలిపోవుచున్నదానను. అన్నా! అస్మాన్! ఈయంతిమసమయమున నాసకలాపరాధములను క్షమించి నాకుఁసెలవొసంగుము!"

అస్మాన్‌ఖానని నేత్రములయందు నీరులేదు. హృదయమున నిట్టూర్పునులేదు. నోటినుండి మాటయునులేదు యోధృవస్త్రములను ధరించి యున్నయావీరుఁడు పాషాణవిగ్రహమువలె నిశ్చలభావముతోఁ గూర్చుండియుండెను ఆతనియంకపీఠముపై శోణితనిషిక్తయు, మృత్యుకబళితయు నగునాభువనమోహినియుండెను.

. జగత్సింహుఁడు కాతరభావముతో "నవాబుసాహెబ్! నవాబునందని మీకడ సెలవుగైకొనుచున్నది" అనియెను.

అస్మాన్—(ఆశ్చర్యముతో) ప్రాణేశ్వరీ! సెలవుఁగైకొనుచుంటివని చెప్పుచుంటివా? పరమణీమణిని ముహూర్తకాలము చూ[illegible]

యినచో భువనమే యంధకారమయముగఁ గన్పట్టుచుండునో, యేదేవి ప్రసన్నతను లక్ష్యమునందుంచుకొని నేనీజీవితమునందలి సమస్తకార్యములను చేయుచుంటినో, యట్టియామెకు సెలవొసంగుటయా! ప్రాణేశ్వరీ! నీవు కొంచెముముందుగఁ బోఁదలఁచుకొంటివా? నీయస్మాను నీ వెనువెంటనేవచ్చును.

అ—మాటాడలేను. చెప్పవలసినది ముగిసినది నాతల్లి—దుఃఖితయైన నాతల్లిని సమాధానపెట్టుము. నీవు నాయెడలఁ జిరకరుణామయుఁడవని నేనెఱుంగుదును—నీయంకపీఠముపై మరణము—చాల సుఖముగానున్నది—అస్మాన్—ఎంతశోభ! నీవును నేనును—స్వర్గరథమునందు—సోదరీ సోదరులము—ఎంత మాధుర్యము—ఆహా! పోవుదము—అస్మాన్.

అయేషానోటినుండి యిఁకమాటలేదు. సముజ్జ్వలమైన యావర్తిక యాకస్మికముగ నారిపోయినదనియు, సౌందర్యశోభాయుక్తమైన పుష్ప మకాలమున రాలిపోయినదనియు నందఱు ననుకొనిరి.

ఉపసంహారము

అతిరమణీయప్రదేశమందలి యొకనిభృతస్థలమున నయేషావరవపువును సమాధిచేసిరి. ప్రతిదినమున నుదయమునను సాయంతనమునను నొకపురుషుఁ డాసమాధికడకువచ్చి సమాధిపై శిరసుంచి మౌనియై యశ్రువర్షమును గురియించుచుండుట ననేకులు చూచుచుండిరి. ఆ మనుష్యుఁ డస్మాన్‌ఖాను.

ఆదురవస్థ సంభవించినపిదప నుత్సాహమును, బలమును నస్మాన్‌ఖానుని విడిచిపోయినవి. ఏనారీమణిబలముచే నస్మానుఖాను బలిష్ఠుఁడయ్యెనో, యామె యాతనిని విడిచిపోయినది. మరల నొకటిరెండు యుద్ధములయందు సులభముగా నస్మానుఖానోడిపోయెను. పఠానుల సమస్తాధికారములును మొగలాయీలవశమైపోయినవి. అందుకొ[illegible] కస్మానుఖానొక నిట్టూర్పుయినను విడువలేదు. ఒరిస్సాదేశమునఁ బఠానుల యాధిపత్యము సమాప్తమైపోయెను.

ఘటనాఘటనసమర్థుఁడగు విధివిధానము లాశ్చర్యజనకములు కాశ్మీరబీగముసోదరునితనయయగు నయేషాయెక్కడ? కటుల్‌ఖానుని యింటఁ బెరుగుటెక్కడ? డిల్లీలో మొగలాయీలకడ సేవకుఁడుగనున్న పఠానుని తనయుఁడెక్కడ? ఆఱేండ్లవయసున మాతృవియోగము తటస్థింప బంధువని కటుల్‌ఖానునియింట నభివృద్ధిఁ జెందుటెక్కడ? ఆతని సుగుణసంపత్తిని, ధైర్యసాహసములంజూచి కటుల్‌ఖాను తనపుత్రునిగ నెంచి సంరక్షించుచు సర్వసేనాధిపత్యమునొసంగు టెక్కడ? మానసింహమహారాజు తనయుఁడెక్కడ? బందీయై కటుల్‌ఖాను భవనమునఁ జేరి యయేషాప్రేమకు నిలయమగుటెక్కడ ? ఈఘటనముకంటె విచిత్రమేమికలదు? సంతతభోగపరాయణుఁ డగు జ్యేష్ఠపుత్రుని మూలమునఁ బఠానురాజ్యమున కేమైన భంగమువచ్చునేమోయని తలంచి

యస్మానుఖానుని రెండవతనయునిగాగ్రహించి రాజ్యాధికారమొసంగి యతనిమూలమున బహానులరాజ్యమంతయు వృద్ధిలోనికి వచ్చెనను కొనిన కటుల్ ఖానుని యుద్దేశమేమైనది? భారతవర్షమున బహానుల యౌన్నత్యము మొదలంట నిర్మూలమైపోయినది. విధివైదము లవిలంఘ్యములుకదా.

అస్మానునిజీవితాంతమున నాతని యిచ్ఛానుసారముగా నయేషాసమాధి పార్శ్వమున నాతనినశ్వరకళేబరము సంరక్షితము సేయఁబడియెను.

సమాప్తము.

కాకినాడ : జార్జిప్రెస్ యందు ముద్రింపబడిరి — 1949. (1,000 కాపీలు)